భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

సెప్టెంబరు 1957

సంపుటము 34 : : సంచిక 9

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

సెప్టెంబరు 1957

అంతర్నిరీక్షణ

శ్రీ కేతవరపు వేంకటరామకోటిశాస్త్రి

*   *

కాళిదాసుని శాకుంతలములోని "కామం ప్రత్యా దిష్టాం స్మరామి"
అను దుష్యంతుని స్వగత శ్లోకము ఆధారముగా.

*   *

మునితనయా కరగ్రహణముం బొనరించితివంచు నాడి శ్రే
మనగలవాడ ఆ ఋషుల ఆత్మ నెఱింగినవాడ—వారి కే
లను అనృతమ్ములాడుపని? గౌరవముంబడి ఈ దులాడున
ట్లనయ మనాకృత వ్యథ సమాకులమౌ అనుభూతి పేర్చెడున్.

ఇది అనుభూతి కానెడద నేర్చు మనస్సును నిల్వనీదు దా
రదమును బోలె దేహమున రక్తము సర్వము కల్మషమ్ముగా
తుది నొనరించి నన్నిచట త్రుంచునో అంచనిపించు నంతకై
నది ఇది పొందునేమొ ఎట నాయను దిక్కును లేని జీవమున్.

ఆతడు బ్రహ్మవర్చసు డనావిలబుద్ధి క్రతుక్రియా నిబ
ద్ధాతత శుద్ధ చేతసు డనంత తపో విభవాచ్ఛమూర్తి, తా
నై తరలించి పంపెనట! నా దురదృష్టము! కాశ్యపర్షి క
ప్రీతిఘటించి ఇంతకును ప్రేయసియా మఱి భార్యయా అగున్.

ఇదియును ప్రేయసీ విరహ మీగతి నున్న దనంగరాని అ
ద్భుత పరిణాహ తాపపరిపూర్ణము సంక్షుభితాంధమైన తా
నిది యొక వింత మోహము వహించను పీలును గాక యుండి గూ
డ దడిసి త్యాజ్యభావన నెడంద నొకించుక నిల్వనీయనున్.

కేవల మిద్ది భార్యయయి గీల్కొని నిల్చిన ఆత్మలోని దా
భావనగాదు; కాదనగవచ్చు ననంగనురాదు; చిత్రమై
జీవు డహర్నిశమ్ములు కృశించు నెదో తనలోని రూప మే
దో వెలవెట్టగా తలచియుంగొని చన్నటులూహలంబడిన్.

ఆ రూపమ్మును గాంచగా వలయు నన్నారాట మీరీతిగా
మారెంగావలయు న్విషాదభరమై - మన్మానసాంతర్గతా
కారంబిట్లు సుదూరభూమి నిలువంగా నోపగా లేని న
న్నీరీతిం సృజియించు టేల విధి అంధీభూత చేతస్కుగా

ఈ విషాద యోగసమాధి నెందు లేదు
కామవాసన; వాత్సల్య మేమొ గట్టు
త్రెంచిన ప్రవాహమునువలె తీవ్రమగుచు
నున్న దేమి ? రసస్థితి యుంటనేమొ.

ఆధ్యాత్మికము తాపమందునా యన్న నా
త్రిశరీరముల కాధి లేదు; ఆధి
భౌతికమందునా బాధ లేదును పుత్ర
మిత్రాది సంసర్గ మేధ్యతకును;
ఆధిదైవిక మిదియందునా యన్న నే
ప్రకృతి శక్తులు నేగి పట్టువడవు;
ఇదియ తాపత్రయమేని ముక్తుడ నేను
కాని విముక్తుడగాను నేను—
తాప మనుభూతమైచన దానికేది
పేరు లేదని, లేదనవీలుపడదు;
హృదయ మున్నది అనుభవ మెదియునైన
అవగతమగును దానికైనదీని.

ఒకడను నేను భూతమున ఒక్కడ నేను భవిష్యమందు ఈ
సకలము వర్తమానమున సంసరణమ్మిది మోహతాపహే
తుకము సమాశ్రయించుకొని దుందుడుకుంబడి పోవుచుంటి ఇం
తకు భ్రమ అన్నదే కలుగదాయెను నాకును రక్తజీవికిన్.

వలస

శ్రీ యామిజాల శంకరం

రైలు వడివల్ల చిన్న కుదుపుతో తోశాట్టినట్టుగా ఉంది. అతిప్రయాసతో యీ బెర్తు సాధించి పక్క పరచి వత్తిగిల్లాడు సూర్యం.

నలువైపులా చీకటి ముసురుకుంది. లోపల లైట్లు వెలుగుతున్నాయి. పెట్టెంతా రణగొణ ధ్వని; చిరు చలి వేస్తోంది. దుప్పటి తీసి ముసుగు తన్నాడు. మగతగా ఉంది. కళ్లు మూతలు పడ్డాయి. గతించి పోయిన అనుభూతులు రైలు చక్రాల్లా మనో నేత్రం ముందు దొర్లుతున్నాయి.

* * * *

భార్య అన్నపూర్ణమ్మకు పదెకరాల పొలం, పెద్దలోగిలి, ఐదేళ్ళ పసివాణ్ణి తన్ను, వదలి తన తండ్రి పరంధామయ్య పరంపదించాడు. తల్లి తన్ను తీసుకొని తన మేనమామ వెంకట్రావింటికి వచ్చింది. అప్పటి నుంచి అక్కడే మకాము.

మామయ్యకు ముగ్గురు పిల్లలు. పెద్దది నిర్మల. తనకంటే ఏడాదే చిన్న. రెండోవాడు రమణ. కడగొట్టుది కమల. కమల పుట్టిన తరువాత మా అత్తమ్మకు పెద్దజబ్బు చేసింది. ఆపరేషన్ చేశారు. ఆ తరువాత పిల్లలు పుట్టకుండా పోయారు.

ఇంట్లో అందరికీ తనకు కమలకు వివాహం చేయాలని ఉంది. ఇది సాకుగా తీసుకొని రమణ కమలను ఏడిపించేవాడు. "ఇటు చూడమ్మా! చెల్లమ్మా! ఈ కలం మా ఆయనది. అదే —నీ మొగుడిది. జాగ్రత్త పెట్టు..."

చిన్నతనం. ఉడుకుమోత్తనం పట్టలేక తల్లితో తన కష్టం వెళ్ళబోసుకునేది. తల్లి అంతా విని, నవ్వుతూ, పిల్లను వళ్ళోకి తీసుకొని, గారాబంగా:— "మీ అత్తయ్యకు కొడుకుంటే రమణ ముక్కుకు గాలం వేసేవాళ్లం. మరి కొడుకేరు. నిర్మలకు, సూర్యానికి యీడు కొదాయె ఏదో ముడి పెడదామంటే అయిన సంబంధం పోగొట్టుకుంటావా! ఎట్లాగయినా మీ యిద్దరికి తప్పదుగా మరి!..."

"నువ్వు కూడా అలా అంటావేం!..." వీడబడి గిల్లేది; కొట్టేది.

"జుట్టు పీకేశేయ్! ఇట్లా కూర్చో. చూడు కమలా! వాడేమనుకుంటే నీ కెందుకే!..."

"ఎందుకనాలేం?"

"మరి ఎప్పుడో కప్పుడు ఎవరికో ఒకరికి విన్న కట్టాలిగా!..."

"నే నేమన్నా బ్రతిమా - కట్టటానికి"

"నీకు తెలియదుగాని, పెండ్లి అంటే అంతే నమ్మా!..." అంటూ పిల్లతో కాసేపు ఆడుకునేది.

చాటుగా ఉండి యిదంతా వినేవాడు తను.

తల్లికి పిల్ల లోకువయింది. "ఇదిగో యీ కాఫీ నీ మొగుడికిచ్చి రావే పిల్లా!..."

"నీ భర్తగా రొస్తున్నాడు. దారిమ్మా..."— అన్న.

అంతా ఏడిపించేవారు. తనకే పుట్టింది బుద్ధి. నూతి దగ్గర కూర్చుని మహా దుద్ధతోంది మొహం. దగ్గరగా జరిగాడు:— "చూడు! అంతా ఏమంటున్నారో!..."—చిలిపిగా అన్నాడు.

"అంటే యేం?..." కోపంగా అంది.

"అవకుండా అంటె, కోపంగా ఉండ దేమిటి?..."

"ముందవుతుం దేమిటి? విన్నపలు చేసుకోను..."

"నువు నన్ను చేసుకోకపోతే, నిన్ను నేను చేసుకుంటాను."

గబగబా ముఖం కడుక్కొని లోపలికి పోయింది. పరికిణి తను తొక్కిపట్టి ఉంచాడు. క్రింద

పడింది. కోపం వచ్చింది. ఏడుపూ వచ్చింది:—"నిన్ను చస్తే చేసుకోను..."—అంది.

"నన్నుమించి నీకెవరొస్తారు..."

తలుచుకుంటూఉంటే వళ్లు పులకరించింది. చిన్నగానవ్వుకుని పక్కకు వత్తిగిల్లాడు.

రైలుకుదుపుతో ఊగాడుతూంది.

* * *

క్రమమంటూన్న అరణ్యం మధ్యగుండా సాగిపోతోంది రైలు. కీచురాళ్ళధ్వని...నక్కలకూతలు...భయంకరంగాఉంది.

ఛట్టున స్ఫురణకువచ్చింది. ఏం జబ్బో చెప్పలేదు తను. అమ్మ అవసానదశలోఉంది. అమ్మమీదపడి బోరునఏడ్చాడు. మాటలు పెగల్చుకుని మామయ్యతో అంది:—"వీడికి నీవే దిక్కు..."

"అదేమిటె చెల్లీ! నామీదనమ్మకంలేదా?..." మామయ్యకూడా కండ్లుతుడుచుకున్నాడు.

తల్లి తనకు బుద్ధులుచెప్పింది. మామయ్యకు ఎదురుచెప్పనని మాటయిచ్చాడు. మామయ్యపిల్లను చేసుకోమంది. కమలను చూపబోయింది. స్మృతితప్పింది. తల నిర్మలకేసి పడిపోయింది. ఎగశ్వాసం పుట్టింది. పిల్లలను బయటకు లాక్కువచ్చింది అత్తయ్య.

అంతా గొల్లుమన్నారు.

బరువుగా శ్వాసవదలాడు. క్షణంశూన్యంలో తడుముకున్నాడు. లేచి, వంగికూర్చుని, సిగరెట్టు ముట్టించాడు.

రైలు కదులుతూంది; కుదుపుతూంది.

* * *

అందరూ అమ్మ—నాన్నా—అనిపిలుస్తారు. తను అత్తయ్య మామయ్య అంటాడు. అంతే తేడా. అంతకన్నా భిన్నత్వం తనకేం కనుపించదు.

నిర్మలా, రవణా కూడా ఇంటరుపరీక్షలువ్రాసి యింటికొచ్చి ఉంటారు. కమల ఎలావ్రాసిందో స్కూలుఫైనల్ పరీక్ష. అంతా తనరాకకోసం ఎదురుచూస్తూంటారు. ఇంకొక్కసంవత్సరం కళ్ళుమూసుకుంటే తనూ యీ ఎం.బి.బి.యస్. పాసవుతాడు. తన ఊళ్లోనే ప్రాక్టీసుపెట్టాలి. అచుట్టుపట్ల సరయిన డాక్టరులేదు. డబ్బుకూడా బాగావస్తుంది. పేరూ ఉంటుంది.

కమలకు తనుతీసుకొనిపోయే జాకెటుచీరె నచ్చుతుందో లేదో! ఊహాసౌధాల్లో మునిగి తేలుతూ, నిద్రాదేవతవడిలో వాలాడు.

* * *

సందడిగావుంది యిల్లు. పిల్లలంతా సెలవలకు యింట్లకువచ్చారు. పాతమిత్రుల్ని, క్రొత్తమిత్రుల్ని కలుసుకున్నారు. తమతమ కాలేజీల అనుభవాలగురించి చర్చించుకుంటున్నారు. పొందిన బహుమతుల్ని చూపించుకుంటున్నారు. భవిష్యత్తు దర్పల్లో స్వర్గానికి నిచ్చెనలు వేస్తున్నారు. దినాలు దొర్లుతున్నాయి.

ఇన్నాళ్లకివ్వాళ వెంకట్రావుగారు తనమేనల్లుణ్ణి వెంటబెట్టుకొని పొలాలమీదికి బయలుదేరాడు. కొంతసేపయినతరువాత గోదావరితీరానికి చేరుకున్నారు. నిర్జనప్రదేశం. ఇద్దరూకూలబడ్డారు.

చాలాసేపు వెంకట్రావుగారు వేదాంతాన్ని, కర్మనుదర్చిస్తూ పోయాడు. "జీవితంలో అనుకున్నవన్నీ కావు. విచిత్రం యీప్రపంచం. ఒకదానికి మరోదానికి పొంతనుండదు. మనమొంకటి అనుకుంటాం. కానిజరిగేది మరొకటి అటు మీవంశం వారు ఇటు మావంశం వారు ఎంతో ఘరానాగా బ్రతికారు. ఎప్పుడేం జరుగుతుందో ఎవరమేం చెప్పలేం! విచిత్రమైన పరిణామాలవల్ల వంశాలు పతనమైపోతూంటాయి. వ్యక్తులు కూలిపోతారు......" కంఠంలో జీరకొద్దిగా కనుపించింది. సూర్యం కొంచెం కదలాడు.

"చంటిపిల్లవాడుగా ఉన్నప్పుడు నిన్ను మీ అమ్మమాయింటికి తీసుకొని వచ్చింది. అప్పటినుంచి నువు మాచేతుల్లో పెరిగావు. మధ్యలో మీ అమ్మ కూడా మనలను వదలిపోయింది. అస్తమించేటప్పుడు ఏం చెప్పిందో జ్ఞాపకముందా? నిన్ను నాచేతుల్లో పెట్టింది. నీ ఆస్తికి, నీకు...నీభావి జీవితానికి నేను సంరక్షకుణ్ణి కావలసివచ్చింది. నాచెల్లెలి అంతిమకోర్కె నెరవేర్చటంకోసం నేను, నావిధి కడు జాగ్రతగా నిర్వర్తించాను. ఇంకా ఏం చెప్పిందో జ్ఞాపకముందా—సూర్యం!......"

"మామయ్య పిల్లలను చేసుకోమంది. నీమాటకెదురు చెప్పనని మాటకూడా యిచ్చాను. ఈ రెంటికీ యిప్పటికీ, ఎప్పటికి కూడా నేను వ్యతిరేకంగా నడుచను..."

"నీవన్నమాట చెల్లించుకుంటావా?"

"అదేమిటి మామయ్యా! నామీద నీ కెవరైనా అపవాదులు చెప్పారా? అవేం నమ్మకు మామయ్యా! నేను నీవాణ్ణే అంతే నే ననగలుగుతాను"

"సూర్యం! అలాకూర్చో! నీకు తెలుసుగదూ! నాకు చదువులపిచ్చి ఎక్కువని. నాపిల్లల్ని బి. ఏలు; ఎం. ఏలు చదివించి గొప్పవాళ్లను చేద్దామనుకున్నాను. అందుకే చదివిస్తున్నాను...కాని..." ఆగిపోయాడు.

చాలాసేపు గడిచిపోయింది. "సెలవలకు నా పిల్లలంతా యింటికి వచ్చారు. నాయిల్లు కళకళలాడుతోంది. కాని మీ అత్తయ్యముఖంలోని దైన్యం గుర్తించావా?" చటున సూర్యానికేదో స్ఫురణకు వచ్చింది. అత్తయ్యగారు, మామయ్యకూడా అలానే ఉన్నారు. నిర్మలకూడా అలానే ఉంది. నిర్మల కొంచెం పెద్దమనిషి తరహాపిల్ల. అదిగాక పెద్దది. ఎక్కువగా ఎవ్వరితో మాట్లాడదు. కమల కూడా యీడొచ్చినపిల్లే అయితేనేం చిలిపిది; నిర్మలలో అగాధాలు అంతుపట్టవు. అతి గాంభీర్యం ఉంది. కమల అలాకాదు. ఆవేశాన్ని, ఆవేదనను అణచుకోలేదు. ఇద్దరూ అందగత్తెలే. నిర్మల కొట్టవచ్చినట్లుగా ఉంటుంది. కమలలో మెత్తదనం ఎక్కువ కమలకంటె నిర్మలే ఓవాసి అందంలో ఎక్కువ అంటారు. కమల లోని చిలిపితనం దీన్ని కప్పేస్తుంది.

నిశ్శబ్దానికి భంగం కలిగిస్తూ వెంకట్రావుగారన్నారు—ఒకరోజు మేడమీద నేనేదో లెక్కలు వ్రాసుకుంటున్నాను. మీ అత్తయ్య నాదగ్గరకు వచ్చింది. "ఇంత జరుగుతుందనుకోలేదు, కొంప మునిగింది."—అంది.

"ఏం జరిగింది" అన్నాను.

"మీరు వద్దని చెప్పితే విన్నారుకారు. నెత్తిమీదికొచ్చింది..."

"అబ్బ! ఏం జరిగిందో చెప్పరాదూ!" పని పాడవుతోందని విసుక్కున్నాను. ఇటూ అటూచూచింది ఎవ్వరూ లేరని నిర్ధారణ చేసుకుంది. మెల్లగా నాచెవిలో ఊదింది!—"నిర్మల గర్భిణి"

ఒక్కసారి స్తంభించిపోయాడు సూర్యం.

"ఈవూరికి పెద్దమనిషిని నేను. ఎవరు ఏం చేయబోయినా నాసహాయం కోరుకుంటారు. తర తరాలుగా అభిమాన గౌరవ సంప్రదాయాలతో పెరిగింది నావంశం. ఒక్కసారి అతః పాతాళానికి అణగ ద్రొక్కబడుతుందని ఎలా అనుకుంటాను చెప్పు. రేపు నలుగురిలో తలఎలా ఎత్తుకొని తిరిగేది. ఇన్నాళ్ళకి నాకీ యీ కళంకం వచ్చింది. నా పిల్లలు నాజీవితంతో చెలగాట మాడుతారని ఎలా అనుకుంటాను. చటున కండ్లొత్తుకున్నాడు. సూర్యం తబ్బిబ్బయ్యాడు.

"చెప్పు సూర్యం! నా అవస్థలో నువ్వుంటే ఏంచేస్తావు? ఇలాంటి విషయాలు యితరులతో చర్చించరాదు. మన మానమర్యాదలను హృదయంలో పదిలపరచుకునే ఆత్మీయులతో ఆలోచించాలి. అందుకే నిన్నడుగుతున్నాను. చెప్పు?..."

ఏం చెబుతాడు. ఏం చెబితే బాగుంటుంది. నిజంగా మామయ్య స్థితిలో తనుంటే ఏం చేస్తాడు: "నాకు మాత్రం ఏం తెలుసు మామయ్యా! ఏం చెయ్యాలో ఏంచేస్తే బాగుంటుందో? నాకు ఏమీ తోచటం లేదు" అన్నాడు.

"కుమిలిపోతూ మీ అత్తయ్య నాతో చెప్పింది. క్షణం నిశ్చేష్టుడయ్యాను. కోపంతో ఘూర్ణిల్లిపోయాను. నిర్మలను నిలువునా నరికి వేద్దామనుకున్నాను. కాని మచ్చ రూపుమాసిపోతుందా? కక్షతో నాహృదయం దహించుకొని పోతోంది. ధనం లేకపోయినా బ్రతుకవచ్చు. మానమర్యాదలు పోయింతరువాత జీవచ్ఛవంలా ఎలా సంచరించేది. సైనుకాలువల్లోపడి నానా ఉచ్ఛనీచం తినే పందిలా యీ దుర్భర జీవితాన్ని ఎలా కొనసాగించేదిరా! అబ్బా!! అటుచూడు. ఆ పాకె ప్రవాహంకేసి చూడు. ఆ ఎత్తైన గట్టుమీద నుంచి ఆ బండ ఎలా విరుచుకుని పడిందో! అలా...సరిగ్గా అలాగే...నేనుకూడా..."

"మామయ్యా!" ఆవేశంలో అరచాడు సూర్యం.

"కొన్నిదినాలుగా అదే ఉద్దేశ్యం నాలో ఉంది. తెగించలేక పోతున్నాను. నేను కూడా దాటిపోతే కుటుంబం అపవాదులపాలై దిక్కులపాలవుతుంది. కాని బ్రతికుండగానే యీ కళంకాన్ని కొంగున కట్టుకొని ఎలా తిరిగేది..." ఉద్రేకంలో కండ్లు అద్దుకున్నాడు.

చాలాసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది. దూరాన రెండు కొండలమధ్యా, తాటితోపుల మాటున పండు ముసలితనాన్ని నిరూపిస్తూ, అస్తమిస్తున్న అరుణదేవుడు

రివ్వ గాలికి నీటిపై లేచే చిరు కెరటాలను, తన సాంధ్య కిరణాలతో, ముద్దు పెట్టుకుంటున్నాడు.

"సూర్యం!... నాకు సహాయపడవూ?"

"ఏమిటి మామయ్యా?..."

"ఎలా అడిగేదిరా? ఏమని చెప్పేది?..."

"ఫరవాలేదు చెప్పు తప్పకుండా చేస్తాను..."

"నిర్మలను మరోడికిచ్చి పెండ్లిచేద్దా మను కున్నాను. అపవాదు ఆగదు, నిజందాగదు. పుక్కలు చింపిన విస్తరవుతుంది. చూచావా? ఒక్కరివల్ల ఎందరం ఎన్ని బాధలు పడాల్సివస్తోంది. అయ్యో! ఇది నాకు పుట్టకపోతే ఎంత బాగుండేదిరా!..."

"బాధపడి ప్రయోజనం లేదు మామయ్యా! ఉపాయ మేదన్నా ఆలోచించు. దెంబేలుపడి కార్యం సాధించలేము..."

"నామానాన్ని కాపాడు సూర్యం!..."

"తప్పకుండా. ఏం చేయమంటావ్?..."

"నిర్మలను పెండ్లి చేసుకోగలవా?..."

"మామయ్యా!..."

"అవునురా! గత్యంతరం లేక ప్రాధేయపడు తున్నాను..."

"అదెలా సంభవమవుతుంది..."

"నేనూ అంతే అనుకున్నాను. అందరికి నేనన్ని రోజులు ఉన్నాను. ఇవ్వాళ నాకొక్కరు లేరు. చిత్రం. ఇంతవరకూ నేనెవరి సహాయం అపేక్షించ లేదు. నేటికి నాయింట్లో, నావంట్లో పుట్టిన యీ కులట మూలాన అందరికి తల వంచాల్సివచ్చింది. ఒకరోజు వెంకట్రావంటే అందరికి మోడల్. ఈనాడు అందరికి ఆ వెంకట్రావు భయపడాలి. ఒకనాడు యీ గ్రామానికి సింహం. ఈనాడు గ్రామసింహం. ఆ వెంకట్రావు చచ్చిపోయాడని చాటించరా?..." అరిచాడు ఉద్రేకంలో.

"మామయ్యా!"

"నాకు పిచ్చికూడా ఎక్కుతోంది. భగవంతు డిలా ఎందుకు చేస్తున్నాడో చెప్పలేము! బహుశా ఎవరి జీవితాలు అంతం కావలసి ఉన్నాయో!"

"అల్లా అనకు మామయ్యా!...

"ఆరిపోయే దీపంలా, చల్లారిపోయే జీవితాలు, ఇంకా దేన్ని చూచో రెపరెప కొట్టుకుంటాయి. దాన్ని ముందు యీ మడుగులో తొక్కి, తర్వాత నేను చస్తాను." కోపంతో గర్జించాడు.

"నామాట కొంచెం వినుమామయ్యా!..."

"ఏం వినమంటావ్, నామాట నువు విన్నావా? అమ్మదగ్గర ప్రమాణంకూడా చేసావుకదూ!..."

"అది సాకుగా!..."

"అందుకే నిన్ను ఏమీ అనటం లేదు. నామానం కాపాడమని నీకాళ్లు పట్టుకుంటున్నాను..." కాళ్ల మీద పడ్డాడు.

"మామయ్యా!..." ఉద్రేకాన్ని అణచుకుని: "నన్ను కాస్త ఆలోచించుకోనీయి మామయ్యా!..."

"బాగా ఆలోచించు. తీవ్రంగా ఆలోచించు. ఇదికూడా ఆలోచించు. ఒకవేళ నీ భార్య అయి ఉండి—ఇలాంటి పనిచేసి ఉంటే—అప్పుడు పరువు కోసం—గౌరవంకోసం—"

"బలవంతంగా నామెడలు వంచితే ఏంలాభం మామయ్యా! నేనుకాని నిర్మలకాని ఏంసుఖిస్తాం..."

"దీనికి సమాధానం యిప్పుడు చెప్పలేను—నే నలా చేయదలిస్తే నిన్నడుగుతానా? నిన్ను మధ్యపెట్టి పెండ్లి ప్రతాలు పంచినట్లయితే ఏం చేసేవాడవ్? ఆ ఉద్దేశ్యమే నాకుంటే దీనికి కారకుడవు నువ్వే నంటె—కాదనగలవా?..."

"మామయ్యా!..."

"అందుకే అంటున్నాను. ఇన్నాళ్ళ కివ్వాళ నాగీత యీ విధంగా బయటపడింది. పల్లని గోదావరి తల్లి తన విశాలగర్భంలో మాకు చోటివ్వ దంటావా?" నడిచాడు—గబగబా.

"చేసుకుంటాను మామయ్యా! భగవత్సాక్షిగా చేసుకుంటాను..." అరిచాడు సూర్యం.

మామయ్య వెళ్ళిపోయాడు.

కమల కదిలింది కండ్లలో సూర్యానికి:— "ఒకరి జీవితాల కోసం మరొకరి జీవితాల బలి..." ఆవేదన అణగలేదు. ఆలోచన తెగలేదు. దుఃఖం కట్టలు తెగింది. కమల ప్రేమైక హృదయం కదిలించి వేసింది, ఉద్వేగం పొంగి పొరలింది. నేలమీద పడి భోరున ఏడ్చాడు.

* * * *

తెల్లవారి మేడమీద తన గది ప్రక్కనుంచే నిర్మల పోతూవుంటే సూర్యం పిలిచాడు. వచ్చింది.

కూర్చోమన్నాడు. కూర్చుంది. తరువాత ఎలా మాట్లాడాలో అర్థంగాక తికమక పడ్డాడు.

"ఎందుకూ?...పిలిచావు?..." అడిగింది నిర్మల.

"నాకంతా తెలిసింది. వాడెవడో నాకు చెప్పవూ?"

"ఆఁ" అంటూ కండువిప్పి నోరు తెరచి, గాలి పీల్చింది—కంగారులో. తడబడ పడింది.

"భయపడకు నిర్మలా! నేను నీ క్షేమంకోరి అడుగుతున్నాను. నీ మేలుకోసం ఏదైనా చేయటానికి నిశ్చయించుకున్నాను. అతని కంఠగా కావాలంటే మీ నాన్న యిచ్చేదే కాకుండా నా ఆస్తి అంతా వ్రాసి యిస్తాను. చెప్పవూ!..."

"ఎన్నెన్నో అనుకున్నాను. ఏమేమో అయింది. కొల్లాపడిపోయాను. నా హృదయమంతా క్షోభించి పోతోంది. నా యీ పాడుజీవితం ఇంకా ఎందుకు అంతంకాకుండా ఉంది." కండ్లల్లో నీళ్లు పెట్టుకుంది.

"ఏడిస్తే ఏం ప్రయోజనం చెప్పు నిర్మలా! ఒక పని చేసేముందు ఎంతో ఆలోచించాలి. ఇది సామాన్య విషయమా! పోనీలే నిర్మలా! ఏదో ఘోరం జరిగి పోయింది. వినకుండి లాభంలేదు. ముందుకుపోయే దారి చూడాలి..." అనునయిస్తూ అడిగాడు సూర్యం.

"రంగారావు..." అంది

స్తంభించిపోయాడు సూర్యం, "వాడితో...వాడితోనా..."

సూర్యం మెదడు గిర్రున తిరిగింది. రంగారావు ఇంటరులో తన క్లాసుమేటు. ఇన్ని సంవత్సరాల తర్వాత ఎలాగోపాసయి బి. ఏ. కు వచ్చాడు. పైకి చాలా పెద్ద మనిషి. ఠీవిగా, దర్జాగా, దర్పంగా తిరుగుతాడు. తరచి చూచిన వాళ్ళకుగాని అతని జీవితం అర్థంకాదు. ధనవంతుని ఏకైక పుత్రుడు. నిచ్చల విడిగా డబ్బు ఖర్చు పెడతాడు. పదిమంది రౌడీలు పక్కన కాస్తూంటారు అతన్ని. ఎదురు తిరిగినవాణ్ణి ఏ సందులోనో బొమికలు విరుగగొట్టిస్తాడు. విలాస పురుషుడు. డబ్బుతో స్త్రీలు అతని చేతుల్లోంచి దాటిపోతూంటారు. మాటలతో, చేష్టలతో కొమ్ములు తిరిగిన ఆడదాన్ని వంచింపగల నేర్పరి. అవతలయినా భయం లేదు. అతని పేరు వినగానే నిర్మలంటే అసహ్యమేసింది.

"చదువుకోవడానికా వెళ్ళింది. రంకులు నేర్చుటానికా!"

"సూర్యం!..." అరచింది నిర్మల.

"సిగ్గులేని చలగాటాలు. చదువుకునే వాళ్ళ బుర్రల్లో ఈరోజుల్లో పెరుగుతున్నది విజ్ఞానం కాదు–"

"షటప్!..." తీవ్రంగా అరచింది నిర్మల.

"నిర్మలా!..." కోపంతో గింజుకున్నాడు.

"నీతులు నీకంటె నాకు బాగా తెలుసు. నిన్ను చెప్పమని నే నెప్పుడూ కోరుకోలేదు. నీ సహాయం నే నెప్పుడూ అపేక్షించలేదు. నన్ను నువ్వు నిందించ వలసిన అవసరంకూడా ఏమీ లేదు. నువ్వేం అర్చవాడవు; తీర్చవాడవు కావని నాకు బాగా తెలుసు..."

"నీకు సిగ్గువేయటంలేదూ ఇలాంటి తప్పుడు పని చేసినందుకు?..." ఛీత్కారించాడు సూర్యం.

"అదే అంటున్నాను. అనవసరంగా జోక్యం కలిగించుకోవద్దని. నా సమస్యను నేనే పరిష్కారం చేసుకోగలను. నువ్వేం కష్టపడవద్దు."

సూర్యానికి కోపం బాగా వచ్చింది. కాని ఓపిక పట్టాడు.

"నేను మంచిదాన్నో, కాదో కూడా తెలుసుకునే అవసరం నీకులేదు. నా హృదయాన్ని కదలించి, అనవసరంగా కల్పించుకొని, నా విషయం తెలుసుకున్నావు. నేను పడ్డానుకదా అని, నన్ను అపహాస్యం చేస్తూ, నామీద పెత్తనం చేయటానికి ముందుకు రాకోకు. నిజానిజాలు బాగా తెలిసినవా డొకడున్నాడు—భగవంతుడు. వాడు చూస్తాడు..."

"పాపులకు భగవంతుడు ప్రత్యక్షమవుతాడు—రేపు సాక్ష్యం చెప్పటానికి."

"మాటలు మంచిగా రానీయి. నేనేం పాపిని కాదు."

"రేపు లోకమంతా అదే అంటుంది."

నిర్మలకు కోపంవచ్చింది. కోపావేశంతో కను పాపలు ఎర్రబడ్డాయి; కనురెప్పలు, అధరాలు వణవణ లాడాయి. కాని తమాయించుకుంది. "లోకం అంటుందో, అనదో, ముందు నువ్వే అంటున్నావు" దుఃఖం, అభిమానం పెల్లుబికటంవల్ల, ముందుకొని

వచ్చింది:—"నేనేం పాపం చేసాను. మోసపు మాటలను నమ్మి, పవిత్రమైన హృదయంతో, దేవతామూర్తిగా ఆరాధించా నొకవ్యక్తిని. మనో దౌర్బల్యం వల్ల భవిష్యత్తును ఊహాగానం చేయలేక పోయాను, పరమ పవిత్రమయిన పరమేశ్వరుని ఎదుట ప్రమాణ స్వీకారం చేసాం; నమ్మాను మంచి తనానికి వంచన తోడయింది"—ఉద్రేకం దాటి యిచ్చింది. "ఎవరి జీవితాలతోనూ కాదు, నా జీవితంతో నే నే చెలగాట మాడుకున్నాను. పట్టుకున్న పట్టువస్త్రం పామై కరచింది. నా అజ్ఞానం అగాధానికి దారి తీసింది. ఇవ్వాళ నీతో కూడా మాట పడాల్సి వచ్చింది. అసలు నువ్వెవరు నన్నడగటానికి? నీకేం హక్కుంది. నీకు చెప్పవలసిన బాధ్యత నాకేం ఉంది? పో అవతలకు... పో...పో..." కోపంతో ఉడికిపోతూ, అగని దుఃఖంతో పరితపిస్తూ పెదవులు కంపిస్తూ గుడ్లెర్రజేసి, బొంగురుపోయిన కీచుగొంతుకతో కయ్...కయ్... అని అరుస్తూ, దబ్రున పోతోయింది. "టఫీ" మని ద్వారబంధంతలకు తగిలింది. విసురుగా పోతూ ఉండటంవల్ల, దెబ్బను తట్టుకోలేక, పట్టుతప్పి గిరుకున తిరుచుకొని పడింది, "అబ్బా!"—అంటూ విలవిల్లాడింది.

అందరు ఆవిడ తప్పు చేసిందంటారు. కాని ఆవిడమాత్రం పవిత్రహృదయంతో నమ్మి మోస పోయానంటుంది. పతితను కాను అనాథను, అభాగ్యురాలినంటూ ఆ ఆర్తనాదం ఘోషించింది. ఆహృదయ నైర్మల్యం ఆ కన్నీటి ధారాప్రవాహంలో కనుపించింది. ఎంతో జరిగాక గాని ఒకరి హృదయం అర్థం కాదు.

సూర్యం దగ్గరకు వచ్చాడు "నన్ను క్షమించు నిర్మలా! పవిత్రతను కల్మషంలో కలుపజూచి నప్పుడు కలిగే పశ్చాత్తాపాన్ని అర్థం చేసుకోవటం కష్టం. కాని సంఘదృష్టిలో నువుచేసింది తప్పు నిర్మలా! కాని నీకోసం ఏమి చేయటానికైనా సిద్ధంగా ఉన్నాను. నీకోసం నాజీవితం త్యాగం చేస్తాను. భగవత్సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. ఈమాటలోని భావం నీ కిప్పుడర్థం కాదు,"—నిశ్శబ్దంగా మేడదిగి నడిచాడు.

నుదుటిమీది బొప్పిని చేతితో నిమురుకుంది నిర్మల. ఆవిడహృదయం బీటలువారి బ్రద్దలైపోతోంది. "నేను తప్పుచేశాను. ఘోరానికి నడుకట్టాను అకృత్యానికి ఒడిగట్టాను" తల నేలమీద వాల్చి తల్లడిల్లిపోయింది. కన్నీరు కాల్వలు కట్టింది.

* * *

పోతూ ఉంటే కొంగుపట్టుకొని లాగేవాడు. పకపక నవ్వుతూ చిలిపిగా ఏడిపించేవాడు. కాఫీయిస్తే తాగుతూ మాడనట్లుగా మీద ఒలికించేవాడు. తన చక్కని, తెల్లగా ఉతికినచీర కాస్తా పాడయిపోయేది. "కండ్లలో పొగ తెప్పించదా?"—అంటూ తన కండ్లల్లోకి చూస్తూ చురుక్కున సిగరెట్టు అంటించేవాడు. మంటతో గంటసేపు ఏడ్చేది తను. చేసిన కొంటెచేష్టకు నవ్వు, మంటతో బాధ, ఒకప్రక్క కోపం కమ్ముకొని వచ్చేవి. "అబ్బా;... అబ్బా!!"—అంటూ తను బొబ్బలు పెడుతూఉంటే "ఒకవాతే వంటపట్టదంటారు. అను...అంటూ మరొకటి అంటించబోయేవాడు. వెనుకనుంచి "ఓ"—అంటూ గభాలున అదిరిపడేటట్లు అరచేవాడు. ఉలిక్కిపడి చచ్చేంత పనయ్యేది. లేదా గట్టిగా కండ్లు మూసేవాడు. ఎంత గట్టిగా అనుకున్నారు—కండ్లు ఎర్రబడేవి. అర్చి, గింజుకున్నా వదిలేవాడు కాదు. గిల్లి గిచ్చి ఏడిస్తే వదలేవాడు. చదువుకుంటున్నాడు కదా దానికి భంగంకలిగించటం ఎందుకు అనుకొని చప్పుడు చేయకుండా కాఫీ అక్కడపెట్టి వెనుతిరుగుతూంటే "చెప్పవేం?..." అంటూ వీపుమీద చెళ్లున చరచేవాడు. పోనీ చెవితే "ఏమిటీగోల"—అంటూ డొక్కలో పొడిచేవాడు; జడపట్టి లాగేవాడు; లేదా కాళ్ళకు కత్తెరవేసి క్రింద పడేంతపనిచేసేవాడు; ఇంతా చేసి ఏంతెలియని అమాయకుడిలా పుస్తకాల్లో తలదూర్చేవాడు. అలా ఉండే సూర్యం తనతో కొన్నాళ్ళనుంచీ మాట్లాట్టం లేదు; తప్పుకుని తిరుగుతున్నాడు. అంత హుషారుగా ఉండే బావకు పిలిస్తే వినపడదు. ఎప్పుడు ఏదో ఎడతెగని ఆలోచన. కమల తలచుకుంటూ కుమిలింది.

"ఏంబావా! అలా ఉన్నావ్?..." అడిగింది.

"ఏంలేదు..." క్లుప్తంగా సమాధానం చెప్పాడు.

"ఏంలేకపోతే — ఎందుకా విచారం. నాకు చెప్పవూ?—" ప్రాధేయపూర్వకంగా, అమాయకంగా, ప్రేమపూరితహృదయంతో అడిగింది.

ఎలా చెబుతాడు? ఏమని చెబుతాడు? "ఏమన్నా ఉంటేకదా చెప్పటానికి..."

"నాదగ్గరేందాచకుబావా! నీకెందుకు నేనంటే ఏవగింపు. నాతో యిదివరకులా ఎందుకు మాట్లాడవ్? నన్నెందుకు దూరం చేస్తున్నావ్?" ఇన్నాళ్ళనుంచీ పేరుకొని ఉన్న ఆ హృదయంలోని విచార మంతా ఒక్కసారిగా పెల్లుబికింది. ఆగలేక అతని వడిలో పడుకొని భోరున ఏడ్చింది.

అమాయికమైన, సౌందర్యపూరితమైన, నిర్మలమైన ఆమె హృదయాన్ని చూచి అతని గుండె కరిగిపోయింది. ఛట్టున వంగి ఆవేశంలో మనుపటిలా తన కౌగిలిలోకి పొదివి పట్టుకున్నాడు. "కమలా!..." అన్నాడు. "నీ ఏడుపు నేను చూడలేను కమలా! నువు బాధపడితే నాహృదయం ద్రవించి పోతుంది..." అంతలో ఏదో స్ఫురించిం దతనికి. కౌగిలి వదిలేశాడు. తప్పుచేసినవాడిలా తల్లడిల్లాడు— "నేను దుర్మార్గుణ్ణి కమలా!..." దోసిల్లో తలదాచుకున్నాడు. "నీసౌఖ్యం కోసం ఏంచేయటానికైనా సిద్ధంగా ఉన్నాను. నువు కష్టపడుతూంటే నన్ను తలచుకో కమలా!..."

"అదేమిటిబావా! నువ్వుండగా నాకు కష్టమెలా వస్తుంది;..."

"కమలా!...."తల్లెందుకో క్రిందనుంచి పిలిచింది.

"అమ్మెందుకో పిలుస్తోంది. ఛీ! ఏడవకూడదు. కళ్ళు తుడుచుకో? అలా! ప్రతి చిన్నవిషయానికి ఇలా బెలితిపడవచ్చునా? జీవితంలో మొదటి పాదంలో ఉన్నావు. ఇంకా ఎన్ని ముండ్లబాటలలోనుంచి నడవాలో? ఎన్ని భయంకరసంఘటనల నెదుర్కోవాలో? జీవితసమస్య లెన్ని పరిష్కరించుకోవాలో? ఏమిటో యీ ప్రపంచం—అనుకున్నవన్నీ కావు. అందుతున్న వనుకున్నవి అందవు. ఆనందాలు దూరమవుతాయి. విషాదాలు చేరువవుతాయి. ఎంత ధైర్యం, ఎంత గుండె నిబ్బరం కావాలి? ప్రపంచమంతా పూల బాటలతో నిండి ఉండదు కమలా!....

"ఏమిటి బావా యిదంతా!..."

"అనుకున్నవి కానప్పుడు ధైర్యంకావాలి. అదే నేనంటున్నాను..."

"నువ్విలా మాట్లాడుతూంటే నా కెందుకో భయంగా ఉంది..."

"కమలా!..." తల్లిపిలుపు మళ్ళీ.

"వెళ్ళిరా. అమ్మెందుకో పిలుస్తోంది."

కమల మెట్లు దిగింది.

ఆ రాత్రంతా సూర్యానికి కునుకు లేదు. అంతులేని ఆలోచనలతో సతమత మౌతున్నాడు. క్షణక్షణానికి అతని ఆలోచనల ఆకారం మారిపోతోంది. బుర్రంతా వేడెక్కిపోయింది. చికాకు ఎక్కువయింది.

అర్ధరాత్రి కావచ్చింది. కిటికీలోనుంచి చూస్తే వెన్నెల బాగా కాస్తోంది. చుక్కలమధ్య చంద్రుడు చక్కగా కానవస్తున్నాడు. మేడమీది గదికిటికీ ఏమో, చుట్టూ చాల ప్రదేశం కానవస్తోంది. కిటికీలో నిలబడి చంద్రుణ్ణి చూస్తూ, తనూ కమల యిలా చూస్తే ఎంత బాగుంటుంది అన్న ఆలోచన కలిగింది. హృదయంలో ఎవరో చెయ్యిపెట్టి కెలికినట్టయింది.

క్రింద కిర్రుమంటూ చిన్నశబ్దం వినిపించింది. తలుపుతీసిన శబ్దం వినుపించింది. ఎవరో వ్యక్తి దొడ్లో తారట్లాడుతున్నారు. బావిదగ్గరగా వచ్చి ఆగిపోయింది. సూర్యానికి అనుమాన మేసింది. మెట్లుదిగి దొడ్లోకి నడిచాడు. కొంచెం దూరంగా ఆగాడు. తీరా చూస్తే నిర్మల.

నడుం పైటతో కట్టింది. చేతులెత్తి పరమేశ్వరుణ్ణి ప్రార్థించింది. కన్నీళ్ళు తుడుచుకుంది. మనస్సు కుదుట పరచుకుంది. గట్టిగా నిట్టూర్చింది. భావిలోకి వంగింది. ఛట్టున పట్టుకున్నాడు సూర్యం.

"చావటానికి చాలా స్థలాలున్నాయి. ఇంట్లో చచ్చి యింటి వాళ్ళందర్నీ యిబ్బంది పెడితే ఏం లాభం!..."

"సూర్యం!..."

"అవును నేనే. ఇలా చేసినందువల్ల యీ కళంకం మాసిపోతుందని కదూ ఊహించావు. కారణ మేమున్న విషయంపై డొంకంతా కదిలిరాదూ?..."

"ఇంకా దేన్ని చూచి బ్రతికేను"

"అంతా దేన్నిచూచి బ్రతుకుతున్నారను కుంటున్నావా?" కొంతసేపాగి "మీ నాన్న యిప్పటికే కుమిలిపోతున్నాడు. ఊరూ, వాడా ఆడపిల్లల్ని చదివించకు, చెడిపోతారని గగ్గోలుపెట్టింది. అయినా ఆయన లెక్కచేయలేదు. ఇవ్వాళ ఆయన కుమిలిపోతున్నాడు. నువ్వీపనిచేస్తే ఆయన ఇంకా జీవిస్తాడనేనా నీ ఉద్దేశ్యం. ఆయన తదనంతరం మీ అమ్మ-"

"సూర్యం!..."

"ఇది ఏమన్నా ఆలోచించావా? నీ పక్క దానితో నే పోతుందా యిదంతా! ఏమిపనులు చెప్పు యివి."

చాలాసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది.

"ఇప్పుడు నే నేంచేసేది సూర్యం!..."

"నువ్వేమీ చేయలేవు చేయవలసినవారు వేరే ఉన్నారు. వారే చేస్తారు? ఏంచేస్తారో చూడు? ఒకవిషయం చెబుతాను విను. నీలో ఏమైనా పవిత్రత ఉందనుకుంటే - దాన్ని ఎవరైనా గ్రహించగలరను కుంటే- అది నేనొక్కణ్ణిమాత్రమేనని గుర్తుంచుకో. మొన్న చెప్పాను జ్ఞాపకముందా: నీ కోసం నా జీవితం త్యాగంచేస్తానని..."

రెండు కాళ్ళమీద పడిపోయింది నిర్మల: "నువ్వు దేవతామూర్తివి!"

"లే—ఇంట్లోకిపద. నాకోమాట యిస్తావా నిర్మలా?..."

"తప్పక..."

"ప్రమాణపూర్వకంగా చెప్పు"

"భగవంతుని సాక్షిగా..."

"ఎన్నడూ యిలాంటి పని చేయవుకదూ!..."

"సూర్యం..."

"ప్రమాణం చేస్తావుకదూ! పద ఇంట్లోకి..."

* * * *

వాలుకుర్చీలో పడుకుని కామశాస్త్రగ్రంథ మేదో తీవ్రంగా చదువుకుంటూన్న రంగారావుని పిలిచాడు- సూర్యం:

"ఎవరది? — ముఖానికి అడ్డంగా ఉన్న గ్రంథాన్ని దింపి ప్రశ్నించాడు.

"నేను సూర్యాన్ని."

"రా! కూర్చో!!—'వారిజాక్షులందు, వైవాహికములందు, ప్రాణవిత్తమానభంగమందు, బొంక వచ్చు నఘము బొందదధిప'—ఓహో! ఎంతబాగా రాశాడు..."

"నాకిప్పుడు ఎక్కువగా మాట్లాడటానికి తీరిక లేదు"

"నాతో ఏమైనా పనుందా?"

"అవును. నిర్మల గుర్తుందా?"

"నిర్మల!...ఎవరబ్బా!..."

"అప్పుడే మరచిపోయావా?"

"ఆనవాళ్ళు చెప్పు. పోల్చుకుంటాను?"

"నీతోపాటు యీ కాలేజీలో చదివింది."

"లిల్లీయా! చంపేశావు. దాన్ని మనం కొన్నాళ్లు కీప్ చేశాం......"

"అలాఅనటానికి అసహ్యమేయటం లేదూ?..."

"తప్పేముంది. నాదగ్గర దాపరికం లేదు. ఇప్పు డెక్కడుంటోంది?"

"ఇంటిదగ్గర."

"పెండ్లి—గిండ్లిఅయిందా?"

"పెండ్లయితే కాలేదు."

"ఏం?..."

"నీకు తెలీదా?"

"నిజంగా తెలీదు"

"గర్భిణి"

"వాట్!"

"ఆమెమీదికివచ్చే అవమానాన్ని కాపాడవలసిన ధర్మం నీమీదఉన్నది."—అన్నాడు సూర్యం.

"అయితే నువుపారథ్యం వచ్చావన్నమాట"

"కాదు. వేడుకోవటానికి. మా కుటుంబానికి వచ్చే అపకీర్తినుంచి కాపాడమని దోసిళ్ళుపట్టి ప్రార్థించటానికి వచ్చాను. నీకు కావలసినంతడబ్బు కట్నంగా యిప్పిస్తాను."

"ఇంకా"

"అగ్నిహోత్రంలాంటి మా సంసారానికి యీ కళంకాన్ని ఆపాదించటం—అధర్మం. మీరుచేసిన యీపనికి ఎందరో కుమిలిపోతున్నారు. పరువుగా బ్రతికేవారిని బజార్లో పెట్టటం ధర్మం కాదు."

"నువ్వింతగా బ్రతిమాలుతున్నావు కాబట్టి చెబుతున్నాను. నేను దీనికి బాధ్యుణ్ణి కాదు."

"అయిందేదో అయిపోయింది, దీనివల్ల కొన్ని జీవితాలు బలిదానం కాకుండా చూడు. మా మామయ్య కుమిలిపోతున్నాడు. అతనిచ్చేకట్నం చాలకపోతే నా ఆస్తంతా రాసిస్తాను. తప్పక?..."

"నీమామకూతురా?..."

"అవును. గర్భిణి అయిన ఆమె నలా వదిలేయటం న్యాయం కాదు. దీనికి నువ్వు బాధ్యుడవు కాదూ? నీ తీయతీయనిమాటలు కాదూ?"

"ఇదో పెద్దసమస్యగా మాట్లాడకు. ఇదేం ఘన కార్యమా! ఆమెగర్భానికి నువుకారకుడవు కాదని ఎలా చెప్పగలవు?..."

"రంగా!" అరచాడు సూర్యం.

"నాతియ్య తియ్యని మాటలకు లొంగిపోయిందన్నావు. ఇంకా ఎందరు ఎన్ని గేసెలాలకు పలుకులు పలికారో!..."

"నోర్ముయ్"—గర్జించాడు సూర్యం

"ఛీ! నీచ!" ఛ్రువ లేచాడు రంగారావు.

"నాకు తెలుసు నువు రౌడీవని. కాని గుర్తుంచుకో; నీ కన్నా ఎక్కువ తెగించి ఉన్నాను. నన్ను అంటలేవు. గుర్తుపెట్టుకో పాపులు శిక్షనుండి తప్పించుకోలేరు."

"పో! అవతలకు." సూర్యాన్ని విసురుగా వక్కతోపు తోశాడు రంగారావు. తలుపుకు వెళ్ళిన గుద్దుకుంది ముఖం, ముందటి పన్ను రాలిపడింది. బాధతో విలవిల కొట్టుకున్నాడు. నోటివెంట బొలబొల రక్తం కారి చొక్కా తడిసిపోయింది. కండ్లవెంట జలజల నీళ్ళు కారాయి.

రక్తం చూచి జంకాడు రంగారావు.

బాధతో—"పాపులు శిక్షకు దూరంకాలేరు".. సూర్యం రంగారావుతో అన్న ఆఖరుమాట. జేబురుమాలు నోట్లో కుక్కుకుని నడిచాడు. పోతూ క్షణమాగి:—"ఒకరి ముఖం చూచి ఆగాను. లేకపోతే నీ అంతం చూద్దును—"

ఎన్నడూ లేనిది ఇవ్వాళ, యీక్షణం, రంగారావు హృదయంలో దేవినట్టుగా అయింది. అటు ఇటు పచారుచేశాడు. కుర్చీలో కూలబడ్డాడు. గట్టిగా శ్వాసపీల్చి వదిలాడు. సిగరెట్టు వెలిగించి పొగకేసి కాసేపు చూచాడు. తమాయించుకున్నాడు. "హేఁ... పెండ్లి..." కాసేపాగి "ఇలా అయితే ఎంతమందిని కట్టుకోవాలి నేను." ఆలోచించాడు. "పరమపతివ్రతలు...ఇంకేం"—నవ్వాడు.

* * *

కాలుజారి ప్లాటుఫారంమీద పడితే పన్నూడిందని అందరికి చెప్పాడు. ఇల్లంతా అల్లకల్లోలమయింది.

బాగా జ్వరం కాసింది. ముఖమంతా బూరెలాగా పొంగిపోయింది. డాక్టరువచ్చి ఓ యింజక్షను యిచ్చి వెళ్ళిపోయాడు. అందరికీ అని చెప్పనుకొని కమలకు మాత్రం కంటికి కునుకు లేదు. కనురెప్ప వాల్చకుండా తెల్లవార్లూ కాపాడింది. పలవరించినప్పుడల్లా వణకిపోయేది. వంటిమీద చెయివేసి అదిరిపడేది. వేన్నీళ్ళలో గుడ్డముంచి జాగ్రత్తగా కాపేది. వళ్ళు తెలియని స్థితి సూర్యానికి. దూపుదెబ్బ తింటుందేమో అన్న అనుమానం వెలిబుచ్చాడు డాక్టరు. అలా జరక్కుండా చూడమని భగవంతుణ్ణి పదేపదే ప్రార్థించేది.

అర్ధరాత్రి తండ్రి వచ్చాడు. చూచాడు. "నువు వెళ్ళి పడుకో కమలా! నిర్మలను పంపు. చూస్తా ఉంటుంది." అన్నాడు.

"పోనీలే నాన్నా! ఒక్క రాత్రి. ఫరవాలేదు"

"కాదులేమ్మా! ఇప్పటిదాకా నువ్వే చూస్తూ కూర్చున్నావు. కాస్త విశ్రాంతి తీసుకో. అక్కయ్యను పంపు. వెళ్ళు..."

"అక్కయ్య నాలాగా చూళ్ళేదు. బధకస్తురాలు."

వృద్ధుని హృదయం తపించిపోయింది. బావమీద కమలకున్న ఆ మమకారం, ఆ నిశ్చలత, నిబ్బరం... వృద్ధుణ్ణి కదలించాయి.

"నేను చేయకూడని పని చేయబోతున్నాను." అరచుకున్నాడు మనస్సులో.

జీవిత పరమావధిని వెతుక్కుంటూ, కర్తవ్యం కోసం కలవరిస్తూ జరిగిన సంఘటనల నెమరువేసుకుంటూ, బేజారయి దిగులుతో పొర్లుతోంది మంచం మీద.

చరచరా వచ్చాడు తండ్రి—"పడుకోని ఏడవక పోతే, సూర్యందగ్గర చావరాదూ?...రోగమా!..."

ఇంత కఠినంగా, తీవ్రంగా, గట్టిగా తండ్రి మాట్లాట్టం యివ్వాళే. అదిరిపడి లేచి కూర్చుంది.

పగలంతా వంటపొయి దగ్గర చాకిరిలో అలసి, అప్పటిదాకా సూర్యం దగ్గరే ఉండి, అప్పుడే పడుకున్న తల్లి, యీ అరుపుతో దిగ్గునలేచి కూర్చుంది. మెల్లగా వెంకట్రావుగారున్న గదిలోకి నడిచింది.

"నేను ద్రోహం చేస్తున్నాను." ఉద్రేకంలో అరచాడు.

"ఏమిటండీ యీ అరుపులు." అంటూ దగ్గరగా వచ్చింది.

"వచ్చావా? చూడు. నేను ద్రోహం చేయటం లేదూ?..."

"మీరు తెలిసినవారు. ఆలోచించే ఏదైనా చేస్తారు. మీరేం చేసినా, తప్పు మాత్రం చేయరు..."

"చూడు. గౌరవం, మర్యాదా అంతా పోయి యీ కళంకం మూటకట్టుకొని యింకా నేనెందుకు జీవించటం చెప్పు?"

"గౌరవం, మర్యాదా, కళంకం, యివికావు నాకొక్కటే వలసింది. మీరు. మీరులేని తెల్లవారి నే నెట్లా ఉంటాను. పిల్లల సంగతి?..."

*   *   *   *

శుభలేఖ పట్టుకొని గబగబ మెట్లెక్కింది కమల. సూర్యం ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. "బావా!..." పిలిచింది.

తిరిగి చూచాడు. అక్కడ పెట్టింది శుభలేఖ. చదివాడు.

"నీ పెండ్లి శుభలేఖ." పెదవులు బిగబట్టి అడిగింది.

"అవును"

"అక్కయ్యను చేసుకుంటున్నావా?..."

"ఏం? చేసుకోగూడదా?..."

"ఎందుకు చేసుకోగూడదు." దుఃఖం ఆగటం లేదు. అయినా గంభీరంగా అంది—"నాకొమాత్రం తెలిపితే నేం?..."

"సంప్రదించ లేదంటావా? కటువుగా నే అన్నాడు. కమలను తేను మరువలేదు. కనీసం ఆమె తన్ను మరచిపోవాలి. ఈ మాటలతో ఆమె మనస్సు నొప్పించాలనికాదు. ఆ హృదయంలో అసహ్యం కలగాలని.

"అవును. నాకు చెప్పేదేమిటి?..."

"ఏం? మా అక్కయ్యను చేసుకోడం నీ కిష్టం లేదా?..."

"నా కెందుకుండదు. మా అక్కయ్యకు ... బావకు...పెండ్లి..." పెల్లుబికే దుఃఖం అణచుకోలేక గోడకేసి తిరిగింది. తూలుతూ మెట్లు దిగింది. అను కోని యీ సంఘటనకు ఆమె తట్టుకోలేకపోయింది. తన గదిలోకి పోయి తలుపు వేసుకుని కూలబడి భోరున ఏడ్చింది.

రమణ హృదయం అమాయికమైంది. ఏదీ తొందరగా అర్థంకాదు. శుభలేఖ చూచి అక్క దగ్గరకు వచ్చాడు. "గుడ్ విషెస్ మేడమ్" అంటూ అక్కకు చూపాడు. నిర్మల తెల్లకిందులయింది.

రమణ మేడమెట్లు ఎక్కాడు. సూర్యంతో: "ఏంలోయ్! బావా! ప్లేటుఫిరాయించావు? అంతా కమలను పెండ్లి చేసుకుంటావనుకుంటూంటే అమాంతం నిర్మల మెడకైనే పోతున్నావు. ఓపినియన్స్ చేంజి చేస్తూంటేగాని పొలటీషియన్ కా నేరడట. గిరీశ మన్నాడులే. వస్తా. మా స్నేహితుల్ని పిలవాలి... వెళ్లాడు.

అతను వెళ్ళిందాకా వుండి నిర్మల లోని కొచ్చింది. సూర్యాన్ని చూచింది. సూర్యం నిర్మలను చూచాడు. ఇదివరకులా అతని కండ్లలో కండ్లు కలిపి చూడలేక పోయింది. తల దించింది. అడిగింది: "ఇది అంతా నీకు తెలిసే జరిగిందా?..."

"అవును"—అన్నాడు సూర్యం.

"మరి నాకెందుకు చెప్పలేదీ విషయం?"

"నేనుకాదు చెప్పాల్సింది..."

"నా అభిప్రాయం అడుగకూడదా?"

"అందుకు నేనుకాదు అర్హుణ్ని."

"మరి నువ్వెందు కంగీకరించావా?

"అవును."

"ఇది నీ కిష్టమేనా?"

"ఇక్కడ యిష్టాయిష్టాల ప్రసక్తి లేదు."

"కాని నేను"—

"నాకు తెలుసుగా."

"నువ్వేం సుఖిస్తావ్?" ప్రశ్నించింది నిర్మల.

"దీని అంతరార్థమది కాదు."

కాని...కాని.. 'నేను వివాహితను."

"సంఘం దృష్టిలో కాదుగా?"

"నాకో సహాయం చేసిపెట్టు సూర్యం."

"ఏం చేయాలి."

"నన్నొక్కసారి — ఆఖరుసారి— అక్కడకు తీసుకొని వెళ్ళు."

"ఎక్కడికి?"

"కడసారి కాళ్ళుపట్టి వేడుకుంటాను."

"లాభంలేదు నిర్మలా! పరిస్థితులు విషమించాయి."

"కాదు సూర్యం. నాలో ఎంత ఝంఝూమారుతం వీస్తోందో నాకు తెలుసు. పొరబాటున కొరివితో తల గోక్కున్నాను. ఒక్క తప్పటడుగుతో నా బంగారుజీవితం పాడైంది. యౌవనం కళ్లు కప్పింది. పసుత్వ ప్రేరేపణకు బలయ్యాను. ఓ చిన్న ఆశాజ్యోతి ఇంకా వెలుగుతోంది. అది ప్రజ్వరిల్లుతుందో, చల్లారుతుందో తేల్చుకోవాలి." ఇంతవరకు నిబ్బరంగామాట్లాడింది "ఒక్కసారి ఆ దేవాలయంలోకి తీసుకొనివెళ్లు. ఏ దేవాలయంలో ఏ పరమేశ్వరుని సన్నిధానంలో

ప్రమాణస్వీకారం చేసావో—అక్కడనుండి ఎలుగెత్తి పిలుస్తాను. వారొస్తారు. నాకు నమ్మకముంది. తప్పకుండా వింటారు, వస్తారు. నేను వెళుతున్నాను, పిలుస్తాను..." ఆవేశంలో, పరవశంలో పోబోయింది.

"నిర్మలా!"

"ఇహ నా బ్రతుకింతేనా సూర్యం!" ఏడ్చింది.

సూర్యం అనుకున్నాడు: "భగవాన్! ఇందులో తప్పెవరిది?"

* * *

నలుగురూ ముక్కుమీద వేళ్ళు వేసుకునేట్లుగా ఏ పటాటోపం లేకుండా నిర్మలా సూర్యంల వివాహం జరిగిపోయింది. ఇంట్లో జరిగే ప్రథమకార్యం ఇలా జరుగుతుందని ఎవ్వరూ ఊహించలేదు. వీళ్ళిద్దరికీ అనుకోకుండా వివాహం కావటం చుట్టుప్రక్కల అలోచనలను, అనుమానాలను వ్యాపింపజేసింది. ఇంత సందట్లోను ఆ యింట్లో అందరి ముఖాల్లోనూ విషాదరేఖలు స్ఫుటంగా కనుపిస్తున్నాయి. పుట్టెడు దుఃఖాన్ని దిగమ్రింగుకుని నీరు పెదవులమీద ఏదో నవ్వబోయేవారే అంతేను. అసలు యీవివాహం యింతక్లుప్తంగా జరగటానికి ముఖ్యకారణం సూర్యం గట్టిపట్టుదల.

మంగళసూత్రం కడుతూన్నపుడు సూర్యం కదిలాడు. నిర్మల రెండు కన్నీటిముక్కలు రాల్చింది. కమల హృదయం రెపరెపకొట్టుకుంది—తన అమూల్యవస్తువు జారిపోయిందని. కాని కమలకేం తెలుసు. ఉదయభానుని శీతకిరణాలను చవిచూచి ఉప్పొంగిపోయింది. స్థానభ్రష్టత్వం చెందినపుడు ప్రస్ఫుటంగా వచ్చే మధ్యాహ్నమార్తాండుని ప్రచండకిరణాలకు కోమలమైన కమలపు సహస్రదళాలు ఎలా వాడిపోతాయో ఆమెకేం తెలుసు. కమలం సూర్యుణ్ణే ఆకర్షిస్తుంది. ఆహ్వానిస్తుంది, ఆనందిస్తుంది. కాని ఎప్పుడు?

అన్నిటికన్నా వింతవిషయం. పెండ్లినాటిరాత్రే శోభనకార్యంకూడా నిర్వహించటానికి నిశ్చయించారు పెండ్లిపెద్దలు.

సర్వాలంకారాలతో సుశోభితమైన గది. చక్కగా అమర్చిన పందిరిమంచం. చక్కని పరుపు, మెత్తనిదిండ్లు, తీర్చిదిద్దిన పక్క. వధూవరులు ఆరగించటానికి పసందైన ఫలహారాలు. సుగంధద్రవ్యాల సువాసనల ఘుమఘుమలు అన్నిటినిమించి మనస్సును మమకారాదులతో ముంచితేల్చే ముగ్ధమనోహరమూర్తి (నిర్మల) మూలకు మరలిఉంది.

* * *

భయం, అనుమానం, విచారం, అభిమానం—ముంచుకునివచ్చాయి నిర్మలకు. హృదయం దహించుకునిపోతూంది. సజలనేత్రాలతో నిలుచుంది.

"పడుకో నిర్మలా! చాలారాత్రయింది. అబ్బ! ప్రొద్దుటినుంచి నలిపేశారనుకో. ఈ మూడుముళ్ళకు ఎంత కోలాహలం. ఎంత అనవసరమైన ఖర్చు. మన దేశంలో మనవాళ్లు యీతంతు కొంతమార్చాలి. ఎట్లా చేసినా పెండ్లేకదూ! వేలు ఖర్చుపెట్టే దేశంనాటిబంధువుల్ని పిలిస్తే, ఎంతచేసినా, చూచినా, యీదూషణ, తిరస్కారాదులు "అదిలేదు...ఇదిలేదు..." తప్పదు కాబోలు.

"అలసట బాగా వచ్చిఉంటుంది నీకు. నామాటలతో మరీ విసిగించుతున్నాను నిన్ను. అలా ఆ పరుపుమీద పడుకో. మెత్తగా ఉంటుంది. నేనిట్లా పడుకుంటాలే..." అంటూ ఓదుప్పటిలాగి క్రిందపరచి, ఓదిండు లాక్కున్నాడు.

ఎలా సంబోధించాలో అర్థంగాక చాలాసేపు తికమకపడింది నిర్మల. కడకు:—"అది చాలాతప్పు! నేనే క్రిందపడుకుంటాను. మీరు మంచంమీద పడుకోండి..." అంది,

"మరేమిటి? నా పేరు సూర్యంకదూ!..."

"కాని ఇప్పటి మన సంబంధం వేరు. అలా పిలువకూడదు..."

"ఇప్పుడున్న లేదా మనలో ఏముంది?..."

నిర్మల మాట్లాడలేదు.

"నువ్వు నాకేమవుతావో నాకు తెలియదు. కాని నేనుమాత్రం నీ గౌరవమర్యాదలకు సంరక్షకుణ్ణి. మరచిపోయావా నిర్మలా! నీకోమాట యిచ్చాను. "నీకోసం నా జీవితం త్యాగం చేస్తానన్నాను." ఒకసారి నామాటలతో నిన్ను చాలాబాధపెట్టాను. ఏమనుకోకు."

చాలాసేపు నిశ్శబ్దంగా గడచిపోయింది: "నాకిప్పుడు ఆశాలేదు నిరాశాలేదు. సుఖంలేదు కష్టంలేదు. కాని ఒక్కటిమాత్రం నేనుచేయాలి. కమలకొకమాట యిచ్చాను నిర్మలా!"...ఈమాటలంటూ ఉంటే అతని కనురెప్పలు తడిశాయి. "ఆవేశమొచ్చినా, దుఃఖమొచ్చినా ఆపుకోలేని మెత్తని హృదయం. చిన్నసంఘటనకే బహుబాధపడుతుంది. ఆమెహృదయాన్ని గుర్తించి, పదిలంగా పువ్వుల్లో ఉంచి పూజించేవాణ్ణి ఐతే కావాలి. లేకపోతే జీవితంలో

మహాక్షోభపడిపోతుంది." కానేపాగి "పాపం! డాక్టరీ చదువులంటే మహాఅభిమానం. డాక్టరు నే లేవాలి, లేస్తా నిర్మలా" "నీ సుఖంకోసం ఏదైనా చేస్తా"నని మాటకూడా యిచ్చాను కదూ!"...అంటూ క్రిందనే పడుకున్నాడు.

"అదేమిటి! క్రింద ఎట్లాపడుకుంటావ్?"... అలవాటుచొప్పున ఏకవచన ప్రయోగం చేసింది. ఛట్టున నాలుక కరచుకుంది.

దేహాన్ని దగ్గరకు గుంజుకుని:—"రాతిమీద వర్షంకురిసినా, చలివేసినా, గాలివీచినా, యెండ కాచినా ఏమవుతుంది?"...ముసుగుతన్నాడు. అలసిన శరీరం అరగంటలో నిద్రకు ఒరిగింది.

నిర్మల, సూర్యం ఒకయింట్లో పెరుగుతూ వచ్చారు. ఇప్పటివరకు వారిద్దరిమధ్య వున్నభావాలు వేరు. నిర్మలను సూర్యం, ఓచెల్లెలిలాగానో, అప్పలాగానో, వదినలాగానో భావిస్తూ వచ్చాడు. ఒక్కసారిగా ఆమెను ఆలిగా భావించలేదు. అతనికలాంటి అభిప్రాయం లేదు.

ప్రచండ ఝంఝామారుతంమధ్య ఓ దీపకళిక ఉంది. నలుపైపులనుండి హోరెత్తి వీచేగాలికి ఆ దీపం ఆరిపోకుండా అతడు విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. అయితే ఆదీపానికి అతనికి సంబంధంలేదు. అతనిదీ కాదు. ఎవరో తప్పనిసరిగా బలవంతపరిచారు. అప్పజెప్పారు. ఆ దీపాన్ని ముట్టుకుని చెయికాల్చుకోవటం అతని కిష్టంలేదు. ఆ ఉద్దేశ్యం కలుగలేదు. అయితే అతనలా సంచరిస్తే ఏంజరిగేదో!

ఆరగించేవారు లేక చల్లారిపోయాయి ఉపాహారాలు. అగరువత్తులు ఆరిపోయాయి. సువాసనలు సమసి పోయాయి. పటాలపై పారాడుతున్నాయి క్రీనీడలు.

నిర్మల చాలాసేపటిదాకా నిద్రపోలేదు. నిద్రపోతూన్న పవిత్రమయిన సూర్యం మూర్తిత్వాన్ని చాలాసేపు చూచింది. ఆలోచనాతరంగాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. ఆమె హృదయంలో సూర్యం ఒక దేముడిలా కనిపించాడు. పాదాభివందనం చేసింది. అక్కడే కటిక నేలమీద పడుకుంది.

* * *

ఒకనాడు మామ అల్లుడితో అన్నాడు. "ఈ రోజుతో కమల చదువుకూడా మానిపించివేస్తున్నాను."

"అలా కాదు మామయ్యా! అలా జరగటానికి వీల్లేదు..." అన్నాడు- సూర్యం.

"నీకు తెలియదు."

"నాకంతా తెలుసు. రాయీ, రత్నపు బరువులు ఒకేంత ఉండవచ్చు. కాని విలువలో చాలా తేడా ఉంది మామయ్యా!...సానపెట్టినకొద్దీ అంతర్భాగం దేదీప్యమానంగా ప్రకాశిస్తుంది. అందర్నీ ఒక త్రాసులో తూచకూడదు."

* * *

సూర్యానికి నిర్మలకు ఉన్న సంబంధం చాలా సున్నితమైంది. వెటకారంగా గాని, హాస్యానికి గాని, నవ్వుతూ తుళ్ళుతూ వాళ్ళు ఎప్పుడూ మాట్లాడుకో లేదు. ముందే చాలా ముభావంగా మాట్లాడుకునే వారు. సంఘంలో వారిద్దరూ ఆలుమొగలు. ఒకేగదిలో పడుకోబెడతారు యింటివారు కూడాను. కాని ఆ రెండు మంచాల మధ్య ఉన్న అఖాతం ఎవరికీ తెలియదు.

ఏ చిన్నపని అయినా నిర్మలకు పురమాయించదు సూర్యం. నిర్మల మరీ క్లుప్తంగా మాట్లాడుతుంది- ఎప్పుడైనా. ఏదైనా కావాల్సివస్తే ఫలానిది కావాలంటుంది. ఎందుకు, దేనికి అన్నప్రశ్న ఎప్పుడూ లేదు. చప్పుడుకాకుండా తెచ్చి అక్కడ పెట్టిపోతాడు.

కడుపుతో ఉన్నవారు కనకుండా ఉంటారా? ఏడునెలలు తిరక్కుండా నిర్మల నీళ్ళాడి కూర్చుంది. పండులాంటి మొగపిల్లాడు. పదిమంది పలురకాలుగా చెప్పుకున్నారు.

"పెండ్లయి ఏడునెలలన్నా కాలేదు" ఒకామె.

"నెలతక్కువ వెధవ"—శాస్త్రీకరించారొకరు.

"మొన్న రవణమ్మకూతురు నీళ్ళాడలా?" నిదర్శన పూర్వకంగా మరొకరు.

"ఏడునెల్లకే కనేస్తున్నారమ్మ!" ఆశ్చర్యంగా ఇంకొకరు,

"ఇంకా నయం. పురాణాల్లోను, రామాయణ, భారతాల్లోనూ ఏడు ఘడియలకే కన్నారుటగా..." పౌరాణికంగా చెప్పిందొకామె.

"అసలుసంగతి వేరే అయివుండాలి. సూర్యానికి, నిర్మలకు ఇదివరకే ఏదో సంబంధం ఉండి ఉండాలి. లేకపోతే యింత హడావుడిగా యీ అనుకోని వివాహం ఎందుకు జరుగుతుంది? లోతులు తరచిందొకతె.

బారసాల కూడా చాలా నిరాడంబరంగా జరిగింది.

* * *

నిర్మలకు సూర్యానికి వివాహమైనతరువాత కమల సూర్యంతో ఎప్పుడోగాని మాట్లాట్టం మాని వేసింది. అయితే వివాహం ఎందుకయిందో కమలకు తెలియదు. ఆ చిదంబర రహస్యం తెలిసినవారు బహు కొద్దిమంది. సూర్యం తప్పెందుకు కాదన్నాడు? తన్ను చూచి తప్పుకొని ఎందుకు తిరుగుతున్నాడు? ఒంటరిగా ఉంటే అనేక ఆలోచనలు. చిన్నప్పటి వారి సంబంధం గుర్తుకువచ్చేది. నేత్రాలు తడుపుకునేది. ప్రేమ ఫలించలేదు. విరక్తి కలిగింది. ఏహ్యభావం కలిగింది. మరి అతను లేకపోతే ఏదో బాధ, ఏదో వెలితి హృదయంలో కలుగుతుంది. కాదన లేదు; రమ్మన లేదు.

ఆమె తలపు వేరు. డాక్టరీప్యాసయి మానవ సేవలో బ్రహ్మచారిణిగా ఉండిపోదామని. ఆ ఉద్దేశ్యాన్ని అనేకసార్లు వ్యక్తపరచింది. కాని వినేవారేరు. కమల వివాహంకూడా కడకు నిశ్చయించారు. వద్దని, చేసుకోనని, చస్తానని, ఘోషవేసింది. కాని లాభంలేకపోయింది. పెండ్లి పత్రికలు వెళ్ళాయి. భారీఎత్తున శుభకార్యం చేయాలని నిశ్చయించారు. ముహూర్తం సమీపించింది. బంధువులు ఒక్కొక్కరే విచ్చేస్తున్నారు. కడకు పెండ్లి వారుకూడా విడిదిచేశారు.

ఒక్కసారి ఒక మూర్తి ఆవిడ హృదయంలో స్థిరంగా స్థావరమేర్పరచుకుంది. ఆ వ్యక్తిని కాదని అదేచోట మరో వ్యక్తికి ఎలా స్థానమీయగలుగుతుంది. ఆమెది అరణ్యరోదన అయిపోయింది.

ఇదిలా ఉండగా ఇవ్వాళే కమలను పెండ్లికూతురును చేశారు. రేపు తెల్లవారుఝామున లగ్నం. అటు విశ్వనాథాన్ని పెండ్లికొడుకు చేశారు. విశ్వం చాలా అందంగా ఉంటాడు. విశాలమైన నుదురు, పెద్దకండ్లు ఇంత ముక్కు—బాగుంటాడు. మొన్ననే డాక్టరీ పరీక్ష యిచ్చివచ్చాడు. కొంచెం సుకుమారి. కలవారింటి బిడ్డడు. బుద్ధిశాలి.

కమల పెండ్లికి సూర్యం ఎన్నో కానుకలు తెచ్చాడు. మంచి పెద్దపెట్టె ఒకటి కొన్నాడు. విలువైన జరీచీరలలో నింపాడు. చీరెలపైన చక్కని ముచ్చటైన జాకెట్టుగుడ్డలు పెట్టిఉన్నాయి. ప్రక్కగా ఎర్రటి పలుచటి కాగితంలోచుట్టి రెండుజతల గాజులు పెట్టిఉన్నాయి. అందమైనపెట్టెలో ఖరీదైన నెక్‌లేస్ ఉంది. ఒకప్రక్క "టాయ్‌లెట్ బాక్స్" ఉంది. ఇంకా ఏమేమో ఉన్నాయి. అయితే రెండెకరాలు తెగనమ్మాడని ఎవరికి తెలుసు?

ఈ పెట్టె సరాసరి కమలగదిలోకి వెళ్ళింది. సూర్యం తిన్నగా మేడమీద తనగదిలోకి వెళ్ళిపోయాడు. ఇవ్వాళ, ఏదో కొద్దిసంతోషం అతనిలో ఉంది. సిగరెట్టు ముట్టించాడు. చిన్నగా యీలపాట పాడుకున్నాడు.

కమల యివ్వన్నీ చూచి నిశ్చేష్టురాలయింది. ఎవరు తెచ్చారో మోసుకొనివచ్చిన పాలేరు నడిగి తెలుసుకుంది. సూర్యం పేరు విన్నతరువాత వాటిని ముట్టుకో బుద్ధికాలేదు.

"ఇవ్వన్నీ ఎవరు తెమ్మన్నారు నిన్ను?"—విసుగుగా సూర్యం గదిలో అడుగుపెట్టి కసురుకుంటూ అడిగింది.

"ఒకరు తెమ్మంటే తెస్తానా!..." తాపీగా సమాధానం చెప్పాడు.

"మరి........."

"మనింట్లో శుభకార్యమవుతూంటే యీమాత్రమయినా ఉండవద్దా?..."

"దీనికి పెద్దవు నువ్వా?..."

"ఏం? ఎందుకు కాకూడదు. నాకుమాత్రం బాధ్యతలేదా? మామయ్య ఎన్నో సంబంధాలు చూచాడు. నాకు నచ్చలేదు. ఇతను వచ్చాడు. ఇతను, నేను కలిసి చదువుకున్నాం. మా అమ్మాయిని చేసుకుంటావురా అన్నాను. నవ్వాడు. కుదిర్చాను. రేపో మాపో గవర్నమెంటు ఉద్యోగి కాబోతున్నాడు."

"నిన్నెవరు కుదర్చమన్నారు?..."

"కన్యకు కల్యాణం తప్పదురా అన్నాడు మామయ్య..."

"ఇవ్వన్నీ ఎందుకు తెచ్చావ్?..."

"రేపటినుంచి మిసెస్ డాక్టరు కాబోతున్నావు కదూ! పట్టుమని పదయినా ఖరీదుగల చీరెలు ఉండవద్దూ! రేపటినుంచీ ఎన్ని ప్రోగ్రాము లుంటాయో! లేడీస్ క్లబ్బులు...మహిళాసంఘాలు...ఇంకా ఎన్నో. అధ్యక్షతలు... ఉపన్యాసాలు ... ఓహ్!" నవ్వాడు.

"నీకెందు కవి?"

"నాకెందుకేమిటి? నా కమలకు పెండ్లవుతూంటే నేను పెట్టుకోవద్దూ!..." ఆవేశంలో అనేశాడు. తెలుసుకొని తలదించాడు.

"బా...వా!..."

"ఏంలేదు కమలా! నీమీలో నేని విపరీతంగా ఉంచికూడదు. ఆనందం పట్టలేకపోయేసరికి కంట్లో నీరు వస్తాయి" కమల కనిపెట్టేంచని యీ మాటలని కన్నీళ్ళు తుడుచుకోలేకపోయాడు. కాని అవి ఆగేటట్టున్నాయా!

"నన్నెందుకు కొడతాన్నావు బావా!"... కమల కూడా పూర్తిగా కరిగిపోయింది. ప్రేమాప్రేమాలు ఒక్కసారి విజృంభించాయి.

ఇన్నాళ్ళ కిన్నాళ్ళ వారిద్దరూ తిరిగి ఎక్కువగా మాట్లాడుకుంటున్నారు. హృదయకవాటాలు తెరుచుకున్నాయి.

మూర్తిం అన్నాడు: "నిన్ను కొడతానంటే యిక్కడ్ని ఎందుకు తెస్తాను. ఒకసారి ఏం చెప్పాను? నీ సుఖం కోసం ఏదైనా చేస్తానని చెప్పలేదూ! నీకే లోటు రాకుండా యిక్కడ్ని తెచ్చాను. మరి మామయ్య యిన్ని కాపాడగలడా! అందుకే తెచ్చాను..."

"బావా!..."

"నన్ను బాగా అర్థం చేసుకో కమలా! నీ పెండ్లి మహావైభవంగా జరగాలి. అందుకే ఎక్కడెక్కడి బంధుమిత్రుల్ని పిలిపిస్తున్నాను. అయిదు రోజులు విశిష్టంగా కావాలి. అందరి అభిమానాలను చూరగొన్నావిది. నీ సుఖానికి ఏ లోటూ రానీయను. నన్ను గురించి ఎవరైనా ఏమైనా అనుకుంటే వాళ్ళ పాపాన వాళ్ళే పోతారు. చూడు కమలా! నీకేమైనా ఇబ్బంది కలిగితే నన్ను తలచుకో ప్రూ! నాకు కబురంపప్రూ!..."

"ఇవ్వన్నీ నాకు సుఖాన్ని చేకూరుస్తాయా బావా!..."

"చూడు కమలా! నా సంతోషం నువ్వు కోరితే నామీద నీకేమైనా అభిమానముంటే ఏ కలతా రాకుండా యీ వివాహం జరగనీయి కమలా! నీనుంచి నేనంతే కోరుకుంటున్నాను..." చరచర లేచి వెళ్ళిపోయాడు.

కమల కుప్పగా కూలబడి ఉంది. పక్కగా ఉండి నిర్మల యీ సంభాషణ అంతా విన్నది. మూర్తిం వెళ్ళిపోయాక మెల్లిగా గదిలో అడుగుపెట్టింది. మెల్లిగా అన్నది: "కమలా! నన్ను గురించి విచారించకు. అసలు విషయాలు నీకు తెలియవు. ఇలాంటి విషయాలు తెలియకుండా ఉంచటమే మంచిది. నేను పాపం చేశాను కమలా! నేను చేసిన పాపానికి భగవంతుడు విధించే శిక్షకు భయపడి పారిపోయేంత పిరికిదాన్ని మాత్రం కాదు..." కొంచెం కదిలింది నిర్మల.

"సంఘ దృష్టిలో మేమిద్దరం ఆలుమగలం. నేనతనికి ప్రియురాలినే కాని ప్రేయసిని కాదు. అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యనే కాని అర్ధాంగిని కాదు. నన్ను నీదానిగా మాత్రం అర్థం చేసుకో కమలా! అందుకే నిశ్చయించుకున్నాను. నీ సుఖానికి నేను తోడ్పడతాను కమలా! త్వరలో నే నా నిశ్చయాన్ని నువ్వు తెలుసుకుంటావు."

"నీకంటె ముందు నే నిశ్చయం చేసుకున్నాను. మూర్తావు త్వరలో ఏం జరుగుతుందో నాకు తెలుసు. నా సుఖానికెవరూ సహాయపడలేరని..." కొంచెం ఉద్రేకం ముంచింది కమలకు— "ఏ సహాయం నాకు తెలుసు. కాని నిన్నేమీ చేయలేవు. నువ్వు చేసేది నాకు తెలుసు. నాకూ బావకూ ఏదైనా సంబంధం అంటగట్టే అభాసు—"

"కమలా!..." లాగి కొట్టింది గూబమీద ఆవేశంలో నిర్మల.

కోపపూరిత నేత్రాలతో తీక్షణం నిర్మల వంక చూచింది కమల—వెళ్ళిపోయింది.

తెల తెలవారుతూనే భోరుభోరున ఏడ్చింది నిర్మల.

* * *

అర్ధరాత్రి కావస్తోంది. అంతా నిద్రలో ఉన్నారు. స్టేషనులోనుంచి కల్కత్తా కెళ్ళే మెయిలు ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్ళిపోయింది. భయం, అనుమానం, విచారం, దిగులు, దుఃఖంతో దిగ్భ్రమచెందే హృదయంతో, అల్లాడుతూ, ఓ మామూలు చేతిసంచితో, ఒక మూలగా నక్కి కూర్చుని ఉంది—ఓ అమ్మాయి, అందులో.

దూర సుదూర తీరాలకు పయనం. చీకటి గుయ్యారం. కీచురాళ్ళ ధ్వని. జంబుకాల భయంకర నినాదాలు. గుడ్లగూబల కలకలం. పిశాచాల పయనం. పట్టాలమీద రైలు చక్రాలు పదపడి త్రొక్కుతూ పోతున్నాయి.

తిక్కన్న శిల్పపుఁ దెనుఁగుతోట

శ్రీ యడవల్లి ఆదినారాయణ

ఋషివంటి నన్నయ రెండవవాల్మీకి
తిక్కన్న శిల్పపుఁ దెనుఁగుతోట
—శ్రీ విశ్వనాథ.

నన్నయ భారతాంధ్రీకరణమునకు సుమారు రెండు శతాబ్దముల యనంతరము తిక్కన సోమయాజి పదునేను పర్వముల భారతమును జాను తెనుంగు నుడికారము సొంపు పెంపెసలార రచించి యాశత్కావ్యనిర్మాణశిల్పమునకు తెనుఁగుతోటయై విరాజిల్లిన వాఁడు.

ఈతనిచే నాంధ్రీకృతమైన భారతభాగమున తొలిపర్వము విరాటము. సోమయాజియే "హృదయాహ్లాది చతుర్థమూర్తికథాశోభితంబు, నానారసాభ్యుదయోల్లాసి విరాటపర్వము" అని చెప్పెను. 'ఉద్యోగము' తిక్కనామాత్యుని రాజనీతిపారంగతత్వము సంపూర్ణముగా గోచరించును. విరాటము మిగిలినవానికంటె హృదయాహ్లాది, ఊర్జిత కథాశోభితము నానారసాభ్యుదయోల్లాసి యుట.

శిల్పము బహుముఖమై సహృదయానుభవైక వేద్యమైనది. యాథార్థ్యమున కనిర్వాచ్యమైనది. దినము దిఙ్మాత్రనిదర్శనముగా నాకు గోచరించిన దానిని ప్రకటింపయత్నింతును. యతిప్రాసముల నెన్నుకొనుట, ఛందస్సు నేరికొనుట, పద్యరచనా విన్యాసము, శైలి, పదసమాససంఘటనా పాటవము, వర్ణనాచాతురి, పాత్ర నిర్మాణకౌశలము, సన్నివేశ కల్పనాప్రాభవము, ఉక్తివైచిత్రి, ఔచితీనిర్వహణము వీనియన్నిటను శిల్పము అనుగతమై యున్నది. వీనిని మించి కథాకథనము నావిష్కరించి రసపోషణము ఉత్తమ కవులకు ప్రధానలక్ష్యములు. కావున శ్రీ విశ్వనాథవారు "ప్రాగ్విపశ్చిన్మతంబున రసము వేయి రెట్లు గొప్పది, నవకథాదృతినిమించి" అనిరి. విరాటము ఊర్జిత కథాశోభితమును, నానారసాభ్యుదయోల్లాసియు కావున శిల్పి సర్వస్వమునకు పట్టుకొమ్మ.

ఇందలి మొదటి యాశ్వాసమున పంచపాండవులు ద్రౌపదీసహితులై మారువేషములు బూని, అసత్యము లాడకుండ, వాస్తవికతను బయలుపరచకుండ, తాము పాండవులని యేరును గ్రహింపకుండ, అజ్ఞాతవాస దీక్షతో విరటుకొలువున నుంటయు నందలి క్లిష్టపరిస్థితియు నభివర్ణితములు. ఆకాలమున దేశమున నొక్క భార్యయు నైదుగురు భర్తలును నైయుంట పాండవుల యింటనే గాని యెచ్చటను లేదు. ఈ అద్భుతసమావేశమే సంశయకారకము. అందును ద్రౌపది అయోనిజ మహామూర్తి. అట్టియామె దాగుట యసాధ్యము.

కావననే ద్వితీయాశ్వాసమున కీచకవధకు కారణ భూతురాలయినది. ఈ ఘట్టము చాలరసముల కాలవాలమై తరువాత ప్రబంధములకును, నాటకీయరచనములకును మార్గదర్శకమై యలరారుచుంట పాఠకశేఖరులకు విదితము.

భారతకథలో నొకచిత్రమైనఘట్టము ముఖ్యమైన భాగము ఉత్తరగోగ్రహణము. ఈయత్నమునను దక్షిణగోగ్రహణ వ్యవసాయమునను దుర్యోధనుని కుటిలరాజనీతి పారంగతత్వము స్పష్టమగును. భారత కథాఘట్టములలో నితఃపూర్వమెన్నడును నెదిరించి పాండవులను దుర్యోధనుడు జయించినది లేదు. జయింపలేకపోయిన్న పేరాసమాత్ర మపారముగ నుండెను. కర్ణుని దాయముకొని, అయినను సులభముగా శత్రుసంహారము చేయగల అవకాశమున్నప్పుడు పోగొట్టనేల! అందులకై పాండవుల మనస్తత్వము తెలిసినవాఁడు కావున ఉత్తరగోగ్రహణ యత్నము చేసినాఁడు. తత్ఫలితముగా నర్జునుడు గోరక్షణమునకు రాకుండనేనియు వచ్చినచో మరల పూర్ణముగా పండ్రెండువత్సరము లరణ్యవాసము నొక్క సంవత్సర మజ్ఞాతవాస ముండి తీరవలెననియు దక్కని యూహచేసెను. అదియుగాక తనలెక్కప్రకారము అజ్ఞాతవాసపుగడువు పూర్తికాలేదు. కాని పాపము! నిజమునకు పూర్తియైనది. ఈ విషయము మెల్లగిన తరువాత రాజరాజు చిన్నబోవును. ఎంతకేలహృదయుఁడో!

అసలు రాజరాజు స్వరూపమేమో యిందు గోచరమగును. రాబోవు మహాభారత రణరంగమునకు రేఖామాత్రచిత్రము లిందే రూపొందినవి. కౌరవవీరులలో నైపుణ్యము లిప్పటికే తలెత్తినవి. పాండవవిజయము తథ్యమనియు సూచ్యార్థసూచనముగా నీ ఘట్టము నిర్ణయించినది. కౌరవుల నాశమునకు నాంది యిందే జేయబడినది.

సంస్కృతాంధ్ర సాహిత్యములందు హాస్యరస పోషణము ప్రధానముగ శృంగారమునకు అంగముగనే జరుగుచువచ్చినది. దీనికి విదూషకుడు ఆలంబనముగా నుండును. హాస్యము వేషమువలనను, భాషవలనను, సాధారణముగా పోషింపబడును. సమర్థులయిన కవులు సన్నివేశములనుగూడ హాస్యరసపోషకములుగా జేయగలరు. ఈ హాస్యమును కడు లలితముగను, సుకుమారముగను, తగుమాత్రముగను పోషించి హృదయమునకు వెగటు పుట్టింపకుండుట ముఖ్య కర్తవ్యము. ఇది సర్వజనాహ్లాదకరము. పాఠక ప్రేక్షక హృదయములను కడుసులువుగ నాకర్షించి తన్మయత్వము గూర్పగలదు. కాని యిది అతిమాత్రమైనచో నంగిరసమునకు భంగము నాపాదించుటయే గాక సహృదయులకు వెగటునుగూడ బుట్టింపగలదు. మధుర పదార్థము తగుమాత్రముగ సేవించిననే యానంద మిచ్చునుగాని మితిమీరినచో వెగటు బుట్టింపగలదు. ఇంతియేగాక యేయితర రసమునైనను సులభముగ భంగింపగలదు. కరుణకు దీని పొత్తు రాదు. వీరముతోడి పొత్తు జేయునపుడు కడుజాగరూకత కావలయును. ఇట్టి ఘట్టమును నిర్వహించుటలో కవిసామర్థ్యము ప్రకటితమగును. తిక్కనసోమయాజి హాస్యవీరముల, అంగాంగి భావ కల్పనమున, కడు విజ్ఞానముజూపెను. ఔచితీ పరిపోషణము మిక్కిలి గావించెను.

ఈ ఉత్తరగోగ్రహణమున అకృతాస్త్రుడు బాలుడు తన్నెదిరి యెఱుగని తీవమున నంతఃపురకాంతా ప్రోత్సుకుడై, వీరమ్మన్యుడై, దర్పోద్ధతి నుత్తరుడు సంగర కౌతుకము మున్పిరిగొన: "ఎత్తునగొందు గౌరవుల నెల్లను మార్కొని యేని గోవులందెత్తు ముహూర్త మాత్రమున కాని సారథి లేడుగదా!" అనును. ఈ సాకున తప్పించుకొనవచ్చునని యేమో చాల వీర ప్రలాపములు జేయును.

కాలకర్మవశమున ద్రౌపది యచ్చటనుండుటయు బృహన్నల తగిన సారథియని యుత్తరుతో చెప్పుటయు జరిగినది. భారత ప్రధానఘట్టముల కెల్ల ద్రౌపదియే హేతుభూతురాలు. స్వయంవరము నాటి నుండియు దుర్యోధన వంశనిర్మూలనము వఱకు గల ప్రధాన ఘట్టములకెల్ల నీమెయే కారకురాలు. కురుకుల క్షయమునకు మూలకారణము ద్రౌపది మానభంగమే గదా! అయ్యవమానాగ్ని చల్లార్చుటకు ద్రౌపది యనుక్షణమును దుర్యోధన దుశ్శాసనుల రక్తవాహినికై యెదురుజూచుచుండును. ద్రౌపది కవమానకారణమున్నచో నది నశించువరకును నిద్రింపదు. కీచకవధా ఘట్టమిట్టిదే. ఇప్పుడు ఉత్తరగోగ్రహణమునకు అర్జునుని యకృతాస్త్రుడై పసికూనయైన యుత్తరకుమారునికి సారథిగా ప్రతిపాదించి ప్రోత్సహించుటయు తన కచ్చ దీర్చుకొనుటకే. బృహన్నల సామర్థ్య మిప్పట్టున ద్రౌపది ముఖమున గాక వేరుగా ప్రకటింపజేయుట యసమంజసము. సైరంధ్రి ఉత్తరతో జెప్పునపుడు "జనపతి తగు సారథి నారయుచున్నవాడు. ఎఱింగిన పని జెప్పగావలయు" ననును. ఇది ధర్మము గాన తాను చెప్పుచున్నదట. బృహన్నల శక్తియుక్తులు ప్రకటించునపుడు అసత్యమాడక యాథార్థ్యమును తమ విజ్ఞప్తి బయల్పడకుండ ఉక్తి చమత్కారమున ప్రకటింపజేయుట పాత్రపోషణమునకును, వాక్యరచనా చణత్వమునకును నిదర్శనము.

ఉత్తరకుమారుని వీరమ్మన్యత, పార్థుడనిన అతనికిగల భక్తి గౌరవాదర్శములు, బృహన్నల యనినంతన కలుగుజుగుప్స, తృణీకార భావములు, తొలుత పరాకోటిని వర్ణనసేయబడినవి. ఇవి యన్నియు సముచిత పదజాలములతో, శైలితో కన్నులకు కట్టినట్లు చిత్రింపబడెను. బృహన్నల తనకు సారథి యని విని అతడనిన మాటల జూడుడు "కురుబల మేగుదెంచెనటె ...దానిపై పరిగొని శౌర్యసంపదయు బాహుబలంబును చూపబూని యేనరిగెద నట్టె, తేరికి బృహన్నలసారథియైన దీని నవ్వరె పురిలోన." ఇందుకురుబలము యొక్క గొప్పతనము, "ఏను" అనగా ఇంత బాహుబలసంపన్నుడైన రాజకుమారుడను నేను అని తన యుత్కృష్టాహంకారములు ద్యోతకము జేయుచు అట్టి మహాబలసంపన్నుడనైన నేను "కౌరవబలము నోడింప బోవుచుండగ బృహన్నలయా సారథి అని

యీసడించుట గోచరమగును. అయిన నేమగును పట్టణమున నవ్వులపాలు కావలసివచ్చును. ఈపద్య రచనమున కౌరవబలముపై శిష్యుడును తన మహావీరత్వమును తాను నిర్వహింపవలసిన మహత్తర గౌరవమున గౌరవము బృహన్నల యుత్కృష్టత్వము ఉత్తరుని ముఖమున తిక్కన చక్కగా ప్రకటింపజేసెను. ఉత్తరుని యీ పురిలో గౌరవమువండుట. అది పోయినచో భరింపలేడు. ఇది మహావీర లక్షణములే పాపము! బృహన్నల నట్లు తెగడుట విని సైరంధ్రి తీవ్రవ్యధ నొందినది. వాక్ప్రారంభము తీవ్రము గానున్నను తుదకు మనోనిగ్రహము చేసికొని తనస్థితికి తగిన యట్లు మాట్లాడినది. "కౌరవసేన గాదు త్రిజగంబులు నొక్కట నెత్తివచ్చినన్ నేడు బృహన్నలావశగతిన్ జయింపదగిన గెల్వవచ్చు" ఇది ఉద్రిక్త హృదయముతో మాట్లాడినది. తర్వాతి భాగము తమాయించుకొని పూర్వాపరసమర్థనీయముగా పలికెను. ఇందు విచిత్రమైన ధ్వనిగలదు. ద్రౌపది భావమున నేడు బృహన్నల చెప్పుచేతలలో నుండవలయు ననియే గాని, అతని పారవశ్యమున నుండవలయు ననియే గాదు. అనగా నుత్తరుని పారవశ్యమును, అర్జునుని నాయకత్వమును ముద్దిష్టములు. ఇదియేకదా పర్యవసానము. ఇందు కూడ ఉత్తరునికి తెలియునట్లు అర్థాంతరన్యాసమును "కారణజన్ములై తనువికారము నొందిన పెంపు దప్పునే" అనువాక్యమున బృహన్నలమహత్త్వము కారణ జన్మత్వము లగ్గడింప బడినవి.

ఉత్తర కడు హృదయంగమముగ నర్తనశాల ప్రవేశించినది. ఆ ప్రవేశవేగమును సౌందర్యమున తళుకు బెళుకులను జూపుటకై "మెరుగు మొగిలు దోచు తెఱగున" ననుపమానము వాడెను. నాట్యమందిరము జొచ్చి అనుచోట మందిరము శబ్దమును మధ్యలో విరిచి రెండవ పాదమున వాడుట మరల తిరిగి లోప్రవేశించుటను గోచరింపజేయును. ఆమె గమనమంతి నట్లు రేఖప్రాస యతి వాడుట యొకలయానుబద్ధమైన క్రమమున నర్తించి గమించినట్లు చూపుటకై యున్నది.

శిష్యురాలయిన యుత్తర కోరిక కాదనలేక నియ్యకొనినట్లు బృహన్నల "జగదీశ్వరపుత్రి నాకు పారతంత్ర్యము చెప్ప కలదె! నీమాటకు నే మిగులంగా నెఱుకు పాదము మీఱజాలుదునే" అని తిరిగి యాథార్థ్యము నిట్లు వాక్రుచ్చును "భవదీయప్రార్థనచే తిరిగి పరమ దుష్కరములు దీర్చియయిన నుత్సవ మొనరించెద. సారథ్యమునిం బోకననగ నేల" వీనియందు నేను యుద్ధమే చేయుదును సారథ్యమేయని యూరక పలుకరి వాస్తవము స్పష్టీకరించును. ఈ ఘట్టమున అర్జునుడు పేడిరూపధరుడై యుండుటచే రెండు పాత్రలకును తగినట్లు ద్వ్యర్థిగా మాట్లాడును. ఈ పల్కులలోను చేతలలోను లలితమైన హాస్యముకలదు. తర్వాత ఉత్తరుడు బృహన్నలను సారథిగా కోరునప్పటి మాటలు "కౌరవులతోడ కయ్యంబు కలిగెనాకు; కడగి నేడు రథముపై గడపవలయు" ననునవి కౌరవులతో యుద్ధము చేయుట చాల మహత్తరవిషయమని యుత్తరునకు తెలియును. బృహన్నలను సారథిత్వమునకు వేగిరించునప్పటి తెలిమాడుకు "వీరమ్మ, మైమఱువు నోడితే తెక్కుము తప్పగుంకదిరదు నీకున్!; సైరంధ్రి చెప్పె నీదగు నీరమ్మను పెంపుగావు వెఱవును మాకున్" క్రియలోని తొందర తనమును చూపునప్పుడు చిన్న వాక్యమ్ముల రెండుమూడు మాటలలో రచింపవలయును. "మాకున్" అని బహువచనము వాడుట రాచఠీవి చూపించును. కొండొకనడి కర్జునుడు సంసిద్ధుడై తన త్రాణమును ఎఱుగనివాడు తొడినట్లు ఎక్కెసెగా తొడిగి అచ్చటి యుబ్బాజననము నవ్వించెనట. అర్జును నంతటి మహావీరునకు లోన భగ్గనిమండుచున్న కౌరవబల విజిగీషాపూర్వక విక్రమవహ్ని వెలకుచున్న దానిని బయల్పడనీక తొక్కిలి బృహన్నలా వేష సముచిత భంగి హాస్యప్రాయముగా ప్రవర్తించుట చాలహృద్యమును సముచితమునైన పాత్రపోషణావైఖరి. "రయమమున నిడ మెత్తు...అస్మదీయ విజయము నభినందింప పురమునజను లెదురొత్తనకా" అనినప్పుడర్జునుడు దగ తొక్కరముగా నిట్లను: "నీ వేమి పనిచిన నట్ల చేయవలయును. నీవున్నరెడ నుండవలయును. నీవు సన్నదెస దనవలయును, నా శక్తి రేగి పంచి పనిగొని కడిమిమై పగఱ గెల్వనుము." ఈ చివరవాక్యమువందలిని విజయస్వరూపమును శక్తియుక్తులను తెలిసికొని శత్రువుల జయించిన కీర్తిని పొందవలెనను నాసను యాథార్థ్యము చెప్పెను. అర్జునుడెక్కిన రథమెంత మనోహరముగా నున్నదో చాటుటకు "కాంచన జాలాలంకృత చంచత్ తనుబీల మెఱయు జవనాశ్వములన్ పూన్చి రథంబున మణిమయ పంచానన కేతు నుత్తై బంధుర భంగిన్." ఇందలి బిందుపూర్వక చకారప్రాసయు, సమాసరచనావిన్యాసము, హృద్యతను స్ఫురింపజేయుచున్నది. ఇట్లు సన్నద్ధుడైన సారథితో ఉత్తర కురు

వీరుల అంబరములలో బొమ్మపొత్తికలను కోరుట ప్రకృ
తిమునం దుచితమును భావివాస్తవికతకు సన్నిహిత
మును. ఇది పిరికియై దనుచున్న ఉత్తరకుమారునితో
చెప్పవలసినది. అట్లుగాక సారథితో చెప్పుటయు
వారికి "జనపాలనందనుండు జయలక్ష్మిన్ చేకొన
వచ్చె చీరలు తెమ్ముట పనియే ఆటలమాటకు ఎల్లభంగుల
తెత్తుగా" అని చీరలు తెచ్చుటయందలి తనకర్తృత్వము
వెల్లడించును. ఇందెల్లయోధుల పట్టునదే కౌరవబలము
నెదుర్కొని యోడించునను తెల్లము చేయబడినది.
బృహన్నల సూతవృత్తి చేయుచుండ ప్రప్రథమముగా
కౌరవబలమును దూరమునుండియే జూచెను. అప్పటిది
చిత్రవర్ణ సంశోభితమై లలితవనము దివికి నరిగాపువో
యెను తెలుపదాల్చినది. ఇదమిద్ధమని కౌరవ బలము
స్పష్టముగా దృగ్గోచరము కానప్పుడు, అదియొక మహో
ద్యానముగా వీరమ్మన్యమైయున్న యుత్తరుని కన్నుల
కనుపడుట కడు నుచితముగానున్నది. అందలి రంగు
రంగుల పట్టులను తాను విహరించుట కలవాటుపడిన,
అనువయిన వనమట్లే భావింపగలెనుగాని ఒక మహో
ర్ణవమట్లుగా చూడలేదు. ఈ వర్ణనమున తొలుత వారిని
మన స్తత్త్వమును, కౌరవబల మెంతదూరమునుండి దర్శన
మిచ్చుచున్నదియు మనకు స్పష్టమగును. కౌరవరాజ
సైన్యము దివికి నరిగాపువోయెను తెలుపదాల్చుట
భావిని కౌరవసైన్యమే కాక కొదకాశ్వహీనులను
భీష్మద్రోణకృపాది మహావీరవరులును, కురుకుమారకతి
ముము దివి కేగి వీరస్వర్గము నలంకరించుట సూచితము.
కౌరవరాజసైన్యంబుకవియె (తొలుత) కని మరల,
నుత్తరుకు జీవ్వకడిన చూపుల కొట్టుకవును. రెండవ
పారి చూచునప్పటి కెంతమార్పుకల్గినదో గమనింపుడు.
కారణము సైన్యసామీప్యమునందుండుటయే. చూపు
నపను చూపునకును మధ్యగల భేదము త్రుటికాలమున
రథ మెంత సామీప్యమునకు గమించినదో యూహిం
చిన నర్తనుని యాతురత, రణోత్సాహము, రథము
నడుపు నేర్పు స్పష్టములగును.

రెండవసారి చూచినతర్వాత నుత్తరుడు బృహ
న్నలతో నిట్లనియె: "భీష్మద్రోణకృపాది ధన్వి
నికరాభీలంబు...కలితంబు సైన్య మిది—యే నేరంగ
శక్తుండ నే."

పై సైన్యవర్ణన పద్యశైలి వేరు. ఇది వేరు.
అప్పటి భావము వేరు. ఇప్పుడు వేరు. ఇది భయాన
కము. శ్లేషాబహుము, దురభిగమ్యముకాని నేతతో స్ఫు
రత శబ్దసమాసరచనయు, ప్రాసకల్పనయు "జాలోపమ్మ
స్ఫార దరురిన్వ ధ్వజ్వల బలావ్యగ్రంగ ఖుర్దగ్రకవ్య
జార్చిప్మత్ర్వాకలితంబు" నందలి సంయుక్తాక్షర
సంధి బంధురతా ప్రయోగంబును చేయబడినవి. పద్య
బంధ మెట్లు ఎంత క్లిష్టమైయున్నదో జూడుడు. ఆ
పద్యబంధ మెట్లు ఎంత క్లిష్టము దుర్గమమునో ఆ సైన్యము
నంతియు. ఇదియే రచనా శిల్పము. ఈ రచనా శిల్ప
మును తెనుగుకవులలో నుత్తము లెల్లరు పాటించి
నుతింపబడిరి. పై పద్యము నందలి "యే నేరంగ శక్తుం
డ నే"లో ఏ నా అనగా క్రింది పద్యమున వివరింపబడి
నది.

అశ్వత్థామ్నిత, బాలుడ (నేను) కౌరవ్యక విద్యా
ప్రాప్తిమై విరాధుంల్ శకుని జయద్రథ దుర్యోధన వికర్ణ
కర్ణాది యోధవరులు. ఇట్టు లెరుంగక వచ్చితి నెట్టొ
మహీదీంగి! బెట్టేరులు — మనకు మారొక్కనవట్టి
కొలదికొరు." ఇందలి ద్విరుక్త టకార ప్రాసము
ఉత్తరు మనః పరిస్థితిని సరిగా చెప్పగలది. తన జ్ఞాన
భయమును అసమర్థతను నొక్కి చెప్పుట కనువైన
ప్రాసము. "కౌరవసేన జూచి కసికో రోషగిరా మది
తోన మేను నీరూరక పోవుచున్కి ఇది యొప్పునె "నేను
బస్తుండే నీ పూరికే ఏమిటి అల్లా పోతావు" అను
భావమును చక్కగా "ఊరక పోవుచున్కి" అను జాతీ
యముతో పాత్రను కూడ కన్నులకు కట్టినట్లు రచిం
చెను. "వేరు నరనాధ్యము" అనగా అప్పు డర్జునుడు
"పసులటు పోవగా మరల రాడితివె నీకు నరేంద్ర
నందనా" అనును. ఈ సంబోధనమున ఉత్తరునిచే
లోగడ చూపబడిన రాచపుట్టువుకలని గర్వమును ఉపా
లంభించి నాడు. "దంతితురంగసద్భటకదంబము
జూచి కలంగు టొప్పునే," జూచిన మాత్రమున నే
భయపడుట తగునా! గుఱ్ఱములు, ఏనుగులు కాల్బలము
విస్తారముగా నుండుట జూచి భయపడుటచేత నుత్తరుని
భీరుతాగుణము, జేలహృదయము నిందు ప్రకటితములు.
తన భీరుత్వము మాత్రమే భిన్నింప "పసుల దయ్య మెఱుంగు
పసతుల సంతోషమేల నాకు. అనికి చాల నేను" అని
దీనుడయ్యెను. ఈ వాక్యములు చిన చిన్న పదముల
తోడను చినచిన్న వాక్యములతోడను కూడియున్నవి.
మాటిగా సర్కానవి. "అనికి చాల నేను" అనునది
యింటికిపోవ వేగిరపాటును స్ఫురింప జేయును.

ఆ క్రమమును తాత్కాలిక కార్యోపసంహారణమును, కార్యాంతరవ్యగ్రతయు, చూపదలచినచో పై రచన చాల యోగ్యము. ఎదుటివారి వాక్యముల త్వరగా ఖండించి పై మాట మాట్లాడక సూటిగా సమాధాన మిచ్చి సంభాషణను త్రుంచివేసి తన కార్యసాధనకు వేగిరించుట యిందు స్పష్టములు. అర్జునుడు ఆమాటయు నీమాటయు చెప్పి యుద్ధరంగమున కుత్తరుని దుముకజేయ నుద్దేశించుట చూచి ఉత్తరుడు వానిమాటల త్రుంచివేసి విసుగుదల చూపుటకై "పసులవత్తు మెఱుఁగ పడఁతుల సంతోషమేల నాకు అలికి చాలనేను." అని ముక్కకు ముక్క తెగవేసి సమాధానమిచ్చి యింటికి పోదము పద అన్నట్లుగ పల్లవిబాడును. ఇది యీ ఘట్టమున నీ పాత్రి కంతియో తెగియున్నది. ఉత్తరుని భీరుమూర్తి కన్నులకు గట్టుటలేదా! దీనికీదృశవాక్య రచనా విన్యాసమును శైలియేకదా సాధనములు కవికి. ఇట్లుపోషన చేసి శబ్దమును వాడుటయే మహాశిల్పము.

అర్జును డింక నేమేమో పల్కుచు ఉత్తరుని సమ్మతింప జేయుటకును ధైర్యమును కల్గించుటకును యత్నించుచు మాటలమున్న రథము త్రోయుచు కౌరవానీకము సమీపమునకు పోవుచు "నీకు భయమేల? ఏ గ్రమ్మరి రిత్తవోదువె? భయోత్కంపంబు నీకేటికిన్ అని తేరు పోనిచ్చును. అప్పుడుత్తరుడు ఆననంబు పల్లటిల్ల మానసంబు తల్లడిల్ల "నేమో" యనును. ఈ శబ్దములవలన ఉత్తరుడు రెండు పల్టీలు కొట్టి తలక్రిందులైనట్లు కన్పడును. ఈ సన్నివేశము నందంతటను హాస్యమున్నది ఉత్తరుడు బవ్వచ్చునితో:

"దవ్వుల విరిగిన నవ్వుదురటె! మేలు మేలు నను వాగను, నీ క్రొవ్వురుగదేని తలపకు మెవ్విధి జనిలేని నను నెత్తిన భీతి"

"ప్రాణముపోవుస్థితి వచ్చియుండగా ఎవ్వరో నవ్వుదురట. నవ్వాపివేయకుము. నీకు నోడలంత పొగరుపట్టినచో పోయి శాస్తి చేయించుకొనుము" అనెను. నవ్వాపకు అనవలసియుండ, నవ్వకు, అనెను, అపుడు తాను ఇతరులను చేయుక్రియ. ఇంది ర్వ్యరి యత్నము లవసరము. అగుటలో తానై చేయునది కావున సర్వస్వాతంత్ర్యములు కలవు. అట్లే అర్జునుడుత్తరునితో స్వైరవృత్తి వహించి. అర్జును డింకను రథము పోనిచ్చుచుండెను. అప్పుడు లాభము లేదని అడిరిపోయి "శరములు శరాసనము నయ్యరదముపై డిగ్గవిడిచి యతిరభసమునన్" "ధరణికి లంఘించి విసంబురిడెసను లజ్జవిడి పోవంబారెన్." డిగ్గవిడిచి యను పదముచే తక్షణమే క్రిందపడవేసి యని యర్థము, లంఘించి అను పదముయొక్క ధ్వని దుముకుటను స్ఫురింపజేయును. అప్పుడర్జునుడు ఉత్తరువెంట పఱిగి ఏరి పట్టుకొనగ నతడు వెలవెల బాఱుచు మూర్తీభవించిన భయానక రసమో యనకనుదీనవదనుడై అర్జునునకు లంచ మిచ్చెద ననియు తనను విడువవలసినదనియు ప్రతిమాలెను. అనేక బహుమానము లిత్తుననియు ననెను. అప్పటికిని విడకున్న కరుణింపు మనెను.

"సైనికుల నెల్లచూచి వెఱుపడక వేగమును లావు" అనుపద్యమున ఎవరు సారథియో ఎవరు యుద్ధవీరుడుగ నుండవలయునో స్పష్టముగ లేదు. ఇచ్చట "చిచ్చఱపిడుగెట్టు లట్టిసరి కూరుల మొత్తము నుగ్గచేసెదన్, గోవుల గ్రమ్మరించెదన్" అని స్పష్టముగా తానే చేయునట్లున్నది. తిక్కన యింత నిశితమైన జాగరూకతను సూక్ష్మతి సూక్ష్మములను పలుకుబడులను కర్తృ కర్మ క్రియల ప్రయోగములను చాటించి ఔచితీ పోషణమును పారమునందించెను. ఈ పద్యమున మఱియొక చమత్కారము గలదు. "కూరుల మొత్తము నుగ్గజేసెదన్, పఱ పెదనేన, రాజన్యతి బాపెద, గోవుల గ్రమ్మరించెదన్." ఇందు నాల్గువాక్యములు గలవు. అవియు చిన్న చిన్నవి. నాల్గు క్రియలున్నవి. ఇట్టి చిన్న వాక్యములును. హెచ్చుక్రియలును పాత్రల యుత్సాహమును ప్రకటితము జేయును. ఇది రచనా శిల్పమునందలి యొక విశేషము. దీనిచే బృహన్నల అర్జునుడని స్పష్టపడిన తర్వాత, కుంతీతనయుడు విరటు కొడుకును కౌగిటజేర్చినప్పుడు, ఉత్తరుడు "మనము కలంకదేర, రిపుమర్దన విక్రమ! ఎక్కు తేరు, నీఘన భుజశక్తి ప్రాపున అఖండిత కార్యము హొన్నతుండనై అని మెఱన సారథిత్వము మహాత్వము వైరులు మెచ్చ జూపెదన్, నను పని గొమ్ము, లెమ్ము. కురునాథున దల్పు మరల్పు గోవులన్" ఇందు ఉత్తరుని ధైర్యవీర్యములు పొడమను, ఉత్సాహము ప్రకటితమగు సమాసరచనము సారథిత్వము, మహాత్వము. అనుశబ్దాలంకారములు, "పనిగొమ్ము, లెమ్ము, కురునాథున దల్పు మరల్పు

గోవులన్" అను ఉత్సాహపూరితమైన శైలిలో ఉత్తరు మనోహరమూర్తియు మనకు కన్నులకు కట్టినట్లు గన్పించును.

"ఆతురరై ఎదిరిమాచు నంబకు చేరి క్రీడింగజని, ఆయుమహాసైన్యాకీర్ణ, బోసీగది విరుద్ధబరిత్రా!" అనును. ఈ ఉత్తరుని హాస్యరసాత్మికమైన ధీకము చాల అద్వితీయమైనది. ఈ భాగమునందు రసవైవిధ్యమున్నను అంతటను పన్నిన హాస్యము హృదయంగమముగా పోషింపబడినది.

అప్పు డర్జునుడు 'వెఱవకుము నన్ను బోటు కురువీరులతోడ నెక్కడేని, అత్తెఱగది యేలనీకు! ఉకుల, లేచికి పారధిగమ్మువాకు, చిర్చుల బీరు గెట్టులెట్టినరి కూరుల మొత్తము మగ్గ చేసెదన్, పట్టి పెనసేన, రాజా ధృతివాపెద, గోవుల గ్రమ్మరించెదన్." ఇప్పటినుండి వీరరసము పరిపుష్టినొందినది. వీరమున కుత్సాహము స్థాయి. ఇంతకు పూర్వ మర్జునుడు అస్పష్టముగా నుత్తరునికి ధైర్య వాక్యములు బలుకుచుండెను. మహోత్సాహమూర్తియై యుండుటకు దుముకుచుండెను. ఎంతకును ఉత్తరుడు అతనిని నర్జునునిగా గ్రహింపలేదు. పరికదా! పరమభీరుడై యుండెజాతి నిరుత్సాహియై ఇంటి మొగము బట్టుచుండెను. ఇపు డర్జునునికి తన నిజ స్వరూపము జూపవలసిన యవసర మేర్పడినది. పూర్వమువలె హాస్యపు పలుకులు పలుకుటకును వేళాకోళములకును సమయము కాదు. అందుచే నీ ఘట్టము నుండి విషయము తీవ్రత దాల్చినది. ఇప్పటినుండి యర్జునుడు ప్రధానపాత్ర కావున వీరము ప్రధానము. అందుచే నీ పద్దెమున వాత్సల్యపూర్వకముగా, ఉత్సాహజనకముగా నడిచినది శైలి. ఇంతకుపూర్వ మర్జును డుత్తరుని సంబోధించుట రాజకుమారునిగా మాత్రమే, కాని యిప్పుడు, ఒక మహావీరుడు అభయ హస్తముతో నొక భీత హృదయుని ప్రేమార్ద్రముగా పలుకుట "వెఱవకు మన్న దానిలో గలదు. పోటుకెక్క చేసి ఉదుటము, నాకు లేచికి పారధిగమ్ము" ఇంత స్పష్టముగా తాను యుద్ధము చేయుదునని యింతకు పూర్వము అర్జునుని పలుకులలో వ్యక్తము కాలేదు. చూడుడు." చిత్తవృత్తి యొక్కించుక చిక్కబట్టుము. ఇప్పుడు కౌరవ సేన నుగ్గచేసెద, నని వాక్రుచ్చుచును.

శమీవృక్ష సమీపంబున కరుగునపుడు అర్జును మూర్తి క్లీబరూపమ్మున్నంబును, ప్రస్ఫురణ విశేష భీషణంబునై దైవ్యధీ భావంబున కౌరవ సైనికుల మనంబుల గలచినది. అర్జునుకు శమీ వృక్షంబునకై బయలు వెడలి చేరులోపల కొంతకాల వ్యవధి యగును, కదా! ఈ కాలమున గమన వర్ణనము చేయవలయును. లేదేని మరియొకవిషయమును దేనినైనను వర్ణింపవలయును. ఈ రెండును ముచితములు కావు. అందుచేత అది యేదియు నక్కఱ లేకయే ప్రస్తుత కథాంశమునకును పాఠకమహాశయులకును మనోహరతా పాదకమైన ప్రధానాంశములు వర్ణింపబడినవి. ఇప్పటి వఱకును ఉత్తరార్జునుల విషయమే వర్ణింప బడినది. గోగ్రహముతో లంకుని పోవు బల విషయ మేది! ఇప్పటికి చాల నాలస్యమైనది. కావున అర్జునుకు శస్త్రములనుకు అప్పటి నుండెననియు, వానిని రక్షకుడై అయ్యనమ్ములకై శమీ వృక్షము నైపునకు బయలుదేరగనె అజ్ఞాతవాస రూపమైన క్లీబత్వము తొలగి, విశ్వరూపి మూర్తి ప్రకటితమగు చున్నదనియు సూచితము. అప్పుడు కౌరవబలమున నుత్పాతములు పుట్టుచున్నవట వాని నవలోకించి పాండవ పక్షపాతియు, శిష్య వాత్సల్య పూరిత హృదయుండును నయిన ద్రోణాచార్యులు సురినదీసూను నవలోకించి "అతిస్నేహః పాపశంకీ" యనునట్లు అర్జునుకు అజ్ఞాతవాస సంవత్సరము ముగియకుండనే బయల్పడునేమోయను భయమున ప్రక్కనున్న దుర్యోధనాదుల కెఱుకరాకుండ భీష్మునికి తెలియునట్లు ద్వ్యర్థిగా నిట్లనును.

"వెఱవరిగాక వీరు కురువీరులకున్ బోసమాపువాడె, అశ్వైరు వోక్రమాని పేర విట సేరగ వచ్చుచున్నవాడు, అహంకరణ ముకొని యొండొకటి గానదు మూర్తి విశేషమూఱయున్ సురపతి యట్ల వీని మది చొప్పది యెట్లొ యెఱుంగనయ్యెడున్" అనగా నిగూఢ వృత్తిని భీష్ముకుకూడ సమాధానము చెప్పెను, "తలపగ రిపులకు ఇమ్ములుకొలది గడచి వచ్చితిమి అకుంఠిత బాహాబలము సెలప తరియయ్యెన్" అని ఇందు "రిపులకు ఇమ్ములుకొలది" యనగా శత్రువులకు సుఖకరమైన ప్రదేశమును అనగా విరాటసైనికులకు బలకరమైన స్థానమును వదలి వచ్చిరి మని భావార్థము. పాండవుల అజ్ఞాతవాసకాలమును గడచి వచ్చితిమని అంతరార్థము. కావు నమరఖుద్ర మొక్కా వోని పరాక్రమముతో యుద్ధము చేయవలసిన కాలమని భావము. అప్పుడు పాండవులకు పరకాలము వచ్చినదని ద్రోణుడు ప్రియంబంది ఉత్సాహముతో

పుత్ర నిర్విశేషవాత్సల్యముతో అతడర్జునుడని స్పష్టీకరించి "సింగం బాకటితో" నను పద్యమును పల్కెను. సింహశబ్ద వికృతియైన సింగంబును వికృతిమైన బృహన్నలా రూపమున నున్న యర్జునునికి వాడుటెంతయేని సమంజసము. "మాతంగస్ఫూర్జిత యూథ మెంత యున్నను, ఒక్క సింగమునకు చాలదు. ఆకలి గొనియున్న సింగము మాతంగయూథమును చూచి నప్పుడు ఒక్కగంతున మీదకు దుముకును. దీనిని స్ఫురింప జేయుటకే "వచ్చెం గుంతీసుతమధ్యముండు సమర స్థేమాభిరామాకృతిన్" యనెను. "వచ్చెంగుం తీసుతుండు" అన్న శబ్దము అర్జునుడు చెంగున దూకి వచ్చుచున్నట్టుల గన్పడును. మాతంగ యూథముపై సింగము చెంగున దూకి వచ్చునప్పుడెట్లు భీషణ సుందర ముగా నుండునో, అట్లే కుంతీసుత మధ్యముడు సమర స్థేమాభిరామాకృతితో వచ్చెనట. "కుంతీసుత మధ్య ముండు" నుటచే నీతడు కాకనిట్టి సింగములవంటి వారింకను గలరని సూచితము.

ఇచ్చట ద్రోణు డర్జునుని పరాక్రమము నగ్గడించుట విని, కర్ణుడు కటకటపడి ధిక్కరించును. రాజనీతి దృక్పథమున నీ కర్ణుని వాక్యములు కడుసమంజసములు. "కౌరవ సేనకెల్ల ఒక్కండెడ మేటివి. ఈబలము గర్వము కుందగ ఇట్లు దోశ్శౌండిమకోహటించితివి తగునా?" యనియు, అతడు వచ్చె నేని "అస్మచ్ఛిలీ ముఖపాతదలిత హృదయపద్ము జేయుదు" నని వీరాలాపము లాడును. దుర్యోధనుడు పాండవులపై కత్తిగట్టుటకు, కౌరవపాండవుల వైషమ్య ప్రాబల్యమునకు మూలము కర్ణుడే కదా! భీముని దుర్యోధను డెదిరింపగలడను ధైర్యము అర్జునుని కర్ణుడు నిర్జింపగలడను విశ్వాసముతో కౌరవ పాండవుల వైరము మహాగ్నియై ప్రజ్వలించెను. అందు చేతనే కర్ణుని తల భారతమనిరి. అట్టి కర్ణుడు అర్జునుని నిర్జింతును అని ద్రోణుని ధిక్కరించి పల్కెను. కర్ణ పరాక్రమముపై ఆధారపడియున్న దుర్యోధనునకు ఇది అమృతసేచనముగానైనది. కాని చివరకు కర్ణుడే కాదు యావత్కౌరవమాతంగయూథము అర్జున శిలీముఖాగ్నికి తృణప్రాయమైనది. బాగుపడదలచినచో దుర్యోధనుని కిది చక్కని పాఠము. అర్జును డనిన దుర్యోధనునకు తగని భయము. అతనినితప్ప మరియెవ్వరినైన గెల్తునను ధైర్యము కలదు. "ఒరుడయ్యేనేని మామకశరాసనశిక్షా దీప్త సాయకపంక్తిన్ బరిమార్చెద." అర్జునుడైన నేమియు చెయ్యలేడు. కావుననే అర్జును డయ్యేనేని అడవికేగి భ్రాతృయుతముగాగ బండ్రెండు వత్సరములు నిలువవలయు మగుడ నను నూహజేసి యుత్తరగోగ్రహణమునకు బూనుకొనెను. దీనినిబట్టి దుర్యోధనునికి పాండవుల నిర్జించుటయందు దృఢమైన విశ్వాసము లేనట్లు ప్రకటితము. ఈ పాత్రయందలి యీ ముఖ్య విషయమును తెలిసిచూచి కవి బయల్పఱచెను.

అర్జునుడు ఇప్పటికి శమీవృక్షమును సమీపించెను. పై కౌరవవీరసంభాషణము వలన రంగస్థలముపై నిరుపక్షములనుండి కథాగమనమైనది. ఇది నాటకీయ శిల్పము. పాఠకమహాశయుల హృదయమందును, కౌరవ మహావీరహృదయమందును గల యొక ముఖ్యమైన సందేహము తీర్చబడినది. దుర్యోధనుని దురాలోచనము స్పష్టమైనది. ఇన్ని ప్రయోజనములు సాధించు నీ సంభాషణమును సూటిగను, క్లుప్తముగను ముఖ్యపాత్రల మూలమున చేయించుట తిక్కన ఔచితీపోషణమునకు ఒక మచ్చుతునక.

ఉత్తర కుమారునకు హృదయమున భీరుత్వము మెండైనను మనమున రాజసమునకు లోటులేదు. అర్జునుడు శమీవృక్షము నెక్కించి గాండీవమును గొని రమ్మని చెప్పగా రాజసపు పల్కుల నిట్లు పలుకును. "పీనుగువంటగ నట నే భూనాథతనూజు డనక పుయి లోడక నన్నీ నీచపుపనికి పనుపంగ నీకుందగునే! పాప కర్మము గాదె!" భూనాథ తనూజుడనను గర్వము ఈ పల్కులందు మెండుగా గన్పించును. అప్పుడు గడు చమత్కారముగ, వాత్సల్యమును ఉపాలంభనమును ద్యోతకమానట్లు ఈ క్రింది వాక్యములననును. "శవము కాదు మత్స్యజనపాలపుత్ర! ఏపట్టైన పనుకుపనయ్య విన్ము" అనును. అతనికి దగినట్లు 'నీవు రాజకుమారుడవని నేను గుర్తెఱింగితిని. ఇప్పుడే నీ రాజకుమారలక్షణము బయల్పడినది' అన్నట్లు మత్స్యజనపాలపుత్ర! యని సంబోధించును. దీనియందు సామాన్య రాజకుమారుడవే గాదు వైరాటివిగూడ నని స్పష్టము చేయును. చెట్టెక్క ఆయుధములు పాములచందమున నునికి గ్రథముండి 'సారథీ' యని సవ్యసాచిని బిల్చెనట. సవ్యసాచిత్వము అద్వితీయ బిరుదము అర్జునునకు అట్టివానిని సారథీయని పిలుచుటలో నెంత సొగసుగలదో! అచ్చట గాండీవమును గనుగొని "ఇది

యొక భావము విస్మయ మొందవిందు కొండచిలువ యొక్కానా దిగియున్నది.” ఇంతవఱకును సామాన్యమైన మాటలలో వర్ణించెను. “ఖచిత కనకకమలసము దయద్యుతి సముపగూహనోజ్జ్వల” అను సమాసమున దాని దైన్యమహాత్వములు సూచితములు.

అటకు పాండవ మత్స్యము డనియు తన తండ్రి కొలువున నున్న కంకభట్టాగులు ధర్మరాజాదు లనియు విశ్వాసపూర్వకముగా నెఱిగి యుత్తరుడు క్రొత్త రూపము నందెను. ఆదినుండి యిప్పటి దనుక మనము జూచు ఉత్తరుకు అకృతాస్త్రిక, బాలుడు, భీరుడు, శేల, తల్లి కొంగులోని పసిబిడ్డ దందమువాడు. కాని బృహన్నల యడర్జునుడని తెలిసి, మనము కలంక జేరిన తర్వాత, నుత్తరుని మూర్తి నిజమైన రాజకుమార యోగ్యమైనది. ఇచ్చటి యుత్తరుకు నాగరికుడు, ఉచితజ్ఞుడు, ధైర్యశాలి. అర్జున వృత్తాంతము విని ఉత్తరుకు అద్భుతహర్షంబులు ఒకుళ్ళ ప్రూనుడిగ్గ నుఱికి సర్వాంగ సంగతోర్వీతలంబుగ దండప్రణామం బాచరించి చేతులు మొగిచి “బాహుసమగ్రశత్రుమదభంజన శౌర్య! సమస్తలోక చేతోహరమూర్తి! నీ విటుల తోచుట నాకు ప్రసన్న విస్ఫురద్దేహముతోడ, భాగ్యము దేవత సన్నిధిసీతకాడె, సమ్మోహముపాసి, చిత్తము ప్రమోదరసత్త్వము పొంది పొంగెడుగ్” అనును. ఇంతకు పూర్వము బృహన్నల ఎన్ని చెప్పినను, విసిగికొని భయపడి బిన్నచ్చిపాటిన ఉత్తరు పాత్రయేనా యిది? అచ్చటి శైలికిని, యీ పద్య శైలికిని, భేదము గమనింపుడు, ఈ శైలి ప్రమోదరసత్త్వమునకు మూర్తి. హృదయమున నెంత సంతసము లేకున్న ప్రూను డిగ్గనుఱుకుటయు సాష్టాంగ దండప్రణామ మాచరించుటయు, చేతులు మోడ్చి నిల్చి “బాహు సమగ్ర శత్రు మదభంజనశౌర్య!” మొదలుగా గల సమాసములలో సంస్తుతించుటయు జరుగునా? ఇందు మరియొక విశేషము గలదు. అర్జును డిప్పుడు బృహన్నలగాదు. సమస్తలోకచేతోహరమూర్తి. బాహు సమగ్ర శత్రుమదభంజన శౌర్యుడు, ప్రసన్న విస్ఫురద్దేహుడు. బృహన్నలారూపము మారుట యెంత సుందరముగా చిత్రింపబడినదో చూడుడు. భారత భాగ్యము దేవతయైన యొక మహావీరుని సన్నిధిని, ఒక మహాభక్తుడు అమాయిక హృదయుడు, నిర్మోహుడు చేతులుంగట్టి నిలిచి మోదితన్మయుడు డగుట యిందలి దృశ్యము. ఇదియే విశ్వరూప సందర్శనానంతరము. శ్రీ కృష్ణుని యెదుట “నష్టో మోహః స్మృతిర్లబ్ధా, త్వత్ప్రసాదాత్ మయాచ్యుత! స్థితోస్మి గత సందేహః, కరిష్యే వచనం తవ” అన్న అర్జునుని దృశ్యము. ఉత్తరుని నాగరికత చూడుడు “విన్నబు గక ఏ నేమే నన్న పలుకు లెల్ల మఱచి” “ఆశ్రితరక్షా సన్నద్ధభావ మేర్పడ, నన్నుక్ గృపజూపవే, సనాథుడ నగుదుక్” అని ప్రార్థించుటలో విదితమగును. ఈ నాగరికతకు సంతుష్టాంతరంగుడై తేఱుకిగ్గి కుంతీ తనయుడు విరటుకొడుకును గ్రక్కున కౌగిట జేర్చెను. తన కన్నవ నత్రువాతి కిటలుకొనెను. ఇట్లార్ద్రహృదయుడైన మూర్తి ఉత్తరుకు తొలుత నవ్వు పుట్టించియు నిప్పుడు పుల్కలెసంగ జేయువాడు. ఇంకను ఉత్తరునకు సహజ లక్షణమయిన భీరుత్వము హృదయమునందు పోలేదు. దానిని మెల్లగ తొలగించి ధీరునిజేసి సారథిగా పని గొనవలసిన బాధ్యత అర్జునునియందు గలదు. కావున సింహము మృగజాతులు భ్రమయునట్లు దిసలు నిండునట్లు సింహధ్వని చేసెను. తరువాత దేవదత్తమును పూరించెను.

ఇట్లు ప్రతి శబ్దమును రసపోషకము కావుటయే మహాశిల్పము.

నియతికృత నియమరహితాం
హ్లాదైకమయీం, అనన్యపరతంత్రామ్
నవరసరుచిరాం, నిర్మితి మాదధతీ
భారతీ కవేర్జయతి.

ఇంద్రాసనాధికారము

శ్రీ కె. యం. మున్షీ

రాక్షసగురువగు శుక్రాచార్యుడు ఇంద్రుని అహంకారమును అణచివేయుటకు, అసురులపై జరుగు అన్యాయములను అరికట్టుటకు ఇంద్రునితో యుద్ధముచేయును. కాని కేవలరాక్షసులు ఇంద్రుని ఓడింపజాలకపోయిరి. వారి ప్రయత్నములు విఫలములైనవి. శుక్రాచార్యుని కుమార్తె దేవయాని యయాతిని పెండ్లాడినది. దీనివలన మానవసేనాసహాయమున అసురబలము అభివృద్ధిచెందినది. శుక్రాచార్యుని ప్రోద్బలమున రాక్షసరాజు వృషపర్వుడు, దేవయాని ప్రోత్సాహముచే నరరాజగు యయాతి ఉభయులును కలిసి ఇంద్రునితో యుద్ధముచేసి జయించిరి. ఆదినుండి శుక్రాచార్యుడు నాశనము చేయుటకు ప్రయత్నించినట్టి ఇంద్రాసనముకొఱకు వీరిరువురు ఇపుడు పెనగులాడ జొచ్చిరి.

పాత్రలు:

యయాతి — వృషపర్వుడు
దేవయాని — ఇంద్రుడు
సేనాపతి

రంగము:

** అమరావతిలోని ఇంద్ర సభాభవనము. రత్నములు చెక్కిన సువర్ణ స్తంభముల పంక్తులు కనిపించుచుండును. మధ్యలో ఇంద్రాసనము రిక్తముగా నుండును. సమీపమున వజ్రాయుధము పడియుండును. యుద్ధభూమినుండి యయాతి, వృషపర్వుడు ఆయుధధారులై ప్రసన్న వదనములతో మాటలాడుకొనుచు ప్రవేశింతురు.

వృషపర్వుడు: ఎట్టకేలకు మన మింద్రుని జయించితిమి

యయాతి: (సగర్వముగా) సురలలో ఒక్కడును మన ధాటికి నిలువలేకపోయెను.

వృ: ఎన్ని తరముల తరువాత విజయశ్రీ లభించినది! నేటికి నా పూర్వులపై జరిగిన అన్యాయములకు బదులు తీర్చుకొనగలిగితిని.

య: (గర్వముతో) నేను జయించి తీరుదునని నాకు ముందే తెలియును.

వృ: (సభాభవనమును చూచి ఉలికిపడి) రాజా! ఈ దేవసభను తిలకింపుము!

య: ఆహా! ఎంత సుందరమైనది! (ఇంద్రాసనము వంక చూచి) ఈ ఇంద్రాసనము (ముగ్ధుడై చూచుచు) నా కోర్కెల కేంద్రము!

వృ: (జొడుగలచి) మన అధికారమున నున్నది. అటు చూచితిరా! (సెమ్మదిగా) వజ్రము!

య: నా ఖడ్గప్రహారమునకు మొక్కవోయిన వజ్రాయుధమే నా?

అనువాదం: శ్రీ చావలి కోటీశ్వరరావు

వృ: పాతాళమును సహితము కంపింపజేయు వజ్రాయుధము. ఇప్పుడిది మనదైనది.

య: (మీసములు మెలివేయుచు) పాపము ఇంద్రుడు!.., సరే! గురువుగారిని తీసికొని రాబోయిన దేవయాని ఇంకను రాలేదేమి?

వృ: (శ్రద్ధగా వినుచు) బహుశః దేవయానియే వచ్చుచున్నది. చందలమై, ఉత్సాహపూరితమై స్వస్థమైన యీ సవ్వడి మరొకరిది కాజాలదు.

య: (నవ్వి) నీవు ఆమె కాలిచప్పుడును కూడ గుర్తింపగలవా?

వృ: ఈమెయే మమ్ములను రక్షించినది. ఈమెయే మాకు ప్రేరణశక్తి, మా జీవాధారము.

య: ఇట్టి మాటలతోనే మీరు ఆమెకు గర్వము కలిగించినారు (నవ్వి) ఆమె రానే వచ్చినది.

వృ: దయచేయుడు! దేవయానీ!

దే: (ఉత్సాహముగా సభాభవనము వంక చూచుచు) ఇదే దేవసభ. ఇక్కడే మాపరాజయ శృంఖలములు సృష్టింపబడుచుండెడివి.

య: ఆ ఇంద్రాసనమును చూచితివా? దేవయానీ!

దే: (ఏకాగ్రదృష్టితో గర్వముగా, ఇంద్రాసనముపై ప్రచూపము నిలబడును.) ఈ ఇంద్రాసనము... అసంఖ్యాకమైన అపరాధులకు జన్మస్థానము.

వృ: ఆచార్యులెక్కడ?

దే: ఇక్కడకు వచ్చుటకు నిరాకరించుచున్నారు.

య: ఎందువలన?

దే: ఈ స్వర్గభూమికి ఇంకను తాము ప్రవేశింప దగినంత పవిత్రత లభింపలేదనుచున్నారు.

వృ: వారుకాక మనకు భవిష్యన్మార్గదర్శకు లెవరు?

దే: నా ద్వారా వారొక సందేశ మంపినారు.

య: సందేశమా?

దే: (నిర్లక్ష్యముగా) అవును. సందేశమే.

వృ: ఏమిటా సందేశము.

దే: "ఇంద్రాసనము ముక్కలు ముక్కలు చేసి వీరులకు పంచుడు. వజ్రాయుధమును నాశనము చేసి, స్వర్గ, మర్త్య, పాతాళలోకముల నేకము చేసి, దేవ, దానవ, మానవ సమాజములను స్వతంత్రులనొనర్చి పరస్పర మైత్రిని నెలకొల్పుడు" అని మీతో చెప్పుమని సెలవిచ్చినారు.

య: (కోపమున) ఏమీ?

వృ: (భయమున) ఏమీ?

దే: ఆచార్యుని ఆజ్ఞను వింటిరా.?

య: ఇంద్రాసనమును నాశనము చేయుటకు కారణము?

వృ: దేవదానవుల మధ్య మిత్రత్వమా?

దే: (విచారముగ) రాజా! ఇంద్రాసనముపై ఇంత వ్యామోహము కలిగినదా!

య: జీవితమంతయు ఇంద్రాసనమింద్రాసనమని కలవరించుచు గడపితిని (మాటలు మింగుచు) గురువుగారు వృద్ధాప్యమువలన ధిషణ కోల్పోయినారు.

దే: (విచారమున) మానవరాజా శాంతింపుడు. ఎన్నో యుగముల అనుభవమువలన నిర్మలత్వమును పొందిన శుక్రాచార్యుల దృష్టిలో దోషమును చూడవలదు. ఇప్పుడీ విజయము నీ బాహుబలమున లభించినదని నీకు తోచుచున్నది. వృషపర్వుని అభిప్రాయములు ఇందుకు పూర్తిగ వ్యతిరేకమైనవి.

య: కాని, దేవయానీ! ఇంద్రాసనమును నాశనము చేసినచో మనము కూర్చుండున దెక్కడ?

దే: ఎక్కువ తక్కువల భేదభావములేని భూమి మీద. ఈ ఇంద్రాసనముమీద మనము కూర్చుందుమా? వలదు, రాజా వలదు. ఈ సింహాసనము నుండి క్రూరత్వము, అన్యాయము అను దుర్వాహినులు ప్రవహించుచున్నవి. ఈసింహాసనమ నధిష్ఠించిన వారు భవనమును చూపి పేరాసను, భక్తి పేరిట అన్యాయమును, ఆగ్రహమును చూపి భయమును సృష్టించి యుగయుగాలనుండి సర్వనాశనమును వ్యాప్తి చేసినారు.

య: మేము ఇంద్రునివంటివారము కాము. వాడు దురాత్ముడు. మేము కాదుగదా!

దే: రాజా! ఇంద్రుడు చెడ్డవాడుకాడు. ఇంద్రాసనము చెడ్డది. నిరంకుశాధికారమునకు కేంద్రమైన యీ సింహాసనము దుఃఖమునకు మూలము. శుక్రాచార్యుల సంజీవిని మంత్రమును అర్థము చేసికొనినవాడు తాను లొంగడు. ఇతరులను లొంగదీయడు. అతనికి దానిని నాశనము చేయుటకే ఇంద్రాసనము మీద ఆశ కలుగును. తండ్రిగారి ఆజ్ఞకు కారణము మీ కింక గ్రాహ్యము కాలేదా? నేటివరకే ఇంద్రాసన

యొక్క ఇంద్రుని మాత్రమే భయంకరునిగ చేసినది. ఇప్పుడు దీని ప్రతికణమును పొంది ప్రతి వీరుడు భయంకరుడై ముల్లోకములను భయరహితము చేయగలడు.

య: (కోపగించుకొని) దేవయానీ! నీ తండ్రి ఆజ్ఞ నాకంగీకారము కాదు. నేనీ యింద్రాసనముకొరకే నా జీవితము నంతను వెచ్చించితిని. ఇప్పుడు దీనిని వదలుకొందునా! అసంభవము. కాదు దేవయానీ! ఈ యింద్రాసనము నాది. నేను దీని నధిరోహింతును. రాదలచినచో నీవును రమ్ము (దేవయానిని వెంటతీసుకొనుటకు ప్రయత్నించును.)

దే: (హెచ్చరిక చేయుచు) రాజా! వలదు. ఈ ఇంద్రాసనము భవబంధనలవలె కఠోరమైనది. పట్టి మాయావి. దీనిని నాశనము చేయుటకే శుక్రాచార్యుడు యుద్ధము ప్రారంభించినాడు. నేను దీనిమీద కూర్చుండను. నీవుకూడ దీనిమీద కూర్చుండుటకు ముందు కొంచెము ఆలోచింపుము. దీని భవ్యత నిన్ను గర్వోద్రిక్తుని చేయగలదు. దీని కాంతివలన నీవు అంధుడవగుదువు. దీని మోహము నిన్ను దుర్మార్గుని చేయును. నీవు ఒకమారు దీనిమీద కూర్చుండినచో తరువాత ఎప్పటికిని క్రిందికి దిగుటకు అంగీకరింపవు. శాశ్వతముగా కూర్చుండి ఉండవలెనను లోభమువలన నీలో క్రోధము క్రూరత్వము జనింపగలవు. అప్పుడు నీవు మానవుల శక్తిని, స్వాతంత్ర్యమును నాశనముచేయుటకు సంసిద్ధుడవగుదువు. భయమును వ్యాపింపజేయుటకు అన్యాయము నాచరింతువు! అయినచో తండ్రిగారి ఆజ్ఞను పాలింపవా?

య: చాలు! చాలు! నీ తండ్రి స్వార్థము నెరవేరగనే మాతో సంబంధము——

దే: దుర్మార్గుడు, అహంకారి, పిరికిపంద, ధర్మవిరోధి ఒక్కడు మిగిలియున్నను మా తండ్రిగారి ఉద్దేశ్యము నెరవేరదు.

య: ఏమి చెప్పితివి! ఇంద్రాసనమును నేను నా పరాక్రమున జయించితిని. నేను దానిని తప్పక అధిరోహింతును. ముల్లోకములును నన్ను పూజించును. నీవు నాతోపాటు రాకుంటివా శర్మిష్ఠను పిలపించెదను; కాదు—ఇంద్రాణి వివాహ మింద్రాసనముతో జరిగినది. ఇంద్రునితో గాదు.

దే: అయినే యయాతీ! నీ కర్మఫలము నీవే అనుభవింపుము. భార్గవపుత్రి ఇక్కడ ఒక్క క్షణమైన నుండదు.

వృషపర్వుడు: ఎందువలన?

దే: వృషపర్వా! నీవుకూడ నీ బుద్ధి కోల్పోయితివి. నేడుకూడ పరిస్థితి పూర్వమువలెనే యున్నది. యయాతి ఇంద్రాసనముమీద కూర్చుండి ఇంద్రుడగును. ఇంద్రుడు పాతాళమున దాగియుండి వృషపర్వుడగును. కవియైన శుక్రాచార్యుడు ఇంద్రుని మిత్రుడై యయాతి పరాజయమునకై ప్రయత్నించును.

య: యయాతి పరాజయమా?

దే: అవును. శుక్రాచార్యుడు ఇంద్రాసనమును నాశనము చేయ గోరుచున్నాడు. దానిమీద ఎవడు కూర్చుండినను వారికి శత్రువులే. వృషపర్వా! గురుదేవుని ఆజ్ఞోల్లంఘనము చేయుదువా?

వృ: దేవయానీ! సుచిరప్రయత్నము ఫలితముగా లభించిన యీ ఇంద్రాసనమును ఇతర రాక్షసులతోపాటు పంచుకొనుటకు నేనంగీకరింపను.

య: వెళ్ళు దేవయానీ! శుక్రాచార్యునితో ఆయన ఇష్టమువచ్చినట్లు చేయుమని చెప్పుము. నేను నా భుజబలముతో ఇంద్రాసనమును వశపరచుకొంటిని. ఇంతవరకు ఆయన ఏమిచేయుచున్నాడు?

దే: ఇంతవరకు చేయుచున్నపనినే ఇకముందుకూడ చేయును. దుర్మార్గులను, పిరికిపందల సర్వనాశనము చూచును. యయాతీ! వృషపర్వా! మీరు మీ వాంఛితములను నెరవేర్చుకొనుడు. కాని జ్ఞాపకముంచుకొనుడు. ఇంద్రాసనము మీ మిగిలియున్న బుద్ధినికూడ నశింపజేయును. మంచిది. నేను వెళ్ళుచున్నాను. (దేవయాని వెళ్ళిపోవును.)

య: (నవ్వి) వృషపర్వా! రమ్ము. స్త్రీ బుద్ధి......

వృ: (భుజములూపుచు) సరే! నీవు ఇంద్రాసనము తీసుకొందువు. మరి నా సంగతేమి?

య: (గర్వముగా) భయపడవలదు. నిన్ను నేను రక్షించెదను.

వృ: రక్షింతువా! నాకు నా పూర్వీకుల రాజ్యము కావలెను, దేవతలను పాతాళలోకమునకు పంపవలెను.

య: నీవు ఇక్కడనె ఉండదలచితివా? ఈ అమరావతిలోనా?

వృ: ఇది మాది. మా పూర్వీకుల జన్మభూమి.

య: భూమి, జయించినవానిది వృషపర్వా!

వృ: (కోపముగా) ఏమంటివి?

య: వినలేదా? ఈ ప్రదేశమును నేను జయించితిని. ఇప్పుడు ఇది నాది.

వృ: అయినచో నేను జయింపలేదా? వేలసంవత్సరములనుండి ఈ కలహమెందులకు?

య: అది నీకు తెలియవలెను. కాని త్రిభువనములను జయించిన యయాతియే త్రిభువనాధీశుడు.

వృ: (ఆగ్రహమున) అట్లయినచో ఒక ఇంద్రుడు పోవగనే మాకు మరొక ఇంద్రుడవతరించె నన్నమాట!

య: (నిర్లక్ష్యముగా ఇంద్రాసనమువైపు చూచి) పరీక్షయ జేయుమనుకొనుము.

వృ: (అకస్మాత్తుగా దూకి యయాతిని పట్టుకొని) నేను జీవించియుండగా నిన్ను ఇంద్రుని కానీయను.

[యయాతి సవరించుకొని వృషపర్వునితో తలపడును. ఇద్దరును చాలసేపు ద్వంద్వయుద్ధము చేయుదురు. చివరకు యయాతి వృషపర్వుని చంపును]

య: (పకపక నవ్వుచు) నీవు జీవించి యుండగనే ఇంద్రుడనైతిని. బాగున్నది—దేవయాని వెడలిపోయినది. శుక్రాచార్యునికి ఆగ్రహము వచ్చినది. లేనిచో నిన్ను మరల బ్రతికించెడివాడు. ఇంద్రాసనమా!—నా జీవిత లక్ష్యమవు. నేడు నీవు నా దానవు. ఎల్లపుడును నా దానవుగ నుండుము.

[మెల్లమెల్లగా ఇంద్రాసనము దగ్గరకు వెళ్ళి గర్వముతో ఠీవిగా దానిమీద కూర్చుండును.]

ఇదే నా స్థానము, నేనే కాదు. శాశ్వతముగా నిది నాదే. (మీసాలు మెలివేసి) ఇంద్రాసనమా! ఇంద్రుని, వృషపర్వుని, జయించిన పరాక్రమశాలివలన నేడు నీవు శోభిల్లుచున్నావు. నిజముగా నీ అదృష్టము ప్రశంసింప దగినది. త్రిలోకాధీశుడనై యున్న నేనిక్కడ కూర్చుండి లోకముల పాలింతును. ప్రజలు భక్తిపూరిత హృదయములతో సదా నా పరిపాలనను కొనియాడుదురు. పాపము శుక్రుడు! చివరకు బుద్ధి కోల్పోక పోయినచో నేడు గురుపీఠము నలంకరించెడి వాడే. కాని ఆయనది అతి తెలివి—సేనాపతీ!

సేనాపతి:—(ప్రవేశించి వణకుచు పాదములకు నమస్కరించును.) దయానిధీ! ఇంద్రాసనాధికారీ!

య: నేడు నేను ఇంద్రునికే ఇంద్రుడను. వృషపర్వుడు కూడ వదలిపోయినాడు. ఇంద్రుని తీసికొనిరమ్ము. వానిసంగతికూడ ఈ రోజే తేల్చివేయుదును.

సేనాపతి: చిత్తము (పోవును).

య: (స్వగతం) ఇది స్వచ్ఛందత! ఇదే సృష్టిని శాసించుట. ఒక్క వ్రేలితో జీవితపథమును నిర్దేశించుట! ప్రాణధారుల భక్త్యర్ఘ్యముల స్వీకరించుట నావంటి అదృష్టవంతునకే ప్రాప్తించును. మనూ! ఇలా! పురూ! పితృలోకమునుండి చూచి ఆనందింపుడు. నేడు తమవంశమును తమపుత్రుడు ఉద్ధరించినాడు. పాపము దేవయాని! ఆమెకు భార్యగా ఉండుట చేతకాలేదు. ఇంద్రాణి కాలేకపోయినది. ఎవరేమి చేయగలరు'

[(సేనాపతి ఇంద్రుని తీసికొని వచ్చును; ఇంద్రుడు తేజోవంతుడు, బలశాలి, శాంతమూర్తి, వాని నేత్రములు గర్వమున ఉన్నతముగా నుండును. శిరస్సుపై కిరీటము లేదు. చేత ఆయుధము లేదు. చెవులకు కుండలములు లేవు. చేతికి అలంకారము లేదు. అతని పీతాంబరములు మానవ రక్తముతో సిక్తములై యుండును.]

సేనాపతి: జయము. జయము! త్రిలోకేశ్వరునకు జయము!

య: (కొంచెముసేపు ఇంద్రునివైపు ఠీవిగా చూచి) నీ స్వర్గము నీచేతినుండి జారిపోయినది. ఇపుడు నీకేమి రావలెనో చెప్పుము. పురుషునకు ఎంతటి పరాక్రమవంతుడో అంతటి ఉదారుడు.

ఇంద్రుడు: మానవరాజా! నేను ఓడిపోయితిని. మానవులు తలచినచో దేవతలను కూడ జయింపగలర)

నేను గ్రహించితిని. గతమును విస్మరించి దేవ, దానవ, మానవసఖ్యమును చేకూర్చుదును.

య: సఖ్యమా! ఇంద్రా! నీ గర్వమునకు హద్దు లేదా! స్నేహమా! నీతోడను, నీదేవతల తోడను స్నేహమా! మూర్ఖుడా! సేవావృత్తిలో జీవితమును గడుపుకొనుము.

ఇం : (శాంతితో) దేవతలు ఎవరికి సేవచేయరు.

య : అయినచో సేవ చేయుట నేర్చుకోవలసియుండును. ఏమందువు?

ఇం : తమరేమందురు?

య : (గర్వముగా) వెర్రి నీదేవతలతో కలసి పాతాళలోకమునకు వెళ్ళి నివసింపుము. వృషపర్వుడు చనిపోయినాడు. వానికి బదులు నీవు నా సేవకుడుగా నుండుము. నేను నీకు రక్షకుడ నగుదును.

ఇం : మాకు ఎవరి రక్షణము అవసరము లేదు. మాకు మేముతప్ప ఇతరుల రక్షణ అంగీకరింపము.

య : నీ యీ మాటలలో ఏ సారము లేదు. నీ వాక్చాపల్యముతో నాకు క్రోధము కలిగింపవలదు.

ఇం : మేము పరాజితులము. ఇప్పుడు మీకు ఏ మాటలలోను సారము కనిపించదు.

య : (అశాంతిగా) నేను నిన్ను......

ఇం : నీవు మమ్ము చంపలేవు.

య : క్రోధారుణ నేత్రుడై ఈ ఇంద్రాసనము నాది.

ఇం : (దృఢముగా) ఎవరు దీనిమీద కూర్చుందురో వారిది యీ సింహాసనము.

య : (ఉగ్రముగా) మూర్ఖుడా! ఈ వజ్రాయుధము కూడ నాదే.

ఇం : (శాంతముగా) కాదు. నిర్భయముగా ఉన్న వారిదే యీ వజ్రాయుధముకూడ.

య : (కోపముగా) నేను భయపడుచున్నానా? ఇంద్రా! జాగ్రత్త (ఇంద్రాసనమునుండి లేచి వజ్రాయుధముతీసికొని ఇంద్రునిపై పరుగెత్తును.)

ఇం : దుష్టుడా! దుర్బుద్ధిగలమానవుడా! భయములేని వారికి ఇది హాని కలిగింపదు. (యయాతి చేతినుండి వజ్రాయుధము లాగికొనును. యయాతి భయపడి వ్యాకులముగా ఇంద్రుని పాదములమీద పడిపోవును.)

ఇం : యయాతీ! ఇది భయములేనివారిదని చెప్పలేదా గర్వాంధుడా! మేము నీచేత, నీ సేనచేత ఓడిపోతిమనుకుంటివా! మూర్ఖుడా! యుద్ధము నభిలషించిన శుక్రాచార్యుని దృఢశక్తి, స్వార్థరహిత సంఘర్షణవలన మేము పరాజితులమైతిమి.

య : దేవేంద్రా! క్షమింపుము. నేను భ్రమపడితిని.

ఇం : నీవంటిజీవి కీస్వర్గమున స్థానములేదు.
[వజ్రాయుధములో కొట్టును. భయంకరశబ్దములో మెరుపు మెఱయును. ఏమియూ కనిపించదు. యయాతి ఆక్రందనముమాత్రము వినిపించును.]

[తెర]

అప్పయ దీక్షితులు

శ్రీ కోన వేంకటరాయశర్మ

ఇప్పుండితా ఖండలుండు శకవర్షము 1425 ప్రమాదీచ నామ సంవత్సర కన్యామాస కృష్ణ ప్రతిపత్తునం దుత్తర ఫల్గునీ నక్షత్రయుక్త శుభలగ్నంబున అనగాఁ క్రీస్తుశకము 1553 సంవత్సరము సెప్టెంబరు నెల పదు నెన్మిదవ తేదీనఁ గాంచీపురము దాఁపునఁగల "అడప్ప పాళెము" లో సదాచార సంపత్తి గల కుటుంబమునఁ బ్రభవించి క్రీస్తుశకము 1625 వ సంవత్సరమునఁ జనిపోయినట్లు లవగత మగుచున్నది.

"ద్వాసప్తతిం ప్రాప్య సమా బుధేన్ద్రా
న్కృతం వ్యథా దప్పయ దీక్షితేన్ద్రైః."—

(ను "శివలీలార్ణవ" వచనముం బట్టియు,

"వయాంసి మమ సప్తతే
రుపరి నైవ భోగేస్పృహా
న కించి దహ మర్థయే
శివపదం దిదృక్షే పరం."

అను దీక్షితుల వాక్యముం బట్టియు—నప్పయ్య దీక్షితులు డెబ్బది రెండేండులు జీవించినట్లు తెలుఁగ నగుచున్నది. ఇతని పితామహుఁడు అచ్చన్న దీక్షితులు ఈ యచ్చన్న దీక్షితులు శ్రీ కృష్ణదేవరాయల యాస్థానమున నుండెనని (J. O. R. Madras, Vol, III, P. 158) దెలియుచున్నది. ఇయ్యచ్చన్న దీక్షితులనే యాచార్య దీక్షితులని యందురని యప్పయ్య దీక్షితుల—

"ఆసేతు బంధ తట మాచ తుషార శైలా
దాచార్య దీక్షిత ఇతి ప్రథితాభిధానమ్,
అద్వైత చిత్సుఖ మహాంబుధి మగ్న భావ
మస్మత్పితామహ మశేష గురుం ప్రపద్యే!"

అను శ్లోకము విదితమొనర్చు చున్నది. అప్పయ్య దీక్షితుల తండ్రి రంగరాజాధ్వరి. ఈ రంగరాజాధ్వరి వివరణ దర్పణము, అద్వైతవిద్యా ముకురము—అను గ్రంథముల రచించిన మేధావి. "అద్వైత విద్యాచార్య" బిరుదాభిరాముడు. కావుననే యప్పయ దీక్షితులు—

"యం బ్రహ్మ నిశ్చిత ధియః ప్రవదన్తి సాక్షా
త్తద్దర్శనా దఖిల దర్శన పారభాజః,
తం సర్వవేద సమశేష బుధాధిరాజం
శ్రీ రంగరాజమఖినం పితరం నతోఽస్మి!"

అని యీ రంగరాజాధ్వరిని వినుతింపగల్గినాడు.

చ		శ రా	శు
	రాశి		
గు			
	కే	కు	ల ర బు

అప్పయ దీక్షితుల జాతకచక్రము.

ఈ చక్రమును బరికించినచో నారూఢ పంచమమున గురుఁడుండుట వలన ఈ జాతకుఁడు సర్వజ్ఞుఁడు, గ్రాంథికుఁడు, వ్యాకరణ వేదాంతముల నిష్ణాతుఁడు, వాఙ్మి—యగునని "జాతకరాజ" మందలి:

"గురుణా త్రిత సంబంధే
సర్వజ్ఞో గ్రాంథికో భవేత్
వైయాకరణ వేదాంత
వేత్తా వాచాలకో భవేత్
గురుణా త్రిత సంబంధే
సంప్రదాయేన వేదవిత్
శాస్త్రవి ద్గ్రంథ కర్తృత్వ
ముఖ సద్గుణవాన్ భవేత్."

అను వాక్య మవగత మొనర్చుచున్నది. ఇమ్మహాత్ముని జాతక చక్రమున గురుఁడు పరిపూర్ణ శుభుఁడు. ఆరూఢమున సూర్యుఁడుండుటవలన వేదాంతశాస్త్రముతోపాటు సంగీత శాస్త్రమును అభ్యసింపఁగలఁడనియు, నందు నిష్ణాతుఁడగుననియుఁ,—దెలియనగుచున్నది. తత్ఫలితముగ "శివార్కమణి దీపిక"ను రచించి "శివాద్వైతస్థాపనాచార్యుఁ" డయ్యెను. ఆరూఢ పంచమమునఁ గుజుఁడు అష్టమదృష్టిలోఁ జూచుటవలన "ఖండదేవుని"వంటి మీమాంసా శాస్త్రజ్ఞుఁడు అప్పయ్య దీక్షితుని "మీమాంసక మూర్ధన్య" యని కీర్తించి వినుతించెను. దశమాధిపతికి స్వక్షేత్రమున సుస్థితి గొందవినందున అప్పయ్య దీక్షితులు

మహారాజసముం దెరెయ్యెను. కావుననే యాత్రరాహుఁ దేకరుండు.

"నానాదేశ నరేంద్రమండల మహా
యత్నాతి దూరీభవ
త్కాదాచిత్క పదారవింద వినతే
రప్పయ్య యజ్వ ప్రభోః
శైవోత్కర్ష పరిష్కృతై రహరహ
స్సూక్తైః సుధాలాలితైః
ఫుల్లత్కర్ణపుటస్య బొమ్మ నృపతేః
పుణ్యాని గణ్యానికిం."

అని యప్పయ్య దీక్షితులను వినుతించుటఁ దటస్థించినది. జగన్నాథస్వామిని బడసి యపర శివాజితో రమ్యని యీతనిఁ దుగ్గడింపఁబడుటను విలోకింపఁగా నీతని శిష్టాచార తత్పరత విదితము కాఁగలదు.

"కువలయానందము"లోని:

"అముం కువలయానంద
మకరో దప్పదీక్షితః.

"శ్రీ రంగరాజ కుచివర్ణిత చంద్రమౌళి
రస్త్యప్ప దీక్షిత ఇతి ప్రథిత స్తనూజః."

అను వాక్యములఁబట్టి యప్పయ దీక్షితులను 'అప్పదీక్షితు' అనియుఁ బిలుచుచుండురని యవగత మగుచున్నది. కాని నీలకంఠకవి.

"శ్రీ మానప్పయ దీక్షితో విజయతే
శ్రీకంఠ విద్యాగురుః."

అని యనేకతావుల నప్పయ దీక్షితుఁ డనియే వ్యవహరించి యున్నాఁడు. జాతిస్మృతిప్రసిద్ధులగు మహాబల శాస్త్రులవారి "ఈశానస్తుతి" యందిది.

"వైకుంఠే పంఠ కోలాహల మయ కలహో
ల్లుంఠనే ఽకుంఠ (శ్రీ శ్రీ) శ్రీకంఠాచార్య కం
ఠోక్తత నయపరణి వ్యాకృతా కుంఠితోఽసి."

"ఇత్యేవం శిక్షితో శ్రావిద్యా నయాభి
జ్ఞశిక్షా మాత్రి రూపైర్దీక్షో ఽభూ
దీక్షితో ఽసౌ పరిమళకృతి తి
శ్శంకరాచార్య పక్షే....—"

అను శ్లోకముల ననుసరించియు, భట్టోజీ మేకకృతమ్మకు తద్వ్యాఖ్యానముం బట్టియు, నితఁడు మహా జేవుడే విద్యాధికుని గా విశ్వసించినట్లు శ్రీకంఠభాష్యమున విశ్వాసము గలిగి తన్మత ప్రతిష్ఠాపకములగు పెక్కు నిబంధనముల రచించియుఁ బదంపడి శ్రీ నృసింహాశ్రమ స్వామిచే బోధింపఁబడి శాంకర మతమునఁ బ్రవేశించి పరిమళాది గ్రంథముల విరచించినట్లును తెలుంగగుచున్నది. నీలకంఠ మహాకవి రచిత "నలచరిత్ర" ప్రస్తావనయందు—

"అస్తి కిల కృష్ణరాజకంఠీర వరణార
విందస్య ధిరచ్యాజకుల చూడామణే
రష్టాభిః క్రతుభి రష్టభి రాయతిన్నై
శ్శంభో రష్టాభిశ్చ సర్వవిద్యా విశారదై
స్తనయై రష్టాపి దిశో యశోభి ర్ధవలతాపి"

అని యప్పయ్య దీక్షితునిఁ బ్రస్తుతించియున్నాఁడు. ఇతని నుద్దేశించియే బాలకవి:

"అప్పదీక్షిత కిమి త్యతిస్తుతిం
వర్ణయామి భవతో వదాన్యతాం,
పాఽపి కల్పతరు రద్యలిప్సయా
త్వద్గిరా మపసరం ప్రతీక్షతే."

అని చెప్పెనియెను. ఇయ్యప్ప దీక్షితుఁడు శ్రీకంఠభాష్య వ్యాఖ్యానమైన "శివార్కమణి దీపిక"ను రచించినప్పుడు కనకాభిషేకముం బడసెనని సాహిత్యమార్గ సంప్రదాయ కుశల త్రిమండయిన "పరమపుంగవయజ్వ" రచించిన :

"హేమాభిషేక సమయే పరితో నిషణ్ణ
సౌవర్ణ సంహతి మిషా చ్ఛివబొమ్మ భూపః,
అప్పయ్య దీక్షిత ము...రవవస్య విద్యా
కల్పద్రుమస్య కురుతే కనకాలవాలమ్."

అను వచనముం బట్టి విదితమగుచున్నది.

ఇమ్మహాభాగుఁడు శ్రీకంఠాచార్యకృత బ్రహ్మసూత్రభాష్యమునకు "శివార్కమణి దీపిక" యను పేరితో నొక వ్యాఖ్యానమును, శాంకర బ్రహ్మసూత్రభాష్యవ్యాఖ్యానమగు "భామతి"కి వ్యాఖ్యయైన "కల్పతరువు" అను గ్రంథమునకు "పరిమళ" మను వ్యాఖ్యానమును,— విలిఖియించుటయగాక అన్ని శాస్త్రములలోను గ్రంథములఁ బెక్కింటిని రచియించిరి.

సాహిత్యమునఁ గువలయానందము, చిత్రమీమాంస, వృత్తివార్తికము,—లోనగు వానిని, పూర్వమీమాంసయందు విధిరసాయనము, ఉపక్రమ పరాక్రమము,—మున్నగువానిని, శుద్ధాద్వైతమున న్యాయరక్షామణి, శాస్త్ర సిద్ధాంతలేశ సంగ్రహము, పరిమళము,—లోనగువానిని, శ్రీకంఠ మతమున శివతత్త్వ

వివేకము, రత్నత్రయ పరీక్ష, శివకర్ణామృతము, బ్రహ్మతర్క స్తవము, శివార్కమణిదీపిక,— మొదలగువానిని, వ్యాకరణమున నక్షత్ర వాదావళి మున్నగువానిని,— ముప్పది మూఁటిని ఇట్లు నూటనాల్గు ప్రబంధముల నిబంధించెను. అట్లని "శివలీలార్ణవము"నం గల "ద్వాసప్తతిం ప్రాప్య సమా బుధేంద్రా, కృతిం వ్యధా దప్పయ దీక్షితేంద్రః"—అను వచనము స్ఫురింపఁజేయుచున్నది.

దక్షిణదేశమున స్వతంత్ర రాజ్యముల నేర్పఱచికొనిన నాయక రాజులు తెలుఁగు వారౌటవలనఁ దమ స్వతంత్ర రాజ్యములలో నుండి వ్యవహరించుటకుఁ దెలుఁగు దేశమునుండి పండితులఁ, గవుల, గాయకుల, నర్తకుల, మంత్రులఁ, జమాపతులఁ - గొంపోయిరి. అటులఁ గొంపోఁబడిన తెలుఁగు కుటుంబములలో అప్పయ్య దీక్షిత కుటుంబ మొకటి.

తిరుమల తాతాచార్యులు వేంకటపతి రాయల కాలములో అనఁగా క్రీస్తు శకము 1585 వ సంవత్సరము నుండి క్రీ. శ. 1614 వ సంవత్సరము వఱకు నతని యా స్థానమున నుండెననియు, నయ్యాస్థానమందె యున్న యప్పయ్య దీక్షితులు తాతాచార్యుల ప్రతిపక్షి యనియు,- నందఱెఱింగిన విషయమే! అప్పయ దీక్షితుల మేనయల్లుఁడయిన యజ్వల దీక్షితులు క్రీ. శ. 1623 వ సంవత్సరము మొదలుకొని క్రీ. శ. 1659 వ సంవత్సరముదాఁకఁ బాండ్యదేశము నేలిన తిరుమల నాయకుని మంత్రి యౌటచే నప్పయ్య దీక్షితులును తాతాచార్యులను వేంకటపతిరాయల కాలములోని వారనుట నిర్వివాదాంశము.

రాయల యాస్థానమునందు అప్పయ్య దీక్షితుఁడుండు నప్పుడు, తాతాచార్యులకును నీతనికిని శైవ వైష్ణవ మత సంబంధములగు వివాద లుత్పన్నమై యా వివాదలలో, సిద్ధాంత రాద్ధాంతములలో, చర్చలలో, నితనిదే పైచేయియై విజయలక్ష్మీ కరగ్రహణము జొనర్చుచు నందఱచే వినుతింపఁబడుచుండెడివాఁడౌటచేఁ దాతాచార్యులు సహింపఁజాలక వీనిని నే విధమున నైనఁ దమ వైష్ణవమతమునం గలిపికొనినం గాని ప్రయోజనము లేదనియుఁ, దమ సిద్ధాంతము నెగ్గి వ్యాప్తము కాఁజాలదనియుఁ, దమ మతము విస్తరింపదనియుఁ,—దలఁచి యేకతము నున్న రాయలను సమీపించి చేయఁదగు కార్యము నంతను విన్నవించి కార్యోన్ముఖు నొనర్పఁగా, రాయలును గురు నిర్బంధంబువం జేసి యప్పయ్య దీక్షితులను సమాశ్రయణముఁ జేసికొనవలసినదని యభ్యర్థించి, బ్రతిమాలి, వేఁడికొని, బెదకు నిరోధించి, భయపెట్టినను దీక్షితుల వారప్పని కొడంబడఁడయ్యెనట.

తాతాచార్యులు సేయునది లేక రాయలతో వాతని శాసించవలసినదని చెప్పఁగా, రాయలు దీక్షితుల రావించి "మహాభాగా! సమాశ్రయణ మొనర్చుకొనుట కిష్టపడని వారు మా రాజ్యమున నివసించుటకే వీలులేదు. కావునఁ దాము బాగోగుల యోజించి యుచితమును తేల్చికొనుఁడు. కొన్ని ముహూర్తములు గడువొసంగితిని. అలో, సమాశ్రయణమునకే యంగీకరించిన సరియే! లేకుండిన మా రాజ్యమును విడిచిపోవలసి యుండును."—అని చెప్పఁగా దీక్షితులు "నృపతీ! దమ రాజ్యమును విడిచి పొమ్ముటకే నిశ్చయించితిని"—అని రాయల శాసనమునకు గుఱియై యా రాజ్యము విడచివచ్చుచుండఁగాఁ, దాతాచార్యుల యొత్తిడి ననుసరించి రాయలు మార్గమధ్యమున దీక్షితుల బలాత్కరించి తప్తముద్రాంకనము సేయుఁడని భృత్యుల కాజ్ఞాపించెనఁట!

అయ్యదనున విప్పండితాఖండలుఁడు నిస్సహాయుండై చేయునది లేక పరమశివునే మార్గయునిగాఁ బ్రార్థింప నమ్మహాదేవుని కరుణాకటాక్ష వీక్షణంబునఁ దాతాచార్యులును దత్రాపి రాయలును దలపెట్టిన పని వమ్మయినట్టులా సందర్భమున దీక్షితులవారు చెప్పిన "నిగ్రహాష్టకము"నుబట్టి స్పష్టమగుచున్నది.

ఈ నిగ్రహాష్టకములోని "సహస్ర వర్త్మాస్తాం"— "క్వచిదపియ వే దస్తం"—అను శ్లోకములవలన అప్పయ్య దీక్షితులయెడల నితరు లొనరించిన యొగ్గను దలపెట్టిన దురుద్యమము తెల్లమగుచున్నవి.

ఇ దైతిహ్యముంబట్టి వీరి యింట నిప్పటికిని బరమేశ్వరుఁడు "మార్గ సహాయుం"డను పేరితో నిలువేల్పుగా నారాధింపఁబడుచున్నాఁడు.

పూర్వోత్తర మీమాంసా శాస్త్రములలో భారతావనియందలి పండిత మండలి నెల్ల నప్పయ దీక్షితులు జయించి, విశ్వజిద్యాగ మొనర్చియుండెను. అవసాన కాలమున నప్పండితాఖండలుఁడు చిదంబర క్షేత్రమున నటరాజును వినుతించుచు నచటనే సిద్ధి నందెను.

ఆర్యుల నివాసభూమి.

శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

ప్రాచీన భారతదేశచరిత్రను వ్రాయదలచేవారు దానికితగిన ఆధారాలనన్నింటిని పరిశీలించవలసి ఉంటుంది. వీటిలో కొన్నిమాత్రమే ప్రామాణికమైనవని, మిగిలినవి అప్రామాణికాలని త్రోసివేయటం యుక్తముకాదు. కాని మనచరిత్రకారులు బౌద్ధ జైన గ్రంథాలపైచూపిన ఆదరమును మన పురాణేతిహాసాదులపైన చూపకపోవటం శోచనీయము. ప్రస్తుతము ఆర్యుల ఉనికినిగురించి విచారింతుదాము.

ఆర్యులు ఎక్కడనుండో బయలుదేరి మనదేశానికి వచ్చినారని చరిత్రకారుల కొందరు చెప్పినారు. కానిమన సంప్రదాయంలో గాని, మనగ్రంథాలలో గాని ఎక్కడా వీరు విదేశములనుండి భారతభూమికి వచ్చినట్లు చెప్పియుండలేదు. స్వభూమిని వదలివచ్చినవారు ఆ మహత్తరవిషయాన్ని కప్పిపుచ్చగలరా ? దేశాలను వ్యాపించిన అరబ్బులు, యూదులు ఇంతవరకు వారి పూర్వదేశాన్ని వదలివచ్చినట్లే చెప్పుకొనట మున్నది గదా! అమెరికాకు వలసపోయిన పాశ్చాత్యులు నేటికికూడా ఆవిషయాన్ని మరువలేదే! బౌద్ధ,జైనాది గ్రంథాలలోసహిత మీవిషయము కన్పించదు.

కలియుగారంభము క్రీ. పూ. 3102 వ సంవత్సరమగుటచే వైదికవాఙ్మయసంకలన మింతకుముందే జరిగి ఉండాలని భారతసంప్రదాయము. దీనికిఅనుగుణముగా అయనాంశలు కృత్తికలలోనున్నట్లు చెప్పు శతపథ బ్రాహ్మణకాలము కలియుగానికి పూర్వమున్నదని ప్రముఖభారతీయ జ్యోతిర్వేత్తలు పలికినారు. కాబట్టి అతిప్రాచీనసంహితలు కనీసము క్రీ. పూ 4000 కాలము నాటికైనా నేటిరూపమున ఉండితీరవలెను. కాని పాశ్చాత్యక్రైస్తవచరిత్రకారులు ఇంతవెనుకకు వెళ్ళటానికి సాహసించరు. వారి మతగ్రంథంలో చెప్పిన సృష్టికాలము క్రీ. పూ 4000 కాలానికి దగ్గరకావటంచేత ఇతర దేశచరిత్రలను ఈ తేదీకి తర్వాతనే వర్ణించటము వారికి అవసరమైనది. ఈసంగతి గమనించని భారతీయచరిత్రకారులు వారిధోరణికి పల్లవి నాలాపించినారు.

వైదికవాఙ్మయకాలమును గురించి గాని, ఆర్యుల ఉనికిని గురించిగాని విచారించే ముందు మనం కొన్ని విషయాలను గమనించాలి. సంహితలలో వచ్చే శాఖలకు చాలవరకు సమగ్ర రూపము మన మహాభారతంలో ఉన్నదని గెల్డ్నర్ అను జర్మన్ విద్వాంసుడు, ఆయన శిష్యుడు లీగ్ నిర్ధారణ చేసినారు. ఇది మొదటి విషయము. రెండవది; భారతీయులు అనాదిగా చేస్తున్న నామకరణ ప్రక్రియ. తాత ముత్తాతల పేర్లు మనుమళ్ళకు పెట్టటం మన ఆచారమైపోయింది. దీనిని గమనించకపోతే ప్రాచీనుల కాలనిర్ణయంలో మనము తప్పటడుగులు వేయటం కద్దు.

---

* ఆర్యుల ఆదిమనివాసమునకు సంబంధించిన మీమాంస భారతదేశ చరిత్ర యొక్క ప్రాతిపదికనేగాక ప్రపంచ చరిత్రయొక్క ప్రాతిపదికనే మార్చునదిగా వున్నది. గత ఆంధ్రపత్రిక ఉగాదిసంచికలో (1957) శ్రీ జటావల్లభుల పురుషోత్తముగారు ఈ విషయము కొంత చర్చించియున్నారు. ఇంకా అనేకవిశేషాంశములను శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగారు ఇందు వివరించినారు. చరిత్రకారులు ఈ విషయమై తగు నిర్ణయం చేయుగలరని ఆశించుచున్నాము. —సం. పా.

ఋగ్వేదంలో సుదాస దాశరాజ్ఞయుద్ధము చెప్పబడింది. నహుషుని పుత్రుడు యయాతి, మనుమడు పురు. ఈ పురువంశీయులు తృత్సుని క్షత్రియులు. తృత్సులకు చెందినవాడు సుదాసుడు. ఈయన పూర్వులలో ముద్గల, వధ్ర్యశ్వ, దివోదాస, సృంజయ, చ్యవనులు కనిపిస్తారు. కవషఐలూష, పురుసంవరణ, యాదవ, శివ లేక ఆనవ, ద్రుహ్యు, మత్స్య, తుర్వశ ప్రభృతులయిన పదిమందిరాజులతో యుద్ధము పరుష్ణీ సమీపమున జరిగినది. ఇచట పారిపోయిన రాజా పురువనబడిన పురుకుత్సుడు. పౌరాణిక మత్స్యులు సుదాసుని తర్వాత గోమ్మతి తీరములకు కనిపించేవారు. కవషఐలూషుని కుమారుడైన తురకావషేయుడీ యుద్ధంలో ఒక నదిలో మునిగిపోయినాడు. ఈయన సంతతికి చెందిన మరొక తురకావషేయుడే జనమేజయుని పురోహితుడు కానటంచేత దాశరాజ యుద్ధం క్రీ పూ. 3102 కి ముందే జరిగి ఉండాలి.

ఇంతేకాక పౌరాణిక వంశ వృక్షాలలో ప్రధాన రాజ నామములే ఇవ్వబడినవని మరువరాదు. మను సంతానములో ఇక్ష్వాకు, నాభాగ, ధృష్ట, శర్యాతి, నరిష్యంత, ప్రాంశు, నాభా నేదిష్ఠ, కారుష, పృషధ్ర ఇల, సద్యుమ్నులున్నారు. ఇళ పుత్రుడు పురూరవసుడు. ఈయన కుమారుడు ఆయువు, మనుమడు నహుషుడు. నహుషుని పుత్రుడు యయాతికి జన్మించిన ఐదుగురు దాశరాజయుద్ధంలో కనిపిస్తారు. సుదాసునకంటె పూర్వము కనీసము ఏడుతరాలు పేర్కొనబడినవని చెప్పవచ్చును. ఈ రీతిగా విచారిస్తే ఋగ్వేదంలో కనీసం ఇరవై ఐదు తరాలకు చెందిన ఋషులు కనిపిస్తారు. వీరికి సుమారు వేయి సంవత్సరాల కాలము చెప్పితే ఋగ్వేద సంహితా కాలము క్రీ. పూ. 4000 కు ముందే పోతుంది.

మనుసంతతిలోని యాదవ వంశమునకు చెందిన వారిలో 93 వ రాజు కంసుడు. ఒక్కొక్క తరానికి పౌరాణిక గణనలో నలభై సంవత్సరా లున్నవి. దాశరాజ యుద్ధంలో యదువున్నాడో ఈ యుద్ధము కృష్ణ కంసులకంటె 3400 సంవత్సరాల పూర్వమే జరిగి తీరాలి. ఇది క్రీ. పూ. 6550 కి రాగలదు. ఆనవ వంశంలో 94 వ తరానికి పాండవులు, కర్ణుడు వస్తారు. మనువునుంచి 44 వ వాడైన భరతుడు సుదాసుని తర్వాత 1440 ఏండ్లకు, అనగా క్రీ. పూ. 5110 కి ఉండాలి. కాబట్టి ఉత్తర పాంచాలులలో 68 వ వాడుగా కనబడే సుదాసుడు దాశరాజ్ఞ యుద్ధంలోని వాడు కాదని లెక్క చెప్పవచ్చును. ఈ లెక్కలను బట్టి మనువుకాలము క్రీ. పూ. 7000 కి వెళ్తుంది.

పరీక్షిత్తు క్రీ. పూ. 3076 లో రాజ్యానికి వచ్చినాడు. ఈయన మనుమడు అధిప్రతారివద్దగల ధృతి అనే పురోహితుడు కన్పించే పంచవింశతి బ్రాహ్మణము క్రీ. పూ. 3000 నాటిది కావలె. మరొక మనుమడు శతానీకుడు విదేహ రాకుమారిని పెండ్లాడినాడు. కాబట్టి బుద్ధుడు పుట్టిన రోజునవే జన్మించిన ఉదయనుడు వేరొక శతానీకుని పుత్రుడు కావాలి. మొదటి శతానీకుని మనుమడైన అధిసీమ కృష్ణుని కాలంలో (క్రీ. పూ. 2920) మొట్టమొదటి సారిగా పురాణములు నైమిశారణ్యమున చెప్పబడినవి. ఈయన సంతతికి చెందిన నిచక్షుని కాలమున పంటలు పాడైపోయినవని చెప్పు ఛాందోగ్యపరిషత్తు క్రీ. పూ. 2850 నాటిదని గట్టిగా చెప్పవీలున్నది.

ఇంత ప్రాచీన కాలానికి చెందిన వైదిక వాఙ్మయమునకు కర్తలు ఆర్యులని, ఈ ఆర్యులు ఎక్కడనుంచో బయలుదేరి మన దేశానికి వచ్చినారని చెప్పటం మన చరిత్రకారులకు అలవాటైపోయినది. శ్రీ మున్షీ గారి విద్యాభవనం ప్రచురించిన వైదిక యుగము చే సంపుటములో ఒకచోట ఆర్యుల మొదటి నిలయము దక్షిణ రష్యా అని (పుట 212), వేరొక చోట మధ్య ఆసియా అని (పుట 218) చెప్పబడినది. బహుశః వీరి ప్రకారం ఆర్యులు దక్షిణ రష్యానుంచిలేచి మధ్య ఆసియాకు వచ్చి, అచటనుంచి ఇతర దిక్కులకు పోకుండా మన అదృష్టవశాత్తు ఎందుకో భారతదేశానికి వచ్చి ఉంటారు. ఊహాగానమంటే ఇదే.

భాషా శాస్త్రము ప్రకారము ఆర్యులంతా ఒకే ఒకచోట ఉండేవారని, అచటినుంచి ఇతర దేశాలకు భిన్న మార్గాల ద్వారా వలసపోయినారని, కొన్ని పదాల ప్రాచీన రూపాలు గ్రీకు, లాటిన్ భాషలలో నిలచిపోయినవని చెప్పతారు. ఉదాహరణకు తార అనే పదం తీసికొందాము. అవెస్తాలో 'స్తర్' గ్రీకులో 'అస్టెర్', లాటిన్లో 'అస్ట్రుమ్' అని కనిపించే పదం సంస్కృతంలో తారవివదంటే వలస వచ్చిన భారతీయులైన ఆర్యులు పూర్వ రూపాన్ని మార్చినారని వీరంటారు. కాని ఒకే ఒకచోట ఉన్న జన సమూ

హాను ఒకే భావను ఒకే విధముగా ఉచ్చరించేవారని చెప్పటం భాషా శాస్త్రం తెలియని వారికే తగుతుంది. ఒకే భాష, ఐనా మాండలిక భేదా లుండవచ్చును. ఇంతే గాక చీలిపోయేవారు సహజంగా ఆనాటికి ఉన్న భాషా సంప్రదాయాలను తమవెంట తీసుకొని వెళ్ళటం సహజం. అరవదేశానికి 16, 17 శతాబ్దాలలో వలస పోయిన ఆంధ్రులు ఆనాటి పదాలను తీసికొనిపోయి, నేటికిగూడా వాటినే ఉపయోగిస్తున్నారు. ఆ శతాబ్దాల ప్రాచీన రూపాలు మన నేటి తెనుగులో కన్పించవు. ఇంతమాత్రాన మనమంతా తంజావూరు మొదలైన అరవజిల్లాలనుంచి ఆంధ్రదేశానికి వలసవచ్చినవారమంటే చరిత్ర ఒప్పుకుంటుందా? ఇలాగే 'తార' అనే రూపం భారతదేశంలో రాకముందే చీలిపోయి పాశ్చాత్యదేశాలకు వలసపోయిన ఆర్యులు ఈ శబ్దపు ప్రాచీన రూపాన్ని వెంటతీసుకొనిపోవటంలో ఆశ్చర్యం లేదు.

ఆర్యులు భారతదేశంనుంచి ఇతర స్థలాలకు వలస పోయివారనటానికి ఆయా ఆర్యభాషలలోని సారస్వతం కూడా తోడ్పడుతున్నది. ఆర్యుల అతి ప్రాచీన గ్రంథాలు వేదాలని అందరు అంగీకరించిన విషయమే. వేదాల తర్వాత వచ్చినది అవెస్త. ఈ జెందవెస్త తర్వాత క్రమముగా లిథువేనియన్, గ్రీక్, లాటిన్, జర్మన్ సారస్వతాలు బయలుదేరినాయి. దాదాపు స్థిరముగా నివాసములు ఏర్పరచుకొన్న ప్రజలలోనే సాహిత్యం బయలుదేరటం కద్దు. దక్షిణ రష్యానుంచి ఆర్యులు బయలుదేరినట్లయితే మన వేదాలకన్న పూర్వమే లిథువేనియన్ వాఙ్మయం కనిపించాలి. యూరప్‌లోని ప్రజలు మన వేదాలు వచ్చినదాకా ఆగి, ఆ తర్వాత తమ గ్రంథాలను చెప్పసాగినారని దక్షిణ రష్యావాదు లనటం సత్యదూరము. ఇంతేగాక మూడు వందల యేండ్ల క్రిందట యూరప్‌నుంచి పశ్చిమముగా ఈ జాతికి చెందినవారు అమెరికా చేరినారు. ఈ విషయాన్నిబట్టి అతి ప్రాచీనకాలంనుంచి ఆర్యులు పశ్చిమ రాజ్యాలకే వలసపోవటం సాగించారని తేలుతుంది. ట్రోజనులు పశ్చిమంగా పోయి ఇటలీ చేరినారు.

దీనికి అనుగుణంగా ఒక విషయాన్ని గమనించాలి. ఋగ్వేదసంహితలో అనేక పర్వతాలు పేర్కొనబడినవి. కాని హిమాలయము ఒక్కసారైనా అదికూడా నిర్లక్ష్యముగా, ప్రస్తావించబడినది. ఈ శబ్దము కన్పించే సూక్తం చాల అర్వాచీన మయినదని పాశ్చాత్యులే అన్నారు. పశ్చిమోత్తర దిశగా ఆర్యులు భారతదేశానికి వచ్చినవారైతే వీరు హిమాలయాలను అంత తేలికగా వదలివేస్తారా? ఇట్టి కారణాలను అనుసరించి స్యనెర్, ప్రార్జెర్‌లు పశ్చిమయూరప్ చాల అర్వాచీన కాలమున, చిట్టచివరకు ఆర్యులచే ఆక్రమింపబడినదని వాదించినారు. భారతదేశంనుంచి వెళ్ళగొట్టబడిన ఆర్యులలో కొందరు తర్వాతి కాలంలో మనమీదికే దండెత్తి వచ్చినారు. పార్శీలు మాత్రం అరబ్బులచే నిరుద్ధులైనప్పుడు తమ పూర్వుల దేశానికి తిరిగి వచ్చినారు. తాము భారతదేశానికి వచ్చిన పర్షియా దేశస్థులమని పార్శీలు నేటికీ చెప్పుకొంటారు. భారతీయు లిట్లా వచ్చినవారు కాకపోవటంచేత వారిట్లా చెప్పుకోవటం లేదు.

మధ్య, దక్షిణ భారతదేశమునకు చెందిన ఈ ఆర్యులు క్రమముగా తూర్పు భారతమునకు వ్యాపించి, అటునుంచి పశ్చిమమునకు, ఉత్తరమునకు పోయినారు. ఒక ఋగ్వేద సూక్తంలో భారతదేశపు నదులు పేర్కొనబడినవి (10-75), ఈ వరుసలో తూర్పునుంచి వాయవ్యంగాగల నదుల క్రమము కన్పిస్తుంది. వీరు వాయవ్య భాగంనుంచి ఇతరప్రదేశాలకు వ్యాపించి ఉంటే ఈ వరుసలో చెప్పేవారు కారు.

గంగానది అర్వాచీన మనబడే సూక్తంలో ఎందుకు కన్పిస్తున్నదని అడుగవచ్చు. ఇక్కడ రెండు విషయాలను గమనించాలి. మనకు నేడు లభించే వైదిక వాఙ్మయము అసలాకాలంలో బయలుదేరిన వాఙ్మయంలో అతిస్వల్పభాగమని ఋజువుచేయబడినది. ఈ స్వల్పభాగంలో ఏదైన కన్పించనంత మాత్రాన వైదికార్యులకా విషయము తెలియదని వాదించటం సాహసమాత్రము. మనకు నేడు లభ్యమైన భాగంలో గంగానది ప్రసక్తి బాగా ఉండిఉండవచ్చును. ఇక రెండవ విషయము. వైదిక వాఙ్మయము శీర్ణమైపోతున్న రోజులలో సంహితాది విభాగము, సంకలనము జరిగినవి. ఈ సంకలనములో కూడా చాలభాగము వదిలివేయబడి ఉండే వీలున్నది. పైగా సంకలనకర్త అతి ప్రాచీన భాగాలను ఆనాటివారికర్థమైన భాషలోనికి తీర్చి దిద్ది ఉండవచ్చును. కుత్సత్రిత ఆప్త్యుల సూక్తాలనుబట్టి ఇట్టిది జరిగిందని గట్టిగా చెప్పవీలున్నది. ఈ రీతిగా గమనిస్తే సప్తసింధువులు భారతీయులు తర్వాత చెప్పిన సప్తమహానదులే కావచ్చును.

ఆంగ్లంలో 'బీచ్' అనబడే చెట్టు ఒకటున్నది. ఆర్యుల కీవృక్షం పరిచితమైనదని, ఆర్యభాష లన్నిటిలోను ఈ వృక్షం సూచకపదములు తుల్యములని, సంస్కృతంలో దీని ప్రాచీనరూపము 'భగ' అనీ, అందుచేత ఈ వృక్షము పేరు కన్పించే ప్రాంతమే ఆర్యుల ప్రథమ నివాసస్థలమని ఒక వాదమున్నది. జర్మనీలోని కోయినింగ్స్‌బర్గ్ నుంచి క్రిమియా వరకు ఒక గీతగీస్తే దానికి పడమరగానే ఈ చెట్టు కన్పిస్తుంది. కాని వైదిక 'భగ' శబ్దము, ఆంగ్ల 'బీచ్' శబ్దము తుల్యములు కాజాలవని భాషాశాస్త్రమే చెప్పుతున్నది. ఈ చెట్టుతో పరిచయము పాశ్చాత్య దేశాలకు పోయిన ఆర్యులకే ఉన్నది కాని అందరకు లేదు. పైగా ఆయా దేశాలకు పోయిన ఆర్యులు ఆయాదేశాలలోని ప్రాచీనవాసుల భాషలలోనుంచి కూడా మాటలను తీసికొన్నారు. ఈ పదాలుకూడా ప్రాచీన ఆర్యభాష లోనివని యెంచ వీలులేదు. 'బీచ్' అనే శబ్దము ఇలాంటి ఋణాగ్రస్త శబ్దముకావచ్చును.

వైదిక సంస్కృతంలో ఆర్యభాష లన్నిటి కంటె ఎక్కువ అచ్చులున్నవి. మనము పడమరకు పోతున్నకొద్ది ఈ అచ్చులసంఖ్య క్రమముగా తగ్గుతుంది. నేటి భారతీయ భాషలలోకూడా ఈ అచ్చు లన్నీ ఉన్నవిగాబట్టి ప్రాచీన ఆర్యుల ఆదినివాసస్థలము భారతదేశము కాదనటం సాహసప్రాయము.

ఏవో కొన్ని విషయాలు వైదికవాఙ్మయంలో కన్పించటంలేదుగనుక ఆ వస్తువు లున్న దేశంలో ఆ కాలమున వైదికఆర్యులు లేరనికూడ చెప్పవీలులేదు. మొహెంజొదరో శిథిలాలలో సింహమునుగురించిన చిత్రాలు కన్పించవు. కాని దగ్గరగాఉన్న రాజస్థాన్‌లో చాలా సింహాలున్నవి. కాబట్టి ఈ ప్రాంతంలో కన్పించే శిథిలాలు సింహాలు లేనిచోటునుంచి ఇక్కడకు తీసికొనిరాబడినవని వాదించేవారికి ఉన్మత్తులకు భేదములేదుగదా! ఇలాగే బియ్యము వేదాలలో చెప్పబడనంతమాత్రాన వారికి వరిధాన్యమే తెలియదనటం కూడా అసంబద్ధమే. వైదిక ఆర్యులకు బియ్యమే తెలియదని వాదించేవారు ఈ వాఙ్మయంలో లవణము చెప్పబడలేదు గనుక ఈ ఆర్యులు ఉప్పులేకుండా భోజనము చేసేవారని చెప్పాలి. పాప మెందుకనో ఉప్పుసంగతిని ఈ పరిశోధకులు మరచిపోయినారు. అసలు వైదికార్యులు వారి దైనందినచర్యగా వ్రాసినదైతే ఈ వైదికవాఙ్మయంలో అన్ని విషయాలు కన్పించేవి. కాని వారు తమజీవితంలో అతి ముఖ్యమైన ధార్మికాధ్యాత్మిక సన్నివేశాలను మాత్రమే భావనా వ్యాపారశక్తిమున చిత్రించినారు.

ఏనుగును మృగహస్తి అని వైదికార్యులు పిలిచినారుగనుక వీరికి చేయిగల జంతువుగా ఏనుగు కన్పించినదని, వీరు ఏనుగులున్నచోటికి తర్వాతికాలమున వచ్చినారని మరొకవాదము. కాని మృగహస్తి అనే పదము భావనాగరిష్ఠమైన కవిసమయాన్ని సూచించే మాట ఎందుకు కాగూడదు? మృగాలను చతుష్పాత్తు లని, మనుష్యులను ద్విపాత్తులని, వైదికఋషు లన్నారు గనుక వీరికి మృగాలు, మానవులు వింతవస్తువులుగా మొట్టమొదటిసారి కన్పించారని అనలేముగదా!

ప్రాచీన ఇరాన్ దేశస్థులు తమ ఆదిమనివాసమును ఐర్యనవేజో అన్నారు. ఇది ఆర్యావర్త శబ్దానికి అపభ్రంశము. అసురదేశంలో ఇరాన్‌కు ముఖ్యనగరమైన హిరణ్యపురమును రాజసూయానికి ముందు అర్జునుడు ముట్టడించినాడు. తర్వాత నివాతకవచ, కాలకేయుల నోడించినాడు. ఈ కాలకేయ శబ్దమే ఉత్తర మంగోలియాలో ఖల్ఖస్ అని నేడు పిలువబడుతున్నది. మహాభారతము ప్రకారము ఇరాన్ అనే శబ్దానికి పూర్వరూపము హిరణ్యశబ్దమై ఉంటుంది. ఇరాన్ దేశస్థులు రస, సరస్వతి మొదలగు నదులను స్మరించారు. వలస పోయేజనం తమ ప్రాచీనదేశ, నగర, నదీనామాలను క్రొత్తదేశములోని వాటికి పెట్టటం మానవ సంప్రదాయం. యార్క్‌కు న్యూయార్క్ వచ్చింది. పర్షియనుల రన్హా శబ్దంకన్న వైదిక రసశబ్దం అతిప్రాచీన మనటంలో సందేహము లేదు.

అవెస్తాలో భగవంతుని అహురమజ్ద అన్నారు, ఇతను వేదములలో అసురోమహాన్ అని కనిపిస్తాడు. ఈ అసురుని ఆరాధించిన దేశము అస్సీరియా. వీరు కస్సైటి పాలనకాలంలో అక్కడకు చేరినారు. చాల్డియా రాజగు సర్గోన్ (క్రీ. పూ. 3800) సిరియాను అసుర అని పిలిచినాడు. సురశబ్దము సిరియాగాను, అసురశబ్దము అసురుగాను మారినవి. ఇది మనకు పర్యాయపదములే గదా; కాబట్టే ఈ దేశానికి రెండుపేర్లు వచ్చినవి.

యజ్ఞయాగాది క్రతువులపై ధ్వజమెత్తిన ఉపనిషదృషుల వలెనే జరథుష్ట్ర కూడా దండెత్తినాడు.

అస్సురబనిపాల్ (క్రీ. పూ. 700) వరకు ఇతని సంస్కరణలు పరిచితములే. దేవుని ధ్యానించు వారిని జరథుస్త్రు నిందించి నప్పుడు అతని దృష్టిలో వైదికార్యులే ఉన్నారు. కావున ఆయన చేతులలో మన ఇంద్రుడు దైత్యుడైనాడు. దీనినిబట్టి అస్సిరియాకు వలసపోయిన ఆర్యులకు భారతదేశములోని ఆర్యులపై క్రోధము వచ్చినదని ఎంచ వీలున్నది. భారతీయులు వారిని తమ దేశమునుంచి వెడలగొట్టి యుండవచ్చును. అందుచేత వారికి ఆగ్రహము వచ్చినదని, తద్వారా భారతదేశము నుంచి తాము తెచ్చుకొన్న ఆచారవ్యవహారములను వారు సంస్కరించ పూనినారని భావించ వీలున్నది. మీడియా దేశపువారినుంచి పర్షియా దేశస్థుల పురుషు శవములను పాతిపెట్టటం కూడా గ్రహించినారు. తమను వెళ్ళగొట్టినవారి దేవతలు వీరికి రాక్షసు లైనారు. అవెస్తాలోని గాథలు మొదలైనవి సంహితలు బ్రాహ్మణములు వచ్చిన కొంతకాలానికి బయలుదేరి నట్లు దీనివలన స్పష్టమౌతున్నది.

భారతదేశంనుంచి లేచిపోయిన ఆర్యులలో కొందరు పర్షియాలో స్థిరపడిపోయినారు. వీరు తెచ్చిన సంస్కరణలతో తృప్తి చెందనివారు వీరిని వదలి ఇంకా పడమరగా పోయినారు. ఇండోయూరోపియన్ల శబ్దాలను, శబ్దార్థములను బాగా శోధించిన బ్రాండెన్ స్టైన్ అనే పండితుడు అతిప్రాచీన ఆర్యకుటుంబము నుంచి మొట్టమొదట బయటకు వచ్చినవారు భారత పర్షియా దేశాల ఆర్యులని స్థిరపరచినాడు. కాని ఆయన ఇచ్చిన వాదాలద్వారా మొట్టమొదట స్థిరనివాసముల నేర్పరచుకొన్నవారు భారతదేశము లోని ఆర్యులని తేలుతున్నది. ఇతరులు ఆ సమయానికి ఇంకా ఉచితస్థలాన్వేషణలోనే నిమగ్నులై ఉన్నారు. భారతీయుల నుంచి లేచిపోయినవారిలో మొదట స్థిరపడినవారు పర్షియా దేశములోని ఆర్యులు.

భారతదేశమే ఆర్యుల నిజమైన నివాసభూమి. ఐతే ఈ దేశాన్ని పూర్తిగా ఆర్యమతంలోకి మొట్ట మొదటనే మార్చకుండా, ఎందుకు ఇతర దేశాలకు వీరు పోవలసి వచ్చినది? అని అడుగవచ్చును. కాని జాతికి మతమునకు ఎలాంటి సంబంధం లేదని వైజ్ఞానికు లందరును అంగీకరించిన విషయమే గనుక ఈ అశంకకు ఆధారము లేదు. విభిన్న సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను సమన్వయపరచే శక్తి ఆర్యుల విశిష్ట స్వభావంలోనే ఉన్నది. కత్తి కట్టుకొని, మోసగించి తమమతాన్ని ఇతరులపై రుద్దటం ఆర్యుల స్వాభావిక గుణము కానే కాదు.

నిర్యాణవర్షము అని పిలువబడిన ఆర్యావర్తము మొట్టమొదట అహురమజ్ద సృష్టించెనని వెండిదాద్ లో మొదటి ప్రకరణమున గలదు. ఈ ఆర్యావర్తమున చలికాలము సుదీర్ఘమైనది. తమ పూర్వులు దేశాన్ని వదలి వచ్చినారని చెప్పబడినది. ఆర్యశబ్దము రూపాంతరాలను పొంది ప్రపంచమంతట వ్యాపించినది. కాని ఆర్యావర్త శబ్దము కేవలము మన దేశంలోనే కన్పిస్తుంది. దీర్ఘశిశిరములను సాధించటానికి ఉత్తర ధ్రువానికిగాని, రష్యాకు గాని, మధ్యఆసియాకు గాని పోనక్కరలేదు. భూమి తీవ్రంగా కంపించినదని ఋగ్వేదము చెప్పుచున్నది. (2.12.2). ఈ కంపాలవలన శీతోష్ణపరిస్థితులు చాలవరకు తారుమారైనవి. కొండలలో బయలుదేరి సముద్రములోనికి ప్రవహించిన సరస్వతీనది (ఋ. వే. 7. 95. 2) మాయమైనది. ఈ భూకంపాలవలన కూడ కొందరు మన దేశాన్ని వదలవలసి వచ్చినది.

మధ్యఆసియావాదము దోషభూయిష్ఠము. ఎత్తైన కొండలుగాని, ఎడారులుగాని, దాటశక్యం కాని అడవులుకాని అక్కడ లేవు. పైగా విరివిగా ఆవులు, గుర్రాలు ఉన్న మధ్యఆసియా పాడిపంటలకు పుట్టిల్లుగా ఉండేది. గొర్రెకు మేత, మానవుల ఆహారము సమృద్ధిగా అక్కడ లభించేది. అలాంటిదేశాన్ని ఆర్యు లెందుకు వదలి వేయగలరు? భూకంపాలవలన లేచిపోయినారంటే, అవి భారతదేశంలోనే ఆ నాడు వచ్చినవనటానికి మన కాధారా లున్నవి. పైగా తూర్పు పడమరలలోని సముద్రాలలోనికి సూర్యుడు వెళ్తున్నాడని ఋగ్వేదమున్నది (10. 136. 5). మధ్య ఆసియా వారికి సముద్రా లెలా కన్పించగలవు? ఉత్తరధ్రువ ప్రాంతంవారికి మాత్ర మీ రెండు సముద్రాలు ఎలా కన్పించగలవు? పంజాబులో ఆర్యులుంటే వారికి మాత్రం ఈ రెండు సముద్రాలు కాని, నాలుగు సముద్రాలు (ఋ. వే. 9. 33. 6) కాని, కన్పించటానికి వీలేమాత్రం లేదు. భూపంకమే (ఋ. వే 2.12.2) కాకుండా, స్వైరవిహారము చేస్తున్న కొండలు (ఋ వే 2-17-5) కూడా ప్రస్తావింప బడినవి. ఇవి అగ్నిపర్వతాలు. ఈ ప్రమాణాలకు

నుసిద్ధమైన భారతీయులు క్రొత్త క్రొత్త నివాసభూములను వెదికిపో సాగినారు.

'తోకం పుష్యేమ తనయం శతంహిమాః' (ఋ. వే. 1-64-14) అని, 'పశ్యేమ శరదః శతం, జీవేమశరదః శతం' (7-66.16) 'సహావీర వ శతాదదా స్తమేతి హోతః' (శ. బ్రా. 8.4.6) అని పంక్తులున్నవి. పుత్రపౌత్రులను నూరునూరు కాలాలవరకు జీవించేటట్లు పెంచాలి; నూరు శరదృతువులను చూడాలి; సూర్యుని కిలాంటి ఉదయాస్తమయాలు లేవు—అని వీటి భావము. ఇలాంటి వాక్యాలవలన ఆర్యులు ఉత్తర ధ్రువ ప్రాంతంవారని చెప్పవచ్చునని ఒక వాదమున్నది. కాని మంచుకురిసే రోజులు అనాదికాలంనుంచి భారతదేశంలో మామూళ్ళరోజులు. పండిన ధాన్యాన్ని కోతచేసి ఇంటికి తెచ్చే కాలమది. శరత్కాలం భారతదేశంలో ఎలా ఉంటుందో బాగా అర్థంచేసికోవాలంటే మన ప్రాచీన మహాకవులను ఒక్కసారి తిరగవేస్తేచాలు. మంచుకురిసే ధ్రువ ప్రాంతంలోనే ఆర్యులుంటే, చలిబాధ దుర్భరము కాకతప్పదు. అలాంటి సమయంలో చేసేకాకుండా, మాకొడుకులు, మనుమల్నికూడా నూరు చలికాలాలను చూడాలి అని ఎవరు కోరుకోగలరు? తమ సంతానంపైన తమకే ఈప్సిత, ప్రేమము ఉన్నవాడే ఇలాంటి కోరికను గ్రంథస్థం చేయగలడు. పైగా పైపంక్తులలో ఒకచోట 'పుష్యేమ' అనే క్రియాపదమున్నది. దీనికి పోషించటమని అర్థం. ఈ పోషణకు కావలసినది ధాన్యము. మనకు ధాన్యము లభించేది హేమంత, శిశిరాలలో కదా! సూర్యుని ఉదయాస్తమయాలు లేకపోవటం జ్యోతిశ్శాస్త్రంలో ప్రాథమిక సూత్రము. ఈ సూత్రము బ్రాహ్మణాల కాలానికికూడా ఆర్యులకు తెలియదనటానికి ఆధారాలులేవు. ఒకవేళ తెలియదంటే, ఈ వాక్యం కవి ప్రతిభాసిద్ధమైన వర్ణనగా మనమెందుకు గ్రహించరాదు? నూరు చలికాలాలవరకు సంతతి పోషింపబడాలి అనే కోరికగలవారు, తమ నివాసము ధ్రువ ప్రాంతమైతే దానిని ఎందుకు వదిలిపోతారో మన కెక్కడా చెప్పలేదే.

ఋగ్వేదం 1-30-9 లో తన ప్రాచీన నివాసం నుంచి రావలసిందని ఇంద్రుని కోరినారు. ఈ ప్రాచీననివాసము భారతదేశానికి ఉత్తరంగా ఉన్నదేశం కాదు. తా నివసించిన ఎక్కడినుంచి వస్తున్నాడో ఆ ప్రాచీననివాసంనుంచి రావలసినది మాత్రమే కోరిక. వైదికవాఙ్మయంలోని పదాలకు వాచ్యార్థాన్ని చెప్పేటాలాభాగము మనకుతెలియవ్యవహారుండని అందరూ అంగీకరించిన విషయమే. మేరుపర్వతాన్ని చుట్టివస్తూ, దానికి పైగా ఆ నక్షత్రాలు తిరుగుతున్నవి. (తై. బ్రా. 3.9.22.1; మ. భా. వన 163; మను 1.67) అనే మాటలు కవి ప్రతిభాసిద్ధమైన వర్ణనలని ఇందువలననే చెప్పాలి. ఇలాంటివే ఉపమానోక్తాలు.

కౌషీతకి బ్రాహ్మణంలో (7.6) ఉత్తరప్రాంతపు భాష అనన్యవంతమైన దన్నారు. ఈ ఉత్తర ప్రాంతాన్ని వ్యవహరించటానికి తీసికొని వెళ్ళటంలో ఊహాగానమే కల్పించగలదు. చాల ప్రాచీనకాలం లోనే ఉత్తరభాగానికి ప్రాముఖ్యము వచ్చినది. కైలాసశిఖరము, పవిత్రగంగానది, బదరికాశ్రమము, నైమిశారణ్యము మొదలైనవన్నీ ఉత్తర భారతంలోనే వెలసినవి. ఈ హిమాలయాలకు ఉత్తరతీరాన పరలోకమున్నదని భారతం (శాంతి 192.8.20) చెప్పతున్నది. అనగా భారతదేశాన్ని వదిలి వెడలిపోయినవా రవలంబించినమార్గ మిదని భావము. కాశీకిపోయినవారు కాటికి వెళ్ళినవారు సమానమే అనే సామెత మనకున్నది. ఇలాగే భారతదేశాన్ని వదిలి బయటకు వెళ్ళినవారు చచ్చినవారితో సమానమని చెప్పటానికి మాత్రమే హిమాలయాల ఉత్తరతీరము పరలోకంగా చెప్పినారు. కాబట్టే హిమాలయాల కుత్తరంగా ఉన్న భూములలో మానవుడు పాపవిముక్తుడై, మోక్షాన్ని పొందుతాడని మహాభారతము (ఉద్యో 8.27.1) చెప్పింది.

ఆర్యావర్తానికి వ్యతిరేకంగా ప్రవర్తించినవారిని దేశంనుంచి వెళ్ళగొట్టినారు. నహుషుని బయటకు తరిమినారు. (ఆది 75.26 29; వన 181.30.43; ఉద్యో 11.17; శాంతి 342.44-51) నహుషుని సోదరుడు ఇంద్రుని జయించగా, ఆయన కుమారుడు దేవతల దేశాలను పాలనము చేసినాడు (వాయు 92.75-99; మత్స్య 24.35.49; భాగ 9.17,12-16). వీరు అందరు ఇళాసంతతివారు. ఈ ఇళావంశీయులు భారతదేశాన్ని వదిలి మధ్య ఆసియా చేరుకొన్నారు. ఇళాపుత్రుడైన పురూరవసునకు గంధర్వులతో సంబంధ మున్నది. ఇళాభర్త జారజుడైన బుధుడు. అంగిరసవంశజుడైన

తారయొక్క జారుడు సోముడు. ఉత్తరదేశపు బ్రాహ్మణులకు రాజా సోముడు (ఋగ్వే 3.8; విష్ణు 4.6) ఇవ కర్తృత్వంలో పురూరవసుడు క్షత్రియుడైనాడు (బ్రహ్మ 108.69.70). ఇలా సంతతి వర్ణసాంకర్యమును తెచ్చినది గనుకనే ఈ సంతతికి చెందిన నహుషుడు దేశభ్రష్టుడైనాడు. ఈ సంతతి వారికి హిమాలయ భూములలో నున్న గంధర్వులతో సంబంధాలు వచ్చినవి.

అయోధ్యలో పాలించిన క్షత్రియుల మూల పురుషుడు ద్రావిడదేశమునుంచి వచ్చినవాడని భాగవతమున్నది. దీనినిబట్టి ఆర్యసాంఘిక వ్యవస్థకు బాహ్యంగా ఉన్నవారు ద్రావిడులు కానేకారని దృఢపడుచున్నది. ద్రావిడశబ్దము జాతిని సూచించేది కాజాలదు. ఇది దేశవాచకము, లేక భాషావాచకము. ద్రావిడులు వేరు, దస్యులు వేరు. దస్యులకు భూము లున్నవి. (ఋ. వే. 1.100.18). వైదికార్యుల శత్రువులైన దస్యులు (2.11.19) యజ్ఞయాగాదులపై నమ్మకము లేనివారు (10.22.8). వారికి తొంభైకోట లుండేవి (3.12.6). దస్యురాజగు కృష్ణునకు పదివేల అనుయాయు లున్నారు (8.85.13.15). మొదట దానవులవద్ద నుంటినని, తర్వాత దేవతలవద్దకు వచ్చితినని శ్రీ చెప్పినట్లు మహాభారతము (12.225,228) చెప్పుచున్నది. పర్షియా భాషలో దహ్యుశబ్దానికి గ్రామమని అర్థము. వీరే ఇటలీలో దాచి అని, గ్రీసులో దకోఇ అని పిలవబడినారు. కాబట్టి దస్యులు దానిసలుగాని, ద్రావిడులుగాని కారని, ఆర్యుల ప్రబలశత్రువులైన వీరు గ్రామజీవన సస్తులని చెప్పవలెను. మొట్టమొదట బ్రాహ్మణులని పిలువబడ్డ ఒకేఒక వర్ణముండెడిదని, ఈ బ్రాహ్మణులే చాతుర్వర్ణ్యముగా మారినారని శాంతిపర్వమున (188. 10-17) గలదు. ద్రావిడులు వ్రాత్యక్షత్రియులని మనువు (10-20-22) పలికినాడు. తమ వేదోక్త ధర్మాలను వదిలివేయుటంచేత వీరికి క్షత్రియవాసన నశించినదని చెప్పినారు. (మను 10.43-44; అనుశాసన 33-21.22, 37-17.18). ఈ ద్రావిడులు కూడా ఆర్యులతో బాటు భారతదేశం నుంచి బయటకు వెళ్ళినారు. ద్రావిడులైన చుమురి (=సుమి) తెగ యూఫ్రటీస్ నదీ ముఖమున ఉండేవారు. ధుని అనే ద్రావిడుడు దక్షిణ బాల్టియా రాజగు దుంగి (క్రీ॥ పూ॥ 2900) అనువాని పూర్వపురుషులలో కన్పిస్తాడు. లైసియా ప్రజలు తమనుతామే తెర్మిలై అని శాసనాలలో పిలుచు కొన్నారు. తెర్మిలై, ద్రమిళ, ద్రవిడశబ్దాలు పర్యాయపదాలు. ఆర్యసంప్రదాయాలను త్రోసిపుచ్చుకొని ధర్మభ్రష్టులైన వారు ఆయా ఇతర దేశాలకు వెళ్లినారు, అప్పుడక్కడ వీరిని పర్షియాలో సిద్రిఅని, అర్మీనియాలో సాకుచెక అని, చీనాలో మూదెఅని, చౌఅని పిలచినారు. వీరినే శూద్రులని మనదేశంలో వ్యవహరించి ఉండవచ్చును.

కశ్యపభూమియున్న కశ్మీరమునుండి లేచి పోయిన ఆర్యులు స్థిరనివాస మేర్పరచుకొన్న ప్రాంతమునగల సముద్రమును కశ్పియన్ సముద్రమన్నారు. కసులు, కస్సైటి వంశము అనేవి ఈ కశ్మీర ఆర్యులతో సంబంధముగలవని చెప్పవచ్చును. పశ్చిమ ఆసియాలో క్రీ. పూ. 1756 నుంచి 1170 వరకు పాలించిన రాజులు కస్సైటివంశజులు. వీరికి సూరియస్ అనే సూర్యదేవుడున్నాడు. మరుత్తస్ కూడా ఇక్కడ కన్పించటంకాక వజిమరుత్తస్ అనే వ్యక్తి వీరిలోఉన్నాడు. సుమలియ (=సుమాలి, సుమాల్య) అనే పర్వతదేవత, శుగమున (=సుచమున) అనే తేజోదేవత కలరు. ఐదవరాజు పేరు అబిరత్తస్ (=అభిరథ). అన్యాయంగా రాజ్యమాక్రమించు కొన్న సుజిగ అనువాడున్నాడు. చేయువాడు అనే అర్థంలో కరశబ్దంవచ్చే పేర్లు కరఇందస్, కరబురియస్, కరహార్దస్. వైదికభగశబ్దమిక్కడ బుగస్ గా మారింది. సుర్యాన్ని వీరు శస అని పిలచారు. బాబిలోనియా, అస్సీరియాప్రజ లీమాటను వీరినుంచి గ్రహించారు. బాబిలోనియా భాషలో సుర్యానికి శుర అనే పేరు కన్పిస్తుంది. శసువుకు అర్థంచెప్తూ ఇది తూర్పు పర్వతాలలో కన్పించేగాడిద అని బాబిలోనియావా రన్నారు. అనగా సుర్యం కొత్తగా తూర్పు దిక్కునుంచి ఈ ప్రాంతాలకు వచ్చినదని భావము. దీనితోబాటు ప్రజలుకూడా అక్కడనుంచి వచ్చినారని తాత్పర్యము. పర్షియావారు మన సకారాన్ని హకారంగా మార్చినప్పటికీ, కస్సైటీలు సకారాన్ని సకారంగానే ఉంచారు. పర్షియాభాషలో ఈ హకార పరిణామం రాకముందే కస్సైటీలు వారినివదలి వెళ్ళినారు. బహుశ పర్షియనులు తెచ్చిన సంస్కారణలు వీరికి రుచించక పోవటంచేత వీరిలా పోయినారేమో! క్రీ. పూ.

1756 లో రాజ్యానికి వచ్చినారంటే ఈ కస్సైటీలు అక్కడకు క్రీ. పూ. 2000 లకే చేరియుండాలి.

క్రీ. పూ. 1675 నుంచి 1575 వరకు ఈజిప్టును పాలించిన హైక్సోస్ అనే వంశము విదేశవంశమని ఈజిప్టు సంప్రదాయము. హాత్షెప్సుట్ రాణి వీరిని ఆము అని, షస్వ అని పిలచింది. ఆము అంటె ఆసియా వారని అర్థము. వీరి నాయకులను హీక్షసుత్ అని పిలచారు. దీనికి ఎడారులలోని రాజకుమారులని అర్థము. వీరు ఆర్యులైనా కావాలి, లేక ఆర్యసంస్కృతిని అవలంబించిన పశ్చిమ ఆసియావారు కావాలి. వీరి భాషలో బ్నౌ (=వనవ), అఫ్నౌ (=అపఘ్నౌ), అపాఫీస్ (=అపభిస్), అసెత్ (=శశిత), కర్తాస (=కర్త) అనే సంస్కృతిపదాలున్నవి. వీరి ముఖ్య పట్టణాన్ని అవరిస్ అన్నారు. ఇది మన అవర శబ్దము. సెంకెన్ (=సుఘన్), కర్ (=కర), తర్తి (=తకతి) అనే పేర్లు వీరిలో కన్పిస్తున్నవి. వీరి దేవుడు సుతేఖ్ అనుటకు సుతేక లేక సుతేజస్. యుద్ధరథాన్ని వరఅర్థమన్నారు. తూళతమును కాటుకను తుతిక్నమన్నారు. పరశుధనుడైన రామక్ అను దేవుడు ఈజిప్టులో ఉన్నాడు. ఈయన పరశురామునికన్న వేరుగాడు. క్రీటుదేశపు మైసీనియా ప్రజలకు పరశురాముని జంటగొడ్డలి పరమపవిత్రమైనది. రామ పరశురాములకు జరిగినయుద్ధంవలన పరశురాముని అనుయాయులు ఈజిప్, క్రీట్ దేశాలదాకా వెళ్ళారనటంలో సందేహంలేదు.

పాలస్తీన్, సిరియాలలో దొరికిన అమర్న అనబడు లేఖలలో (క్రీ. పూ. 1380-1350) అర్తమనియా, (అర్తమన్య, ఋతమన్య), అర్జలియ (అర్జన్య), బిరియవాజ (=వీర్యవాజ). బిరిదశ్వ (బృహదశ్వ, వృద్ధశ్వ), బిరిదియ (బృహదియ), బిసితను, దర్న (దర్న), సుతర్న ఏతగమ, ఎందరూత (ఇంద్రోత) అను సంస్కృతిపదాలున్నవి. ఫారోయొక్క వార్తావహుని పేరు ఇరిమయస్స. నెమ్మదియైన గుర్రము గలవాడని ఈమాటకు అర్థము. ఈపదం చివరఅశ్వశబ్దం కన్పిస్తుంది. హోజినాయకుని పేరు మాయర్జన. దీనిలో మొదటి మాకారము మాసశబ్దములోనిది. మాసదేవతయైన చంద్రునిచె రక్షింపబడువాడని ఈ మాటకు అర్థము. ఫారో ప్రతినిధి కొడుకైన వమ్యహాజ తండ్రి కుతర్జుడు. రుస్మన్య (రుచిమన్య), సతియ (సత్య), సుబంధు, సుమిథ (సుమిత్ర), సుతర్జ సుతర్న (సుత తవయ), సువర్దత (స్వర్దత్త), తెవ్వత్తి (దేవత్తి), తుర్వజు (తుర్వసు, తురబాహు), విద్యా యశ్దత (యశోదాత), జిర్దమ్యస్ద (హృదయమేధ). జిత్రయర (చిత్రవార). జురస్తర (సురాష్ట్ర), జురత (సురథ), అమయ, అను మానవ నామాలిక్కడ కన్పిస్తున్నవి. అక్షప, సునాము అను పేరుగల నగరాలు పాలస్తీనాలో వున్నవి. దీనినిబట్టి ఆర్యసంస్కృతి సిరియా, పాలస్తీనాలలో ఎంతగాగా పాతుకుపోయినదో తెలియగలదు. ఈశబ్దాలన్నీ సంస్కృతపదాలకు అపభ్రంశాలుగా ఉండటంచేత భారతీయులే ఇచటకు వచ్చినవారని విశదము కాగలదు. పాలస్తీనాశబ్దానికి పులస్త్యశబ్దంతో సంబంధము లేదని ఎవరనగలరు?

యూఫ్రటీస్ నదియొక్క పైలోయలో మితన్ని అనే వంశము క్రీ. పూ. 1475 నుంచి 1280 వరకు పాలించినది. అర్తసుమర (ఋతస్మర), అర్తతమ (ఋతుధామ) దుష్రత్త(దుశ్శ్రీశ), దహార్త(దాహార్త), మత్తియువాజ (మధివాజ) సుస్సతర్ (సంతుత్ర), సుత్తర్న (సుఘర్న) అనే రాజులిక్కడ పాలించారు. ఇంద్ర, మిత్ర, వరుణ నాసత్యదేవతలు వీరికున్నారు. పర్షియనులు ఇంద్రుని దానవునిగా మార్చకముందే వీరు అక్కడనుంచి తప్పుకొని వచ్చినవారు. వీరి ముఖ్యనగరము వర్సన్ని (వసుక). యుద్ధవీరుని మర్య శబ్దంతో పిలిచినారు. ఇది వైదిక పదము. రాష్ట్రపాలకులను విరాట్ లన్నారు. మనము కొరడా అని అర్థము చెప్పే పరితత్ను అనే పదానికి భాషలో పరితితిను అని ఉన్నది. మనరుక్మ శబ్దమునుంచి ఉరుక్మన్న అనేమాటను కల్పించినారు. ఇలాంటి మాటాడిన వారితో కొంతకాలముండిన ఆర్యులు ఆతర్వాత భారత దేశానికి వచ్చారనటం భాషాశాస్త్రమర్యాద తెలియని వారికే తగుతుంది.

ఆసియా మైనరుకు చేరిన హిత్తైతీలు క్రీ. పూ. 1400 నుంచి 1200 వరకు అక్కడ పాలించారు. వీరి కాలంలో ఎందర్ (ఇంద్ర), లుపక (లోపక,లోపశ) సుమిత్రిరస్ (సుమిత్రి), అబిమర్దస్ (అభిమర్ద) అనేవారున్నారు. సువర (స్వర్) పర్వత మొకటి చెప్పబడింది. ఏక (ఏక), తెరవర్తన్న (త్రివర్తన), పంజవర్తన్న (పంచవర్తన), సత్త (సప్త) వర్తన్న, నవవర్తన్ని అనే ద్వంద సమాసాలుకూడా ఇక్కడున్నవి.

వస్త్రశబ్దము వస్త్రియన్‌లో ఉన్నట్లు హస్తకొంబడా, మన ప్రాకృతాలలో వలె వస్త్ర వినరి. అనగా వీరు వస్త్రియాలలో ఎక్కువకాలం నిలవకుండా ఆసియా మైనరు చేరినవారని భావము. వీరిభాషలో ఔజమేధ (అవాజమేధ), విష్ణువన్న (విష్ణువన), శివన్న (శివన) తివనవ్, వనన్న శబ్దాలు కూడా ఉన్నవి. సుద్రానికి వేసే తిండిలో చుక్రము వేసి ఒక పేరున్నది. దీనిని వీరు జుల్హి అన్నారు. గంజాయికి వీరి భాషలో గంజ శబ్దమున్నది.

హిట్టైటులు ఆసియా మైనరు క్రీ. పూ. 1950 లో ఆక్రమించినారు. ఎడ్వర్డ్ మేయరు వీరు తూర్పు దిక్కు నుంచి ఇటకు వచ్చిన వారని సిద్ధాంతించుచు, ఇండో ఇరానియనులు పశ్చిమముగా పోవుచు వీరిలను ఇంకా పడమరకు తరిమి వేసినవారన్నారు. అక్కాడ్ దేశపు నరంసిన్ అను రాజును పురుష ఖత్తితో క్రీ. పూ. 2401 లో యుద్ధం చేసినారు. ఖత్తియనగా క్షత్రియుడు. ఈ క్షత్రియ రాజులు క్రీ. పూ. 1740 నాటికి ఆమొరైటే ప్రభుత్వమును హతమార్చినవి. వీరిన్ని పురు క్షత్రియులు. ఈ ఖత్తి శబ్దమే హత్తి, హిత్తి, హిట్టైటిగా మారినది.

తోఖేరియా భాష ఒకటి ఈమధ్య బయట పడింది. వీరిని తుర్వశరి, తుర్వక్రి, తిక్కర అని పిలుస్తారు. వేదాలలో గల తుర్వశవంశమునుంచి వచ్చిన వారు శాకులు. ఈ శాకశబ్దము తక్షక శబ్దభవము. తక్షశిలా ప్రాంతమునుంచి లేచిపోయి తూర్పు తుర్కిస్తాను ఆక్రమించుకొన్న ఈ శాకులే తర్వాత కాలములో బౌద్ధమతానికి ప్రబలమైన ఆశ్రయమిచ్చారు. ఇటటివారు తమ ప్రాచీనుల నివాస భూమి యైన భారతదేశానికివచ్చి విద్య నభ్యసించారు.

ప్రాచ్య ఆర్యభాషలతో సన్నిహిత సంబంధం కలది లిథువేనియన్ భాష. ఈ భాషనుంచి అనేక పదాలను ఫిన్లండుభాష గ్రహించినది. భారతదేశం నుంచి బయలుదేరిపోయిన మెంటుమొదటి సమూహంలో కొందరు ఆర్యులు లిథువేనియాకు, కొందరు ద్రావిడులు ఫిన్లండు, హంగేరియాలకు వలసపోయినవారని చెప్పబడుచున్నది. ఎక్కడినుంచో గ్రీసుదేశానికి వచ్చి, అక్కడివున్న వల్లని మిథోవన్లను ఎదుర్కొనినవారు గ్రీకులని పరిశోధకులొప్పుకొన్నారు. కావుననే గ్రీకు భాషలో చాల అనార్యశబ్దాలున్నవి. క్రీ. పూ 1200 కు అఖియియన్లను గ్రీకుభాషను మాట్లాడినవారు గ్రీసు దేశాన్ని చేరినారు. వీరిని హిట్టైటులు అఖియవులని, ఇటలీవారు అఖిలి అని అన్నారు. ఈజిప్టు శాసనాలలో క్రీ. పూ. 1229 నాటికి వీరనే అకైవములని పిలిచినారు. వీరు నావికులని, వీరి నాయకుని అత్తర్షియస్ అని హిట్టైటిలన్నారు. కాయన తర్వాత అత్రియస్ వినాడు. ఈ శబ్దంలో అత్రి, ఆత్రేయ శబ్దాలు కన్పిస్తున్నవి. అఖియియన్లే ఒక్కకులని కూడ పిలువ బడిన ఇక్ష్వాకులు. భాగవతం ప్రకారము ఇక్ష్వాకులు ద్రావిడదేశమునుంచి వెళ్లినవారు. కావుననే గ్రీసు దేశమును చేరిన ఇక్ష్వాకులద్వారా ద్రావిడపదాలు గ్రీసు భాషలోకి చేరినవి. గ్రీక్ లోని లిథోస్ శబ్దానికి 'రాతి' అనే పదానికి భేదమేమీ లేదు. ఏకశబ్దానికి ఐకోస్ అని గ్రీకులోవున్నా జర్మన్, ఆంగ్ల భాషలలో ఒక్ అని రావటం ద్రావిడభాష ప్రాబల్యమే అనకతప్పదు. గ్రీకులో కన్పించు దానాయ్ తెగ దానవశబ్దభవము. పెలాస్గి అనే తెగను ఫిలిస్తైనులకు, ఈజిప్టులోని పులసేటికి, అస్సీరియాలోని పులస్తుకు మన పులస్త్యునకు సంబంధమున్నదని స్పష్టము. గ్రీకు గాథలలో కన్పించు అద్రాస్టస్ (ద్రష్ట) డయామీడ్ (ద్వివిధ), అజక్స (అజ) అనువారి పూర్వులు భారతీయులే. ఇల్లీరియాలోఉన్న దర్దనీతెగ మన దరదులే. గ్రీస్ లోని క్రీసేస్ (భృగు), అగమెడెస్ (అజమీఢ), ఒరెస్టెస్ (వశిష్ఠ), కోరస్ (క్రోష్ట్యు), కోలోఫాన్ (దిలీప), పృథేన్ (పృథు) అనువారు మనపూర్వుల సంతతివారే. దిలీప శబ్దానికి చెందిన గ్రామమే డెల్ఫి. యౌవనాశ్వ శబ్దమే ఇవకా యవనశబ్దాలను తెచ్చినది.

ప్రాచీన భారతీయులకు సుమేరియాతో వ్యాపార సంబంధాలుండేవి. సుమేరియనులకు కన్యా కుమారి దేవత ఉండేది. మన దుర్గవలెనే ఈమె వాహనము సింహము; ఈమె భర్త మన శివుని వలె వృషభవాహనుడు. మెసపొటేమియా శాసనా లలో ఈమె రణరంగమునందలి సైనిక సమూహాలకు నాయకురాలని కొనియాడబడినది. ఇది మహిషాసుర మర్దనాన్ని స్పష్టంగా సూచిస్తున్నది. మెసపొటేమియావారు ఈమెను పర్వతదేవతగా స్తుతించారు. ఈమె మన హైమవతి, వింధ్యవాసిని. సుజరాతులో నానా దేవి ఆలయమున్నది. సుమేరియావారికి నానా అనే దేవత ఉన్నది. శిశుసంస్కారాన్ని భారతదేశమునుంచి వీరు గ్రహించారు. అనేక వస్తువులు సింధునదీలోయలోని మొహెంజోదారో సంస్కృతినుంచి ఇక్కడకు తీసి కొనిపోబడినవని గార్డన్ చైల్డ్ కూడా ఒప్పుకొన్నాడు. ఆసియా సింధుశాఖను ఈదుకొని ఎరిదు అనేచోటికి వచ్చిన సుమేరియా గాథలలోని నాయకుడు సగము మనిషి, సగము చేప. ఇది శతపథంలోని మత్స్య గాథను జ్ఞప్తికి తీసికొనిరాగలదు.

ఇంత ప్రబలాధారము కన్పిస్తున్నప్పుడు ఆర్యులు భారతదేశానికి ఎక్కడినుంచో వచ్చినవారని చెప్పటం యుక్తియుతము కాదు. అసలు ఆర్యుల నివాసభూమి భారతదేశమని, ఇక్కడినుంచి ఉత్తరముగాను, పశ్చిమముగాను బయలుదేరిపోయి విదేశాలలో పేరు నివాస ములు ఏర్పరచుకొనివారని స్పష్టముగా చెప్పవచ్చును.

బ్రతికి చెడిన జీవి

శ్రీ వీరమల్ల రామకృష్ణ

శివరామయ్య ఇప్పుడంటే దరిద్రుడయిపోయాడుగాని, ఒకప్పుడు బాగా బ్రతికినవాడే! తనచుట్టూవున్న సమాజంలో ఎంతో గౌరవంగానూ; సుఖంగానూ బ్రతికాడు. తనను ఆశ్రయించినవాళ్ళను ఎంతగానో ఆదరించాడు. పదిమందికి ఇంత పెట్టాడు; పదిమందిచేత ఇంత మంచివాడనిపించుకొన్నాడు. అట్లాంటి రోజుల్లోనే తనకూతురు సుగుణకూడా ఎంతో వైభవంగా పెళ్ళిచేశాడు. ఆ పిల్ల తరువాత చాలాకాలానికి పుట్టిన మగపిల్లవాడికి, అప్పటికి నాలుగేళ్లు.

అయితే, ఇదంతా ఆనాటిమాటే! ఇప్పుడా శివరామయ్యకు ఆ ఆస్తిపాస్తులేమీ లేవు. ఉన్నదంతా వ్యాపారంలో ఊడ్చుకుపోగా, ఆయనకు మిగిలిందల్లా ఆరోజుల్లో సంపాదించిన పేరూ; ప్రతిష్ఠానూ. అంతమాత్రంచేత తిండీ కుడా వొస్తాయా అంటారు? అది కొంతవరకే నిజం. ఎందుకంటే ఆయన బాగాబ్రతికిన రోజుల్లో ఆయనసహాయం పొందినవాళ్లు చాలా మంది ఎటుగూడీ వున్నారు. అందులో అందరూ విశ్వాసఘాతకులే ఉంటారా మరి? పుంజెరీకాక్షయ్య, వల్లభయ్యలాంటి ఒకరిద్దరు మంచివాళ్లు ఉంటారుగనుకనే, శివరామయ్య ఎంత దరిద్రుడయినా, అట్టే యిబ్బంది లేకుండా బ్రతకగలుగుతున్నాడు. అదైనా వాళ్లుచేసే సహాయమేగానీ, తనకుతానై ఆశ్రయించిందేమీ లేదు. చిత్రమేమిటంటే, చెడిబ్రతికినవాడైతే ఎక్కడయినా ఎందుకైనా చెయ్యి చాపగలడుగానీ; బ్రతికి చెడ్డవాడు ఆపని చెయ్యలేడు. శివరామయ్య అసలే చెయ్యలేడు. అంతేగాకుండా ఇతరులు తనను ఆస్థితిలో ఊహిస్తున్నారన్నా భరించలేని ఆత్మాభిమాని. కాబట్టే కన్నకూతురూ, గౌరవనీయుడైన అల్లుడూ, ఆయనను ఏనాడో ప్రాధేయపడ్డారు; మాదగ్గరకు వచ్చి వుండి పొమ్మని. పోనీ, కనీసం అమ్మనీ, తమ్ముణ్ణీ అయినా తీసుకువెళతానని అనేకసార్లు అడిగింది సుగుణ.

ఆ సందర్భంలో మరొకళ్ళయితే నిరభ్యంతరంగా వెళ్లిపోయేవాళ్ళు. కాని, కాస్త దూరదృష్టీ, ఆలోచనా కలవాళ్ళు ఆ పని చెయ్యగలరా? శివరామయ్యలాంటివాళ్లకు అసలు సాధ్యం కాదు. అదీగాక, ఇక్కడనుంచి కదలపోయేటంత దరిద్రం ఏమున్నది గనుక? పాతికమంది పిల్లలా? అప్పుల బాధలా? రోగాలా? ఏమున్నయ్? ఉన్న ఒక్కగా నొక్క వలుసు, తనూ, తన భార్యానూ. ఈ భాగ్యానికి ఇంత అవసరపు ప్రయాసదేనికి? అని ఆయన అభిప్రాయం.

పిల్లవాడి చదువుసంధ్యలకా ఇప్పట్లో అట్టే ఇబ్బందిలేదు. తనకూ, పంతులు సత్యనారాయణకూ వున్న మంచితనంవల్ల ఒక్కదమ్మిడీ తీసుకోడు. ఆతరువాత అయినా హైస్కూల్లో చేర్పించవప్పటిమాటకదా! ఆ సంగతి అప్పుడాలోచించుకోవచ్చు. చెడిబ్రతికినవాడికైతే రేపటిసంగతేమిటని ఇవాళే ఆలోచనగాని, బ్రతికిచెడినవాడికి, ముఖ్యంగా శివరామయ్యకు, ఎప్పటి విషయాన్ని అప్పుడే ఆలోచించడం అలవాటు. అందుకే అవాళే సుగుణకు మంచితనంగా నచ్చచెప్పి తప్పుకున్నారు. అంతకుమించి ఆయనకు మరోదారి వచ్చదు. ఎందుకంటే దరిద్రులయినంతమాత్రంచేత తనకున్న దారిద్ర్యాన్ని పదిమందికీ బహిర్గతం చేసుకోవాలని ఎక్కడా లేదంటాడు. జీవితావసరాలను వీలయినంతవరకు సంక్షిప్తపరచుకుంటే. ఆ సమస్యను తేలిగ్గా పరిష్కరించుకోవచ్చునంటాడు.

అయితే, ఇది ఎంతమందికి సాధ్యమవుతుందనేది వేరే విషయం. కానీ, శివరామయ్య వీలైనంత మేరా, ఆ పద్ధతినే ఆచరణలో పెట్టుకొంటున్నాడు. అయినా కొన్ని కొన్ని సమయాల్లో, ముఖ్యంగా—పండుగ పర్వదినాల్లో; ఎంత ప్రయత్నించినా మనస్సులో ఏదో వెలితిగా వుండకపోవడం లేదు. ఇదివరకు బాగా బ్రతికిన రోజుల్లో అయితే, పండగ రావడం ఆలస్యం,

ఎంతో సంతోషంగా గడుపుకునేవాళ్లు. అంతేనా కా ఎందుకు; సుగుణ పుట్టినరోజు పండుగలు ఎంతో వైభవంగా జరిపేవాడు. అంతే!

అవన్నీ ప్రస్తుతం ఏవో జ్ఞాపకాలుగానే వుండి పోయినయ్. తను దరిద్రుడైనంత మాత్రంచేత కాలం దరిద్రగొట్టుదవుతుందా? అయినా కాకపోయినా తనదారిన తాను పోతూనే ఉంటుంది. కనుకనే వొచ్చే పండుగకు సుగుణను తీసుకురావడమనేది చాలా పెద్ద సమస్యగా తయారయింది. ఏం చెయ్యడానికీ తోచదు. కూతురును తీసుకొస్తే అల్లుణ్ణీ తీసుకురావాలి. పిల్లిద్దరనూ తీసుకొస్తే, ప్రస్తుత స్థితిలో తను భరించలేడు. వాళ్లిద్దరినీ కళ్లలో చూసికూడా చాలా కాలమైంది. భగవంతుడు సరిగ్గా చూడలేదు గానీ, లేకపోతే, ఈపాటికి సుగుణ ఇద్దరిపిల్లల తల్లి కావలిసింది.

ఇలాంటి భావనలు మనసులో మెదిలినప్పుడల్లా ఎంతో కొంత బాధపడక తప్పదు! కన్నకడుపు తీపి ఎంత చెప్పుకున్నా తరగదుగదా మరి! అట్లాగని, తన మనసులోని బాధను నివృత్తి చేసుకోడానికి ఓ కార్డు ముక్క రాసిపడేస్తే, వాళ్లిద్దరూ వొచ్చేస్తారు. అయితే, సుఖంగా బ్రతుకుతున్న వాళ్ళను తాత్కాలికంగానైనా సరే ఈ దరిద్రంలో కాలు నిలపనివ్వడం తనకు మరింత బాధ. అందుకని ఎంత బాధైనా దిగమ్రింగుకోడానికే ప్రయత్నం చేసి, పోయిన రెండుమూడు పండుగలకు మెదలకుండా వూరుకొన్నాడు. ఆ ఒకటి రెండు రోజులూ, వాళ్ళిద్దరూ, కళ్లల్లో కనుపిస్తూనే వున్నారు. అయితే, ఈ పండుగకూడా అంతేనా అని మళ్ళీ దిగులు ప్రారంభమైంది.

ఏ ఆలోచనా తోచక, ఆ రాత్రి భార్య సుభద్రమ్మను పిలిచి ఈ సంగతే అడిగాడు. అంతా విని, "ఏం చేద్దామంటారు?" అనడిగింది సహజంగా. ఆమె మాత్రం అంతకంటే ఏమని చెబుతుంది? డబ్బు అనేది వుంటే దాన్ని ఖర్చుపెట్టే మార్గాలూ ఆలోచనలూ అనంతంగా వుంటయ్. ఏమీ లేనప్పుడు తెలివిగలవాళ్ల ఆలోచనలుకూడా మందకొడిగానే వుంటయ్ ఇట్లాంటి వాటిల్లో.

ఆ రాత్రి శివరామయ్య చాలాసేపు ఆలోచించాడు. ఆడపిల్ల అన్న తరువాత పుట్టింటికి అంతో యింతో ఆశతోనే బయలుదేరుతుంది. పాపం ఇది సుగుణ విషయంలో వర్తించకపోయినా, ఆడపిల్లను పుట్టింటి నుంచి వట్టి చేతుల్తో తిప్పి పంపడం తను సహించలేడు. తన జీవితకాలంలోనే ఒకనాడు ఎంతో వైభవంలో తన కూతురును అత్తవారింటికి పంపాడు. తిరిగి ఈనాడు అదే ఆడపిల్లను వట్టిచేతుల్తో పంపడం బ్రతికి వున్నవాని అంతరాత్మకు ఎంతమాత్రమూ నచ్చదు. ఏది ఏమయినా ఈ స్థితిలో వాళ్ళను తీసుకురావడం మంచిదికాదనిపించింది. చాలా ప్రయత్నంమీద తనను తాను సమాధానపరచుకొన్నాడు.

అట్లా సమాధానపరచుకొన్న అయిదవరోజున సుగుణ దగ్గర్నుంచి ఓ వుత్తరం వచ్చింది. ఆ వుత్తరాన్ని తాపీగా చదువుకున్నాడు. అందులో సుగుణ రాసిందేమిటంటే, 'వొచ్చే పండుగకు మేమిద్దరం బయలుదేరి వొస్తున్నా'మని రాసింది! రెండు మూడు నిమిషాల వరకూ ఆయనకు ఏ ఆలోచనా లేదు. ఆ వుత్తరానికి సంతోషించాలో, విచారించాలో కూడా అర్థం కాలేదు.

సరిగ్గా అదే సమయానికి బడినుంచి పరుగెత్తుకుంటూ వస్తున్న శంకరం ఒక్కక్షణం ఆగి తండ్రి చేతుల్లోని వుత్తరాన్నీ, ఆయన ముఖాన్నీ ఒక్కసారి పరిశీలనగా చూశాడు. నాన్న అట్లా ఎందుకున్నాడో అర్థంకాలేదు. అయినా అడగడానికి అట్టే సాహసించలేకపోయాడు. అదీగాక, శివరామయ్య ఆత్మాభిమాని ఆయన కొడుకు మాత్రం అంతకంటే తక్కువ తిన్నవాడా ఏమిటి?

ఇదంతా గమనిస్తున్న శివరామయ్య ఆసక్తితో చూస్తున్న శంకరాన్నుద్దేశించి, "అక్క ఉత్తరం రాసింది" అన్నాడు సంక్షిప్తంగా.

ఆ ఒక్కముక్కతో వాడి చిన్న పెదవుల మీద చిరునవ్వు వికసించింది. వాడి దృష్టిలో పిప్పరమెంటు బిళ్ళలకంటే అక్క వుత్తరం చాలా కమ్మగావుంటుంది. చాలాకాలం తరువాత అక్కను గురించి మళ్లీ వినడం జరిగింది. వాడి పసిహృదయంలో, ఏనాడో నిక్షిప్తమయివున్న అక్క తాలూకు మధురస్మృతులు మళ్ళీ మెదిలినయ్. అంతేగాకుండా తల్లి తరువాత అలాంటి గౌరవనీయమైన స్థానం ఆ ఒక్క అక్కకే ఇచ్చాడు. అందుకే తన సంతోషాన్ని ప్రకటించుకొనేందుకూ, తను ఏదిచెప్పినా వినే తల్లిదగ్గరకు మళ్ళీ పరుగెత్తాడు.

"అమ్మా, అక్క ఉత్తరం ఎప్పుడు రాసింది?. ఎప్పుడొస్తుంది? అందులో నా పేరుందా?" అనడుగుతున్నాడు.

వంటపనిలో వున్న తల్లికి ఇదేమీ అర్థం కాలేదు.

"అక్క ఉత్తరం రాయడమేమిటి, రావడమేమిటి?" అని అంటూ చెయ్యి కడుక్కొని అసలు సంగతేమిటో కనుక్కుందామని బయలుదేరింది.

ఈలోగా శివరామయ్య వంటగది దగ్గరకొచ్చి, పిల్ల ప్రశ్నలన్నీ వింటూనే వున్నాడు. భార్య ముఖం చూసి ఒక్క క్షణం ఆగి, "ఆఁ! సుగుణ ఉత్తరం రాసింది. వాళ్లిద్దరూ నాలుగైదు రోజుల్లో వొస్తారుట" అన్నాడు.

అది విని ఆయనవేపు ఒక్కసారి మళ్ళీ చూసి తల క్రిందికి దింపుకొన్నది. శివరామయ్య ముఖంకూడా నిండుకుండలాగా ఏ భావాన్నీ చిందనివ్వడం లేదు. వీళ్ళిద్దరినీ చూస్తున్న శంకరానికి ఇదేమీ అర్థం కాలేదు. అక్క వొస్తుందనే సంగతి, తనలాగ వీళ్ళకెందుకు సంతోషం కలిగించడం లేదో అతనికి తెలియదు.

అట్లా నిల్చున్న శంకరాన్నుద్దేశించి, "చూడు చిన్నా, అక్క నిన్ను బాగా చదువుకోమంది. నాలుగైదు రోజుల్లో వొస్తుందిట. ఆఁ!...సరేనా! పో ఆడుకో..." అని వీపుమీద తట్టి బయటికి పంపించాడు శివరామయ్య. మరికొంతసేపాగి, "నాకు తెలియకనడుగుతాను...సుగుణకు రాను రాను తెలివి తగ్గిపోతోందనుకుంటాను." అన్నాడు భార్యనుద్దేశించి నెమ్మదిగా.

ఆమె కీమాట చాలా కొత్తగా వినిపించింది. చిన్నప్పట్నుంచీ ఎంతో గారాబంగా చూసుకునే సుగుణను గురించి, ఆయన నోటిమీదుగా ఇట్లాంటి మాట వినడం ఇదే మొదటిసారి. రవ్వంత ఆశ్చర్యపడుతూ—"అదేమిటండీ, అట్లా అంటారూ?" అన్నది.

"మరి కాకపోతే ఏమిటి చెప్పూ—ఇట్లాంటి ఉత్తరం సుగుణ రాస్తుందని ఎప్పుడైనా అనుకొన్నావా? కనీసం రాసేప్పుడయినా ప్రస్తుతం మనస్థితి ఏమిటో జ్ఞాపకం రాలేదా అని," అన్నాడు కొంచెం చిరాగ్గా.

"సరే. మీరు చెప్పేది మరీ బావుంది. ఇప్పుడంటే మనం దరిద్రులమైపోయామని, ఆత్మాభిమానంకొద్దీ బిడ్డలమీది మమకారాన్ని కూడా చంపుకొంటున్నాం గానీ, మనంత తేలిగ్గా వాళ్ళు నిగ్రహించుకోగలరా? పండగలకీ పబ్బాలకీ మనం తీసుకురావడం మానేశాం సరేసరి. తనకుతానై లక్ష్మీదేవిలా ఇంటికొస్తానన్నా మనం కాదనడం దేనికి? దాన్ని చూసికూడా ఎన్నాళ్ళో అయిపోయింది. చిట్టితల్లి కళ్ళల్లో కనుపిస్తుంది" అన్నది దీనంగా.

ఆ చివరిమాట అనేప్పుడు ఆమె కళ్ళల్లో నిజంగానే నీరు తిరిగింది. చప్పున ఆమె తలవొంచుకొన్నా, ఈ సంగతి ఆయన గమనించకపోలేదు. రెండు నిమిషాలాగి ఆమెను సమాధానపరచే ధోరణిలో: "నువ్వనేది నిజమేననుకో. వాళ్లను చూడాలనే కోరిక నీకంటే నాకు ఇంకా ఎక్కువగానే వుంది. కానీ ఏంచేస్తాం చెప్పు. చూస్తూ చూస్తూ, ఈ దరిద్రంలోకి వాళ్ళను ఆహ్వానించడం దేనికి! తీసుకొచ్చి మనం ఉద్ధరించే దేముంది? నీమటుకు నీవు ఎన్నడన్నా అట్లాంటి చీర కట్టుకున్నావా?" అడిగాడు. ఆమె నోరెత్తలేదు.

"పిచ్చిదానా, బిడ్డలమీది మమకారం నీ ఒక్కదానికే కాదు. దరిద్రుల మయినంతమాత్రంచేత మనకున్న దరిద్రాన్ని పదిమందికీ తెలియపరుచుకోవలసిన అవసరమూ లేదు. నేననేదేమిటంటే, మనకంటే వాళ్ళు సుఖంగా బ్రతుకుతున్నారుగదా! వాళ్ళను అలా బ్రతకనిద్దాం. ఈ దరిద్రంలో వాళ్ళను మనం ఏంసంతోషపెట్టగలం? మన దరిద్రాన్ని వాళ్ళముందు మరోసారి పెట్టుకోడం దేనికి? తీరా వాళ్ళను తీసుకొచ్చి, ఏరకంగానూ సంతోషపెట్టలేక, సిగ్గుతో తలవొంచుకుని, బాధతో విలవిలలాడిపోతూ కళ్ళనీళ్ళు పెట్టుకోవడం దేనికి? ఈ అవస్థంతా ఎందుకు చెప్పు?" అడిగాడు.

"అందుకని, కన్నబిడ్డను పుట్టింటికి రావద్దంటారా?" అన్నది చాలా ప్రయత్నంమీద, లోలోపల కుమిలిపోతూ. ఆయన ఆమాటకు వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. ఒక్క క్షణం ఆగి, "చూడూ, నువ్వుకూడా అట్లా నిష్కర్షగా మాట్లాడితే ఏంచెప్పను? ఇంతకాలం కాపురంచేసిన నీకే నా అంతరాత్మఘోష అర్థంకాకపోతే, ఆ భగవంతుడికికూడా అర్థమవుతుందనుకోను. నువ్వనవసరంగా బాధపడకు. ఏదో బ్రతికినంతకాలం సుఖంగా బ్రతికాం, అయిపోయింది. ఆనాడు సుఖపడినప్పుడు గర్వపడిందిలేదు—ఇవాళ

చింతపడడమూ అనవసరం. లోకంలో మనమేనా; ఇంకెంతమంది లేరు! నువ్వు బాధపడి, నన్ను బాధించకు. సుఖాలు అనుభవించడానికి అందరూ ఇష్టపడతారు, పోటీపడతారు. కాని కష్టాల్లోనే పరస్పరాభిమానాలూ—వ్యక్తిత్వాలూ బయటపడేది. రేపు సుగుణకు ఉత్తరం రాసిపడేస్తాను. అంతగా నీకు చూడాలనివుంటే, ఈ పండగకొస్తా వెళ్ళిపోయాక, ఏకోదినంగా నువ్వే వెళ్ళిరా" అన్నాడు.

ఆమె సమాధానం చెప్పలేదు. ఆయన ఇష్టాయిష్టాలకు వ్యతిరేకంగా చెప్పడం, ఆనాడు బాగా బ్రతికిన రోజుల్లోనే అలవాటు లేదు. ఇవాళ కొత్తగా ఆమె మారిందీ లేదు.

పూర్తిగా నిండిన కళ్ళనీళ్ళు పైటచెంగుతో వొత్తుకుంటున్న ఆమె నుద్దేశించి "చూడూ, అన్నీ తెలిసిన నువ్వుకూడా అట్లాంటిపని చేస్తే ఎట్లా? పండగరోజుల్లో నీలాంటి మనిషి పట్టింట్లో కూర్చుని కళ్ళనీళ్ళు పెట్టుకోవడం ఏమంత మంచిపనికాదు," అని అనగలిగాడే గాని ఆయన కళ్ళల్లో నీళ్ళు నిండకుండా నిగ్రహించుకోలేకపోయాడు.

* * * *

ఆ మరుసటిరోజున సుగుణకు ఉత్తరం రాశాడు.

"చిరంజీవి సౌభాగ్యవతి సుగుణకు—

మీ నాన్న దీవించి వ్రాయునది. నీవు వ్రాసిన ఉత్తరం అందినది. ఒకప్పుడయితే అట్లాంటి ఉత్తరం చూసి సంతోషించి ఉండేవాణ్ణి. కాని ఆ రోజులు గతించిపోయినవి. నా జీవితంలో చివరిపాదం యింతదారిద్ర్యంతో నిండివుంటుందని నేనెన్నడూ అనుకోలేదు. నువ్వు పుట్టినప్పట్నుంచీ కాకపోయినా కనీసం ఊహ తెలిసినప్పట్నుంచీ మనమెంత గారాబంగానూ, సుఖంగానూ బ్రతికామో నీకు తెలుసు. చక్కగా చదువుకొన్నావు. భగవంతుడిచ్చిన అందచందాలతోపాటు, గుణవంతుడైన భర్త లభించాడు. నీ జీవితంలో చెప్పుకోదగిన ఒడుదుడుకులనేవి లేకుండా సుఖంగా బ్రతుకుతున్నదానవు. కాని నీ తల్లిదండ్రుల స్థితి నీకు భిన్నంగా వున్నదనే సంగతి నీకు బాగా తెలుసు. అట్లా తెలిసివుండి కూడా, నీవు వ్రాసిన ఉత్తరం చూస్తే నాకు నిజంగానే బాధ కలిగింది. అదీగాక, నా అదృష్టాన్ని ఎంతమంది పంచుకొన్నా నేను చింతపడలేదు. కాని నా దురదృష్టాన్ని ఇతరులు కాదుగదా కనీసం కన్న కూతురైనా పంచుకోవడాన్ని నేనెంతమాత్రం భరించలేను. నేనెంత ఆత్మాభిమానినో నీకు తెలుసు. ఇతరులచేత వేలెత్తి చూపించుకోవడమనేది, నాకే కాదు, నా పూర్వులకూ కూడా లేదు. అటువంటివాణ్ణి, ప్రస్తుతం ఎట్లా కాలంగడుపుతున్నానో నీకు తెలుసు. ఈ ఉత్తరం నా మనసులోని బాధను కొంతవరకు వ్యక్తం చేస్తుందనుకొంటాను. అయినప్పటికీ, నీకు రావాలని వుంటే, నేనేమీ చెప్పలేను.

మీ అమ్మ-తమ్ముడూ బాగానే వున్నారు.

మీ నాన్న"

ఆ దీనంగా రాసిన ఉత్తరాన్ని మళ్ళీ ఓసారి పూర్తిగ చదువుకొన్నాడు. తన మనసులోని అస్థిరత్వానికి ప్రబలమైన తార్కాణంగా కనుపించింది. సుగుణ రాసిన ఉత్తరంతో పోల్చి చూసుకుంటే, తను ఎంతకఠినంగా సమాధానమిస్తున్నదీ అర్థమయింది. దరిద్రం మనుష్యుల్ని తినేస్తే మిగిలిన అస్థిపంజరంలా అసహ్యంగా కనుపించింది. ఈ ఉత్తరం ఆ సుగుణ చేతుల్లో పడితే ఎంత ఘోరంగా, బాధతో విలవిలలాడిపోతుందో వూహించుకుంటే వొళ్ళు జలదరించింది. తల్లిదండ్రులమీది మమకారంతో దగ్గరకొస్తున్న బిడ్డను, కాళ్ళతో తన్నడంకంటే ఘోరమైన పాపం మరొకటి కనుపించలేదు. కసాయివాడి కత్తికీ, తన ఉత్తరానికీ అట్టే భేదమున్నట్టు లేదు. వెంటనే ఆ ఉత్తరాన్ని నిలువునా, అడ్డంగా చీల్చి ముక్కలు ముక్కలుగా చేశాడు. గుర్తుపట్టడానికి వీల్లేకుండా నలిపి అవతల పారేశాడు. వెంటనే లోపలికిపోయి, విచారంతో తల వొంచుకొని బియ్యంలో రాళ్ళు ఏరుకొంటున్న భార్యనుద్దేశించి, "నీకో మంచిసంగతి చెప్పనా?" అన్నాడు.

"ఏమిటే?" అన్నది ఆత్రంగా.

"సుగుణకు నేను ఏ ఉత్తరమూ రాయడంలేదు.. రాసిన ఉత్తరం చింపేశాను. వాళ్ళిద్దరు తప్పకుండా వొస్తారు." అన్నాడు.

ఆమె చాలారోజులతరువాత మళ్ళీ యివాళ హృదయపూర్వకంగా సంతోషించింది. ఆక్షణాన తనభర్త శివరామయ్య, శివరామయ్యలా గాకుండా సాక్షాత్తు శ్రీమన్నారాయణమూర్తిలా కనుపించాడు ఆమెకు!

* * *

రాసిన ఉత్తరం ప్రకారం తెల్లవారితే పండుగనగా సుగుణ తనభర్త జయరావుతో సహా వొచ్చింది. జట్కా బండిలో సామానంతా బండివాడు లోపల పెట్టాడు. వాడికి జయరావు ముందే డబ్బిచ్చి పంపేశాడు. లాంఛనంగా మామూలుమర్యాదలన్నీ జరిగినయ్. ఇంతకాలానికి కన్నకూతురును చూడటంవల్ల, తల్లిదండ్రులిద్దరూ సంతోషంతో కళ్ళు నీళ్ళతో నింపుకొన్నారు. ప్రొద్దుట్నుంచి ఎదురుచూస్తున్న శంకరం అక్క కొంచ విసివశంలేదు. ముందు వాణ్ణి మనసారా కౌగిలించుకొని ఒక్క ముద్దు పెట్టుకొంటేనే గాని ఆమెకు సంతృప్తి కలగలేదు.

"ఏంరా చిన్నా, ఇవాళ తల దువ్వుకోలేదేం?" అని పలుకరించిందికూడాను!

సంతోషంతో వాడు సమాధానం చెప్పలేక పోయాడు.

"ప్రొద్దుట్నుంచి ఒక్కటే ఎదురుచూడటం! చద్దిఅన్నంకూడా తినలేదింకా" అన్నది తల్లి వాడి తరఫున.

సుగుణ తండ్రిదగ్గరగా తల వొంచుకు నిల్చుంది. ఆయన సంతోషం చెప్పనలవిగాకుండా వుంది. భరించలేక బొంగురుపోయిన గొంతుతో "బావున్నారా, అమ్మా..." అన్నాడు, అతిప్రయత్నంమీద తల నిమురుతూ.

"ఇంత చిక్కిపోయావేం తల్లీ?" అని వొళ్ళంతా తడుముతూ అడిగింది తల్లి.

రెండునిమిషాల తరువాత కొడుకునూ, కూతురునూ తీసుకొని లోపలికి వెళ్ళిపోయింది సుభద్రమ్మ.

శివరామయ్య అల్లుడుదగ్గర కూర్చుని; మంచి చెడ్డలు మాట్లాడుతున్నాడు. సందర్భవశాత్తూ:

"మీ పైఆఫీసరు మంచివాడేనా?" అనడిగాడు.

"ఓ, ఆయనకేం. యమధర్మరాజు. చాలా మంచి వాడే పాపం!" అన్నాడు భలోక్తిగా జయరావు.

శివరామయ్యకూడా సన్నగా నవ్వాడు. అదీ జయరావుకోసరం. మనస్సంతా ఇంట్లో వంటింటి చుట్టూ తిరుగుతూ వుంది. ఈ నాలుగురోజులూ గౌరవంగా బ్రతికి బయటపడటం ఎట్లాగా అనేది ఆయనకు గుండెల్లో పెద్ద బెంగగానే వుంది. రెండుపూటలా ఓవల్టీన్నుగురించీ, టిఫిన్నుగురించీ సందేహాలున్నయ్. ఉన్నబట్టల్లో ఇస్త్రీచేసిన దుప్పటి ఒక్కటికూడా లేదు. తలగడ్డలుకూడా అంతంతమాత్రంగానే వున్నయ్. సబ్బులూ, పాలూ, పెరుగూ, నెయ్యి, యిత్యాదయః వాటినిగురించి మరీ సందేహంగా వుంది. తనింట్లో ఒక్క అల్లుడేగాని; వల్లభయ్యగారింట్లో ముగ్గురు అల్లుళ్ళు వున్నారు. అందులోనూ; మరీ పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళు. విడిరోజుల్లో అయితే ఏదో ఒకరకంగా సర్దుకోవచ్చు. ఈ పండగరోజుల్లో అందరికీ అన్నీ అవసరమే. ఇట్లా అన్నిసమస్యలూ చుట్టూ ముసురుకొనివుంటే; ఏచింతా లేకుండా; వంటింట్లో కూర్చున్నది భార్య. ఏంచేస్తున్నదో తెలియదు.

ఇట్లా ఆలోచిస్తూ పరధ్యానంగావున్న మామ గారినిచూసి, "మీరు మరీ సన్నబడిపోతున్నారు. వొంట్లో బావుండడంలేదా ఏమిటి?" అనడిగాడు జయరావు.

"ఆఁ ఏంలేదు. బాగానే వుంటున్నది" అన్నాడు అప్రయత్నంగా.

"మరి ఏమిటి ఎప్పుడూ ఆలోచిస్తున్నట్టు కనిపిస్తారు?"

"ఏముంది ఆలోచించడానికి. ఏంలేదు" అని ఏదో ఒకరకంగా తప్పుకోడానికి ప్రయత్నించాడు.

కొంతసేపాగి, శంకరాన్ని పిలిచి, "పెందలాడే బావకు వేన్నీళ్ళు అదీ పెట్టమను. రైల్లో నిద్రా పాడూ సరిగ్గా వుండివుండదు. మధ్యాహ్నం అట్లా ఒక్క అరగంట నిద్రపోతే కొంత బడలిక తగ్గుతుంది. అన్నట్టు, అమ్మ వాళ్ళు లోపల ఏంచేస్తున్నారూ?" అనడిగాడు. కాని శంకరం సమాధానంచెప్పకుండా లోపలకు పారి పోయాడు.

మామూలుకంటే అరగంట ఆలస్యంగా భోజనాలకు పిలుపువచ్చింది. స్నానాలుచేసి భోజనందగ్గర కూర్చునేసరికి, శివరామయ్యకు ఆశ్చర్యం కలిగింది. తను ఇంతవరకూ ఊహించనివిధంగా భోజనం వడ్డన జరిగింది. ఈ పిండివంటలూ, భోజనం, ఇదంతా ఎట్లా సమకూరిందో ఆయనకు అర్థంకాలేదు. ప్రతిదానికీ డబ్బుతో ఖరీదుకట్టబడితే; ఇంత డబ్బు రహస్యంగా తాను ఏమూలా దాచిపెట్టలేదు. దీనికి మూలం ఏమిటో ఎంత ఆలోచించినా అర్థంకాలేదు. భార్యను పిలిచి

అడగడానికా సమయంకాదు. ఏ ఆలోచనాలేని జయరావు నిరభ్యంతరంగా భోజనంచేస్తున్నాడు. తను మాత్రం ఎందుకు వివశపడాలి? అందుకని శివరామయ్య మాట్లాడకుండా భోజనంచేశాడు. ఇంత సంతృప్తిగా తినికూడా చాలాకాలమయింది. కాని, ఆయనకా సంతోషం లేదు. ఏదో పెద్దదిగులు, మనస్సంతా కమ్ముకొన్నది. ఎవరిపనిగోలు. భార్యకు ఇంట్లో పని తీరటం లేదు. అసలే భోజనాలు ఆలస్యం అయినయ్. మళ్ళీ జాగ్రత్తపడకపోతే, మధ్యాహ్నం కాఫీలుకూడా అంతే అవుతయ్. అందుకని శంకరంతోపాటు తల్లీ కూతుళ్ళిద్దరూకూడా ఒకేసారి భోజనానికి కూర్చున్నారు. తండ్రికీ, భర్తకూ మధ్యాహ్నం నిద్ర పోయేందుకు అంతకుముందే పడకలు సిద్ధంచేసింది సుగుణ. ప్రయాణపు బడలికతో జయరావు బాగానే నిద్రపోయాడు. ఏ నిద్రా లేకుండా అటూ యిటూ దొర్లిందల్లా శివరామయ్యే.

ఎంత ప్రయత్నించినా భార్యతో ఏకాంతంగా మాట్లాడే వీల్లేకపోయింది. దీనికితోడు సుగుణను చూడ్డానికొచ్చిన ఆమె పాత స్నేహితురాండ్రతో ఇల్లంతా మాపటిదాక రైలుపెట్టెలా తయారయింది. తన ఇల్లు ఇంత సందడిగా కలకలలాడి ఎంతోకాలమయింది. నిజంగా ఇది హర్షింపదగిన సంగతే! కాని ఆయన మనసు ప్రతిదీ శంకిస్తూనేవుంది. కనిపించిన ప్రతి కొత్తదనాన్ని గురించీ ఇది ఎక్కడిది? ఎట్లా వొచ్చిందనే ప్రశ్నలు తలలో పేరుకొంటున్నయ్. వాటికి సమాధానాలు చెప్పేవాళ్లుమాత్రం ఆయనకు దొరకడంలేదు.

అట్లా సందడితోనే మధ్యాహ్నంవరకూ గడిచిపోయింది. భోజనాలవీ అయ్యాక, దక్షిణపుగదిలో మంచంమీద పడుకొని శివరామయ్య మళ్ళీ ఆలోచనలు మొదలుపెట్టాడు. పదినిమిషాలతరువాత గదిలోకి ఎవరో అడుగుపెట్టిన చప్పుడయింది. అనుభవంవున్న మనిషిగనుక గమనించి "ఎవరదీ-సుగుణా!" అన్నాడు.

"నేనే నాన్నా..." అని తలవైపు వొచ్చి నిల్చుంది.

తల వెనక్కుత్రిప్పి సుగుణ ముఖాన్ని ఒక్కసారి చూసి, "ఇట్లా రామ్మా, ఇక్కడ కూర్చో." అని మంచంమీద ఒకప్రక్కగా జరిగాడు.

తండ్రి పాదందగ్గర చిన్నప్పటి భయంతోపాటు వినయంగా కూర్చుంది.

"ఏమ్మా ఇట్లావొచ్చావు? అమ్మ ఏంచేస్తోంది?" అనడిగాడు.

"అమ్మ యింట్లో పనేదో చూస్తోంది..." అని ఒక్కక్షణం ఆగి "నాన్నా" అని ఆగిపోయింది.

సుగుణ ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నదని ఆయన గమనించి, "చెప్పమ్మా, ఏంకావాలి?" అనడిగాడు ఆప్యాయంగా. "ఏం లేదు నాన్నా. ఇంటిల్లిపాదీ అందరూ కొత్తబట్టలు కట్టుకొన్నారు. నువ్వుకూడా ఆ బట్టలు కట్టుకో నాన్నా. పండగపూట మీరొక్కరూ అట్లావుండిపోవటం..." అని ఆపైన చెప్ప లేకపోయింది.

శివరామయ్య మనస్సు ఒక్కక్షణం సముద్రంలా అల్లకల్లోలమైపోయింది. తను మొదట్నుంచీ ఏదైతే ఊహిస్తున్నాడో అదే నిజమై ప్రాకుతున్నది. తన గారాబుబిడ్డ, సుగుణ. ఆమెను ఏమంటాడు? అనలేడు. అపని చెయ్యలేడు. ఆ రెండింటిమధ్యా ఇరుక్కుపోయి, మళ్ళీ ఆలోచనలోపడ్డాడు. సుగుణ చేతుల్లోని కొత్తబట్టలు ఇంకా అల్లాగేవున్నయ్.

"నీకేంకావాలమ్మా అనడిగావుకదా నాన్నా. నాకింతకంటే ఏమీ అక్కర్లేదు. ఇంకేమీ అడగను నాన్నా." అన్నది గద్గదస్వరంతో. సుగుణ కళ్ళలో నీళ్ళునిండటం తండ్రి స్పష్టంగా చూశాడు. లోలోపల ఆయనహృదయం కుమిలిపోతున్నది. కనురెప్పలు రెండూ ఒక్కదగ్గర చేరినప్పుడు అశ్రుబిందువులు చెంపలప్రక్కగా జారిపోయినయ్. "సుగుణా! భగవంతుడు నాకు మొదటిసారిగా ఆడపిల్లనే ఎందుకిచ్చాడో నాకిప్పుడర్థమయింది. నా జీవితంలో ఇట్లాంటిరోజు ఒకటున్నదనే సంగతి నేనెన్నడూ ఊహించలేదు. ఆ బట్టలు నేకట్టుకున్నందువల్ల నీకు సంతోషం కలిగితే, తప్పకుండా కట్టుకుంటానమ్మా! పండగపూట కంటతడిపెట్టకు సుగుణా! నేనెంత దరిద్రాన్నయినా భరిస్తానుగాని; కన్నీళ్ళనుమాత్రం భరించలేను" అని తడిపొడిగావున్న ఆమెతల నిమురుతూ కళ్ళు తుడిచాడు.

ఇదేసమయమని, "మరొక్కమాట నాన్నా." అన్నది సుగుణ.

"ఏమిటమ్మా?" అన్నాడు తండ్రి వాత్సల్యంతో.

"ఈసారి నాతోపాటు నిమ్మల్నికూడా తీసుకెడతాను నాన్నా."

ఒక్కక్షణం ఆగి, "నీయిష్టం. నేకాదంటానా తల్లీ." అన్నాడు శివరామయ్య.

సుగుణ పెదవులమీద చిరునవ్వు చిందింది. "చాలు నాన్నా. ఇక నేవెడతాను. మళ్ళీ మీకు కాఫీలవేళవుతుంది. అమ్మ ఒక్కర్తే అవస్థపడుతున్నది." అని తండ్రి ముఖం మరొక్కసారి సంతృప్తిగా చూసి కొత్తబట్టలు అక్కడపెట్టి వెళ్ళిపోయింది.

అరగంటతర్వాత కొత్తబట్టలు కట్టుకొన్న శంకరం గదిగుమ్మానికి చాటుగా నిల్చొని; "నాన్నగారూ, అమ్మ కాఫీకి రమ్మంటోంది." అని దీర్ఘం తీస్తూ చెప్పి పారిపోయాడు. శంకరం అట్లా నిల్చొని చెప్పడానికి కారణం ఏమిటో ఆయన తేలిగ్గా యూహించాడు.

కాఫీ త్రాగడానికి అవతలిగదిలోకి వెళ్ళినప్పుడు, తనలాగే జయరావుకూడా కొత్తబట్టలు కట్టుకొచ్చాడు. ఆయనను చూడటంతోటే శివరామయ్యకు మళ్ళీ ఆత్మాభిమానం ముంచుకొచ్చింది. సిగ్గుతో కుంచించుకుపోయాడు.

తరువాత సుగుణ, శంకరంకూడా, కొత్తబట్టలతో వచ్చి అక్కడే టిఫిన్‌తిని ఓవల్టిన్ త్రాగారు. నిన్న మొన్నట్నుంచీ కళ్ళారా చూడ్డానికి వీల్లేకుండా తిరుగుతున్న శివరామయ్యభార్య సుభద్రమ్మ, ఇప్పుడు కొత్తచీర కట్టుకున్నా, కనుపించినట్టే కనుపించి మళ్ళీ వెనక్కుపోతున్నది. జయరావు ఆ యింట్లో వున్నంతవరకు ఆమె అంతే! ఎందుకంటే గౌరవనీయుడైన అల్లునిఎదుట స్వేచ్ఛగా అత్తగారు తిరిగే ఆచారం ఆ ఇంట్లో ఇంకా లేదు.

ఎట్లాగో ఆ కాస్త ఓవల్టిన్ తాగేసి ఆ గదిలోనుంచి బయటపడ్డాడు శివరామయ్య. ఆ సమయం చూసుకుని భర్తనుద్దేశించి, "ఈ సంతోషానికంతటికీ మూలం మీరేనని ఏమాత్రం ఆయనకు తెలిసినా, లజ్జతో కుమిలిపోతారు. ఇప్పటికే మీకు ముఖం చూపలేక వీలయినంతవరకు తప్పుకుంటున్నారు. బ్రతికి చెడిపోయిన అంతరాత్మను క్షోభపెట్టడం మనకు మంచిదికాదు." అని చెప్పింది సుగుణ.

ఆ తరువాత మూడో రోజున సుగుణ మళ్ళీ ప్రయాణమైంది. బండివాడి సహాయంతో సామాను బండిలో పెట్టించాడు జయరావు. శంకరం ముందుగానే బండిలో చేరాడు. సుగుణ ముందు తల్లిని సముదాయించి, "వెళ్ళొస్తా నాన్నా" అన్నది కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

శివరామయ్య లోలోపల కుమిలిపోతున్నాడు. తీవ్రమయిన ప్రయత్నంతో తనను తాను సంబాళించుకొని, "కన్నబిడ్డను పుట్టింటినుంచి వొట్టిచేతుల్తో పంపే దౌర్భాగ్యపుగీత భగవంతుడు నానుదుటగీశాడు" అని ఆపైన అనలేక ఆగాడు.

సుగుణ తేరుకుని, చూడు నాన్నా, మీరు అట్లా దిగులు పడితే అక్కడకు వెళ్ళినా నాకు శాంతి వుండదు. ఇప్పటికే మీరు ఈ దిగుళ్ళతో చిక్కి సగమై పోతున్నారు. నాకేం కావాలి నాన్నా. పెట్టవలసినదంతా ఇదివరకే పెట్టారు. నాకేం పరాయిదా నా అదృష్టం కలిసొస్తే రేపు సుఖపడకూడదా"? అన్నది.

"లేదమ్మా లేదు. నాకలాంటి ఆశ ఏమీ లేదు. సిరీ, సంపదా శాశ్వతంకానిమాట నిజమే! కాని ఒక వ్యక్తి తాలూకు సాంఘిక విలువల్ని; పరువు మర్యాదలను అంతిమస్థాయిలో నిర్ణయించేటప్పుడు మన చుట్టూ వున్న సమాజం అతను చెడిబ్రతికినవాడా బ్రతికి చెడినవాడా అనే కొలతబద్ద తీసుకుంటుంది. అయినా, నా బ్రతుకేనో తెల్లవారి పోయింది. నా తరువాతివాడైన శంకరాన్ని రెండో కోవలో విడిచిపెడుతున్నాననే బాధ తప్ప మరేమీ లేదు. ఇంతకాలానికి మళ్ళీ మమ్మల్ని మనుషులుగా చేశావు. ఆడపిల్లలు పుట్టింటినించి అంతో ఇంతో తీసుకువెడతారుగానీ, ఒట్టి చేతుల్తో వెళ్ళరు. నాకా అదృష్టం..." అని ఆపేశాడు.

లోలోపల ఉండలుచుట్టుకుపోతున్న దుఃఖం అతన్ని నోరెత్తనివ్వలేదు.

"అదేమిటి నాన్నా, ఆడపిల్లలన్న తరవాత అందరూ పుట్టింటినుంచి దోచుకుపోయేవాళ్ళే వుండరు. పుట్టింటికోసరం దాచిపెట్టేవాళ్ళుకూడా వుంటారు."

"సుగుణా!" అన్నాడు తండ్రి, ఆమె తల నిమురుతూ—

మరొకసారి తల్లిదగ్గరకూడా సెలవుతీసుకుని యల్దేరింది సుగుణ.

రైలెక్కించి రావడానికి వాళ్ళతోపాటు శివరామయ్యకూడా బయల్దేరాడు. ఈ స్టేషనులో మొన్న మొన్నటివరకూ ఎక్స్‌ప్రెస్ కూడా ఆగుతుండేది. ఇప్పుడదీ మానేసింది. పాసింజరు తప్ప మరొకటి ఆగదు. అదీ ఇవాళ అరగంట ఆలస్యం. అయినా సరే, అంతవరకూ వుండి, వాళ్లను బండిలో భద్రంగావున్న చోటు చూసి కూర్చొపెట్టాడు.

రైలు ఇక కదులుతుందనగా, ఎంత ప్రయత్నించినా కళ్ళల్లో నీరు సుళ్లుతిరుగుతూనే వుంది. జయరావుకు ఎలాగో వీడ్కోలు చెప్పగలిగినా, సుగుణతో చెప్పడానికి నోరెత్తలేకపోతున్నాడు.


"జాగ్రత్త సుగుణా! భద్రంగా వెళ్ళిరామ్మా!" అన్నాడు అతి ప్రయత్నంమీద. ఆయన పెదవులు అప్రయత్నంగా అదురుతున్నయ్.

"చిన్నవాడయినా ఇక్కడుంటే కొంత కాలం జరుగుతుండేది. ఇప్పుడు వాణ్ణికూడా నువ్వు తీసుకుపోతున్నావు" అన్నాడు దీనంగా.

"పోనీ, అంతగా బాధగా వుంటే, అమ్మను వెంటబెట్టుకొని మీరు కూడా ఓసారి రండి నాన్నా. మీ ఇష్టం వచ్చినప్పుడు మళ్లీ వొచ్చేద్దురుగానీ" అన్నది సుగుణ పైటచెంగుతో కళ్లు తుడుచుకొని.

సుగుణ ఇంత చిన్నపని ఎంతదూరం ఆలోచించి చేస్తున్నదో ఈ క్షణానగానీ, శివరామయ్యకు అర్థం కాలేదు.

"అట్లాగేనమ్మా!" అన్నమాటను స్పష్టంగా అనలేకపోయాడు. కాని రైలు కదిలింది.



జన్మకాలశోధనము

శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు

జ్యోతిశ్శాస్త్రమువలని ఫల మేదైనా, అది ఎంత అయినా, స్పష్టలగ్న గ్రహాదులే దానికి ప్రధాన మయిన ఆధార మని ప్రాచీనుల మతము.

"జ్యోతిశ్శాస్త్ర ఫలం సర్వం,
లగ్నాధీనం బుధైః స్మృతం;
స్ఫుట ఖేటాశ్రయం తత్తు;
తస్మాత్ ప్రాధాన్య మేతయోః."
(పితామహుడు)

స్పష్ట లగ్నమును సాధించవలెనన్నచో, జన్మకాలము నికరముగా నుండుట తప్పనిసరి. అది శుద్ధము కానిపట్ల, దాని ఆధారముతో గుణించిన లగ్నాదులు, ఎంత నికరములైనా, మనకు వాని ఉపయోగము మట్టమే. ఏలందురా? మన భూమండలములో దిన మొకటికి అరువదివేలమందికి తక్కువలేక జననములు కలుగుచున్నవని సంఖ్యాశాస్త్ర నిపుణులు అంచనా వేసియున్నారు. ఈ జననము లన్నియు భచక్రమందలి 360 భాగలలోనే జరుగవలయును. కనుక, సరాసరి ఒక భాగ లగ్నముగా నుండగల నాల్గునిమిషముల కాలములో 167 జననములు కావలసియుండును. అనగా, రమారమి నిమిష కాలములో ఈ ప్రపంచమున 42 మంది పుట్టుదురనుట! జన్మకాలము నికరముగా లేనిచో, దానికి గుణించిన జాతకము ఉద్దేశించిన వ్యక్తిది కాక, ఏ దేశములోనో, ఎచ్చటనో పుట్టిన ఏ ఇతర వ్యక్తిదో కాకలదు. కనుక, అపరిశుద్ధకాలమునకు కష్టపడి గుణించిన జాతకచక్రమువలన ఏ జీవునికి ప్రీతి? జాతకఫలములు కొన్ని అనుభవమునకు రాలేదని కొందరనుకొనుట అందరు వినుచున్నారముకదా? ఎవరిదో జాతకమునకు ఫలము వ్రాయించుకొని, అది తనజీవితములో జరుగలేదన్నచో, అర్థమేమి? నాడీగ్రంథములలోనున్న జాతక కథలు వ్రాయించుకొన్నవారు అవి తమవే అనుకొని సంతోష పడుటయు, కాలక్రమమున అందలి ఫలములు కొన్ని అనుభవమునకు రాకపోగా, శాస్త్రమును నిందించుటయు, అందరము చూచుచున్నాము. కారణము స్పష్టము.

జన్మకాలమును నిష్కర్షగా గమనించి గుర్తువేసుకొను సంప్రదాయము, ఏ కొన్ని సందర్భములలోనో తప్ప, సాధారణముగా, నేటికాలమున వాడుకలో లేకుండుట విచారకరము. కాలమునుగురించి మనకే శ్రద్ధలేనిచో, మంత్రసానికేమిటట? పగలు మూడుగంటల ప్రాంతములోననియో, రాత్రి రెండుగంటలపైగా అనియో, జన్మకాలములను అత్యంతస్థూలముగా చెప్పు అలవాటు సర్వసాధారణముగ నున్నది. ఇట్టికాలమునకే గుణించెడి జాతకములు వ్యర్థప్రయాస మన్నచో తప్పుగాదు. గంటలు నిమిషములలో గ్రంథస్థము గావించియున్న జన్మకాలములలో సైతము ఏదో కొంత వ్యత్యాసము చూపట్టుచుండును. మంత్రసాని కాలమును గమనించుటలో చేయు ఆలస్యము, గడియారములలో నుండు దోషము మొదలగు కారణములవలన ఎంత నికరముగా వ్రాసియుంచిన జన్మకాలమైనా, కొంత తేడాగా నుండుట అసంభవము కాదు.

కావుననే లగ్నశోధనపద్ధతులతో శుద్ధము కావించని జన్మకాలము అపరిశుద్ధముగా భావించవలయునని పరాశరుడు గంటవాయించి చెప్పెను. శోధనపద్ధతులు కొన్ని వాడుకలోనుండుమాట వాస్తవము. కాని, వానిలో అనేకములు విమర్శ సహములు కావు. అతిస్థూలముగా లగ్నరాశినో, నవాంశనో సూచించుటకుమాత్రమే అవి ఉపయోగపడవచ్చును. 'ఉత్తరకాలామృతము'లో చెప్పబడిన మార్గమిట్టిదే. ఇక, 'గుళిక' స్థానమునకు కోణరాసులలో కాని, ఏరాశిలోనైనా 'గుళిక' నవాంశలోకాని, లగ్నము ఉండవలెనని 'ఫలదీపిక' చెప్పుచున్నది.

"గుళిక త్రికోణభేవా,

జన్మబ్రూయాత్, తదంశేవా." అని. ఒకానొకనాడు గుళికస్థానము మేషరాశిలో 2° భాగలో నున్నదనుకొందము. ఆదినమందు శిశు జననములు

మేష, సింహ, ధనుస్సులలో కాని, వృషభ, కన్యా, మకరములలో వాగ్గవ నవాంశలో కాని, మిథున, తులా, కుంభములలో ఏదైన నవాంశలో కాని కలుగవలెననుట' కటక, వృశ్చిక, మీనములలో 'మేష నవాంశయే లేదు' కనుక, ఆ రాసులలో జననములు కలుగవని తేలును. సారాంశ మేమనగా, అనాటిజననములు భచక్రపు 360 భాగలలో 110 టిలోమాత్రమే సంభవమనుట! దీనిని విశ్వసించుట కష్టము. ఇట్టివే మరికొన్ని పద్ధతు లున్నవి. వానికి ఉపపత్తి తెలియదు.

జన్మకాలమునుండి ఆధానకాలమును సాధించి, తన్మూలముగా జన్మలగ్నమును శుద్ధముచేయు పద్ధతి యొకటి 'బృహత్పారాశరహోర'లో కలదు. కాని, అది దురవగాహము. ఇట్టిదే మరియొక పద్ధతి 'మనుష్య జాతకము' నందున్నది. దాని ప్రయోగము దుర్గ్రాహ్యము. కాని, దీని నే పోలినట్టి సంప్రదాయ మొకటి 'ఆధాన కాలపద్ధతి' యను పేరున పాశ్చాత్య శాస్త్రవేత్తలలో వ్యాప్తికి వచ్చియున్నది. అనుభవములో దీనికి విలువ యున్నదని మనము సహా కనుగొనవచ్చును. అది యట్లుండె.

ఏ విధముగా శుద్ధపరచినాసరే, జీవితమందలి అనుభవ విశేషములను శుద్ధ లగ్నము నిర్దుష్టముగా చూపగలిగినచో చాలును. అదే సాక్ష్య మవసరము. స్థూలముగా వింశోత్తరీదశలుకట్టి ఈ భుక్తిలో ఈ అనుభవము వచ్చినదన్నచో చాలదు. ఈ భుక్తులు కొన్ని రెండు మూడు సంవత్సరముల కాలము వ్యాపించి యుండుటచే, ఇట్టి సమన్వయము అర్థము లేనిదగును. ప్రాణదశలుకట్టి అనుభవములను నిరూపించుమహానుభావులు, సామాన్యముగా, కానరారు.

పోనిత్తము. లగ్నము శుద్ధమైనచో, ఈ క్రింది పరీక్షలలో అది నెగ్గవలసి యుండును :—

ప్రశంసలో నున్న అనుభవము వివాహ మను కొందము. అప్పుడు,

(1) వివాహము జరిగిన సంవత్సరమునకు దేవమానదశ, ఆ శుభకార్యమునకు తగిన దృష్టియోగములు చూపట్టవలయును ;

(2) ఏ నెలలో వివాహము జరిగెనో, ఆ నెలకు చలిత చంద్రుడు వివాహోచితముగు ఉత్తేజనమును చూపవలయును ;

(3) వివాహదినమునకు దైనిక జాతకమును సాధించితిమేని, కేంద్రములకు తగిన గ్రహసంయోగము కానరావలయును.

4. స్పష్టరవి ఆధారమున ఆ సంవత్సరమునకు వర్షజాతకమును గుణించినచో, దానిలో వివాహసూచక యోగములు చూపట్టుట అవసరము;

5. వర్షజాతక కేంద్రముల చలిత స్థానములు వివాహదినమునకు సరిఅయిన గ్రహసంబంధమును సూచించుట ముఖ్యము;

6. శుద్ధకాలమునుండి నికరమైన ఆధానలగ్నము సాధించుట సాధ్యము కావలసియుండును; మరియు; అట్టి ఆధానకాల చక్రము జీవితానుభవములకు తగిన దేవమాన దశలను చూపగలిగి యుండవలయును;

7. ఇట్టి శుద్ధలగ్నపు ఆధారమున సాధించిన సహమములు అనుభవములకు యోగ్యమగు దశలను సూచించగలుగుట ముఖ్యము.

జీవితములో ముఖ్యమైన అనుభవముల విషయమున పై రీతిగా సాక్ష్యము వచ్చిననే తప్ప, లగ్నము శుద్ధమని భావించరాదు. ఆ లగ్నమునకు ఉపయోగించిన కాలము సహా విశ్వాసార్హము కాదు. శుద్ధముకాని జాతకము పిచ్చివానిచేతి రాయివంటిది.

కాని, సామాన్యముగా, జ్యోతిష్కులు వాకుకలో లగ్నశోధక కార్యమును నిరాదరించినారనియే చెప్పవచ్చును. అయినా, అది వారి దోషముకాదు. అనుభవములను గూర్చి ప్రశ్నించినచో, "గతము మాకు తెలును. భవిష్యత్తు మాత్రము చెప్పండి." అని ప్రతివచ్చుట సామాన్యానుభవము. సాధారణముగా, జ్యోతిష్కుల వాక్రీయించువారి లక్ష్యమంతే! కాని, అనుభవమును స్పష్టముగా జాతకము చూపగలదని సాక్ష్యము లేనప్పుడు, భావి ఫలములకు దానిపై ఆధారపడుటలో ఏమి వివేకమున్నదో, భగవంతుని కెరుక. అనుభవములను విచారించి తెలుసుకొని, లగ్న శోధనము చేసి, స్పష్ట కాలమును తేల్చుట అంత తేలికపని కాదు. మూడు నాలుగు దినములు ఈ పని చేయుచు కూర్చున్నచో, జ్యోతిషమే వృత్తిగా నున్నవారికి జీవనయాత్ర జరుగుట దుస్తరము. ఒకటో రెండో, జాతకములకు దశాభుక్తి ఫలములను, రాజయోగములనుసహా, వ్రాసి దినమొక్కటికి అయిదో, పదో, రూప్యములను సంపాదించనిదే, ఆ సంసారులకు కథ జరుగదుకదా?

కొన్నాళ్ళవెనుక ఒకానొక చట్టాశేరపువ్యాపారి తన జాతకమునొక జ్యోతిష్కునికి పంపి అందొక పత్రము నిట్లు వ్రాసెనట!

“మూడుసంవత్సరముల క్రిందటిదాకా గొప్ప లాభాలువచ్చి కథ బాగా జరిగినది. కాని, ఇటీవల వ్యాపారములో గొప్పనష్టాలువచ్చి, మునుగుదునో, తేలుదునో, అంతు తెలియలేదు. మంచికాల మెప్పుడు వచ్చునో, ఎప్పుడు అప్పులు తీరి ఆస్తిచేయగలనో, దయచేసి త్వరగా చెప్పండి. ప్రస్తుతము తమకు పారితోషికము నిచ్చుస్థితిలో లేనని వ్రాయుటకు విచారపడుచున్నాను. కాలము బాగుపడిన తరువాత నాకృతజ్ఞత చూపగలను.” అని.

ఆ పండితుడిట్లు ప్రతి వ్రాసెనట:—“చాలా సంతోషము. తమ వాగ్దానమునకు కృతజ్ఞుణ్ణి. మొదట నా ఆయుర్దాయమును గుణించుకొని, తరువాత నెమ్మదిగా తమ జాతకము ఫలములు వ్రాయ నారంభింతును. చిత్తగింతురు.”

పరిస్థితు లిట్లుండగా, ఏశాస్త్రపద్ధతులు వికసింపగలవు? రాజాదరమును కోలుపోయిన విద్యకు ప్రజాదరముసయితము లభించకపోవుట శోచనీయము.

పోనిండు. శోధన పద్ధతులపై విశ్వాసముగల పాఠకమహాశయులకు ఉదాహరణమొక్కటి నివేదింతును.

ఒకానొకపురుషుడు 11-6-1919 నాడు 7-32 P. M. (I S T) లో దేహలీనగరములో జననమందెనట. (28°-40' ఉత్తరాక్షాంశ; 5-8'-48" పూర్వరేఖాంశాకాలము.) ఇతని జీవితమునందలి విశేషము లివి:—

(1) 18-9-1945 నాడు జాతకుడు తుపాకితో శత్రువుల నిద్దరిని చంపుట;

(2) 10-4-1946 నాడు జాతకునికి ఉరిశిక్ష విధించబడుట;

(3) 27-4-1947 నాడు ఉరిశిక్షకు మారు ఆమరణ కారాగారవాసము విధించబడుట;

(4) 23-6-1954 నాడు జాతకుడు కారాగృహమునుండి విడుదల చేయబడుట.

* ఇతని నిరయన జాతకచక్రమిది:—

		కే 10-26 శు 18-42 ర 26-54 బు 26-55	గు 25-57
	(నిరయన)		కు 10-43
	జాతకము		శ 0-39
లగ్నము 5-37	చ 4-15 రా 10-26		

ఈ చక్రమును చూచి జాతకుడు హంతకుడగునని చెప్పగలుగుట, ఏ దివ్యదృష్టి సంపన్నులకో తప్ప, ఇతరులకు నా దృష్టిలో అసాధ్యము. సాహసముకూడ విషయ మిప్పుడు తెలిసి యున్నది కనుక, ఏదో రీతిగా, సమన్వయము చేయుటకు ప్రయత్నించవచ్చును. అట్లు చేసిన వారు లేకపోలేదు. అష్టమాధిపత్యమువలన పాపి అయిన చంద్రుడు వ్యయస్థానములో నుండి, అరింటనున్న పాపగ్రహములగు కేతు, రవి, కుజ, బుధుల దృష్టి కలిగియున్న కారణమున, జాతకునికి హత్యచేయు మనస్తత్త్వము వచ్చినదట! పంచమ, భాగ్యాధిపతులగు కుజ, రవులు పాపులెట్లయిరి, అను ప్రశ్న వచ్చుట సహజముకదా? ఈ చిక్కు వదలించుకొనుటకు వారికొక ఉపాయము లభించినది. “నాడీజ్యోతిష” మను పేరున ఇటీవల ఒక క్రొత్తపద్ధతి అందందు ప్రచారములోనికి వచ్చి యుండుట చదువరు లెరుగుదురు. ఇది ఏ ఋషిప్రోక్తమో, తెలియరాదు. అది యొక చిదం

* బెంగుళూరు నగరములో, శ్రీయుత బి. వి. రామన్ గారి సంపాదకత్వమున వెలువడుచున్న ‘అస్ట్రాలాజికల్ మ్యాగజైన్’ అను జ్యోతిష మాసపత్రికలో, 1956 మార్చినెల సంచికయందు (281 వ పుట) ప్రకటితమైన శ్రీ మానిక్ చంద్ జైన్ గారి వ్యాసమునుండి ఈ అంశములు కృతజ్ఞతతో స్వీకరించబడినవి.

జన రహస్యము. ఈ పద్ధతి ననుసరించి, పుబ్బనక్షత్ర మున మృగశిరలో రవి, బుధులుండుటచే, వారికి కుజుని తోమాపలకు మద్భినదట! ఈ కుజుడు అష్టమాధిపతి యగు చంద్రుని నక్షత్రమగు రోహిణిలో నుండుటం బట్టి దుష్టఫలప్రదుడైయ్యెనట! ఈ సంబంధముతలన రవి కుజులిద్దరూ దుష్టులైరట! కనుక, జాతకునికి హంత కత్వము వచ్చినదట! ఏమి ఈ గ్రాదిన ప్రాణాయామ కళాచాతుర్యము? ఈ సమన్వయ మెంతసమంజసమో, చదువరులే ప్రమాణము.

పుబ్బకుకి బృహస్పతి, మృగశిరకు చంద్రుడు, అధిపతులని వేదములు చాటుచున్నవి. కాని, వీరి సంప్రదాయములో, పుబ్బకుకి శని, మృగశిరకు కుజుడు, అధిపతులట! వింశోత్తరీదశాక్రమములో ఒక్కొక్క నక్షత్రమునకు ఒక్కొక్క గ్రహమునకు దశాభాగ మిచ్చినాము కదా? ఆనక్షత్రమునకు ఆదశాభాగముతే అధిపతియగునట ఈ సంప్రదాయ మందలి రహస్యము. పరేకాని, ఇతరములగు ఉడుదశలు, అనగా, అష్టోత్తరి, పంచోత్తరి, శతాబ్దిక, మున్నగునవి, పెక్కులున్నవి కదా? వానిలో నక్షత్రములకు వేరు వేరు గ్రహములు దశాభాగము లగుచున్నారు. ఆ దశల ననుసరించి గ్రహాధిపత్యములను గ్రహింపకూడదా? ఒక్క వింశోత్తరీ దశకు మాత్రమే ఈ విశిష్టాధికార మున్నదని ఎవరు నిర్ణయించిరి! కొన్ని జాతకములకు వింశోత్తరీ పద్ధతి అన్వయించుట పరాశర సమ్మతము కాదుకదా! అప్పుడేమి గతి?

"కృష్ణేతు రవిహోరాయాం
చంద్రహోరాగతే సితే."

అని పరాశరుడు చెప్పుటచే, శుక్లపక్షములో రవి హోరలో జనించిన ఈ జాతకునికి వింశోత్తరీ దశ కట్టుటే అసంగతముగు చున్నది. దశయే లేనప్పుడు, అధిపతుల అధికార మెట్లు రాగలదు? ఈ పద్ధతిలో ఇన్ని చిక్కు సమస్యలున్నవి.

అది యట్లుండె. బుధ దశలో కుజాంతరములో జాతకుకు హత్య కావించెనట! శుభాశుభ గుణములకు కుజాంతరము తెగియున్నదనవచ్చును. కాని, ఒక కష్టము.

"ఆయుర్దాయ విభాగశ్చ,
ప్రాయశ్చిత్త క్రియాతథా,
పాపమేవైన కర్తవ్యా,
శత్రూణా మప్యుపాసనం."

అని ప్రాచీన సూత్రము. దశలలో సంవత్సరమనగా, 360 దినముల 'సావన' సంవత్సరమేకాని, 365¼ దినముల 'సౌర' సంవత్సరముకాదు. ఈ పద్ధతిని అనుసరించియే, నెలకు 30 దినములని, ఏడాదికి 12 నెలలని, దశాశేషమును గుణించుచున్నాముకదా, ఇట్లు లెక్కించినచో, హత్యాకాలమునకు కుజాంతరము పోయి రాహ్వంతరము నడచుచుండగలదు. ఇక కేతు దశలో, శేత్యంతరములో, గురుపు విచారణలో కారాగృహ విముక్తియట! 23-6-54 నాటికి శేత్యంతరమే యుండెను. గురు విచారణ ఎట్లు నిలుచును?

పోనిండు. ఈ సమన్వయమును వట్లుంచి, ఇచ్చిన జన్మకాలము శుద్ధమా, అది హత్యాదినమును సూచించగలదా, అని పరీక్షింతముగాక. 23-6-1954 నాడు సాయంకాలము 5-30 P. M. (IST) గంటలకు గ్రహస్థితి ఇట్లుండెను:—

			వరుణ 17-15
	సాయనము — హత్యాదినము నాటి గ్రహస్థితి		కు 3-18 రా 5-17 శ 22.21
కే 5-17			యమ 11-1 గు 16.34
చ 6-38		శు 4-1 ఇం 5.35	బు 4.49 ర 20-19

ఉపదిష్టకాలపు ఆధారమున ఈ దినమునకు దైనిక కేంద్రములను గుణింతము.

ఉపదిష్టకాలము	... 7.32-0 P. M.
భారత కాలప్రమాణము (Standard)	... 5-30-0
పోగా, మిలువ = గ్రీనిచ్ మధ్యమకాలము	... 2- 2-0
రేఖాంశకాలము	... 5- 8.43

చేర్పగా, స్థానిక మధ్యమ కాలము (L. M. T.)	... 7-10-43
దీనికి గంటకు 10 సెకండ్ల వంతున ధనసంస్కారము	... 0- 1-11
నాక్షత్ర కాలాంతరము	... 7-11-54
13-9-1945 నాటి స్థానిక నాక్షత్ర కాలభుక్తి	... 11-27-36
దైనిక జాతకమునకు నాక్షత్రకాలము	... 18-39-30

ఈ కాలమునకు లగ్నపట్టిక గ్రంథము ననుసరించి దేహళీనగరమునకు దైనిక కేంద్రము లిట్లు రాగలవు :-

దైనిక దశమ కేంద్రము	... 9°-5'	మకరము
దైనిక లగ్నము	... 14°-3'	మేషము

ఇపుడు మనము ముఖ్యముగా గమనించవలసిన సమస్య ఇది. హంతకధర్మముకల మన శత్రువు జాతకునికి జన్మకాలిక గ్రహములు ప్రసాదించినవని అనుకొందము. కాని, ప్రశంసాదినమునందే అతడు హత్యచేయ నేల? ఆనాటి గ్రహస్థితి ఇట్టి దౌరాత్మ్యము నుద్బోధించునట్టిది కాకూడదా, అనవచ్చును. మంచిదే కాని, అది సర్వమానవకోటికిని సమానము. ఇతనిని మాత్రము ఇట్టి కార్యమునకు ప్రేరేపించ నేల? జాతకగ్రహ స్థానములపైన కాని, ముఖ్యముగా జన్మకాలిక కేంద్రముల పైనగాని, తాత్కాలిక దుష్టగ్రహములు వచ్చిపడుట వలన అట్టి ప్రేరేపణము జరిగియుండవచ్చును. అందు కేమో? అట్టి సన్నిహిత సంబంధమేమియు చూపట్టకున్నది. కొన్ని భాగల దూరములో, ఏదో సమసప్తకమో సంయోగమో, కలదని తృప్తిచెందువారుందురు. కాని, ఇట్టి విషయములలో అట్టి దూరపు సంబంధము గవ్వకైనా కొరగాదు.

"ఏకాంశదృష్ట్యాతు దినే ఫలంస్యాత్,
యోగస్థితైకాంశసమాగమోక్తిః"

ఇత్యాది ప్రాచీనసూత్రములను నిరాదరించుట మాత్రమును కాని, ఫలమును సాధించలేము. ఫలప్రదగ్రహములతో ఆత్యంతిక సంబంధము (సంబంధము లన్నింటిలో సంయోగమే పటిష్ఠమైనది.) వ్యక్తియొక్క దైనికజాతకమందలి కేంద్రములను వ్యాపించని దినమున విశేషఫలములు అనుభవమునకు వచ్చుట, సాధారణముగా, సంభవించదు. ఇదే దైనికజాతకమందలి విలక్షణ ధర్మము.

క్రూరుడగు యముడు జన్మకాలములో కర్కాటక రాశిలో 5°-42' లో నుండెను. హత్యాదినమున రాహు సంయోగము మాత్రము కాక, ఇంద్రునికేంద్ర వేధ సహా ఈ యమునికి వచ్చినది. ఇట్టి యముని సమసప్తక వేధ మకరరాశిలో 5½ వ భాగకు ఉన్నది కదా? ఇంతే కాదు. మూలానక్షత్రపు విషనాడి మకరరాశిలో 5°-11' నుండి 6°-6' వరకు నుండినది. ఇట్టి పరిస్థితులలో దైనిక దశమము మకరములో 5½° భాగకు వచ్చియుండె నేని, ఆనాడు జాతకుడు క్రూరకార్యమునకు పూనుకొని యుండుట అసంభవము కాదు. ఇది తప్ప సమీపములో వేరు గ్రహసంబంధ మేదియు కానరాకున్నది. కనుక, దైనిక దశమకేంద్రము ఆనాటి కేతువుపై నుండితీరవలెనని మనము భావించవలసి యున్నది. అనగా, 4½° భాగల పట్టు అది వెనుకకు జరుగవలసి యుండుననుట. ఈ ఉపపత్తి నాశ్రయించి జన్మలగ్నము ధనుస్సులో 20½° భాగలో ఉండవలయునని నిర్ణయింపగలము. (లగ్నపట్టిక గ్రంథము చూడుడు.) (*)

ఇది ఆధారముగా నుంచుకొని, ఆధానకాల పద్ధతిని ఉపయోగించుట తరువాతి కార్యము. శుక్లపక్ష చంద్రుడు దృశ్యార్ధ కోణములో నిర్లింగ భాగలో నుండుటయు, లగ్నము పుల్లింగ భాగకు వచ్చియుండుటయు, కారణముగా, ఆధానదినము 13-9-1918 అనియు, ఆధానకాలము 9-45 P. M. (I. S. T.) అనియు నిర్ణయించుచున్నవి. ఈ పద్ధతివలన ధనుస్సులో 20°-39' జన్మలగ్నమగును. కనుక, శుద్ధమయిన జన్మకాలము 7-19'-8'' P. M. (I. S. T.) కాగలదు. ఉపదిష్ట కాలముకంటే ఇది 13 నిమిషములు వెనుకకు జరిగినదనుట. దీనిలో గొప్ప అసంభవము లేదు. ఎట్లయినా, జీవితానుభవములకు సరిపడగల జన్మకాలమిది, మన ప్రకృత సమస్యకు ఇంత చాలు.

(*) Raphaels' "Tables of Houses for Northern latitudes" అను పట్టికగ్రంథము నుండి ఈ లగ్నదశమములు ఏ అక్షాంశకైనా సులభముగా సాధించవచ్చును.

ఈ శుద్ధకాలమునకు సాధించిన స్పష్టకుండలి ఇందున్నది:—

వరుణ 1-42 (వ)	హత్య 7-39	పుణ్య 27-26	శు [illegible]-9 కు 11-24 ర 19 34 34 బు 19-30
	పాయసము — శుద్ధ స్పష్ట జన్మకుండలి —		యమ 5-42 గు 19-39
			కే 3-24 ఇంద్ర 7-19 శ 23-22
కారాగృహ 28-49 ల 20-39 క్రౌర్య 12-33 కర్మ 12-29 రా 3-9	వ్యయ 20-30 చ 26-21	X 3-28 శత్రు 8-41	

మనః కారకుడగు చంద్రుడు వృశ్చికములో నున్నాడు. జాతకుడు క్రూరకార్యములు చేయువనియు, పాపములు దాచువనియు వరాహమిహిరాచార్యుని మతము. రాజదండన వలన ధనము నష్టమగు ననుఫలము కల్యాణవర్మ శోధించినాడు. ఈ చంద్రునికి అష్టమ (మృత్యు) భావాధిపత్యమున్నది. ధర్మస్థానమందలి శనినుండి ఇతనికి కేంద్ర శత్రుదృష్టి. అధర్మ ప్రవర్తనమువలన బంధనము కలుగునని తెలుపు యోగమిది. రవి, కుజ, బుధులు సప్తమకేంద్రములో నున్నారు. విరుద్ధ ధర్మాచరణము, కార్పణ్యము, నిర్దయత, క్రూర స్వభావము, దీనికి ఫలమనుచున్నాడు పృథుయశస్సు.

"రవి కుజ బుధ యోగోయం,
విరుద్ధ ధర్మాన్వితం, విదేశరతం,
కృపణం, దయావిహీనం,
స్వార్జిత ధననాశే దుఃఖసంతప్తం"

[హోరాసారము]

దశమాధిపతియగు శుక్రుని అష్టమస్థితి వలనిఫలము దుష్టస్వభావమట! లగ్నాధిపతి (గురువు) సైతము అష్టమభావమందే కలడు. మహాక్రోధము, కుమార్గ ప్రవర్తనము దీని ఫలమని పరాశరుడు చెప్పెను. ఇవి అన్నియు శోధించితిమేని, క్రూరస్వభావము, క్రోధము, దయావిహీనత, ధర్మభ్రంశము, పాపకార్యాచరణము, రాజమూలక ధననాశనము మున్నగు గుణములు సూచితము లగుచున్నవి కదా? కాని, లగ్నాధిపతి అష్టమస్థితికి, సప్తమాధిపతి (బుధుని) సప్తమస్థితికి సహా, ఇతర దుర్గుణము లెట్లుండినా, దీర్ఘాయుస్సు ఫలమగుట జాతకుని భాగ్యము.

పైయోగములు ఎంత దుష్టములైనా, అవి జాతకునియందు హంతకస్వభావమున్నదని మాపుట కష్టము. అధర్మమార్గమున క్రూరకార్యమేదైనా చేసి, కారాగృహవాసన మూడవచ్చునగదా?

ఇచటనే సహమబిందువుల వైశిష్ట్యము. ఒక్కొక్క భావమునకు కారకత్వము లనేకములున్నవి కదా? దశమభావమునకు కర్మస్థానమని పేరు. కాని, ఉద్యోగము, అధికార గౌరవము, కీర్తి, అంతస్తు, పితృభాగ్యము, మొదలగు అనేక విషయములను ఈ భావము తెలుపగలదని ఎరుగుదుము. ఇన్నింటిలో, జాతకుని కర్మస్వభావ మెట్టిదో, కీర్తి ఏపాటిదో, అధికారగౌరవ మెంతటిదో, మున్నగు విశేషాంశములను కనుగొనుటకు ప్రత్యేకాధారములు కావలసియున్నవని సులభముగా గ్రహించగలము. ఇట్టి ప్రత్యేకాంశములను సూచించి, భావములకు సహాయపడు బిందువులే "సహమ"ములు. తాజక శాస్త్రవేత్తలయిన మన ప్రాచీనులు వీని ప్రయోజనమును బాగుగా గుర్తించి విపుల పరిశోధనము చేసిరి. వీని సహాయము లేనిదే మనచర్చ సంపూర్ణము కాదు.

జాతకచక్రములో 'కర్మ' సహమమును చూతుము. ఇది 'క్రౌర్య' సహమముతో చేరుకొని లగ్నమందున్నది. కుజుని సమసప్తకదృష్టి వలన ఈ బిందువులు తైక్ష్ణ్యమును సంపాదించుకొన్నవి. అర్థము స్పష్టమే. 'కారాగృహ' సహమము సయితము లగ్నమందే కలదు. చోద్యమేమనగా, 'కర్మ' సహమమునకును, 'కారాగార' సహమమునకును, పరివనుమ లగ్నము తులాభారము తూగుచుండుట గమనించదగినది. క్రూరకార్యము, కారాగృహయాత్ర, ఇవి లగ్నమును (అనగా, వ్యక్తిని) ఆశ్రయించియే ఉన్నవనుట కాదా?

కాని, దీనివలననే జాతకుడు హత్య చేయునవుట సాహసము. 'హత్యా' సహమమున వేరొక బిందువు

కలదు. మేషరాశిలో ఆ సహమమున్న భాగ (8°) మహా క్రూరమైనది. పాశ్చాత్య శాస్త్రజ్ఞులు దీనికి "చావు బ్రదుకుల" భాగ అని నామకరణము చేసినారు. మన ప్రాచీనులు దీనిని "మృత్యుభాగ" అని వ్యవహరించారు. ('హోరామకరందము' చూడుడు) మాయల మారి అగు ఇంద్రుడు మృత్యుస్థానమున కూర్చుండి స్నేహదృష్టితో దీనిని, భుజము తట్టుచున్నాడు. 'క్రౌర్య' సహమమును నేరుగా ప్రేరేపించుచున్న కుజుడే ఈ 'హత్యా' సహమమునకు సయితము అధిపతి! ఈ సహమమునకు ఎట్టఎదుట (180°) 'శత్రు' సహమము కలదు. ధర్మస్థానమందలి శనినుండి 'శత్రు' సహమమునకు అర్థకేంద్ర, 'హత్యా' సహమమునకు పార్థ కేంద్రవేధ! శత్రుజయమును కాంక్షించి, క్రూర కార్యమును హత్యకావించి, ధర్మభ్రంశము పాలై జాతకుడు కారాగృహవాసము చేయగలుగునని సూచన కాదా? నాడీ జాతకపద్ధతుల డొంకతిరుగుడు కార్య కారణ సమన్వయమనుకొంటే, ఇది సయితము కదా!

పై యోగములకు వాస్తవముగా విలువ యున్నచో, దేవమానదశలో హత్యాకాలమునకు తగిన ఉత్తేజనము చూపెట్టకలరా? అనవచ్చును. చూడుడు.

దశమకేంద్రముపైన యాజమాన్యము శుక్రునిది. సాధారణముగా, ఇట్టి ఘోరకార్యాచరణమునకు కావలసిన మనస్తత్త్వము శుక్రునికి లేదు. 1945 లో దశమకేంద్రము చలించి వృశ్చికరాశిని ప్రవేశించుటచే, కుజునికి దీనిపై అధికారము వచ్చినది. చాలదని, చలిత కుజుని నిండు త్రికోణదృష్టి బలముతోనే ఇది వృశ్చిక ప్రవేశముచేయుట. బలముపట్టి సాధించుట వృశ్చిక ధర్మము. చోరత, క్రౌర్యము, శౌర్యము, బలము, క్రోధము, మొదలగు గుణములు ఈ కేంద్రమునకు ఇప్పుడు వచ్చినవి. ఇట్టి పరిస్థితులలో మూడింట (పరాక్రమస్థానమందలి) వరుణుని త్రికోణదృష్టిసహా దీనికి లభించెను. "ఏకైక మపత్యవర్గాయ." అనిపించు యోగములివి. దురదృష్టమా, అన్నట్లు, 'శత్రు' సహమము చలించి అప్పుడే ఈ చలిత దశమకేంద్రమును చేరుకోవలయునా? ఇది శత్రువులపై దండయాత్ర కాక వేరేమి? చలిత బుధుడప్పుడే ఇంద్రునిలో చేరుకొని కోణదృష్టితో 'హత్యా' సహమమును ప్రేరేపించినాడు. కార్యసాధనమునకు కావలసిన యుక్తి, తంత్రజ్ఞత, అలవడినవి. 'కర్మ', 'క్రౌర్య' సహమములు చలనవశమున అప్పటికే నికరముగా యముని సమసప్తకవేధను, పొంది దుష్టములగుట. చలిత 'సంకల్ప' సహమమును క్రూరముగ కేంద్రదృష్టితో చలిత కుజుడప్పుడు ప్రబలముగా ఉద్బోధించినాడు. ఇంకేమి కావలయును?

నాటకరంగ ప్రసాధనము పూర్తిఅయినది. పాత్రధారులు సిద్ధముగనున్నారు. 'నాంది ప్రస్తావన మాత్రమే కొదవ. 6-9-1945 నాడు పర్వము (అమావాస్య) 1-43′-26″ P.M. (G. M. T.) లో కన్యారాశి 13° లో పడి, 'క్రౌర్య', 'కర్మ' సహమములను కేంద్రదృష్టిచే ప్రేరేపించినది. ఆనాడు బుధుడు చలిత శనిపై, శుక్రుడు ఇంద్రునిపై కుజుడు చలితకుజునిపై, పడుముకట్టి నిలిచి, కార్య రంగమునకు ఆయత్తపడి యుండిరి. ఇంద్రుడు యముని కేంద్రములో నుండి అసహమములను చెలరేగించినాడు. నాంది ఘంటారావమును ఈపర్వము సమకూర్చెను. యవనిక ఎత్తుటే ఆలస్యము.

ఈపర్వ క్షణమున దేహళీనగరమున దశమ కేంద్రము ధనుస్స $28\frac{1}{3}$° భాగలో, లగ్నము మీనరాశి $27\frac{1}{3}$° భాగలో ఉండినవి. అనగా, రవిచంద్ర సంయోగ ఘర్షణమువలన ఆకాశరంగమునందు వెలువడిన ప్రచండశక్తి భచక్రమందు అప్రత్యేక భాగలలో కేంద్రీకృతమయి యుండెననుటే! దశమ కేంద్రము 'కారాగృహ' సహమస్థానమునే ఆశ్రయించి యుండుట పాఠకమహాశయులు గమనించియుందురు. కారాగృహరంగము సిద్ధమై ఆహ్వానించు చున్నది. కాని, 'పర్వపు' కేంద్రము వ్యక్తిజాతకమునందు అనుకూలస్థానమును చేరుకొనుదాక యవనిక ఎత్తబడదు. దశమకేంద్రము దైనికచలనపద్ధతితో చలిత 'క్రౌర్య', 'కర్మ' సహమములను స్పృశించనిదే, కార్యము జరుగనేరదు. ఈస్పర్శ ఎన్నటికి సిద్ధముగునో, చూతము.

	గం	ని
మకరము 5° దశమ కేంద్రములో నుండగల నక్షత్రకాలము	18	21
పర్వకాలము P. M. (L. M. T.)	6	52
నాక్షత్ర కాలాంతరము ...	6	53
నిలువ, నాక్షత్రకాల భుక్తి ...	11	28

ఈ ఘట్టి ఏనాటికో, వాటికి అట్టి స్పర్శ కలుగ గలదు. పంచాంగము (అనగా, ఎఫెమెరీస్సు) చూచి తిథిని, ఈ ఘట్టి వివరముగా 13-9-1945 నాటికేయని చూడగలము. హత్యాదిన మదేకదా! దినము కేంద్రమిము మకరరాశి 5° లో నుండినప్పుడు, పర్వలగ్నము ఎటులుండెనో, పరిశీలింపుడు. వివరముగా, మేష రాశిలో 7½° భాగలో అది నిలిచియుండగలదు! జాతకములో 'హత్యా' సహమస్థానముండె! హత్య జరిగినది. ఏల జరుగదు! కాలపురుషుని అగ్రమేయ శక్తి అది! ఇది 'కాకతాళీయ' మనగలమా ?

'మాయూరాలు' వింశోత్తరీపద్ధతితో చేయు సమన్వయమునకంటె, ఈ పద్ధతిలో మెరుగున్నదో లేదో తారతమ్యమును చదువరులే తెల్పుకోగలరు.

10/11-6-1945 నాడు 2-38'-49'' గంటలకు (Am. I. S. T.) వర్ష ప్రవేశము. అప్పటికి వర్ష జాతకమును గుణించి చూడుడు. 'హత్యా' సహమాధిపతియే లగ్నాధిపత్యం వహించి, లగ్నమందే నిలిచి వక్రులైనారు. చంద్రుడు సహమ తేజస్సును గ్రహించి సహమాధిపతికి అందిచ్చుచున్నారు. 'కారాగార' సహమము లగ్నాధిపతి కేంద్రముచే అభిలషించుచున్నది. ఈ యోగములు చాలు. దినరాధిపతియు, 'కారాగృహ' సహమాధిపతియు నగు శనియొక్క వార్షికదశలోనే యీ కార్యము జరుగుట!

హత్యాదినమునకు దినజాతకమును గుణించినచో 'హత్యా' సహమాధిపతిని కేంద్ర దృష్టిచే ప్రేరేపించు చున్న వరుణుడు లగ్నమందే యుండెనని చూడగలము. 'హత్యా' సహమాధిపతి తేజస్సును గ్రహించి చంద్రుడు లగ్నాధిపతికి అందిచ్చుచున్నారు. ఇంకేమి కావలయును !

గ్రంథవిస్తర భీతిచే వార్షిక, దైనిక చక్రముల నీయ నైతిని. కాని, సాధించిన ఆధానకాలము సత్యమైనచో ఈ అనుభవములకు బీజము అందుండవలదా ! అది పరిశీలించువారి తృప్తికొరకై ఆధానకాల చక్రము నిచ్చి చాలింతును. ఈ ఆధానకాలచక్రమున పరాక్రమ భావాధిపతి చంద్రుడు మృత్యుభావములో నున్నాడు. చతుర్థాధిపతి రవినుండి పరిపూర్ణ కేంద్ర వేధ ఈ చంద్రునికి. ఇది అశుభయోగమని వరాహమిహిరుని మతము. సప్తమభావమందున్న సప్తమాధిపతి కుజుడు క్రూరబాహుళ్యమును, క్రూర దశమును సూచించగలడు. 'హత్యా' సహమము, 'సంకల్ప' సహమము కూడా, ప్రబలకుజుని పేఠుబడిలో నున్నవి. అందులో, "అపరిహార్య పురాకృత దుష్కర్మఫలము" సూచించు దుష్టభాగలో ఈ 'హత్యా'

		కారాగృహ 14-36 I 25-21	,కే 17-30
వరుణ 24-47 (వ) X 10-31	ఆధానకాల కుండలి — (పాయనము) —		యము 6-28 ళ 11-54
			ఇంద్ర 8-23 కర్మ 10-36 శ 22 13 పుణ్య 25-58
ర 20-40 రా 17-30	సంకల్ప 5-22 కు 17-51 హత్య 29-15		గు 1-48 బు 8-37 చ 20-3

సహమము 'తిష్ఠ' వేసియుండుటు! ప్రబలగండాంత ప్రవేశమది. లగ్నాధిపతి శుక్రుడు దుర్బలుడు (నీచ). 'హత్యా'సహమము అతని కేంద్రముచే అభిలషించు చున్నది. 'పుణ్య' సహమమునకో, వ్యక్తికరణాలి వరుణుకి సమసప్తక వేధ ! ఉద్యోగాధిపతి శనికి యము, వరుణుల క్రూరదృష్టిబలవ ప్రోద్బలమున్నది. క్రూర బుద్ధి, క్రూర కార్యాచరణము, శిరశ్ఛేదనము, హత్యల సంబంధము, ప్రారబ్ధ పరిపాకపు ఫలములని ఈ చక్రము చూపుచున్నది కదా !

ఈ సహజధర్మములకు జన్మకాలగ్రహభావస్థితి ఎట్టిపోషకత్వముల నెరిగించినదో, చదువరులు పరిశీలించెదరు గాక. మరియు, ఆధానకుండలికి దశనాథ దశలు సాధించిలేని, హత్యాకాలమునకు తగిన ప్రారబ్ధ పరిపాకమును చూపు దశావిశేషములను చిత్రించ గలరు.

విశేషమేమన, ఆధానకుండలికి హత్యాదినము నాటికి దైనిక జాతకము సాధించితిమేని, దైనిక దశమము కుంభములో 11° భాగకు రాగలదు. 'కర్మ' సహమముపైన యముడు సాక్షాత్తుగా ఆవాహనమైన వాడు, అతనికి వింశ సమసప్తక స్థానములోనే ఈ కేంద్రము నిలిచియుండెనని గమనించితేని, పాఠక మహాశయులు ఆశ్చర్యపడక మానరు.

లగ్నశోధనమునకు ఎంత విలువయున్నదో ఉదాహరణముగ చూపుటకొరకు మాత్రమే ఈ విమర్శనమని మనవి.

"కాలోహి దురతిక్రమః"

నవ్వుటాలకు

"ఉత్తమ్"

పాత్రలు:

ప్రసన్నకుమార్

అవతారం

శరత్

రంగము: 1

* * గదిలో ఒక బల్ల, దానిమీద అలారం టైంపీసు. ప్రక్కగా రెండు కుర్చీలు! ఒక మడతమంచం, దాని ప్రక్కగా ఒక పడకకుర్చీ. గోడకు 18 వ తారీఖు శనివారం అని చూపించే కాలెండరు.

శరత్ : (సంతోషంగా చదువుతాడు) అన్యస్త్రీలను కన్నెత్తిచూడని ప్రభాకర్ ను వాడియైన శరములవంటి నీ కలభ్రమాఘులతో బందీకృతుని చేసి నీ ఒడిలో చేర్చుకొంటివి. నీ కౌగిటిలో నేను నా జీవితభార మంతటిని మైమరచితిని. ప్రప్రథమముగా నీ హృదయమున హత్తుకొని స్వర్గతుల్యుడనైతిని. హా... ఎంతబాగుంది! - బ్రహ్మాండంగా రాసేశాను.

[అవతారం ఆనందంతో ఓలలాడుతూ హుషారుగా వస్తాడు. ఆ హుషారులో రచనలో మునిగి తేలుతున్న శరత్ చేతిలో వున్న కాగితంతీసి బల్లమీద పారేస్తాడు.

అవ : ఒరే! శరత్ — మేరేజ్ కి వస్తావా?

శర : ఏం మేరేజ్ రా?

అ : గ్రాండ్ ఎక్సలెంటయిన మేళాలతో సమ్మగా ఉంటుంది.

శ : గ్రాండ్ ఏమిటి? ఎక్సలెంటేమిటి? అసలు ఎవరి పెళ్ళి? ఎక్కడ? ఎప్పుడు? ఆ వేమీ చెప్పకుండా యేమిట్రా నీ హడావిడి.

అ : అదేమిట్రా! అంత తేలిగ్గా తీసేశావ్? ఎవరికో పెళ్ళయితే నేనెందుకు చెబుతాను?

శ : అయితే మీ అక్కరా, అన్నరా, మరెవరన్నానా?

అ : ఒరే! నీది పట్టి మట్టిబుర్ర. నీకు లోకజ్ఞానం సున్న. వ్రాస్తావు పెద్ద రచయితలాగ కథలు, చెత్తకథలు. ఏదో 'ప్రేయసీ నా ప్రణయ సుందరీ' అని పలవరిస్తావేగాని ప్రపంచజ్ఞానం సున్న.

శ : పోనీలే! నాకథ పూర్తికానియ్యి.

[కౌగిలం తీసుకుంటాడు.]

అ : నీ కవిత్వం అలా ఆపి ముందు యీ శుభవార్త వినవోయ్!

శ : ఒరే! ఆ శుభవార్తకంటె యీ అద్భుతఘట్టం వినరా. వింటే, వింటున్నవాళ్ళు, చదివేవాళ్లు ఆ స్వర్గసౌఖ్యం అనుభవిస్తున్నట్టే వుంటుంది. చదువుతానుండు—

అ : నువ్వు చదవావద్దు నేను వినావద్దు. దానికంటె అతి అమూల్యమైనది యీవార్త! ఓ గొప్ప శుభవార్త; మన చరిత్రలో సుప్రసిద్ధ ఘట్టం.

శ : అదేదో చెప్పనైనా చెప్పరా. నీ పోరు తీరుతుంది. ఇంతకూ ఆ మారేజ్ ఎవరిదో చెప్పావుకాదు.

అ : నువ్వు చెప్పనిస్తే గదట్రా.

శ : సరే యిప్పుడైనా చెప్పు—

అ : ముందు ఆ కాగితం అలా బల్లమీద పారేయ్. కాస్త మనసు దీనిమీద ఉంచి విను.

శ : వింటాను చెప్పరా!

అ : ఒకే హై డియర్ శరత్ నువ్వు రమ్మంటే రానన్నావుగాని.........

శ : ఏంజరిగింది? (ఆశ్చర్యంగా)

అ : ఏంజరిగిందని నెమ్మదిగా అంటా వేమిట్రా?

శ : (విసుగ్గా) ఏం జరిగిందో చెప్పరా.

అ : ఇండియా కాఫీహౌసులో కాఫీత్రాగి బయటకు వస్తుంటే, మెరుపుతీగలా మెరిసిందిరా.

శ : ఏమిటి?

అ : ఏమిటంటా వేట్రా. ఎవరు అను?

శ : ఎవరు?

అ : ఓ అప్సరస.

శ : అప్సరస అక్కడ కెలా వచ్చిందిరా?

అ : నిజంగా అప్సరసో, దేవతో, ఊర్వశో, మరేమిటో నేను గ్రహించలేను. ఎలావచ్చిందో కూడ చెప్పలేను.

శ : వచ్చి ఏం చేసింది?

అ : అలా అమాయకంగా పోతోందిరా.

శ : అంతేకదా (హేళనగా)

అ : అంతేనా?—

శ : మరి?

అ : నేను వెంటాడాను. యార్డు గజాలు వెళ్ళాక ఏమండీ అనిపిలిచాను.

శ : నువ్వే పిలుస్తా!

అ : ఛె ఛె. ఏం అలా అంటున్నావ్?

శ : అదే నీ కంత ధైర్యమెలాగ వచ్చిందీ అని?

అ : అయితే నాకు ధైర్యం లేదంటావా?

శ : లేకేం. కావలసినంతుంది. కాకపోతే అది కళ్ళెర్రజేస్తే ఆమడదూరం వెళ్తావ్. అంతే.

అ : ఒరే నేనంటే నీ కంత హేళనగా ఉంది. మన తడాఖా తెలియదులే.

శ : అవునవును. తర్వాత ఏం జరిగింది?

అ : ఏమయిందంటావా ఏమండీ అని మళ్ళా పిలిచాను. పిలవగానే ఉలిక్కిపడేటట్లు "ఎందుకండీ" అని హుషారెత్తించింది.

శ : జడిశావా!

అ : జడిసాననుకో కాని...

శ : కాని, అని ఆపివేశావే. ఏంచేశావ్.

అ : కూడా వెళ్ళి కాస్త నా మాట వినండి అన్నాను.

శ : అంతే!

అ : "ఎందుకు వినాలి!" "అసలు మీ రెవరు?" అంది. అప్పుడు నేను "నేను ఒక ప్రేమికుణ్ణి" అన్నాను.

శ : అంటే నవ్విందా.

అ : నవ్వలేదు కాని సీరియస్ గా "ప్రేమికులైతే ప్రియురాలి దగ్గరకు వెళ్ళండి. పబ్లిక్ రోడ్ మీద యిదేం పని" అంది.

శ : (నవ్వి) అనగానే 'రైట్ ఎబౌట్ టర్న్' కొట్టావా?

అ : అబ్బే అలాగే వెంటాడాను.

శ : అయితే యేమీ అనలేదా?

అ : అంది. "ఎందుకండీ మీ రలా కూడా వస్తారు" అని.

శ : అప్పుడు నువ్వేమన్నావ్?

అ : నువ్వు కవిత్వంలో పేలతావు చూడు ఆ మాటన్నాను.

శ : ఏమిట్రోయ్ అది.

అ : అదే—'తుమ్మెదలు పువ్వుల చుట్టూ ఎందుకు తిరుగుతాయి' అన్నాను. కాని మాట్లాడలేదు.

శ : అయితే నీ బుర్ర పనిచేస్తోందన్నమాటే.

అ : అమోఘంగా!

శ : ఆ! తర్వాత యేమయింది?

అ : తాయా కాఫీసు దగ్గర కొచ్చేటప్పటికి "ఎందుకండీ మీకు కాదా చెప్పేది, వెళ్ళండి" అంది. అప్పుడు "నా ప్రేమ సందేశాన్ని అందించడానికి" అని సమాధాన మిచ్చాను. "ప్రేమ సందేశ మేమిటండీ" అని మళ్ళా శ్రమంది.

శ : దర్జాం! అడిగింది?

అ : అడిగింది. అడగ్గానే నాకు బలే హుషారు వచ్చి "ప్రేమ పవిత్రమైంది. అందులో నా ప్రేమ మహాపవిత్రమైంది" అని చెప్ప సాగాను. అయితే "ఆపండి మీ రేదో

కవిత్వ కోరలలో ఇరుక్కుపోతున్నారు. అయినా నా కెందుకు వచ్చిందే" అంటూ కోపంగా పోయింది.

కి : అయితే నీ ప్రేమ వ్యర్థం చేసుకోలేదన్న మాట.

అ : అదేరా బాబూ. కాని నేను విడువలేదు. మళ్లీ ఏమండీ అని పిలిచాను. అప్పుడు "ఏమి టండీ, ఏమండీ, ఏమండీ అంటూ నా వెంటపడ్డారు. పోలీసులతో చెప్ప మంటారా!" అని బెదిరించిందిరా.

కి : పోలీసులతో చెప్తే కొంప మునిగింది.

అ : అట్టే నేను జంకలేదు. పైగా "మీరు మిస్సమ్మ సినిమా చూశారా!" అని అడిగేను.

కి : ఎందుకు?

అ : అదే ప్రశ్న ఆమె కూడా వేసింది.

కి : అయితే ఏమి చెప్పావు!

అ : "ఆడవారి మాటలకు అర్థాలు వేరులే" అన్న పాట ప్రకారం మీరు నన్ను మనసారా ప్రేమిస్తున్నారు కదండీ అని ప్రశ్నించేను.

కి : అయితే ఒప్పేసినట్టేనా!

అ : ఒప్పేసినట్టే.

కి : ఎట్లా?

అ : చాలంక మందహాసంతో చూచి నన్ను ముగ్ధుణ్ణి చేసింది.

కి : చూచి నవ్వినంతట్లోనే!

అ : కాకపోతే ప్రేమించాను ప్రియుడా అంటుందా ఒకే మౌనం అర్ధాంగీకార మన్నారు కదట్రా!

కి : అవుననుకో కాని మరి విడిచి ఎలా వచ్చేశావ్?

అ : వాళింక చూస్తూ గవర్నమెంటు హాస్పిటల్ లోకి పోయిందిరా!

కి : పోతే ఊరుకున్నావా?

అ : కలుస్తానని చెప్పి వచ్చాను.

కి : మంచిపని చేశావ్! ఇంతకూ ఆ మనిషి ఏ 'రెడ్ మార్కెట్' వ్యక్తో.

అ : కాదురా చదువుకున్న పిల్లేరా. బంధువులను చూడడానికో ఎందుకో వచ్చివుంటుంది.

కి : అయితే తిరిగి వచ్చేవరకూ వుండకపోయావ్.

అ : ఉన్నానురా. కాని అరగంట వరకు తిరిగి రాలేదు.

కి : దీనికేనట్రా మార్కెట్ కి వస్తావా! అని వాడా విడిచేశావ్—అంతా ఖరారైపోయినట్లు.

అ : 50% ఖరారయినట్టే—

కి : ఎట్లా?

అ : నేను అంగీకరించానుగా—

కి : అదా అయితే ఆమె అంగీకరించక పోతే 50% చెల్లే అవుతుందన్న మాట.

అ : అదేమిట్రా శుభమంటూ అశుభ మాటల్రా?

కి : అయితే ఇదంతా నిక్కచ్చి కాదుగదా.

అ : అదేమిట్రా బాబు అలా అంటావ్—ఆ నేత్రాలు, ఆ హాసము, ఆ యౌవనంతో కూడిన నా ప్రియురాలి ప్రతిబింబం ప్రతి క్షణం ప్రత్యక్షమవుతూంటే—

కి : ఒరే, నా మాట విని పోయి భోంచేసిరా, ఎందుకైనా మంచిది. నా భోజనమైంది. వెళ్ళు.

అ : నాకు భోజనం వద్దు. నాకడుపు ఆనందంతో నిండిపోయిందిరా.

కి : ఒరే జాగ్రత్త రాత్రికి కలగాని రావొచ్చు. పోయిపడుకో. చక్కటి ఘటం ఒకటి వ్రాశాను. చదువుతాను విను.

అ : ఓరి వెధవ ఆ థియరీ (Theory) అలా పెట్రా. ఇప్పుడు ప్రాక్టికల్ గా అనుభవిస్తున్నాను.

[ప్రసన్నకుమార్ ప్రవేశిస్తాడు]

ప్రసన్నకుమార్ : గుడ్ నైట్!

ఇద్దరూ : గుడ్ నైట్!

ప్ర : ఏరా భాయ్! చాలా హుషారుగా ఉన్నారు!

కి : ఏముందిరా నా కథ పూర్తి కావచ్చింది. ఇలాంటి ఘట్టం ఎన్నడూ ఏ సినిమాలో గాని నాటకంలో గాని, నభూతో న భవిష్యతి. ఇంతట్లో మనవాడు ఏదో శుభకార్యం చేశానని వట్టి హడావిడి చేస్తున్నాడు.

అ : హడావిడి కాదురా! వాస్తవమైన అద్భుత సంఘటన... చెప్పమంటావా!

ప్ర : ఒకే చేదోకమాట చెప్తాను వింటారా?

శ : నా కథ పట్ల నీ అభిప్రాయం ఏమైనా వుంటే చెప్పరా!

అ : ఛా! పాత కథ. మీ అభిప్రాయాలకేం గాని నా జీవితరంగంలో ప్రథమ ఘట్టాన్ని విని భవిష్యత్ ప్రణాళిక ఏలా వుండాలో చెప్పండి.

ప్ర : ఒకే, మీరానందంలో అలా క్రొవ్వెక్కి ఆడుతున్నారు కాని నాకు ఒక తీరని అపకారం జరిగిందిరా.

శ : ఏమిట్రా?

అ : చెప్పు, ఎవడా వెధవ. నీకపకారం తలపెట్టిన వాడెవడో చెప్పు. నిమిషాలలో నాశనం చేస్తాం!

ప్ర : ఏముంటే ఏమి చెప్పమంటారా?

అ : ఫర్వాలేదు చెప్పు. పిప్పిచేస్తాను. జెట్టీల స్టైల్ నా ప్రియమిత్రుడు ప్రసన్నకుమార్ కా అపకారం చెయ్యడం. చెప్పు వెంటనే చెప్పు చిటికల్లో హతమారుస్తాను ఆ పాంతి కుణ్ని—తిన్నగా నా దండాలుణ్ని చెప్పు.

ప్ర : (నవ్వుతాడు)

అ : ఏరా నవ్వుతున్నావ్?

శ : అదే నీ కింత ధైర్యం ఎట్లా వచ్చింది అని.

అ : ఏం? నేను పిరికివాడనా? పైగా మీరంతా ఉండగా నాకు భయ మెందుకూ అంట. అసలు సంగతి తెలిసిందంటే వాడిపని తీసేస్తాను!

శ : అవునవును. రంగంలో దిగితే తెలుస్తుందిలే!

అ : ఒకే! కుమార్, చెప్పరా!

ప్ర : ఏముందిరా సాయంత్రం 5 గంటలకు మునిసిపల్ ఆఫీసునుంచి మా చెల్లి వస్తూంటే ఇండియా కాఫీహౌస్ దగ్గర ఒక కిరాతకుడు వెంట బడ్డాడట.

అ : ఆఁ! (దిగజారిన గొంతుకతో)

ప్ర : అవును. పైగా విసుక్కుంటూన్నా, వెంటాడి హాస్పిటల్ వరకూ వచ్చాడట.

అ : వచ్చాడూ! (శరత్, అవతారం ఒకరిముఖము ఒకరు చూసుకుంటారు.)

ప్ర : ఏదో అసహ్యపు మాట అన్నాడట.

శ : ఒకే అవతారం! కొంప మునిగి వట్టుందే.

ప్ర : ఏఁ?—

అ : ఏమీ లేదు. ఆ అమ్మాయికి అపకీర్తి తెచ్చాడే అని అంటూన్నాడు. ఆ తర్వాత ఏం జరిగిందో చెప్పు. (చాటుగా శరత్ కు సైగ చేసి తన విషయం గూర్చి చెప్పవద్దని బ్రతిమిలాడును.)

ప్ర : హాస్పిటల్ గేటువరకూ వచ్చాడట. చెప్పడం మరచాను. కోపపడుతూంటే ఆడవారి మాటలకు అర్థాలు వేరులే అని పాటపాడి మీరు మనసారా ప్రేమిస్తూన్నారు కదండీ? అన్నాడట—రాస్కెల్!

అ : అయిందేదో అయింది—తిట్టకురా!

ప్ర : ఆ! తిట్టకేమా చీలుస్తావా.

అ : పోనీలేరా! వాడొక అమాయకుడనుకుంటాను. ఇప్పటి రోజుల్లో కుర్రాళ్ళం లేగా. ఇంతకీ ఆమె నీ చెల్లెలని తెలియదుగా వాడికి. ఏదో మర్చిపో.

ప్ర : మరచి పోవడమా! వాణ్ని మసిచేస్తాను, మిగతా వాళ్ళందరికీ బుద్ధొచ్చేలాగు.

అ : ఆఁ! (ఆశ్చర్యంగా)

ప్ర : అవును.

అ : ఒకే! నా మాట విని నీ ప్రయత్నం మానుకో. చూడు. అప్పుడప్పుడూ మనం మాత్రం అలా ఆడపిల్లల్ని ఆడించడం లేదు? నీవేమైనా హడావిడి చేస్తే అల్లరి పాలవడం కాని మరింకేముంది?

ప్ర : అది తర్వాత విషయం. ముందు తప్పకుండా కసితీర్చుకుంటాను. రేపు మళ్ళా వస్తానని చెప్పికూడా వెళ్ళాడట. రేపే వాడిపని పడతాను.

అ : (భయంతో వణుకుతూ) ఒకే కుమార్ యుద్ధం తలపెట్టకురా! శాంతిం వహించరా—గాంధీ తత్వం పూనరా!

ప్ర : ఏమిట్రా! నువ్వు భయపడుతున్నావ్! ఏం అలా వణుకుతున్నావ్?

అ : అబ్బే! ఏమీ లేదు. ఇలాటి యుద్ధాలంటే నాకు చాలాభయం. పైగా నువ్వు నాకు చాలా ప్రియమిత్రుడివి నీకా యుద్ధంలో ప్రమాదం సంభవిస్తే మాకు కాదా. మంచికోసం చెబుతున్నాం. ఏరా శరత్.

శ : అవునురా!

ప్ర : మీరెన్నైనా చెప్పండి నేనుమాత్రం వాణ్ణి విడిచిపెట్టను. మీకేం! అక్కడ నా చెల్లి బెంగపెట్టుకొని తీరని అవమానంతో యేడుస్తోంది.

అ : ఏడుస్తోందా!

ప్ర : ఏడవక యేంచేస్తుందిరా. ఆడది చేసేది అంతకన్నా యేముంది చెప్పు? రేపు మనం ముగ్గురూ కలసి వాణ్ణిపట్టి చిత్రవధ చెయ్యాలి.

అ : నేనూనా!

ప్ర : అవును నువ్వూను—

అ : ఆఁ!

ప్ర : ఏఁ! అలా అంటూన్నావ్. ఇప్పటివరకూ వాణ్ణి నాశనం చేస్తాన్. చిటికల్లో హత మారుస్తా నన్నావుగా?

అ : అన్నాననుకో!

ప్ర : అంటే అన్నట్టు చేయలేవన్నమాట!

అ : కాదనుకో!... కాని.

ప్ర : ఏమిట్రా కాని... అర్జెంటా అవసరం వచ్చినప్పుడు లేనిది వుత్తప్పు డెందుకురా. ఏమైనా సరే నువ్వు తప్పకుండా రావాలి. నువ్వే వాణ్ణి తన్నాలి.

అ : నేనా?

ప్ర : అవును.

అ : వద్దు! నాకు చేతులురావు.

ప్ర : తన్నడానికి చేతులెందుకురా! కాళ్ళుండగా!

అ : ఆఁ! కాళ్ళా. అవీ యేమీ చేయలేవు.

ప్ర : చేస్తాయి. మనిషికి మనిషి సహాయం. కాబట్టి నువ్వు రావాలి.

అ : అవ్యక్తి ఎవరో నీకు తెలుసా?

ప్ర : తెలియదు. రేపొస్తానన్నాడటరా, కాస్తాను. కాని వాడి తడాఖా చూస్తాను.

అ : అతనో కాదో నీకు ఎలా తెలుస్తుంది?

ప్ర : మా చెల్లెలు వస్తుంది. ఆనవాలు చెప్పుతుంది.

అ : ఆ! మీ చెల్లికూడా వస్తుందీ!

ప్ర : ఏం?

అ : అబ్బే ఆడవాళ్ళెందుకురా రణక్షేత్రానికి?

ప్ర : ఆడవాళ్ళు లేకపోతే ఆనవా లెట్లా దొరుకుతుంది?

అ : అవుననుకో! కాని! అనుకుంటే అవతలవాడుకూడా పౌరుషంగా పోట్లాడుతాడు. అప్పుడు అపజయం వస్తే నామోషి. పైగా పేరు ప్రఖ్యాతులు, పాడైపోతాయి.

ప్ర : ఏమైనా అవనియ్యి. నేనుమాత్రం నాపట్టు విడువను. నువ్వు తప్పకవచ్చి సహాయ పడాల్సిందే.

శ : ఒరే! యేదోఒకటి చెయ్యొచ్చుగాని కాసేపు విశ్రమించండిరా. నా కథ ముగుస్తుంది.

అ : అవునురా పడుకుందాం. నువ్వోళ్ళి కాస్త విశ్రాంతి తీసుకో.

ప్ర : నాకు విశ్రాంతేమిఁటి వాణ్ణి ఖూనీ చెయ్యంది నిద్రపోను.

అ : పోవూ!

ప్ర : పోను.

శ : పోకపోతే పోనీకాని, కాస్త నిశ్శబ్దంగా ఉండండిరా!

ప్ర : ఏమిట్రా యెప్పుడూ కథలో, కథలో అంటావ్? ఎప్పుడైనా ఒక్క కథ అయినా పబ్లిషై వచ్చిందీ?

శ : ఈ సారి తప్పకుండా అవుతుంది. ఇదివరకు ఉండే శైలికంటే ఇంకా ఘాటుగా వ్రాస్తున్నాను.

ప్ర : వ్రాస్తే వ్రాసావుగాని, ఒరే, అవతారం ఇంతకీ నువ్వేమంటావురా?

అ : నేనీసారికి రానురా—

ప్ర : నువ్వు రాకపోతే లాభం లేదు. నీవుండాల్సిందే—తప్పకుండా.

అ : ఒరే! శరత్ మా నాన్న యడ్రస్ తెలుసు పట్రా?

శ : సరిగ్గా తెలియదు!

ప్ర : ఎందుకురా?

అ : ఎందుకైనా మంచిది నోట్ చేసుకోరా!
—ఎ. అవధాని, అనపర్తి, తూర్పు గోదావరి జిల్లా.

ప్ర : ఎందుకురా?

అ : ఒక వేళ నే నా మహాయజ్ఞంలో చస్తే యీ యడ్రస్ ద్వారా మా వాళ్ళకు తెలియజేస్తే వచ్చి నా అంత్యక్రియలు జరుపుతారు.

ప్ర : ఓరి నీ తస్సాదియ్యా! అప్పుడే ఎంతవరకూ పోయావ్! పోనీగాని యీ వేళతో ఆఖరట 'సాంసన్ అండ్ డెలీలా' చూద్దాం రండిరా.

శ : నేను యీ రాత్రి కథ పూర్తిచేయాలి. రేపు పోస్టు చెయ్యాలి. నేరా లేను.

ప్ర : రేపు ఆదివారం రా. రేపు పోస్టుచేసినా ఎల్లుండి పోస్టుచేసినా ఒకటే. సరే నువ్వురా అవతారం?

అ : నేనూ రాలేనురా. నేను అలసిపోయాను. విశ్రాంతి తీసుకోవాలి. పైగా నిద్ర కూడా లేదు.

ప్ర : అయితే నేనే పోయొస్తా. గుడ్ నైట్! (వెళతాడు)

అ : ఒరే శరత్ నా ప్రాణం మీదికొచ్చిందిరా!

శ : నా కథ ముగియ వచ్చింది.

అ : నా బాధ చూడరా!

శ : నా కథ వినరా!

అ : అబ్బా! నీ గొడవ నీది. సరే పడుకుంటాను. (పడుకుంటాడు) [తెర]

2

* * గడియారం 1-30 చూపెడుతున్నది. కథ వ్రాస్తున్న శరత్ కూర్చున్నవాడు కూర్చున్నట్లే కుర్చీలో నిద్రపోతూ వుంటాడు. అవతారం నిద్రపోతుండగా అతని ముఖంమీదికి టార్చిలైటు ఫోకసు పడుతుంది. అందువల్ల నిద్రమేల్కొని ఆ లైటుయొక్క ఉనికిని గమనించుతూ ఉండగా ఒక హస్తము పిలుస్తున్నట్లు కన్పించుతుంది. అతన్ని

అ : ఎవరు?

చేయి : (నెమ్మదిగా) ఉష్— నే నే నీ 'లా' ను

అ : నా 'లా' వా? పేరు?—

చేయి : (నెమ్మదిగా) హాస్పిటల్ గేట్

అ : ఓ నువ్వా. ఆ! నాకు తెలుసు నీ వొస్తావని. మన 'లా' ఎటువంటిదో యీ దద్దమ్మలకు ఏమైనా తెలిస్తేగా! ఆగు వస్తున్నా ఈ వేళ ప్లాను వేసుకొని రేపు ప్లాగ్ యెత్తేద్దాం!

[అద్దంలో ముఖం చూసుకొని సర్దుకొంటూ బయటకు వెళ్ళి తిరిగి నిస్పృహతో వస్తాడు]

ఇట్టే మాయమయ్యిందే. నేను వస్తున్నానన్నాను. నా మాట లెక్క లేకుండా పోయింది. మొదట్లో నే మోసమా! ఆ అందాన్ని చూచి ఆనందించుదామని ఎన్నో ఆశలు పడ్డాను. కాని రోయింపమాపులను చూచి పరుగెట్టినట్టయింది. ఇదంతా నాదురదృష్టం.

[ఆ చేయి, వెనుకనుంచి, నిలుచున్న అవతారం భుజంపట్టి లాగుతుంది — "దొంగా దాగి నన్నాడిస్తున్నావా? నన్ను పరీక్షించాలనా?

[మళ్ళీ బయటకు వెళ్ళి తిరిగి వస్తాడు]

అరే మళ్ళా మాయమయ్యింది. విచిత్రంగా ఉందే! దీపం తెచ్చి చూస్తాను.

[వెళ్ళబోతాడు మళ్ళీ చెయ్యి అవతారం భుజంపట్టి లాగుతుంది.]

చేయి : "జాగ్రత్త" —(ప్రక్కనున్న సామానులు కొన్ని పడగొట్టును)

[అవతారం కంగారుపడి భయంతో వణకుతూ వచ్చి మంచంమీద పడి దుప్పటి ముసుగార కప్పుకుని]

అ : ఒరే! శరత్...ఒరే లేవరా! దెయ్యం! దెయ్యంరా!

శ : (నిద్రమత్తులో) దెయ్యంలేదు, గియ్యం లేదు. మాటాడక పడుకో!

అ : అదిగోరా! చూడరా బాబూ! నీకు పుణ్య ముంటుంది లేవరా!

శ : పుణ్యంలేదు పాపంలేదు పడుకోరా.

అ : బాబ్బాబు లేవరా!

శ : ఒరే! నీ వేమైనా కలగన్నావా యేం?

అ : కలకాదురా లేచి చూడు.

శ : దంపుతున్నావురా (అవలిస్తూ లేచి, అవతారం ముఖం కనపడకుండ కప్పుకు పడుకొని చేతితో చూపెట్టుట చూచి) ఇదేమిట్రా ముసుకేసావ్ (దుప్పటిలాగి) ఎక్కడరా? ఏది దెయ్యం?

అ : (భయపడుతూ) అదిగోరా చూడు. నాకు భయమేస్తోందిరా!

శ : (అటూ యిటూ చూచి) ఏమీ లేదురా నీ భయమే దెయ్యం మహారాజులా పడుకో.

అ : (ఇంతలో మంచం క్రిందనున్న జోళ్ళు తగిలి) బాబోయ్! దెయ్యం! (కెవ్వున కేక వేసి మరల దుప్పటి కప్పుకొని పడుకొనును)

శ : ఏమిట్రా యిది, ఏ దెయ్యం రాలేదే!

అ : మంచం క్రింద ఉందిరా;

శ : (తొంగి చూచి) ఏమీ లేదురా.

అ : ఉందిరా! మెత్తగా తగిలిందిరా

శ : ఏమిట్రా నీగోల. నామతిపోతోంది. ఏది లేచి చూపించు.

[లేవదీయును]

అ : (వణుకుతూ) ఈ క్రిందే వుందిరా.

శ : (కోపంగా) ఓరి నిన్ను తగలెయ్య! అది నీ కాలి జోడేరా.

అ : కాదురా

శ : నీ ముఖం పడుకో!—

అ : ఒరే నాకు భయంగా ఉంది నీవు మెలకువగా ఉంటావా?

శ : ఒరే నాకు నిద్రలేదురా నే నిప్పుడే పడుకున్నాను. నేను మెలకువగా వుండలేను.

అ : బాబ్బాబు! నీకు దణ్ణం పెడతాను. నా ప్రక్కన పడుకుని మెలకువగా వుండరా;

శ : అయితే యిది నాకు పనిష్మెంట్ అన్నమాట.

అ : అదేమిట్రా అలా అలిగిపోతావ్? నీ కేమైనా సాయం చేస్తాలేరా.

శ : చేస్తావ్ చేయకేం. ఇంతకూ నీ కేమైనా కల వచ్చిందా?

అ : కలకాదురా. కళ్ళారా చూచాను. ఒక లైట్ ఫోకస్ నామీద పడింది, నాకు మెలకువ వచ్చి చూస్తే దెయ్యరూపి నేను నీ హాస్పిటల్ 'శాంతి', రా, అని పిలిచిందిరా, నేనువస్తే కనబడలేదు. మళ్ళీవచ్చి పడుకోబోదామంటే నా భుజంపట్టి లాగిందిరా, ప్రక్కనున్న సామాన్లు క్రిందపడవేసి గడబిడ చేసిందిరా నాకు చాలా భయంగా ఉందిరా.

శ : ఓరీ! పిరికిపందా అది నీ ప్రియురాలేరా. నీ ధైర్యాన్ని పరీక్షించడానికే చేసిందిరా. పరీక్షలో ఫెయిలయ్యావు.

అ : ఏమోరా! నాకు గాబరాగా ఉంది.

[బయటనుండి అవతారం, అవతారం అని పిలుపు వినబడుతుంది]

అ : ఒరే! అదిగోరా దెయ్యం. మళ్ళీపిలుస్తోందిరా.

శ : ఛా! ఊరుకో! మన కుమార్ గొంతులావుంది. కుమార్!

ప్ర : శరత్ నేనేరా! కాస్త తలుపుతియ్యి!

శ : తలుపు తీసే ఉందిరా

[ప్రసన్నకుమార్ వస్తాడు]

అ : నువ్వా బాబూ!

ప్ర : ఏం! అలా అంటున్నావేరా?

శ : వీడేదో కలగని దెయ్యం, దెయ్యం, అని కంగారు పడుతున్నాడు.

ప్ర : అందుకా మెలకువగా ఉన్నారు? దెయ్యమేమిట్రా నీ బొంద! ఎలావుంది దెయ్యం?

అ : నాకు కనబడలేదురా!

ప్ర : నీ ముఖం! నీవు నిజంగా పిరికిపందవేరా పేరుకు తగ్గట్టు అవతారానివే సుమా. పకే కొత్త స్థల మియ్యి పడుకుంటావు.

శ : సినిమా యెలాగుందిరా?

అ : అవునవును. అలాటి మాటలన్నా చెప్పు.

ప్ర : వాలో సినిమాకు రమ్మంటే వచ్చావా! —గ్రాండ్ గా ఉంది.

అ : వచ్చినా బాగుండును. అప్పు డేదో వంక పెట్టి మానేసాను కాని లేకపోతే ఈ భయం పట్టుకునేదికాదు.

ప్ర : ఒరే! నువ్వు మగాడివేనా.

అ : అంటే

ప్ర : అయితే భయ మెందుకురా?

అ : ఏమో! ఎందుకోగాని భయమేసిందిరా

ప్ర : (నవ్వుతూ) ఓరి నిన్ను తగలెయ్య. దెయ్యం కాదు. ఏమీ కాదు.

అ : మరేమిటి?

ప్ర : అది నేనేరా! నిన్ను టెస్టు చేద్దామని చేసాను.

అ : పట్టిజే—నన్ను నమ్మించడానికి, భయంనుంచి తప్పించడానికి అంటూన్నావ్ అంతే!

ప్ర : కాదురా. ఇదిగో టార్చిలైటు. ఒకే మా బుర్రలు పేసితో నిండివున్నాయిరా.

అ : ఏం!

ప్ర : కాకపోతే నీ 'హాస్పిటల్ గేట్'లోని అని చెప్పిందని నీవంటే, ఈ కవిగారు నీ ప్రియురాలేరా. పరీక్షించడానికి వచ్చిందిరా అంటాడు. దారినిపోయే అమ్మాయికి నీరిక్కడున్నట్లు ఎట్లా తెలుసురా?

అ : అయితే యినంతా నువ్వు చేసిందే!

ప్ర : కాకపోతే మరేమిటి? ఇదేకాదు. రాత్రి చెప్పాపు. ఆ అమ్మాయి నా చెల్లెలూ కాదు యేమీ కాదు. నీ వంటున్న మాటలు విని నిన్ను ఏడిపించడానికి నవ్వులాటకు అలా చెపా యించాము.

శ : ఆహా సంగతి!

అ : నిజమేనట్రా!

ప్ర : నిజమేరా. కొత్త క్షిమితపడక.

అ : రంపావురా—ప్రతీపాకీ ముత్యాముటలం పట్టేట్టు చేసావ్. నిజంగా నా ప్రాణాలు నాలో లేవంటే నమ్ము.

ప్ర : పోనీ యిప్పుడైనా చేరాయా?

అ : చేరాయనుకో—

శ : ఒరే యింత భయస్తుడవి ఎట్లా వెంటబడ్డావురా ఒక ఆడపిల్ల వెనకాలే.

ప్ర : ఆ అమ్మాయి నర్సుట్రయినింగ్ పొందుతున్నదై ఉండాలి.

శ : అయితే అయివుండొచ్చులే.

ప్ర : దాన్ని గురించి ప్రొద్దుటే భోగట్టా చేద్దాం గాని నిద్రపోండిరా.

అ : దేన్ని గురించిరా?

ప్ర : ఆ అమ్మాయినిగురించిరా!

అ . అప్పుడు నేనూ రావాలా?

ప్ర : నువ్వు లేకుండా నే నేమి చేయగలనురా. నీవు ఫలానావ్యక్తి అని చూపెడితే నేగదా నే నేమైనా చేసేది.

అ : అవుననుకో. కాని...

ప్ర : కాని యేమిట్రా చెప్పు!

అ : అభ్యే యేమీ లేదు. ఆ వంకను తీసుకొనివెళ్ళి అక్కడ మెత్తగా తన్నవుకదా.

ప్ర : (నవ్వి) ఓరి చవటపిద్దమ్మ నిజం చెప్పినా నీకు నమ్మకం కలుగలేదురా?

అ : యిమ్మాటికి నిజమేకదూ!

ప్ర : నిజమేరా బాబూ. నీతో తమాషాచేస్తే అలా యిదౌతావేం ఈసారి హాయిగా నిద్రపో.

అ : నీతమాషా గాదుగాని నా ప్రాణాలు కడబట్టించావు.

[తెర]

రంగము : 2

* * అదే గది; శరత్ కూనిరాగం తీసుకొంటూ కూర్చుంటాడు. అవతారం, కుమార్ ప్రవేశం :

శ : ఏమయిందిరా! అవతారం!

అ : ఏదో అనుకు. రూమ్‌కు వచ్చాక చెబుతానన్నాడు. నే నెంతడిగినా చెప్పలేదు.

శ : కుమార్ కాదూ, పండా?

ప్ర : ఆ అమ్మాయి క్రిష్టియన్.

అ : ఆ (కుర్చీలో కూలబడతాడు)

శ : అయితే ప్రేమించవా?

ప్ర : క్రిష్టియన్ అయితే పెళ్లాడవా?

అ : అదే (అనుమానంగా)

ప్ర : ఏం?

అ : మావాళ్లు యేమంటారో

ప్ర : ఒరే మువ్వు పెళ్లాడేది నీకోసమా, లేక మీ వాళ్ళకోసమా?

అ : వాళ్లకోసమే అనుకో

ప్ర : అనుకో ఏమిట్రా?

అ : అట్నే వాళ్ళు ఒప్పుకోరురా

ప్ర : ఇదిగో—పెళ్ళి నీకోసమైతే వాళ్ళయిష్ట మెందుకురా.

అ : వాళ్లిష్టం కాకపోతే యింట్లోకి రానివ్వరుగా.

ప్ర : ఓరి దవటా! ఇదేనట్రా నీ మగతనం

అ : అదేమిట్రా బాబూ!

ప్ర : ఛా! పూరుకో పెద్దముగాడిలా మాట్లాడ బోతావ్.

శ : ఒరే అవతారం మాటల్లో మరచాను నీకేదో లెటర్ వచ్చిందిరా.

అ : ఉట్టి లెటరేనా?

శ : కాకపోతే!

అ : మనియార్డరు రావాలే

ప్ర : ఓరి దద్దమ్మ యీ వేళ ఆదివారం రా!

అ : అయితే లెటర్ ఎలా వచ్చింది?

శ : ఎవరో ఒక అబ్బాయి వచ్చి యిచ్చి పోయాడు.

ప్ర : ఎక్కణ్నుంచిరోయ్?

అ : ఎవర్రా! ఆ అబ్బాయి? ఏది యిలా ఇవ్వు.

శ : (లేచి బల్లమీద ఒక కవరుతీసి) యిదిగోరా (యివ్వబోవును)

ప్ర : (లాక్కొని) చింపి చదివేస్తాము రా.

అ : ముందు నన్ను చదవనివ్వరా.

ప్ర : లవ్ లెటర్ కాదుగా?

శ : లవ్ లెటర్ అయితే అయివుండాలి.

అ : ఏమిట్రా బాబు! నన్నిలా ఆడిస్తున్నారు? నాకు లవ్ లెటర్లెక్కణ్ణుంచి వస్తాయిరా.

ప్ర : అయితే చదువుతాను. (చింపి చూస్తూ) ఒరే అవతారం! మిస్ మోహిని యెవరురా?

అ : అది ఓ బ్రహ్మరాక్షసిలే.

శ : ఏం! దాని గొడవేమొచ్చిందిరా?

ప్ర ఒరే శరత్ వీడు యేమీరాయరగని వంగవాదిలా ఉన్నాడు గాని కథానాయకుడురా.

శ ఏ రోయ్?

ప్ర గోడలమీద పిడిపేరు మిస్ మోహిని పేరు వ్రాసినంటే కిట్టనివా డెవడో వ్రాసాడను కున్నాను గాని యీ ఉత్తరం చూస్తే అక్షరాలా నిజంరా.

శ అదేమిట్రోయ్ మనవాడింతటి వాడయ్యాడా?

అ ఒరే అదేమిట్రా నాకేమీ తెలియదురా నా మాట నమ్మండ్రా... ఆ అమ్మాయంటే నే నాకు భయంరా.

ప్ర : ఏం?

అ : నాకు కొట్టింపుంటుందిరా. నా రెండు చేతులు కలిపితే ఆ అమ్మాయి ఒక చెయ్యి అవుతుంది.

శ : అయితే నేంలే!

అ : అయితే యేమిట్రా. ఆచేత్తో తోస్తే అమడ దూరం పోతాను. అయినా ఆ అమ్మాయికి నాకు ఏమీ సంబంధం లేదురా.

ప్ర : ఉందో లేదో యీ ఉత్తరమే చెప్తుంది.

అ : కాదురా యీ ఉత్తరం యెక్కణ్ణుంచి వచ్చిందో గాని విచిత్రంగా ఉంది. నే నేమీ యెరుగనురా.

శ : ఏదిరా ఆ ఉత్తరం చూపనియ్ (తీసుకొనును.)

అ : అసలు ఆ ఉత్తరం చూడనివ్వండిరా. నాకు గాబరాగా ఉంది.

ప్ర : ఉంటుంది. ఉండదూ! నలుగురికి తెలిసాక అలాగే ఉంటుందిలే.

అ : నిజంగా నా కేమీ తెలియదురా.

ప్ర : నిజమో అబద్ధమో తెలుస్తుందిగా. ఒరేవాడికి చదివి వినిపించరా, వాడి ప్రియురాలు వ్రాసిన ప్రేమలేఖ.

శ : చదువుతాను. వినరా.

ప్రియా!

నీవు చెప్పినట్లు అన్నీ సిద్ధంచేసి ఉంచాను. నీవు యీ ఉత్తరం అందిన వెంటనే నీవు చేసిన ఏర్పాట్లనుగూర్చి తెలియజేయుము. మనము యీరాత్రి 10 గంటల ట్రెయిన్‌కే వెళ్ళిపోదాము. వివరములు ట్రెయిన్‌లో మాట్లాడుకుందాం. 'ఇక వుంటా.'

నీ ప్రేయసి,
మోహిని.

అర్ పీడి దుంపతెగా జెండాయెత్తేవరకూ వచ్చావే. ఇంతాచేసి పైగా ఎందుకురా బుగ బొంకుతావ్.

అ : ఒరే శరత్ మోహిని అంటె నా కెంత భయమో నీకు తెలుసుకదట్రా.

శ : అవుననుకో. కాని పైకి భయం నటించి లోలోపల యిన్ని పన్నాగాలు పన్నావని నాకేం తెలుసు?

అ : పన్నాగా లేమీ పన్నలేదురా. ఇదంతా మాయగా వుంది.

ప్ర : మాయగానే ఉంటుంది. ఈరాత్రికికూడా మాయగానే మాయమౌతావ్.

అ : లేదురా.

శ : ఏమిలేదు?

అ : ఏమోగాని నిన్నా ఈవేళ ప్రొద్దుట లేవగానే నీ మొఖమే చూచాను. నిన్నదూస్తే ప్రాణాలు పోయేట్లు పీ జేడిపించాడు. సరే యేదోవిధంగా సరిపెట్టుకుంటే ఈ వేళ యీ గండం. నాతల పగిలిపోతోందిరా. ఆ మాయదారి మోహినికి నే నేదారికావా? రామచంద్రప్రభూ! ఇంకెవరూ లేరూ?

శ : ఒరే యీ నాటకాల కేమిగాని మాటొస్తే చెబుతున్నాను. మొన్న మోహిని దాన్నుకు 5 రూ॥లు పెట్టి టిక్కట్టు కొని వెళ్ళలేదూ?

అ : వెళ్ళాను.

శ : మరింకేమి?

అ : అంటే?

శ : అంటే మోహినిమీద మోజుందేగా.

అ : నా ప్రాణం తీస్తున్నావురా. మొర్రో నా కేమీ తెలియదురా అంటే మోజు గీజు అంటావేమిట్రా?

ప్ర : అంతేలే!

అ : ఒరే కుమార్ నువ్వైనా అదేమాటట్రా. ఒట్టేసి చెబుతున్నాను. నాకూ మోహినికి ఏమీ సంబంధం లేదురా.

ప్ర : ఒరే వట్టె, వటి ఒట్టులేసేబదులు యీ సంగతి ముందుగా మాతో చెబితే మీకు గ్రాండుగా సెండాఫ్ యిచ్చేవాళ్ళంగా.

అ : నామాట నమ్మరుట్రా?

శ : నిజం చెప్పితే నమ్మేవాళ్ళమే.

అ : నేను చెప్పింది నిజమేరా.

ప్ర : నిజంగా అబద్ధం చెప్తున్నావన్నమాట.

అ : కాదురా. నాకేదో కాలం మూడిందిరా.

ప్ర : ఏం?

అ : ఏమో నాకు చాల భయంగా వుంది.

ప్ర : భయమెందుకురా హాయిగా పోయి ఆనందించి రారా!

అ : ఆనందించడమా! మోహిని అమ్మాయి కాదు. అమ్మలాగుంటుంది నాకు.

శ : ఫరవాలేదులేరా.

అ : అమ్మ బాబోయ్. ఒరే యిలారా!

శ : ఏం?

అ : (శరత్ చేయి పట్టుకుని లేనగుండెమీద పెట్టి) చూడరా గుండె గబగబా కొట్టుకుంటోంది

ప్ర : కొట్టుకుంటే కొట్టుకుందిగాని బలేఛాన్సు కొట్టావులే.

అ : ఛాన్సేమిట్రా నా మొఖం. వచ్చేలాగుంటేను మీరు నన్ను బొత్తిగా కంగారు పెడుతున్నారురా. నేను మాయింటి కిప్పుడే పోతాను.

శ : ఓహో అదా. ఎలాగా గోలయ్యిందని పట్ట పగలే తీసుకుపోదామనా.

అ : అయ్యొయ్యో! నే నేమిచేసేది?

ప్ర : మేమున్నాముగా, మేమిద్దరం వచ్చి మీ ఇద్దర్నీ సంతోషంగా సాగనంపుతాం.

అ : అదిగోరా! అదేమంట. ఒరే నన్ను బ్రతకనివ్వరురా మీరు. తలనొప్పివస్తోంది.

ప్ర : ఏస్ప్రిపిల్ తెమ్మంటావా?

అ : ఏస్ప్రివద్దు ఏమీవద్దు.

శ : అవునులే మోహినివస్తే మందులెందుకు?

అ : ఒరే బాబ్బాబు మీకు దణ్ణంపెడతాను మీరు మోహినీగోడవతల పెట్టకండిరా. నేను చల్లగా పడుకొంటాను. (పడుకోబోతాడు).

శ : అదిగోరా మోహిని వస్తోంది.

అ : (కంగారుగాలేచి) వస్తోంది (పటకలబ్రమింపతాడు. అటూయిటూ పారచూస్తాడు.)

శ : అటు...కాదు, కాదు...యిటు.

అ : (భయంతో) ఒరే దేమో సమాధానం చెప్పి పంపివేయండిరా. నేను దాక్కొంటాను.

శ : ఏమి చెప్పమంటావు?

అ : మాయింటికి వెళ్ళిపోయానని చెప్పు.

శ : ఇంటి అడ్రస్ అడిగి మీయింటికి వెడితేనో?

అ : అవును. ఆమాట నిజమే. అప్పుడు మరీ గోడవౌతుంది. సరే యేదోచెప్పండి. (మంచం క్రింద దాక్కుంటాడు).

ప్ర : మంచంక్రింద ఉంటే దొరికిపోతావురా.

అ : (బయటకువచ్చి) అయితే అలా బయటకు పారిపోతాను. (పారిపోబోతాడు.)

శ : ఒరే నీ దొంగవేషాల కేమిగాని యిలారా దాక్కొంటానని మాకు మస్కాకొట్టి మోహినీతో ఆ దారిని అటే పోదామనా!

ప్ర : అవునట్రా.

అ : ఒరే మీకు దణ్ణంపెడతాను. నన్ను చంపకండిరా! (చెయ్యిపట్టుకొని చూచుకొని) జ్వరం వచ్చింది. (మూలుగుతూ పడుకుంటాడు.)

ప్ర : ఒరే జ్వరంమాత్ర ఉంది ఇవ్వనా?

అ : ఆ మాత్ర జ్వరానికా లేక వైకుంఠయాత్రకా?

[కుమార్, శరత్ నవ్వుకుంటారు.]

శ : ఒరే అవతారం! ఈ ఉత్తరం చదవరా.

అ : ఉత్తరం వద్దు. పత్తిరం వద్దు.

శ : ఒకసారి చూడనైనా చూడరా!

[అవతారం చూస్తాడు.]

శ : ఓరి చవట దద్దమ్మ—నీకు నిజంగా బుర్ర లేదురా—మేము తమాషాచేస్తుంటే జడిసి జ్వరం తెచ్చుకున్నావా?

అ : ఆ!

శ : అవును. నిన్నాడించడానికి నేనే వ్రాసా నీ ఉత్తరం. చూడు నా దస్తూరి.

అ : (లేచి) నిజమేనట్రా?

ప్ర : నిజమే నిన్నరాత్రి నేను తమాషా చేశానని ఈ వేళ శరత్ చెప్పాడురా. అంతేకంటె ఇంకేమీ లేదు. కాస్త ఇప్పుడైనా స్థిమితపడు.

అ : అమ్మయ్య దంపేడురా నిజంగా. వీడు ముచ్చెమట్లు పట్టేటట్లు చేసాడు. నువ్వు జ్వరం వచ్చేటట్లు చేసావ్.

శ : ఇదంతా వట్టి నవ్వులాటకి, కోపం తెచ్చుకోకు.

[తెర.]

అల్లయవేమారెడ్డి వేమవరశాసనము

శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి

శ్రీనాథుఁడు కాశీఖండమను కృత్యాదిలోఁ దన కాశ్రయదాతయైన వేమభూపాలుని మహత్త్వము నుగ్గడించుచు, ఆంధ్రభీమఖండమునందెల్లెడ నైన యీ భూవిభుని త్యాగశీలత్వమును విపులముగ వర్ణించి యున్నాఁడు.

ధరియింప జేసిరి దర్భపవిత్రము వ్రేళ్ల
 గీల మాణిక్యాంగుళీయకముల
కల్పింప జేసిరి గంగమృత్తిక మీఁదఁ
 గస్తూరికా పుండ్రకములు నొసల
సవరింప జేసిరి జన్నిదంబుల ప్రేలఁ
 బ్రాలహారములు ముత్యాల సరుల
చెనువంగ జేసిరి శిఖల చెన్నగుమేలఁ
 గమ్మని క్రొత్త చెంగల్వ విరుల
ధామముల నిండి పైఁడియుఁ దనరఁబడఁగ
బ్రాహ్మణోత్తము లగ్రహారములవారు
వేమభూపాలుఁ డనుజన్ము వీరభద్రు
ధాత్రి నేలింప గోదావరీ తటమునందు.

కా॥ 1-37.

ఈ పద్యమునందు అల్లయ వేమారెడ్డి, తన తమ్ముఁడగు వీరభద్రారెడ్డిచే రాజమహేంద్రవర రాజ్యమును పాలింపఁ జేయుచుండఁగ, గోదావరీతీరాగ్రహారవాసు లయిన బ్రాహ్మణులు బహువైభవములతో విరాజిల్లు చుండిరని శ్రీనాథుని కోట మనకు విదితమ్మైనది. ఈ పద్యము భీమేశ్వరపురాణ కాశీఖండములలో నేక రూపముగఁ గూర్పఁబడినది. మఱియు నీ పద్యమున వేమారెడ్డి యాశ్రయము లభించిన నాఁటి శ్రీనాథుని మూర్తి విభవము కూడ గోచరించుచున్నది.

భీమేశ్వరపురాణ కాశీఖండ కృత్యాదులలో శ్రీనాథుఁడు ప్రధానముగ వేమభూవిభుని ప్రశస్తి నుగ్గడించుచు జతిగూర్చిన వాక్యము లన్నియును చారిత్రక ముగా పరమసత్యములు. ఆ వాక్యముల కుపష్టంభక ములుగా మన కిప్పటి నాఁటి శాసనము లుపలబ్ధము లగు చు న్నవి. అల్లాడ వేమారెడ్డి గోదావరీతీరము నందు వేదవేదాంగ విదులయిన బ్రాహ్మణుల కగ్రహారములు దానము చేసినటులు, అతఁడు వెలకొల్పిన వేమవర శాసనమే తార్కాణము. 1

ఈ శాసనము 118 సంస్కృత శ్లోకములుగలిగి, కవితా విభవముతోఁ గూడిన ఖండకావ్యమై వెలయు చున్నది. ఈ శాసన మూలము చెక్కఁబడియుండిన రాగి రేకులు నేఁడు లండను నగరములోని వస్తు ప్రదర్శన శాలలో హిందూదేశపు ప్రాచ్య పుస్తకశాఖలో నెల కొల్పఁబడి యున్నట్లు నీ శాసనము నాంగ్లాక్షరముల లోఁ బ్రకటించిన 'హల్ట్జు' దొర తెలిపియున్నారు.2 ఈ శాసనమునందలి సంస్కృతశ్లోకములు, కుడిని గ్రామసీమా విభాగమును దెలుపు వచనము, నాఁనాఁటి తెలుఁగు లిపిలో వ్రాయఁబడి యుండినట్లు లా దొర వారి వ్రాతవలన తెలియవచ్చుచున్నది. అందు శాసన ప్రతిబింబములు మాత్రము కూర్పఁబడలేదు. ఆంగ్లాక్షర ములలో సమగ్ర శాసనము ప్రకటింపఁబడినది. ఈ శాస నమున వేమారెడ్డి పాలనము నాఁటి చారిత్రకాంశము లెన్నియో మనకుఁ దెలియవచ్చుచున్నవి. ఆ విషయ మును కొంత వివరించెదను.

---

1. See. Epi. Ind. Vol XIII PP. 237 to 257. Saka 1356. A.D. 1434.

2. This 'Grant' was presented by Sir Walter Elliot in 1887 to the trustees of the British Museum, where it is now preserved in the Department of Oriental printed books and Manuscripts, with the register number "Indian Charters 26". A slip of paper pasted on the back, which gives an abstract of the Contents and other notes, states that it was received from Rajahmundry Epi. Ind. Vol XIII PP. 237.

ఈ దానశాసనము, అల్లయ వేమారెడ్డి తుల్యభాగతీరమందున్న 'మహేంద్రవాడ వెదురుపాక' యను గ్రామములు రెండిటిని గలిపి 'అల్లాడరెడ్డివేమవరము' అని తనపేర బ్రాహ్మణులకు అగ్రహారముగా నిచ్చినపుడు రచింపఁజేయఁబడినది. అందలి విషయ మీతీరుగ నున్నది.

శ్లో. తుల్యభాగాతటే వేమభూపాల స్సముదిర్సతి
అగ్రహారం ద్విజశ్రేష్ఠేభ్య స్సమగ్రాహార మగ్రియమ్
ఏకం గ్రామం కృత్వా గ్రామౌ వెద్రిపాక పినమహేంద్రాడౌ
కృత్వైవ వేమభూపో నిజనామ్నాల్లాడరెడ్డివేమవరమ్

శ్రీ సప్తగోదావర తుల్యభాగ
మధ్యేగ్రహారో మహనీయ సస్యః,
ఆచంద్ర మాతారక మాదినేంద్ర
ముజ్జృంభితాం వేమనృపాల ధర్మః'

గోదావరీ సప్తశాఖలలో మొదటిది తుల్యభాగ. తత్తీరమున నేఁటి రామచంద్రపురము తాలూకాకు సంబంధించి, మహేంద్రవాడ, వెదురుపాక యను గ్రామములు రెండుగలవు. ఈ శాసనమునందు 'వెదురుపాక' 'వెద్రిపాక' గను, మహేంద్రవాడ 'పినమహేంద్రాడ'గను వాకొనఁబడినవి. దక్షారామమునకే వెదురుపాకగ్రామము వాయవ్యమునగ మూఁడుక్రోసుల మేరలో నున్నది. భీమేశ్వరాలయమునకు ముందున్న సప్తగోదావరమునకు, తుల్యభాగాశాఖకు నడుమనున్న భూమి యగుటచే నిది పవిత్రతమ మని సూచించుటకు కడపటి శ్లోకమున "శ్రీ సప్తగోదావరతుల్యభాగ మధ్యే గ్రహారః" అని పేర్కొనఁబడినది.

ఈ రెండు గ్రామముల పరిసరభూభాగము బహుసస్యశ్యామలము వివిధఫలవృక్షసము పేతము అతి సారవంతమును. ఈ విషయ మీ శాసనమునం దొక శ్లోకమున నిట్లు వర్ణింపఁబడినది.

'ఫలభరితవారి శేళ, క్రముక పనస చూతకదళీ కారామమ్.
కలమేక్షుశాలి తిలచణ, ముద్గాది సమస్తసస్య సంపూర్ణమ్

ఈ శ్లోకమునందు వాకొనఁబడిన తోఁటలు, సస్యములు ధాన్యములు నా ప్రదేశమున విరివిగ మనకి నాఁడును గానవచ్చుచునే యున్నవి. చెఱుకు తోఁటలకు నాఁడు నేఁడుకూడ నాఖండము మిక్కిలి ప్రసిద్ధము.

అల్లయ వేముఁడీ రెండుగ్రామముల భూభాగమును, ఇంచుమించు నూఱువృత్తులుగ విభజించి, బ్రాహ్మణులకు తత్తద్గ్రామములందలి దేవతలకు సర్వకర పరిహారముగా దానముచేసెను. ఈ దానమునకు ప్రతిగ్రహీతలైన విప్రులు, ఋగ్యజుస్సామవేదవేత్తలు' వివిధశాస్త్రవిశారదులు నైయుండిరని శాసనశ్లోకములు తెలుపుచున్నవి. అందొకశ్లోకమున తదగ్రహారవాసి విద్వాంసుల శాస్త్రవ్యాహారము లిట్లు వర్ణింపఁబడినవి.

శ్లో. ఏకత్ర తర్కాంచ పరత్రతంత్రం
వేదాంత మన్యత్ర పరత్రశబ్దం,
వ్యాభాషమాణైః కలకంఠకంఠైః
సంఘోష్యతే రోమాంబుధివ ద్విభేదైః.'

ఆ యగ్రహారమునందలి విప్రోత్తములు తర్కము మీమాంస, వేదాంతము, వ్యాకరణము మున్నగు శాస్త్ర విషయములను మధురకంఠములతో భాషించుచుండఁగ నగ్రహారము సముద్రమువలె మార్మ్రోగుచుండెనని దీని భావము. మఱియు నీ శాసనమునందలి శ్లోకములలో నెవ్వరి కెన్నెన్ని వృత్తు లీయఁబడినవియో తెలుపు ప్రకరణమునందు తత్తద్వృత్తి భాగులైన విప్రుల కులగోత్రాదులతో పాటు, వారివారి వేదశాఖలు శాస్త్రపాండిత్యములు కూడఁ బేర్కొనఁబడినవి. వారిలోఁ గొందఱు ఋగ్యజుస్సామములలో నొక్కొక్క వేదము చదివినవారు. మఱికొందఱు ద్విశాఖా వేదులు, వేఱొకకొందఱు తర్కవ్యాకరణాది శాస్త్రవేత్తలును గలరు. నిన్న మొన్నటివఱకు వెదురుపాక విద్వత్కళలకు నిలయమై యుండినట్లు అచటి వృద్ధులు వాకొనుచున్నారు.

వేమునిభక్తి భావము:

వేమ భూపాలుఁడు పరమశివ భక్తుఁడు; మహాదాతుఁడు నను విషయము భీమేశ్వర పురాణ కాశీఖండ కృత్యాదులలో మనకు వినవచ్చుచున్నది. ఆ విషయ మీ శాసనమునందును నిరూపింపబడినది.

శ్లో॥ అనేకగోచర్మమహాగ్రహార
దాతా సుధీరల్లయ వేమభూపః
షట్కాల సంపూజిత పార్వతీశో
హేమాద్రి దానాని సదాకరోతి

మఱియొకశ్లోకమున వేమభూపాలుని మహత్త్వమిట్లు నిరూపింపఁబడినది. మార్కండేయమహేశ్వరుఁడు, తన పుత్రులలో విఘ్నేశుఁడు మదయుతుఁడు, కుమారస్వామి బహుముఖుఁడు, భైరవుఁడు దిగంబరుఁడు నగుటఁజేసి, నిర్దోషుఁడు, నిజభక్తుఁడు, ఉన్నతాశయుఁడు, శివార్చాపరుఁడు నగు వేమభూపాలుని సృజియించెనని చమత్కరించినాఁడు కవి.

'శ్లో॥ విఘ్నేశో మదసంగతో బహుముఖ స్స్కందో౽పి ముక్తాంబరో
నిర్లజ్జః ఖలు భైరవో౽యమితి సంచింత్యాత్మజానాం స్థితిమ్,
నిర్దోషం నిజభక్త మున్నతధియం వీరంశివార్చాపరమ్
మార్కండేయమహేశ్వరో౽జనుత వేమేంద్ర ముర్వీశ్వరమ్.'

ఈ వేమ భూపాలుని భక్తివైభవమును శౌర్యవిశేషమును శ్రీనాథుఁడును విశేషముగ వర్ణించియే యున్నాఁడు. అతఁడు పలికెను.

'త్ర్యంబకోదిత కన్యకాంబు పూరంబున
నఘమర్షణస్నాన మాచరించి
నిద్దమైన మడుంగు సీర్కావి దోవతి
కనక మేఖలతోడఁ గటి ఘటించి
మూల మంత్రాక్షరంబుల బూతి మంత్రించి
పుండ్రకంబులు ఫాలమున ధరించి
శ్రోత్ర ముక్తములతో రుద్రాక్ష మాలిక
లష్టోత్తర శతంబు లఱుతఁదాల్చి
పుండరీకాసనమునఁ గూర్చుండి శంభు
నర్చనముఁ జేయునపుడు మహోగ్రమహుఁడు
చాల నొప్పారు రెండవ శంభువట్లు
వీరనారాయణుఁడు రెడ్డివేమ విభుఁడు.'
—కాశీ. 1-89.

చారిత్రకాంశములు:

భీమేశ్వరపురాణ కాశీఖండకృత్యాదులలో అల్లాడరెడ్డి వేమారెడ్ల విజయములు సావష్టంభముగ వర్ణింపఁబడినవి. ఆవిషయము లీశాసనశ్లోకములందుఁ దార్కాణింపఁ బడినవి.

'శ్లో॥ జిత్వానల్ప వికల్పకల్పితబలం తంచాల్పఖానం రణే
మిత్రీకృత్య సమాగతం గజపతిం కర్ణాట భూపంచ తం
హత్వా కోమటి వేమసైన్యనికరం భూయో౽పి రామేశ్వరే
ప్రాజ్యం రాజమహేంద్రరాజ్య మకరో దల్లాడ భూమీశ్వరః'

ఈ శ్లోకమునం దల్లాడరెడ్డి విజయములు వర్ణింపబడినవి.

'శ్లో॥ దేవబ్రాహ్మణ సీమ్ని యః కరధనం సంత్యక్తవాన్ దుస్త్యజం
దాక్షారామభువి వ్యధత్త విపుల శ్రీ గోసహస్రాణి యః
జిత్వా యః పటుసప్తమాడియ నృపాన్ క్రాంత్వా కళింగక్షితిం
సింహాద్రౌ పురుషోత్తమే పటుజయస్తంభాన్న జృంభా న్యధాత్.'

ఈ శ్లోకమందలి విషయము లల్లయ వేమునకుఁ జెందినవి. మఱియు నీ శాసనమందు మాత్రమే అల్లాడ వేముఁడు కాటయ పౌత్రియు, కాటయ వేముని పుత్రియు, హరిహరరాయల దౌహిత్రియు నగు హరిహరాంబను పెండ్లాడెనను విషయము తెలుపఁబడినది. వేముని సోదరుఁడు వీరభద్రారెడ్డి కాటయ వేముని కూఁతురగు అనితల్లిని పెండ్లాడెననియు వివరింపఁబడినది.

'శ్లో॥ పౌత్రీం కాటయవేమయక్షితిపతేః పుత్రీం చ కాటప్రభోః
దౌహిత్రీం చతురర్థధీం హరిహరక్షోణీపతే శ్శాసితుః
తన్నామ్నా విదితాహ్వయాం హరిహరాంబాం చారు ముద్వాహయ
త్వేషా వేమమహీశమల్లనృపతే స్సామ్రాజ్య లక్ష్మ్యా సమమ్.'

'కాటయ వేమక్షితిపతి,
తనయా మనితల్లినామ విఖ్యాతామ్,
కమలామివ కమలాక్షః,
స్వాముదవహ దల్లభూప వీరేంద్రః.'

అల్లాడ వేమారెడ్డి హరిహరాంబను పెండ్లాడినట్టు లీశాసనమువంటి నిరూపింపఁ బడినది. వీరభద్రారెడ్డి అనితల్లిని పెండ్లాడినట్టు లితరశాసనము లందును, కాశీఖండము నందును నుగ్గడింపఁబడి యున్నది.

'మనుతుల్యుండగు కాటభూవరుని వేమ క్ష్మాత
లాధీశునం
దనఁబొంగి గ్రహాణంబుచేసెఁ బ్రియమొందన్ వీర
భద్రేశ్వరుం
డనితల్లి ద్వనితామతల్లి సుదియాప్రాద్రీంద్ర
సీమావనీ
ఘన సామ్రాజ్యసమర్థ సుప్రథిమపాత్రా దిండి
రాదేవతన్.'
—కాశి. 1-43.

ఇఁక నీశాసనము తుదిని "ఓమ్. అల్లాడరెడ్డి వేమవరానకున్ను వేమసానక్కు దొడ్డవరానకున్ను పొలమేర సీమసంధులు" అని యుపక్రమించి, అగ్రహార సీమావిభాగమును దెలుపు దీర్ఘమైన తెలుఁగు వచన మొకటిగలదు. ఆ వచనమునం దానాఁటి వచన రచనా స్వరూపము కొంత మనకుఁ దెలియవచ్చును. ఆ వచనమునందు మహేంద్రవాడ వెదురుపాకలకుఁ జేరి వివిధ దిశలందున్న గ్రామములు కుంటలు పాకలు పేర్కొనఁబడినవి. వానిని ప్రత్యేక దృష్టితోఁ బరిశీలించిన జాలవఱకు లిత్తిన్నామములతో నిలిచియే యున్నవి. కొన్నిటి పేళ్లు మఱుఁగుపడియున్నవి. నాయూహ కందిన విషయమును కొంత వివరింతును.

శాసనములో 'అల్లాడరెడ్డి వేమవరము' అని పేర్కొనఁబడిన మహేంద్రవాడ వెదురుపాక గ్రామములు తుల్యభాగానదితీరమున నంటియున్నవి. మహేంద్రవాడ అనపర్తికి కొంచెము ఈశాన్యముగ రెండుక్రోసుల మేరలో నున్నది. మహేంద్రవాడకు తూర్పుగ రెండుక్రోసుల మేరలో వెదురుపాక గలదు. వెదురుపాకకు తూర్పున 'కొంకుదురు' అను గ్రామము గలదు. వచనములో వేమసానక్కు దొడ్డవరము అని పేర్కొనఁ బడినది ఈ కొంకుదురు గ్రామమే. ఈ మూఁడు గ్రామములకు దక్షిణపు టెల్లలో పసలపూఁడి, పోమేశ్వరము, లొల్ల, రామవరము అను గ్రామములు గలవు. రామవర గ్రామవాసులు ప్రసిద్ధహరిదాసులు నగు వల్లమిల్లి బసివిరెడ్డిగారిని గలిసి, మాటాడు ప్రసంగములో, కొంకుదురునకు 'దొడ్డవరాగ్రహార' మను నామము గలదని, ముప్పదియేండ్లనాఁడు వారికి కొంకుదురు గ్రామస్థులకు పెద్దలు సమర్పించిన సన్మానపత్రాధారపూర్వకముగ నాకుఁ దెలిపియుండిరి. వృద్ధుల యెఱుకలో ఆనాఁటి కా పేరు నిలిచియుండె నను విషయమును నా కెఱిఁగించిన యుపకృతికి శ్రీ బసివిరెడ్డిగారికి నే నెంతయుఁ గృతజ్ఞుఁడను.

ఈ పొలమేరసీమ సంధులలోఁ బేర్కొనఁబడిన పసలపూఁడి, పోమేశ్వరము, నొల్ల (నేఁటిలొల్ల) పంచలపాక గ్రామముల నామములు నాఁడు నేఁడు నట్లే నిలిచియున్నవి. వేమవరపు తూర్పుసీమలో వెదురుపాక కాగ్నేయముగను, పసలపూఁడి కీశాన్యముగను—వెల్పూరి తిల్లవరము—అను గ్రామము ఈ శాసనములోఁ గనఁబడుచున్నది. ఆ ప్రాంతమునం దిప్పటను నది వినఁబడుటలేదు. ఈ శాసనమునకుఁ బూర్వము కాటయవేముని అహోబలశాసనములో ఈ వెల్పూరి తిల్లవరము కనఁబడుచున్నది. 3

ఈ శాసనమునందుఁ బేర్కొనఁబడిన సీమాసంబంధమునుబట్టి, ఈ తిలవరము అనునది రామచంద్రపురమునకు ఉత్తరముగ నొకక్రోసు దూరము నందుండవలయు నట్లు తెలియవచ్చుచున్నది. అచట నేఁడు 'కోత్తూరు' అను గ్రామ మొకటి గలదు. అది తిల్లవరము పాడుపడఁగా నేర్పడిన క్రొత్తయూరా? యని యొక యూహ. చాల శ్రమించి కనుఁగొనినను ఆ పేరియూరు ఆ ప్రాంతమున వినరాలేదు.

పశ్చిమసీమలో "వేమవరపు గ్రామగ్రాసపూరి ప్రాంతకుంత పడమరముఖమై గ్రామగ్రాసపూరి నొల్ల పొలిమేరనకుదుంగాను పడమరముఖమై వచ్చెను. అంతి రెండూళ్ళున్నవి. అంతనుండి కుంతపడమరముఖమై వచ్చి అన్నపోలారెడ్డి కొమరగిరిపుర గ్రామగ్రాసపూరి ప్రాంతకుంతం గలసెను." వేమవర గ్రామగ్రాసపూరు- అనఁగా నేఁటిరాయవరము. దీనికి పేరు తెనువాలి యేర్ప

3. See S. i. i. Vol X No 577. Saka 1332 A. D. 1410.

కాటయరెడ్డి వేమారెడ్డింగారికి అర్ధాంగలక్ష్మి అయిన ఆ కొమరగిరయ్యంగారే ఇకొమరగిరయ్యంగారై అవతరించిన ఇ[కొ]మరగిరయ్యంగారికి తల్లింగారైన తల్లి సానమ్మంగారు ఇకొమరగిరయ్యంగారికి[న్ని] కాటమరెడ్డి వేమారెడ్డింగారికిన్ని సుకృతముగాను గౌతమీ తీరమందును శ్రీ వేదాద్రి నరసింహదేవరకు ఆచంద్రార్కము ప్రతిసంవత్సర తిరునాళ్ల మహోత్సవానకు ధారపోసి సమర్పణచేసిన వెలుమూరి తల్లవరము.

డినది. అంతకుముందే రాయవరము వెదురుపాకకు శివారు గ్రామము నొల్లకు రాయవరమునకు నడుమనుండి బయలుదేరి పడమరముఖముగా వచ్చునపుడున్న రెండూళ్ళ రామవరము భోలమూరును వానిమీదుగా వచ్చినపుంత అనపర్తిపావరముపుంతతోఁ గలియును. అన్నపోలారెడ్డి కొమరగిరిపురము అనఁగా 'అనపర్తి' యని నేనూహించుచున్నాఁడను. ఈ అనపర్తి గ్రామమును కొటయ వేమారెడ్డి కొమరగిరి పుత్రుఁడైన అనపోతారెడ్డిచే, రాజమహేంద్రవరమునందలి గోపాలస్వామికి దానముచేయించెను. 4 అనపోతపురమే అనపర్తియై యుండునేమో? కొటయ వేముఁడు దానములొసఁగిన గ్రామములకు సాధారణముగా 'కొరమగిరిపురము' అని నామకరణము చేసియున్నాఁడు. శాసనములో అనపోతారెడ్డి యనుటకు బదులు అన్నపోలారెడ్డి యని చదువఁబడియుండెనా? లేక మూలమునం దట్లుండెనో?

మహేంద్రవాడ రాయవరముల కుత్తరసీమలో 'కొమరపాలెము' అను గ్రామమున్నది. అది యీ సీమా సంధులలో నైరృతి మూలతరువాతే, "అంతనుండి అపుంత పడమరముఖమై వచ్చెను. ఉత్తరముఖమై రాంగాను కనమున్నది. అట్టి రాంగాను కొమరగిరిపురపు పొలములోను పుంతదగ్గరను మామిడిరావిన్నున్నవి" అని యీ కొమరపాలెము పేర్కొనఁబడినది.

మహేంద్రవాడమీఁదుగా ప్రవహించిన తుల్యభాగ వెదురుపాక పావరముదగ్గఱనుండి మరలి పందలపాకమీఁదుగాఁ బ్రవహించినది. వెదురుపాక సమీపమున తుల్యభాగలో నొకగుండము గలదు. అది వెదురుపాకవాసుల కొక పవిత్రజలాశయము. వెదురుపాకకు దక్షిణమున తుల్యభాగకాలువ కనఁబడును. కాని అది గోదావరికి ఆనకట్టకట్టినతరువాత క్రొత్తగా త్రవ్వఁబడిన మురికికాలువ. పురాతనమైన తుల్యానదీశాఖ వెదురుపాకకు ముందునుండి రేయురలి, పందలపాక మాచిడాన సంపద ముక్తీశ్వరముమీఁదుగా చొల్లంగిచేరినది. ప్రాఁత తుల్యభాగ యేదిశముగ నుండెనో యీవిషయమీశాసనమునుబట్టియే యూహింపఁగాఁ దెలియవచ్చినది. "ఈశాన్యం పాలిమేరసీమనుండి తుల్యభాగపడమటిదరివట్టుకొని దక్షిణముఖమై వచ్చింది. తుల్యభాగ ఆవలివారికి పగమున్ను ఈవలివారికిపగమున్ను. అంతట దక్షిణముఖమై గ్రామగ్రాసపూరి నరసగుండాము దాంకా వచ్చెను. ఆతుల్యభాగలోని గుండాము వేంకరావికి చెందునని పందలపాక ఊళ్ళకాపులు చెప్పిరి. అంతనుండి తూర్పుముఖమై తుల్యభాగవచ్చెను. వేంకరావకున్ను పందలపాకకున్ను తుల్యభాగసీమ." పందలపాక సమీపమున, అనఁగా కొంకుదురునకు పందలపాకకు నడుమ పెద్దకాల్వకొక తూతికట్టడ మిరుపార్శ్వములగలదు. దానికిరుపైపులను తుల్యభాగాశాఖకు గుర్తులు గానవచ్చుచు నేయున్నవి. తుల్యభాగాశాఖతోఁ గలిసిపోయి వెదురుపాకమీఁదుగా ప్రవహించుచున్నట్లు గానవచ్చెడి మురికికాలువ తరువాత త్రవ్వఁబడెనను విషయము వెదురుపాకలో పెద్దలవలనవిని, గుర్తింపగల్గితిని.

ఈశాసనవచనములోఁ బేర్కొనఁబడిన వెల్వారితల్లవరమును గుర్తించుటకు కడచిన వేసవిలో చాల శ్రమించితిని. ఇంకను శ్రమించుచుంటిని. వృద్ధులనోట పరిపాటినిబట్టి తెలియవలసినవిషయ మిది. అహోబలశాసనమునందు పేర్కొనఁబడిన గౌతమీతీరమందలి వేదాద్రి నరసింహస్వామి యనఁగా 'కోర్కొండ నరసింహస్వామి' యను విషయమును నేనూహించితిని.

4. మా. రెడ్డిసంచిక అనపర్తిశాసనము.

నిద్రాళువు

శ్రీ పురాణం సూర్యప్రకాశరావు

పొద్దు వాటారింది.

గాలి సాగి సాగి ఒక్కమారు స్తంభించిపోయి నట్టుగా మధ్య గదిలో నుంచి వినవచ్చే సందడి ఉన్నట్టుండి ఆగిపోయింది. పార్వతమ్మ గుమ్మంలోకి వచ్చి చూసింది. అంతకు కొద్దిసెకన్ల ముందు వరకూ కూచుని చర్చలు, ఉపన్యాసాలు, తీర్మానాలు, తర్జనభర్జనలతో గడిపిన స్త్రీలంతా ఒక్కరొక్కరే ఇంటిముఖం పట్టారు. నారాయణి ప్రతివక్కరి నుదుటా కుంకుమ బొట్టు పెడుతూ మర్నాడు ఇంకా ముందుగానే రమ్మని మరీ మరీ చెప్పి వీడ్కోలు ఇస్తోంది.

చలిగాలి వుండీ వుడిగీ ఒక విసురు విసురుతోంది. ఇళ్ళ కప్పులమీద తెల్లటిపొగ సుళ్ళు తిరుగుతూ గాలి వాలున పడి సాగిపోతోంది.

నారాయణి సన్నగా కూనిరాగం తీస్తూ గదిలోకి వచ్చి "ఏం పిన్నమ్మా! ఒక్కతివీ ఒంటరిగా కూచుని ఏవిఁ చేస్తున్నట్టు?" అంది.

పార్వతమ్మ కళ్ళజోడు చివరి నుంచి నారాయణి ముఖంలోకి చూస్తూ "ఏఁవీఁ లేదమ్మా పుస్తకం చదువుకుంటున్నాను" అంది.

"అంతేనా, లేకుంటే మీ వాళ్ళెవరిమీదకైనా ధ్యాసమళ్లిందా?"

"అలాంటిదేమీ వుండదమ్మాయ్. నీకు విసుగెత్తి నువ్వు పొమ్మనాలిగాని అంతవరకూ ఈ చూరు పట్టుకుని వేలాడుతూనే వుంటాము."

నారాయణి వ్యంగ్యంగా నవ్వుతూ "నిన్ను బాగా అర్థం చేసుకున్న మనిషిని కాబట్టి ఇప్పుడు నువ్వన్నమాటని సరదాగా, తేలిగ్గా తీసుకుంటాను. కాని ఒక విషయంమటుకు గుర్తుపెట్టుకోవటం మంచిది. ఆదరించటంలో, అభిమానించటంలోనూ ఈ నారాయణమ్మ ఎవరికీ తీసిపోయేదికాదు. జీవితంలో నిగ్రహం, మట్టు మర్యాదా, సభ్యతా, అభిమానం విడిచిపెట్టే సిగ్గుమాలిన మనిషీ నారాయణి కాదు. నారాయణి బరితెగించినఆడది కాదు. భర్త అదుపాజ్ఞల్లో ఒద్దికగా మసులుకొనే నిగ్రహంగల ఆడది.

ఈ చివరి మాటలు ఏ ఉద్దేశంతో ఎవరికి నిర్దేశించబడ్డవో పార్వతమ్మ గ్రహించకపోలేదు. అప్రస్తుతంగా, ఆమె ఈ ధోరణి ప్రదర్శించటం పార్వతమ్మ మనసుకి కొంత నొప్పి కలగకపోలేదు. ఇలాంటి మాటలు వినటం పడటం ఇవాళేమీ కొత్తకూడాకాదు.

ఈ నిందా గర్భితమైన ప్రస్తావన ఒక స్త్రీ నోటి నుండి వినటంవల్ల ఆమె మనసులో కోపానికి బదులు కొంత జాలి, బాధ ఆక్రమించాయి. ఆమె ఒక్కమారు బరువుగా నిట్టూర్చి తిరిగి తన దృష్టి పుస్తకంమీదకు మళ్ళించి ఇంతవరకూ చదివిన ఆఖరి పేజీ కోసం వెతుక్కోసాగింది. కాని అప్పటికే చీకటి బాగా అలుముకు పోవటంవల్ల ఆమె ఇక చదవలేక పుస్తకం మూసి దాన్ని భద్రంగా టేబిల్ మీద వుంచి మధ్య గదిలోకి వచ్చింది.

నారాయణి దీపం వెలిగించి గది మధ్యన కొంకికి ప్రేలాడదీస్తోంది.

"అమ్మాయ్! పెద్దదాన్ని నేనుండగా నీ కెందుకీ అనవసరపు శ్రమ చెప్పు. ఈ పూటనుంచి నేను వండి పడేస్తాను. నా మాట విను." అంది పార్వతమ్మ.

"ఒద్దులే. నేనే వండుతాను."

"నువ్వలాగంటే నేనేం చెప్పేది. పెద్దదాన్ని నేనుండగా నీ కెందుకీ బాధ"

"ఇందులో బాధేముందమ్మా. ఎవరు వండితే నేం?" అంది నారాయణి.

"నా మనసెంత బాధపడుతుందో నీ కర్థం కావటం లేదు."

"నువ్వు చుట్టానివమ్మా. చుట్టాలు చుట్టాలుగానే మన్నించబడాలి" అంది నారాయణి.

పార్వతమ్మ ముఖంమీద నీలిఛాయలు ఆవరించాయి. ఆమె ముఖం ముకుముకుపోయింది. తను ఏ పరిస్థితుల్లో ఈఇంటిగడప తొక్కిందో, ఈ నారాయణమ్మకి తెలియకపోదు. ఆమెనోట మరి మాట పెగల్లేదు. తను వచ్చి కొద్దిరోజులైనా తనవునికి ఇతరులకి బాధాకరమైపోయింది అప్పుడే. తనకి మనశ్శాంతితోపాటు భుక్తికూడా అవసరం. అవి లభ్యమయే స్థానంకోసం ఆమెపడిన ప్రయాసలోనే లోకంచేత వేలుపెట్టి చూపించుకునే దురవస్థకి గురికావల్సివచ్చింది. ఇప్పుడు నారాయణి అన్నమాటలవెనుక నిగూఢమైయున్న భావం పార్వతమ్మకి ఒక హెచ్చరికవంటిదనే చెప్పాలి. నారాయణికి భర్త అష్టవదృష్ట్యా అయితే భర్త జీవించివున్నంతకాలం వైభవంగాగడిపి భర్తతదనంతరం వీథిని పడ్డ ఒకదిక్కుమాలిన ఆడదాన్ని కొంతకాలం పోషించగలగటం అన్నది పెద్దలెక్కలోకి రావల్సిన అవసరం లేదు.

"నిరాశ్రయులకి ఈ విశాలప్రపంచంలో ఏమూలనోకాస్త నిలబడే ఆస్కారం లేకపోతుందా అనే ఆశని పెంచుకోవటం తెలివితక్కువ"అని మనసులోనే అనుకున్నదై పార్వతమ్మ వీథివసారాలోకినడిచి మెట్లమీద స్తంభానికి చారబడి కూచుండిపోయింది.

వీథిగేటు తెరుచుకుని అనూరాధ చంద్రుణ్ణి వెంటబెట్టుకుని లోపలికివచ్చింది. వస్తూనే "ఏం అమ్మమ్మా! అలా కూచున్నావు మాటామంతీ లేకుండా?" అంది అనూరాధ.

పార్వతమ్మ ఆలోచనల్లోనుంచి తెప్పరిల్లి కంగారు కప్పిపుచ్చుకుంటూ "వచ్చావా అమ్మాయ్! రా! ఇలా వచ్చికూర్చో" అంటూ ఆప్యాయంగా పలకరించింది.

అనూరాధ పార్వతమ్మపక్కగా కూర్చుని తన స్నేహితురాలి అనుభవాలగురించి చెప్పసాగింది.

లోపల నారాయణి వంటప్రయత్నంలో మునిగిపోయింది. మధ్యమధ్య కొడుకుని మందలిస్తూంది. పార్వతమ్మ ఏదో తెలియని ఉభియానంతో, సిగ్గపడుకూ వుండీ వుడిగీ వంటగదివైపు చూస్తూ మనవరాలిమాటలు వింటూ వూఁ! కొడుతూంది.

"నువ్వు నే చెప్పేది వింటున్నావా అమ్మమ్మా"

"ఎందుకు వినటంలేదు. అవును, ఆ సరోజని చూట్టానికి పెళ్ళికొడుకువచ్చాడు. వచ్చింతర్వాత ఏమయింది. చెప్పు"

అనూరాధ పెద్దగానవ్వేసి "నువ్వసలు వినటంలేదు. నేను అతిర్వాత చాలాచెప్పాను. నువ్వింకా మొదట్లోనే వున్నావు" అంది.

"అవునుగాని నేనొకటడుగుతాను చెబుతావా అమ్మా" అంది పార్వతమ్మ మెల్లగా.

"ఏమిటది?"

"మీ అమ్మకంటే నేను పెద్దదాన్నికదా. నేనిలా కూచుని చిన్నవాళ్ళచేత చేయించుకుంటే చూసేవాళ్ళేమనుకుంటారు. అదేమైనా బాగుంటుందా?"

"పోనీ నువ్వే వంటచెయ్యకపోయావా?"

"అలాగని నేనంటే మీఅమ్మ వల్లకాదంటుంది."

"పోనీలెద్దూ హాయిగా కబుర్లుచెప్పు లేకపోతే కథలుచెప్పు"—ఈపదహారేళ్ళ అనూరాధ అమాయకత్వానికి పార్వతమ్మ కరిగిపోతూ "నీకు బంగారంలాంటి జతగాడు దొరుకుతాడమ్మా" అంది.

అనూరాధ సిగ్గుతో జేవురించిన ముఖాన్ని పక్కగాతిప్పుకుని "నువ్వు చక్కనిమాటలు ప్రయోగిస్తావు అమ్మమ్మా, చాలామంది మొగుడు, భర్త అంటూ చాలామోటుగా మాట్లాడతారు" అంది.

పార్వతమ్మ "అవునమ్మా వాటిఉచ్చారణలో వినవచ్చేధ్వని చాలాకర్కశంగా వుంటుంది. ఈపదాల్లో లాలిత్యంలేదు. కాని ఆలాలిత్యం చాలాఅవసరం" అంది ఆమె.

కొద్దిసేపు పోయింతర్వాత పార్వతమ్మ ఏదో జ్ఞప్తికి వచ్చినటుగా "అన్నట్టు అడగటం మరిచాను. ఇంతకీ సరోజనికి ఆసంబంధం కుదిరిందా లేదా?" అంది.

ఇంకా ఏమీ తెలియలేదు. ఆ అబ్బాయ్ ఏమీ బాగుండడనీ వయస్సులోకూడా "వార ఎక్కువగా వుందనీ విన్నాను" అంది అనూరాధ.

"సరోజనీ వాళ్ళు బాగా వున్నవారు కారేమిటి?"

"పెద్ద స్థితిమంతులు కారు. మనలాంటివాళ్ళే."

"ఆ అమ్మాయికి వరుడు నచ్చాడటనా?"

"అదే నే నడిగాను. దానిదంతా వేదాంతం. 'నాకు నచ్చట మేమిటి? వాళ్ళకి నేను నచ్చాలి. అంతే. అతను నాకు నచ్చటమనే ప్రసక్తిలేదు. అసలది ఒక సమస్య కానేకాదు' అంది సరోజని. ఇదెక్కడైనా

వుంటా అమ్మమ్మా. ఎంత మగవాడయితేమటుకు, ఆడ దానికి మటుకు కోరిక లుండవా ఏమిటి?"

"చూడవచ్చిన ప్రతి మగవాణ్ణీ ఆడపిల్ల తన అభిప్రాయాల దృష్ట్యా ఎన్నుకోవటం అన్నది సాగేది కాదు. సరోజని విషయంలోనూ అంతే అయింది. ఇక ఆమెకి వెంగవాడంటూ ఒకడు తన మెళ్లో పుస్తె కడితే చాలు, అనే స్థితికి వచ్చేసింది. విసుగెత్తిపోయింది పాపం" అంది పార్వతమ్మ.

ఏదైనా అనుభవంలోకి వచ్చేవరకూ దాని స్వరూప స్వభావాలు ఊహించగలగటం అన్నది అందరికీ సాధ్యమయేది కాదు. అనూరాధకూడా ఆ అందరిలోను ఒకర్తె. ఈ పెళ్ళి చూపుల తతంగాలు, బేరసారాలు, విరసనలు విరుత్సాహాలు-ఇవన్నీ ఇంకా ఆమెకు అనుభవానికి రాలేదు. ఆమె ఆలోచనలు అడివిలో మామిడిచెట్టును అల్లుకుని స్వేచ్ఛగా విస్తరించుకునే మల్లెతీగకు మల్లే సున్నితంగా సాగిపోతూంటాయి. ఏదో ఒక అందమైన వూహాచిత్రాన్ని నిర్మించుకో గలగటంవరకే ఆమెకు చేతనయింది. ఆ రూపాన్ని, లక్షణాలని స్మరించుకొని తియ్యగా బాధ పడగలదు. అంతేగాని ఆ అందమైన కలలు విరిగిన అలలుగా నేల కూలినప్పుడు పొందే భంగపాటును నిభాయించుకోగలగటం అన్నది ఎంత అవసరమో, అటువంటి అవస్థ సంప్రాప్తించటం ఎంత సత్యమో ఆమె వూహించలేదు. అందుకనే సరోజని అన్నమాటలు ఆమెకు విచిత్రంగా తోచాయి. ఆ మాటల వెనక ధ్వనించే నిస్పృహ ఆమెకి అవగాహన కాలేదు.

అనూరాధని దగ్గరగా హత్తుకుంటూ ఆకాశంలో తెల్లటి మేఘాలచాటునపడ్డ చందమామను చూపిస్తూ "ఈ చందమామ, అలా పరుగులు తీసే మబ్బులు ఒకప్పుడు నన్ను కవ్వించి కవ్వించి ఏడిపించాయి. అయినా నాకు కనువిప్పు కలగలేదు. జాగృతి నాకు లేకపోయింది. నాకు ముత్తువదిలి కనువిప్పు కలిగే సమయానికి అంతా మీరిపోయిందని తెలుసుకున్నాను. అప్పుడు నా వునికి నాకు అర్థం అయింది."

"నువ్వు వుండి వుండి పిచ్చిగా మాట్లాడుతూంటావు అమ్మమ్మా! నాకేమీ అర్థంకాదు. ఇంతకీ అదేమిటో పూర్తిగా వివరంగా చెప్పరాదూ" అంది అనూరాధ. కాని ఆ కంఠంలోని చిరుసులితనం లిప్తలో మాసిపోయింది.

"అదేమిటి అమ్మమ్మా ఎందుకిలా కన్నీరు పెట్టుకుంటావు" అంది అనునయపూర్వకమైన ధోరణిలో.

"ఏమే అమ్మాయ్! అన్నానికి లేవండి" అంటూ లోపల్నించి నారాయణి గొంతు వినపడంతో పార్వతమ్మ కంగారుగా కళ్లు తుడుచుకుని "పో అమ్మా! అమ్మ పిలుస్తోంది" అంది.

అనూరాధ లోపలికి వెళ్ళింది. పార్వతమ్మ గాఢమైన నిట్టూర్పు విడిచి అనూరాధని అనుసరించింది.

2

నారాయణి లోకందృష్టిలో అంత ఆశ్చర్యపడవలసిన మనిషి కాదు. కాని ఆమెను చూసి పార్వతమ్మ ప్రతిక్షణం దిగులు పడుతూనే వుంటుంది. భయపడుతూనే వుంటుంది. అందుకనే తన విషయంలో నారాయణి కొన్ని కొన్ని సందర్భాల్లో కర్కశమైన విధానం అవలంబించినా పార్వతమ్మ దాన్నంత తీవ్రంగా తీసుకోదు. సర్దుకుపోతుంది. చిన్నతనంనుంచీ పెద్దవాళ్ళ చాటున కట్టుబాట్లలో పెరిగిన నారాయణి ఇప్పటికీ ఆ లక్షణాలు, గుణాలు లేశమైనా వదులుకోకుండా తనలో జీర్ణం చేసుకుని మసులుతూంటుంది. ఆమెకీ ప్రపంచంలో భర్త చరణాలు తప్ప మరేమీ అవసరం లేదు. ఆమె హృదయాన్ని అంతగా దోచుకోగలిగిన శక్తిగల వస్తువేదీ మరొకటి ఈ ప్రపంచంలో లేదు. కన్నకూతురైనా, కొడుకైనా, మరింకెవరైనా వాటి తర్వాతనే. అందుకనే ఆమె తల్లి పుట్టెడు జబ్బులో వుండి సహాయానికి రమ్మనమని కబురు చేసినపుడు నారాయణి నిర్మొహమాటంగా వీలులేదని జవాబు పంపించింది. భర్తకి ఎక్కడ ఇబ్బందికలుగుతుందో అని ఆమె ఆలోచించింది. తండ్రిపోయిన కొత్తలో విధవ తల్లి తోడుగా నాలుగురోజులుండమని ఆమె ప్రాధేయపడితే "నేను ఒంటరిదాన్నా అమ్మా, వారిని ఎవరు చూస్తారుచెప్పు- అని సమాధానం చెప్పింది. ఆమె ఈ ముప్పయి అయిదు సంవత్సరాలలోనూ ఎన్నడూ సుమ్మం వదిలి ఎక్కడా నాలుగురోజులున్న పాపాన పోలేదు. తల్లి మనసు కష్టపెట్టుకుంటే ఆమె చెప్పిన సమాధానం ఇది- వారు అందరివంటి మనిషి కారమ్మా నేను ఒక్కక్షణం లేకపోతే వారికా ఇంట్లో అంతా అయోమయం అయిపోతుంది. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రపోయేవరకూ ఆయనకు సంబంధించిన ప్రతి చిన్నపని నేను చూసుకోవాలి. నిజంగా

ఆయింట్లో ఏవస్తువు ఎక్కడుంటుందో ఆయనకి తెలియదు. అలాంటి పరిస్థితుల్లో నేనిక్కడ వుండిపోతే ఎలాగు చెప్పు. నేను లేకపోతే ఆయన వేళకి అన్నం తినటం కూడా మానేస్తారు. మాసినబట్టలు వేసుకునే ఆఫీసుకి వెళ్ళిపోతారు. అలమారు తీసుకుని ఇస్త్రీబట్టలు తీసుకోవటంకూడా ఆయనకు చేతకాదు. అసలే ఇంట్లో గడిపేకాలం కొద్ది. నేనుకనక లేకపోతే అసలు ఇంటిముఖమే చూడరు," అంటూ చాలా చెప్పింది. తల్లి అంత దుఃఖంలోనూ కూతురు కాపరంలోని అన్యోన్యతకి మురిసిపోయింది.

"పోనీలే తల్లీ నీయింటికి నువ్వువెళ్ళు" అంది ఆమె.

తల్లి చనిపోయిందని తెలిసినప్పుడు నారాయణి ఈ సంఘటన గుర్తుకు తెచ్చుకునే చాలాకాలం బాధపడింది. ఇలా కన్నతల్లినే కష్టసమయంలో దూరం చేసుకోగలిగిన నారాయణమ్మ తన విశ్వాసాన్ని సహస్రాంశమైనా భంగపరుచుకోకుండా ఇన్నాళ్ళనించీ కాపరంచేస్తోంది. భర్తను "ఇలాగైతే ఎలాగు చెప్పండి" అనే తూష్కారపూరితమైన మాట ఎన్నడూ ఆమె అనలేదు. ఆమె మనోఫలకం మీద లిఖించుకున్నమంత్రం: ఎలా జరుగనున్నది అలా జరుగుతుంది, అంతా భగవంతుని ఇచ్ఛ—ఇది. ఈ నెల యింతే జీతం ఇస్తున్నాను అని ఆయన చెప్పనుకూడా చెప్పకుండా సగానికిసగం ఖర్చుచేసి మిగిలింది చేతిలో పెట్టినప్పుడు "పోనీలెండి ఎలాగో గడుపుకుందాం" అనేది నారాయణి. అక్కడికీ ఆమె చాలా బాధపడి ఆ "ఎలాగో" అనే నీరసమైనపదం పొరపాటున దొర్లినందుకు మనసులో వందతిట్టుకుని భర్త మనసు ఎక్కడ నొచ్చుకుంటోనని, "దివ్యంగా వెళ్ళిపోతుంది. ఏమీ ఫర్వాలేదు" అని మళ్ళీ సర్దిచెప్పేది. అవునుగాబోలు అంతకంటె ఎక్కువడబ్బు ఈ సంసారానికి అనవసరంకాబోలని ఆయన అనుకుని ప్రతినెలా ఇంచుమించు అలాగే ఇస్తూంటారు. నారాయణి ఏనెలా ఇల్లుగడవటం అన్నది ఇబ్బందిగా వున్నదని తెలిసినా ఎన్నడూ ఎదటపడి "రెండొందలు జీతం తెస్తున్నారుకదా ఇలా ఎనభైలూ తొంభయిలు ఇస్తే ఎలాగు చెప్పండి. ఇంత సంసారం గడవాలా?" అని అడగదు.

ఇలాగే నాలుగురాళ్ళు వెనక వేసుకుందాం. ముందు ముందు అవసరం వస్తుంది. పిల్లలుగలవాళ్ళం" అనే ముందుదృష్టిలేకుండా ఆ సంసారం నెట్టుకొస్తున్నారు.

ఒకటి రెండుమార్లు కూతురు వివాహప్రసక్తి నారాయణి తీసుకొచ్చినప్పుడు వీరభద్రంగారు అవును చెయ్యాలి అన్నారంతే. అంతకుతప్పించి తానుగా ఆందోళనపడి పూనుకుని నడుంకట్టుకుని వరునికోసం అంటూ వెతికినపాపాన పోలేదు. తానుగా ఆ ప్రసక్తి ఎన్నడూ లేవటం వుండదు. 'ఈలోకంలో నాకు కావల్సిందల్లా వేళకిభోజనం, రాత్రి పేకాడుకుందుకు క్లబ్బూ—ఈ రెంటికి మించినది మరొకటి లేదు నాకు.' అన్నట్టుగా వుంటారాయన. ఆయనకి మొదట్నించీ అలా సాగుతోంది. మొదట్నించీ కూడా నారాయణి ఎక్కడికక్కడ సర్దుకుపోయే మనస్తత్వంతో ఇదివుంది - ఇదిలేదు—ఇలాంటి ఇంటి బాధ్యతలు కూడా అంతా తనమీదనే వేసుకుని పొరుగింటి అబ్బాయిని, పనిమనిషిని బతిమిలాడి, మంచి చేసుకునో, అణాలూ, బేడలు ముడుపుపెట్టో ఇంటికి కావల్సినవి తెప్పించుకుంటూంటుంది. ఇప్పటికీ అంతే, ఈవిధమైన పరిసరాల్లో ఆయన మనసు మరింత సంకుచితమైపోయింది. తను ఇంటి బాధ్యతలు పట్టించుకోకపోవటంవల్ల కలిగే ఇబ్బందిని ఆయన వూహించలేకపోయారు...అలా వూహించే అవసరం లేకపోయింది. దాంతో ఆయనకి సంసారం అంటే సరైన దృక్పథం లేకుండాపోయింది. జీవితంలో అతి ముఖ్యమైన బాధ్యతల విషయంలో ఆయనకి చాలా చులకనైన, తేలికైన అభిప్రాయాలు ఏర్పడిపోయాయి. ఎవరన్నా ఈ సంసారం ఈదలేక చస్తున్నాను! అంటే ఆమాట ఆయనకి చాలా హాస్యాస్పదంగా తోస్తుంది. వీళ్ళంతా తెలివితక్కువవాళ్ళు అన్నట్టుగా ఆయన తేలిగ్గా నవ్వేస్తూంటారు. ఆయనకున్న పెద్ద బాధ్యతల్లా క్లబ్బు నిర్వహణ. అది సక్రమంగా సాగుతుందా లేదా, ఎవరెవరు చందాలు సరిగ్గా నెలవారీగా చెల్లిస్తున్నారు, ఎవరెవరు ఎగవేస్తున్నారు? ఇదిచూసుకోవటంవరకే. అందులో ఆయన ప్రస్తుతం కార్యదర్శి పదవి నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కరోజు ఆ లెక్కలు చూసుకోవటంలోనూ, ఒళ్ళు తెలియకుండా తాగి పేక ఆటలో తగువులాడుతున్న వాళ్ళని చాకచక్యంగా సర్ది

ఏ ఒక్కరూ క్లబ్బుమీద అవిశ్వాసం ప్రకటించి సభ్యత్వానికి రాజీనామా ఇవ్వకుండా చూసుకోవటంలోను ఆయన బుద్ధి చాలా, పదునైనదని చాలామంది కార్యవర్గ సభ్యులు ఆయన్ని వుబ్బితబ్బిబ్బు చేసేస్తూంటారు. సహజంగా కొస్త ప్రశంసలకే వుబ్బిపోయే తత్వంగలమనిషి కావటంవల్ల ఆయన తన బాధ్యతను మరింత శ్రద్ధగా పట్టుదలగా నిర్వహిస్తూ అవసరమైతే ఒక్కొక్కవాడు ఇంటిముఖమే చూడకుండా గడిపిన సంవత్సరాలుకూడా లేకపోలేదు. ఇల్లు వదిలిపెడితే ఇంతబాధ్యతా భరించగలిగే వీరభద్రంగారు ఇంట్లోమటుకు కనీసం ముఖం కడుక్కుందుకు నీళ్ళయినా ముంచుకోలేరు. అదీ నారాయణి అందివ్వాల్సిందే. ఈ పద్ధతిలో కించిత్తు లోపం జరకూడదు. అసలు జరగనుకూడాను. ఆయన ఇంట్లో వుంటే ఆ పదినిముషాలుకూడా, ఆ క్లబ్బుగోడవలే కథలు కథలుగా చెబుతారు. నారాయణి ఆయన మనసు ఎక్కడ చిన్నబోతుందోనని ఒక చెంప నిద్రకమ్ముకుని వస్తున్నా అణచుకుంటూ ఎంతో శ్రద్ధగా వింటున్నట్టుగా నటిస్తూంటుంది. తానుగా ఈ సంసారంలో ఇది వుంది, ఇది లేదు, ఈ పెళ్ళికెదిగిన అమ్మాయి సంగతేమిటి? అనికూడా ఆమె నోరువిప్పి అడగదు. ఆయనంతట ఆయన ఇటువంటి విషయాలు అంత ముఖ్యమైనవిగా పట్టించుకోరు: ఒక్కముక్కలో చెప్పాలంటే నారాయణికి గడిచిన నిమిషంతోగాని- గడవబోయే నిమిషంతోగాని అంతగా ప్రమేయం పెట్టుకోదు. నడుస్తున్న క్షణంలోనే ఆమె ఆలోచనలు పరిమితమై వుంటాయి. నారాయణిలోని ఈ అద్వితీయ గుణసంపద చాలామంది స్త్రీలని ఆకర్షించింది. వాళ్ళంతా ఆమెను తెగ అభినందిస్తూంటారు. ఆదర్శప్రాయమైన వ్యక్తిగా ఆమె నలుగురి మన్ననలనీ పొందగలిగింది. "ఏదో ఇలాగ కాలం వెళ్లిపోతేచాలు, అన్నట్టుగా నిర్లిప్తతగా, గంభీరంగా ఆమె నవ్వే నవ్వులోని గర్వపూంకాలకి ఆ నారీలోకం అంతా ముగ్ధులైపోతూంటారు. అలా ఆమె నవ్వినప్పుడే పార్వతమ్మగుండెలు చెరువైపోతాయి. ఆమె మనసు భయభ్రాంతిమై కుతకుతలాడిపోతుంది. కాని ఏమీ అనలేక, ఈ అమాయికత్వానికి దిగులుపడుతూ అనూరాధని గట్టిగా హృదయానికి హత్తుకుంటుంది. "జీవితంలో చెలగాటాలాటం చాలాప్రమాదం. ప్రతిక్షణం ఎంతో దూరదృష్టితో మసులుకున్నా కష్టాలు తప్పవు. అలాంటిది ఇంత నిర్లక్ష్యంగా వుంటే ఎలాగమ్మా? ఎలాగు చెప్పు. ఈ రోజులు ఎలాంటివి.?" అంటుంది పార్వతమ్మ. అనూరాధకళ్ళల్లోకి చూస్తూ తన చెంపలు చెరువు చేసుకుంటుంది పార్వతమ్మ.

ఇవాళ ఏమైనా కానీ, ఎవరేమనుకున్నా తన హద్దుమీరి ఒకవిషయం గట్టిగా అడగాలనుకున్నది పార్వతమ్మ. రాత్రి భోజనాలదగ్గర తనమనస్సులోని విషయాన్ని వెళ్ళగ్రక్కింది.

"అవునుగాని ఎన్నాళ్లిని అమ్మాయిని ఇలా వుంచుకుంటాం నాయనా! దాన్ని ఒక ఇంటిదాన్ని చెయ్యవద్దూ?" అంది.

నారాయణి ఏమీ మాట్లాడలేదు.

ఈ కూతురుపెళ్ళి ప్రసక్తి తెచ్చినప్పుడల్లా వీరభద్రంగారికి చాలా ఇబ్బందిగా వుంటోంది. ఈ ప్రస్తావన ఆయన కంతగా రుచించలేదు కాబోలు ముఖం చిట్లించి "అవును చెయ్యాలి మరి" అన్నారు ముక్తసరిగా.

"చెయ్యాలంటే అందుకు గట్టిప్రయత్నం వుండొద్దూ?"

ఏదీ కలసిరావటంలేదు. ఈ ఉద్యోగంతో అసలు తీరటంలేదు." అన్నారాయన అయిష్టంగానే.

"కలిసిరావటానికి మనం చేసిన ప్రయత్నం ఏముందసలు? వాటంతట అవి వస్తాయా? ఎంతో శ్రమపడితే కుదురుతాయి. ఎరికలోవున్న సంబంధం ఏదైనా వుందా?" అంటూ ఆమె ఆయన విసుక్కు తగ్గట్టుగానే రెక్కించసాగింది.

ఒకవిధంగా ఈ ప్రశ్న పరంపర ఆయన్ని చాలా ఇరకాటంలో పెట్టాయి. ఆయన ఏమీసమాధానం చెప్పకుండానే "నేను పెద్దదాన్ని కాబట్టే చనువుతీసుకొని చెబుతున్నాను. ఏమీ అనుకోకు నాయనా. ఇన్నాళ్లి నుంచి చూస్తున్నాను. నీకసలు బొత్తిగా ఇంటి బాధ్యత లేదు. అసలు పదహారేళ్ళ కూతురు పెళ్ళికి ఎదిగి వుందనే ధ్యాసే నీకు వున్నట్టు తోచటంలేదు. ఎన్నాళ్ళని ఇలా సాగుతుంది నాయనా! కాస్త ఆలోచించుకోవద్దూ" అంటూ ఆమె తన వునికినే విస్మరించి మాట్లాడే సాహసం తెచ్చిపెట్టుకుంది. ఈ మాటలు ఎంతవరకూ పని చెయ్యాలో అంతవరకూ పని చేసాయి.

ఆయన "పెళ్ళి చెయ్యాలంటే బోలెడంత డబ్బు కావద్దూ. మన దగ్గర అంత డబ్బు లేదుగా" అన్నారు.

తను చాలా తెలివిగా జవాబు చెప్పానని ఆయన అనుకున్నారు.

"అవును కావాలి. అందుకని పెళ్ళి మానకుంటామా! ఎక్కడైనా అప్పన్నా తెచ్చి చెయ్యాలి. నేనింతగా ఎందుకు చెబుతున్నానంటే మనం ఏదైనా ఒక మంచి సంబంధం చూసి ఆపిల్లని ఓ ఇంటిదాన్ని చెయ్యాలి. లేదా దాని కాళ్ళమీద అది ఆధారపడగలిగే అర్హతయినా ఆమెకి మనం కల్పించాలి. వూరికే ఇంట్లో పెట్టుకునే బదులు చదివించినా బాగుండేది. ఏదీ లేకుండా ఆమె జీవితం ఏమికాను. ఇలాంటి సమస్యలు జాగ్రత్తగా ఆలోచించుకుని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించుకోవాలి. ఆపిల్ల ఎదిగినకొద్దీ పెళ్ళిళ్ళు కావటం కష్టమైపోతుంది. ఇంత నిర్లిప్తతగా వుండటం ఏమీ బాగాలేదు." తలుపు వారనుంచి అనూరాధ గాజులగలగలలు విని ఆమె అతి ఉద్విగ్నంగా "అతిముఖ్యమయిన విషయాలపట్ల ఇలా పట్టించుకోకుండా బాధ్యతారహితంగా తోసుకు తిరగటం చాలా ప్రమాదం నాయనా...చాలా....ప్రమాదం..."

"ఏవిటో ఆ ప్రమాదం!" అన్నారాయన చాలా తేలిగ్గా.

"నీకు అర్థంకాదు నాయనా. నాకు తెలుసు" అని ఆమె కంట నీరు పెట్టుకుని ఎవరూ గమనించకుండా ముఖం చాటుచేసుకుని తుడుచుకుంది. వీరభద్రంగారు ఈ మనిషిధోరణికి చిరాకు పడుతూ "ఏ ప్రసక్తి తీసుకు రావటానికైనా సమయాసమయాలుంటాయి. తిన్న అన్నం సయించాలా! అది వంటపట్టాలా! ఏవిటే గోల" అన్నారాయన చేతిలోముద్ద విస్తరిలోకి విసిరి.

భర్తముఖంలోని అసంతృప్తి గమనించిన నారాయణి ఇక సహించలేక "పిన్నమ్మా, ఆయన కూతురు వివాహంగురించి ఆయనకి బాధ్యత లేదనా నీ అభిప్రాయం. ఆ పాఠాలు నీదగ్గర ఆయన నేర్చుకోవాల్సిన పనిలేదు. అన్నీ అవే జరిగిపోతాయి. దేనికైనా కాలం కలిసిరావాలి. మన ప్రయత్నాలు వృథా." ఈ చవక రకం వేదాంతానికి పార్వతమ్మ "నువ్వుకూడా అలాగే అంటే ఎలాగమ్మా! దేనికైనా మన ప్రయత్నంకూడా వుండవద్దూ. తల్లివై యుండి తొందరచెయ్యటం పోయి నువ్వూ అలాగే ఆ చిన్నదాని భారం భగవంతుడిమీద వేస్తావా!" అంది.

నారాయణికి ఈ వాదనంతా ఒక అప్రస్తుత ధోరణిలా తోచసాగింది. ఆమెకు కూతురు వివాహం గురించి ఆతృతగాని, ఆందోళనగాని లేదని అనుకుందుకు వీల్లేదు. కాని ఈ సమస్య భర్తనువేసుని మాటుడు నొప్పించటం ఆమె ససేమిరా అంగీకరించదు. భర్తని రొక్కించి అడిగే అధికారం తనకే లేనప్పుడు ఎవరో ఒక అంతరబాంతరవ్యక్తి ఈ ధోరణిలో మాట్లాడటం ఆమె సహించలేకపోయింది. "ఇప్పుడు కొత్తగా బాధ్యతల గురించి నీదగ్గర తెల్సుకోవాల్సిన అవసరం లేదమ్మా. ఇక ఆ ప్రసక్తి నువ్వు తీసుకరావద్దు. ఆయన తినే నాలుగు మెతుకులు వంటపట్టాలా? నీపాటి ఆలోచన నాకు లేక నేనా ప్రసక్తి తీసుకురావటం లేదని నీ అభిప్రాయమా?" అంటూ నారాయణి చాలా తీవ్రంగా, గౌరవహీనంగా మందలించింది.

"నారాయణీ! నువ్వు నా కూతురు లాంటి దానివి. నువ్వేమన్నా నేను సహిస్తాను. అందుకోసం పిలవని పేరంటంగా నీయింటికి వచ్చి నీ తిండి తింటున్న దాన్ని. ఈ విషయం నాకనవసరం అని మీరు భావిస్తూ వుండవచ్చు, అనూరాధ నీకు ఎంతో నాకూ అంతే. దాన్ని ఒక యింటిదాన్ని చెయ్యండి. ఈమాటచెప్పే అర్హత నాకే కాదు. మీదంపతుల తీరు చూసిన ఏబుద్ధి గల వ్యక్తికైనా ఆ అర్హతవుంది. నారాయణీ! నిన్ను చూస్తుంటే ఒకప్పటి పార్వతమ్మ అద్దంలో మాదిరిగా కన్పిస్తోందిప్పుడు. ఆ పార్వతమ్మే ఈనాడు పిడికెడు మెతుకులకోసం" ఇక ఆపైన మాట పెగలక ఆమె లేచి పెరటిలోకి వెళ్ళిపోయింది.

వీరభద్రంగారు అయోమయంగా భార్య ముఖంలోకి చూశారు. ఆమె అంతకన్న బాధగా భర్త ముఖంలోకి చూస్తూ వుండిపోయింది. "దేనికో అమ్మమ్మా! నా గురించి మీకెందుకీ బాధ" అన్న అనూరాధ గొంతువిని భార్యాభర్తల ముఖాలు వెలవెలబోయాయి.

3

నారాయణి యింట్లో సమావేశమైన మహిళా మండలిలో ఆనాడు మనోరమ అనే కొత్త వ్యక్తి అందరికీ పరిచయం చెయ్యబడింది. మనోరమ పచ్చగా కొద్దిగా ఎరుపువాలిన జుట్టుతో, పల్చగా, నరుట తిల కంతో, అతిసాధారణమైన, సామాన్యమైన వస్త్రాలంకరణతో సంసారపక్షంగా వుండే మనిషి. ఆమె మాటల

లోని నైశిత్యాన్ని బట్టి ఆమె హృదయపులోతుని కొలవటానికి ప్రయత్నించిన మొదటి మనిషి పార్వతమ్మ. మిగిలినవారెవరూ ఆ దృష్టితో ఆమెను చూడలేకపోయారు. వారంతా ఆమె చరిత్ర విన్న తర్వాత అందులో ఏ మూల ఏ లొసుగు దొరుకుతుందా అది పట్టుకుని ఆమెని తమ నిశితమైన వ్యంగ్యధోరణికి గురి చేద్దామా అనే దృష్టితోనే ఆమెను పరిశీలించసాగారు. నీతులు, నియమాలు, శీలం,—వీటి ఆవశ్యకత ఆడవాళ్ళకున్నంతగా మొగవాళ్లకి వుండదని చాలామంది స్త్రీల అభిప్రాయం. అందుకనే ఆడవాళ్ళ విమర్శకి ఆడవాళ్ళు గురయినంతగా మొగవారు గురికారు. అక్కడ సమావేశమైన చాలామందికి మనోరమ జీవిత చరిత్రలోని అతి ధీరోదాత్తమైన సంఘటనలూ, సన్నివేశాలూ, అతి నీచాతినీచమైన, అవినీతితో కూడిన తొందరపాటు చర్యగా, బరితెగించిన లక్షణాలుగా తోచాయి. ఆమె ప్రస్తుత స్థితికి మూలమైన కారణాలేవీ వారి దృష్టికి ప్రధానాలుగా తోచలేదు. వారి అభియోగమల్లా ప్రస్తుతం ఆమె లక్ష్యం పట్లనే.

"అయితే చదువుకుందామని ఇక్కడికివచ్చారా?" అంది నారాయణి.

"అవును" అని మెల్లగా సమాధానం చెప్పింది మనోరమ.

"ఆ తర్వాత ఏం చేద్దామని?"

"అవసరమైతే ఏదైనా వుద్యోగం చేస్తాను."

"మరి నీ భర్తమాట."

"అదృష్టం బాగుండి వారికి ఏదైనా కలిసివస్తే మంచిదే. లేకపోతే నా సంపాదనతోనే గడుపుకుంటాం"

"అసలు ఇలా చదువుకోవటంలో నీ వుద్దేశం ఏమిటమ్మా" అంటూ మళ్ళీ మొదటికి వచ్చింది నారాయణి. ఆమెకి మనోరమ చెప్పిందంతా సరిగ్గా బోధపడినట్టు లేదు.

మనోరమకి ఈ ధోరణి చిరాగ్గా వుంది. స్నేహపూరితమైన వాతావరణం ఆమెకి ఇక్కడ కనిపించటం లేదు. ఇదేదో న్యాయవిచారణసందర్భంలా తోచసాగింది. తన్ని బోనులో నిలబెట్టి వీళ్ళంతా శల్యపరీక్ష సాగిస్తున్నారు. "నేనున్న పరిస్థితుల్లో ఇలా చెయ్యటం తెలివైన పని అని నేననుకున్నాను. నా రెక్కలమీద నేను ఆధారపడగలిగే శక్తి నాకుండాలి. ప్రస్తుతం ఒక్కగా నొక్క కొడుకు భవిష్యత్తు చూచుకోవాలి. ఆయనకి జీవితంలో ఇంతవరకూ ఒక వుద్యోగమంటూ స్థిరపడలేదు. నేనుకూడా వారికి భారంగా ఎంతకాలం అని వుండగలను. ఈ చదువు నాకు ప్రాణావసరం" అంది మనోరమ.

"అవునమ్మా నువ్వు చాలా తెలివైన పనిచేశావు" అని మెచ్చుకుంది పార్వతమ్మ. ఆమె ఏదో కొత్త ఆవేశంతో లేచి మనోరమ పక్కగా వచ్చి కూర్చుని ఆమె భుజం నిమురుతూ "బాగా శ్రద్ధగా చదువుకో అమ్మా. నాలుగురోజులు శ్రమపడితే నీ లక్ష్యం ఫలిస్తుంది." అంది ఆప్యాయంగా.

ఈ చర్య నారాయణికే కాదు చాలామంది స్త్రీలకు వింతగా తోచింది.

"అయితే నీ చదువు పూర్తి కాకుండానే మీ ఆయనకి ఉద్యోగం దొరికితే?" అంది నారాయణి. "దీనికేం చెబుతావు?" అన్నట్టుగా అంతా ఆమెముఖంలోకి చూశారు. ఇన్ని ముఖాలు తన్ని పరివేష్టించటం గమనించి "అయినా చదువుతాను" అంది మనోరమ దృఢమైన స్వరంతో.

ఈ కంఠంలోని పట్టుదల పార్వతమ్మని ఆకర్షించింది. ఆమె వుత్సాహంగా మనోరమ ముఖంవైపే చూస్తూ కూర్చుండిపోయింది.

"ఇందుకు మీ ఆయన ఒప్పుకున్నాడనుకోను" అంది నారాయణి.

"ఎందుకు ఒప్పుకోరు. ఒకవేళ ఆయన కది అంగీకార యోగ్యం కాకపోయినా ఈ విషయంలో ఆయన ఇష్టాఇష్టాలతో నాకు నిమిత్తం లేదు. నేను చెయ్యదల్చుకున్న పని చేసి తీరతాను. ఈ పట్టుదల నాలో సడలకుండా వుండాలి. ఇది ఒక దీక్ష." అని మనోరమ క్షణం ఆగి ఎవరూ నిశ్శబ్దాన్ని భంగపరచకపోవటం గమనించి "నాకుమటుకు కట్టుకున్న భర్తనీ, కన్నకొడుకునీ తలావకచోటా వదిలి ఇలా వుండటం మనసా. కాని ఆ పట్టుదల అవసరం. జీవితం అనుకున్నంత సులువైందికాదు. కాలం ఎదురుతిరిగినప్పుడు కాళ్ళూ, చేతులూ లేలేని చేతకానితనంతో సర్వం భగవంతుడిమీద భారం వెయ్యటం అన్నది అంత తెలివైనపని కాదు. ఆడది ఇలా చదువుకోవటమే మహా అవమానకరమైన సంగతయితే ఇం-

కంటె అవమానకరమైన స్థితికి స్త్రీ దిగజారవలసి వస్తుంది. భర్త జీవించి వున్నంతకాలం హాయిగా గడిపిన ఆడవాళ్ళు అనేకమంది అంతిమదినాల్లో చిత్తిన ముసుగు వేసుకుని ఇంటింటికీ తిరిగి తిరిపమెత్తుకున్న వాళ్ళని చూసాను. శీలం అమ్ముకుని బ్రతికినవాళ్ళని చూసాను. రైలుకింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్న వాళ్ళని చూసాను. ఇలాంటివి ఎన్నో విన్నాను. మనం బుద్ధిమాంద్యం పెంచుకుని జీవితంలో గౌరవప్రదంగా రోజులు వెళ్ళబుచ్చుకునే అవకాశాన్ని మనం ఎందుకు వదులుకోవాలి. ఇక కొద్దిరోజుల్లో నా ట్రెయినింగు పూర్తయిపోతుంది. అతర్వాత అవసరమని తోస్తే వుద్యోగంలో ప్రవేశిస్తాను. అప్పుడిక నేను కేవలం బ్రతకటం అన్నది ఓ సమస్యగా పరిణమింపచేసుకుని ఆత్మహత్యలకు పూనుకోవాల్సిన అగత్యం వుండదుగా." అంది.

ఈ ధోరణి పార్వతమ్మహృదయానికి నాటుకున్నంతగా మరెవ్వరి గుండెలనీ స్పృశించలేకపోయింది. వారికదంతా హాస్యాస్పదంగానూ, తేలిగ్గానూ తోచింది. చేస్తున్న తెలివితక్కువపనిని సమర్థించుకునే వ్యర్థప్రలాపాలుగా వారు అర్థం చేసుకున్నారు. పార్వతమ్మ కళ్ళు చెమ్మగిలటం ఎవరూ గమనించలేదు. ఆమె బలవంతాన అణుచుకుంది. ఆమె ఆపాదమస్తకం కంపించిపోయింది. మనోరమ ఆడిన ప్రతిమాటా తన్ని వుద్దేశించి అన్నట్టుగానే పార్వతమ్మ గిజగిజలాడిపోయింది. విషాదభారంతో ఆమె లేచి అడుగులో అడుగు వేసుకుంటూ మెల్లగా అక్కడ్నించి నిష్క్రమించింది. చింతాక్రాంతమైన ఆమె హృదయంలో సముద్రఘోష ఆరంభమయింది. ఉవ్వెత్తుగా లేచిన అలలు ఫెడిల్లున వడ్డున విరుచుకుపడ్డట్టుగా ఆలోచనలు మథించసాగినాయి. గదిలోకి నడిచి తలుపు దగ్గరగా వేసి నేలమీదపడి వెక్కివెక్కి ఏడ్చింది. ఏడ్చిఏడ్చి అలాగే సొమ్మసిలినట్టుగా పడిపోయింది. తిరిగి ఆమెకు స్పృహవచ్చి లేచేసరికి ఎదురుగా తన వంక ఆర్తిగా చూస్తున్న అనూరాధ అవుపించింది. అవారనే మనోరమ కూడా వుండటం గమనించి లేచి కూర్చుని చీరచెరుగుతో ముఖం తుడుచుకుంది.

"మీరు పడుకున్న తీరుచూస్తే అది నిద్రలా లేదు. ఒంట్లో ఏదో తేడా వచ్చినట్టుంది. ఇప్పుడు తగ్గిందాండి" అంది, మనోరమ, ఎంతో పరిచయంవున్న మనిషిలా.

పార్వతమ్మ "అవునమ్మా వళ్ళు తిప్పింది. ఇప్పుడు తగ్గింది" అంది.

"నే నన్నమాటలు మీకు కష్టం తోచివుంటే క్షమించండి. నేను మూర్ఖురాల్ని. మీ ఎదట నేనలాంటి ధోరణిలో మాట్లాడ్డం తెలివితక్కువ కాకపోతే మరేమిటి? మీగురించి కొంత విన్నాను. మరి కొంత నేను వూహించాను." అంటూ ఆమె పూర్తి కానివ్వకుండానే అర్థాంతరంగా అందుకొని "అవునమ్మా నువ్వు వూహించింది నాకు తెలుసు. అదంతా నిజం. నువ్వు సరిగానే వూహించావమ్మా. నువ్వన్న మాటల్లో ఏమీ తప్పు లేదమ్మా. ఎక్కడ కుళ్లు కనిపించిందో అక్కడ వేలుపెట్టి చూపించావు. నువ్వు బాగా చదువుకుని నీ పట్టుదల నెగ్గించుకుని ఒక ఆదర్శప్రాయమైన వ్యక్తివి కావాలమ్మా. నువ్వు నెగ్గుతావనే ధైర్యం నాకుంది. మా అనూరాధ కూడా ఇలా చదువుతే బాగుండును" అంది పార్వతమ్మ.

"అవును అమ్మమ్మా! నాకూ చదువుకోవాలనే వుంది. కాని అమ్మకి తెలిస్తే ప్రాణాలు తీసేస్తుంది" అంది అనూరాధ.

మనోరమని ఈ ఇంటి మనుష్యుల్తో పరిచయం చేసిన ఆమె ఇంటావిడ గుమ్మంలో నిలబడి 'మనోరమా! పోదాం వస్తావా?' అంది. మనోరమ లేచి 'వస్తానండీ' అని సెలవు తీసుకుని అనూరాధ పెట్టిన బొట్టును సరిచేసుకుంటూ వెళ్ళిపోయింది.

అనూరాధ ఆమెను సాగనంపటానికి వీధివరకూ వెళ్ళింది. పార్వతమ్మ లేచి కిటికీదగ్గరకు నడిచి కిటికీ గజాలు పట్టుకుని భారంగా ముందుకు వంగి "ఇంతకంటె విశ్రాంతి లభించేచోటు మరొకటి లేదూ? నా రెక్కలమీద ఆధారపడి నేను జీవించలేనూ" అని ఆలోచించింది.

"ఏమిటి మాయదారి చదువులోనమ్మ! నిక్షేపం లాంటి సంసారం వదిలిపెట్టి, ఒక కొడుకుని కని కూడా ఇప్పుడు చదువులేమిటి నా ముఖం. అడిగేవాడు లేక గాని అంతా కిరస్తానీ సజ్జుగా తయారవుతున్నారు. అదే మనం అయితే ప్రాణం వున్నా పోయినా ఇంట్లోనే పడివుంటాంగాని ఇలా సంసారాలు వదులుకుని పరాయి వాళ్ళ ఆర్జన మీదపడి చదువులు వెలగబెట్టటానికి సాహసిస్తామా. ఒకళ్ళని అనేపనే

మంది. ఈరోజులే అలాగున్నాయి. మొగుడికి ఇప్పుడు ఉద్యోగం లేకపోతే ఇక ముందు దొరకదూ? అందుకని తను బరితెగించి వీధిని పడుతుందా? ఛా! ఎంత సిగ్గుమాలిన మనుషులమ్మా! పాపం పండిపోయింది. వుండు చెల్లీ దొడ్లో కాసిన చిక్కుడు కాయలున్నాయి. ఇస్తాను పట్టుకెళ్దువుగాని"—ఈ నారాయణి గొంతు రానురాను దగ్గర కావటంతో పార్వతమ్మ సర్దుకుని కళ్ళు తుడుచుకుని ఏదో పనిలో వున్నట్టుగా మంచం మీద దుప్పటి తీసి దులిపి పక్క వెయ్యసాగింది.

అవతలావిడ నారాయణి వాదానికి తాళం వేస్తూ "పాడుకాలం వచ్చిపడిందక్కా. మన చిన్నతనాల్లో గుమ్మందాటి వీధిముఖాలు చూచి ఎరుగుదుమా? మగవాళ్ల మాటకి ఇప్పటికీ ఎదురు చెప్పటం వుందా? ఆ రోజులు, ఆ భక్తి ప్రపత్తులూ, వినయ విధేయతలూ మట్టూ మర్యాద ఇప్పుడన్నీ మంట గలిసాయి. కాకపోతే కట్టుకున్న మొగుడ్ని, కన్న కుర్రవాడ్ని వదిలి పెట్టి తిరుగుదువమ్మా అంటూ తిమ్మయ్యగారింట్లో పడి చదువులు వెలగబెట్టటానికి ఎన్నిగుండెలుండాలి. ఆడజాతికి చేటుకాలం దాపురించిందక్కా. అసలు మన పెద్దలు చెబుతూంటారే అలాగ ఈ కలియుగం బద్దలయిన పాపంలో ఇంకెంత కాలమో వుండదు. సర్వం నాశనం అయిపోతుందక్కా. ఇంతటి పాపభారాన్ని భూదేవి ఎన్నాళ్ళని మొయ్యగలుగుతుంది" అని ఆమె నారాయణి ఇచ్చిన చిక్కుడు కాయల సంచీపట్టుకుని వెళ్ళిపోయింది.

దీపాలవేళయింది. అనూరాధ దీపం చిమ్నీలు తుడుస్తూంది. నారాయణి పెరటిలో స్నానం చేస్తూంది. మడికట్టుకుని గాని వంటచెయ్యదు నారాయణి. పొద్దుపోయే వరకూ పొయ్యిలో నిప్పు వెయ్యదు. రాత్రి పొద్దుపోయి భర్తవచ్చే సరికి వండిన అన్నం చల్లారి పోతుందని అలస్యంగా వంట ప్రారంభిస్తుంది. పిల్లలకి కూడా బాగా పొద్దు పోయిన తర్వాత తినటం అలవాటయిపోయింది. ఇవాళింకా చంద్రుడు ఆటలు అయి యింటికి రాలేదు. వాడిని అదుపులో పెట్టేవాళే లేరు. రాత్రి ఒక్కొక్కప్పుడు బాగా చీకటి పడిందాకా వాడు ఇంటికిరాడు. అల్లరి చిల్లరగా ఏ కాలవగట్లమీదనో, తోటల్లోనో పడి అల్లరి చేస్తూంటాడు. అదుపులేక వాడి అల్లరి మితిమీరి పోయింది. అప్పుడప్పుడు ఇరుగుపొరుగు వాళ్ళు వాడి మీద ఫిర్యాదులు తెచ్చి నారాయణితో చెబుతుంటారు అయినా నారాయణి వాడ్ని మందలించదు. ఎందుకంటె వాడంటే భర్తకి చాలా గారవం ప్రేమ. అందుకని వాడ్ని ఏమీ అనటం ఆమెకు ఇష్టంవుండదు. వాడిని ఏమన్నా భర్త మనసు కష్టపడుతుంది. మీ వాడు మా పిల్లల్ని కొడుతున్నాడని, తిడుతున్నాడని ఎవరైనా ఫిర్యాదు చేస్తే నారాయణి వాళ్ళనే నాలుగు ఎదురు మాటలని పంపించేస్తుంది. వాడికప్పుడే ఏడేళ్లు నిండుతున్నాయి. అయినా వాడ్ని ఇంతవరకూ బడిలో వేయించ లేదు. అనూరాధ అప్పుడప్పుడు వాడ్ని దగ్గర కూచోబెట్టుకుని తనకు వచ్చిన నాలుగు ముక్కలూ చెప్పబోతుందిగాని వాడి తింగరతనానికి ఆమె తట్టుకోలేక వాడిమానాన వాడ్ని వదిలేస్తుంది. ఇకపోతే నారాయణి, ఎంతసేపూ మడీ, ఆచారమూ, వంటలూ, వార్పులూ సాయంత్రం అమ్మలక్కలతో ముచ్చటలూ వీటితోనే సరిపోతుంది. వాడి చదువుగురించి శ్రద్ధపట్టే అవకాశమే ఆమెకుండదు. ఇక వీరభద్రంగారి సంగతి సరేసరి. ఆయన బాధ్యతలూ, ఇష్టాలు దేశానికి సంబంధించినవై వుంటాయి గాని ఇంటికి సంబంధించినవి కావు.

ఇలా ఒక మూర్ఖమైన వాతావరణం ఆ యింట్లో వ్యాపించి పోయింది. దానికి విరుగుడంటూ లేదు.

చంద్రుడు వళ్ళంతా మన్ను చేసుకుని గెంతుకుంటూ నేరుగా వంటగదిలోకి దూరబడ్డాడు, దారి పొడుగూతా దుమ్ము దులుపుకుంటూను. అనూరాధ "అయ్యో వీడ్ని చూడమ్మా వళ్ళంతా దుమ్ముచేసుకుని కడుక్కోకుండానే ఇంట్లోదూరబడి ఇల్లంతా దుమ్ము చేస్తున్నాడు" అంటూ అరిచింది. అయినా వాడు లక్ష్యపెట్టలేదు. పైపెచ్చు నేరుగాపోయి వంటగదిలో పొయ్యిమీద వేగుతూన్న కూరముక్కల్ని గరిటతో తీసి రుచిచూడ సాగాడు.

అనూరాధ చప్పున వాడిని వీపుమీద చరిచింది. ఒక్కమారు వాడు కెవ్వు మనగానే పెరటిలోంచి నారాయణి, ముందు గదిలోంచి పార్వతమ్మ ఒకేమారు వంట గదిలోకి వచ్చిపడ్డారు కంగారుగా.

"చూసావా అమ్మా వీడు చేసినపని. వీధులన్నీ తిరిగి వళ్ళంతా బాడి చేసుకుని అలాగే వచ్చి కూర ముక్కలు రుచిచూస్తున్నాడు" అంటూ ఫిర్యాదు చేసింది అనూరాధ.

"అందుకని నువ్వేం చేశావు వాడ్ని?"—ఈ కంఠంలోని తీవ్రతకు అనూరాధ నివ్వెర పోయి నిరుత్తరయై నిలబడిపోయింది.

ఈ అవకాశం జార విడువకుండా చంద్రుడు గొంతు మరింత పెద్దదిచేసి 'కొట్టిందమ్మా! చూడు! ఎలా తట్టు తేలిపోయిందో' అని ఏడుస్తూనే వాడు చొక్కా పైకెత్తి వీపు చూపించాడు.

నారాయణి కంగారుగా వాడివీపు నిమురుతూ "ఎంతపనిచేశావే! నీ పెద్దరికం పాడుగాను. కుర్రకుంక ఏదో తెలియక తప్పుచేస్తే అంతలా బాదుకోవటమా! అవి చేతులా మరేమన్నానా? వూరుకో నాయనా... అక్కని నే కొడతాలే...ఏడవకు...అయినా వాడ్ని అలా బాదటానికి నీకెవరిచ్చారంట అధికారం. ఈమారు ఇలాంటి పని చేసి మాడు వీపు చీరుస్తా ఏమనుకున్నావో" అంటూ మిరపకాయలు వేయించినట్టుగా నాలుగూ దులిపేసింది నారాయణి.

అనూరాధ ముఖం చిన్నబోయింది. అభిమానంతో కళ్ళు నీళ్ళ పర్యంతం అయింది. కాని ఎదురుగా తనవైపే చూస్తూ ముక్కుమీద వేలు వేసుకున్న పార్వతమ్మని చూడగానే అక్కడ్నించి కదిలి ముందు వసారాలోకి నడిచింది. ఈ సంఘటనలో అంతగా కలత చెందవలసినఅగత్యం లేకపోయినా అనూరాధమటుకుమనస్సు పాడుచేసుకుంది. ఆమెకి ఒక్కమారు "తనకి పెళ్ళయి వుంటే ఎంత బాగుండేది" అనే ఆలోచన ఎందుకో తట్టింది. ఆవయస్సు అలాంటిది. అప్పుడు వచ్చేవూహాలూ అలాగే వుంటాయి. రాత్రి పడుకోబోతూకూడా పార్వతమ్మ చేత తనదేమీ తప్పులేదని పదిమార్లు చెప్పించుకు నేవరకూ ఆమెకు మనశ్శాంతి లేకపోయింది.

"మరేమీలేదు అమ్మమ్మా. వాడిల్లా అల్లరి చిల్లరగా తిరిగి చదువుకోవటం మానేస్తే వాడేమయినా బాగుపడాలా? ఎనిమిదేళ్ళు వచ్చాయి. వాడి కింత వరకూ అ, ఆలు రావు. వాడికి సిగ్గయినా లేదు. అమ్మ, నాన్న కూడా వాడికి తగట్టే వాడేంచేసినా వాళ్ళు చూస్తూ వూరుకుంటారు. పిల్లల్ని కొస్త మందలించక పోతే వాడేంబాగుపడతాడు! ఇవ్వాళ మటుకు వాడు ఎలాంటి పని చేసాడో నువ్వు చూశావా? వాడు చేసిన పని బాగుంది గాని నేను చెయ్యిచేసుకోవటం బాగుండ లేదన్నమాట. అసలు నాకెందుకులే" అంది అనూరాధ.

పార్వతమ్మ బదులుచెప్పలేదు. ఆమెమనసు మనోరమ వైపు పోయింది. అంతమంది స్త్రీలముందుని సగర్వంగా ఆమె చెప్పిన జవాబులు, తివెనక ధ్వనించిన పట్టుదల, ఆ నుదుటిమీద ముడతలలో వ్యక్తమయిన దృఢత్వం, ఆ చైతన్య ప్రవంతి తెరలు తెరలుగా గుర్తుకు తెచ్చుకోసాగింది. ధీరరస ముట్టిపడే ఆ మూర్తి పార్వతమ్మ హృదయంలో చెరగని ముద్రవేసి హత్తుకుపోయింది. ఇన్నాళ్ళకు తను వూహించిన ఒక మనిషిని యథార్థంగా చూడగలిగింది. జీవితంపట్ల మనోరమకి వున్న దూరదృష్టి, విశ్వాసానికీ పార్వతమ్మ ఆమెను పదేపదే అభినందించింది. జోహారు లర్పించ కుండా వుండలేకపోయింది.

"ఏమిటమ్మమ్మా ఆలోచిస్తున్నావు?" అంది అనూరాధ

"మనోరమనుగురించి నీ అభిప్రాయం ఏమిటమ్మా?"

"ఏముంది? సరదా అయిన మనిషిలాగానేవుంది"

"అంతేనా! అంతకు తప్పించి మరేమీ విశేషం లేదా?"

"ఏమిటది?"

"మనోరమ ఆదర్శప్రాయమైన స్త్రీ. ఆమె లాంటి వాళ్లు చాలాకొద్దిమంది వుంటారు. జీవితం విలువ తెలిసినవారు ఎప్పుడూ గౌరవించదగిన వారు కారూ? ఆమె ధోరణిలో నిశ్చలత, దీక్ష, ఎలా ధ్వనించాయో విన్నావా?"

"అయితే మనోరమ కూడా చదువుకుని వుద్యోగం చేస్తుందా అమ్మమ్మా?"

"అవసరమైతే చేస్తుంది. అయితే అందుకు అర్హత సంపాదించుకోగలగటం అన్నది విశేషం కాదూ? నువ్వుకూడా మనోరమ దగ్గరకు పోయి చదువుకోరాదూ వృత్తినే ఇలా కాలక్షేపం చెయ్యకపోతే."

"అమ్మో! అమ్మ చంపేస్తుంది"

గడియారం పదిగంటలు కొట్టింది. అనూరాధ గంటలు లెక్క పెడుతూంది.

"ఇంకా మీనాన్న ఇంటికి రాలేదు కదమ్మా?"

"లేదు"

భారంగా నిట్టూర్పువిడిచి పక్కకు వత్తిగిలింది పార్వతమ్మ. వీధి మొగలో రావిచెట్టు'జంయ్'మంటూ గోల చేస్తూంది. వూరంతా మాటుమణిగినా నారాయణి

మటుకు కమ్ముకువస్తున్న నిద్రని అణుచుకుంటూ వుండీ వుడిగీ వినవచ్చే ప్రతి చిన్న చప్పుడికీ, భర్త వచ్చాడేమోనని వీధివైపు చూస్తూ ఆవులించి చిటికెలు వేసుకుంటూంది.

ఆమె ఇక ఆగలేక ఓ నిద్రతీసి లేచింతర్వాత గడియారం ఒంటిగంట కొట్టటం భర్త తలుపు తట్టటం ఒక్కమారు జరిగింది.

4

రాత్రి ఏ నిశ్చయానికి వచ్చి పడుకుందో పార్వతమ్మ తెల్లవారి అది ఆచరణలో పెట్టింది. అందుకనే ఇంట్లో ఎవరూ లేవకుండానే ముందుగానే లేచింది. కుంపటి రాజేసి కాఫీ నీళ్లు పడేసింది. ముఖం కడుక్కొని పనిమనిషి రాగానే అది అరవ నవసరం లేకుండానే అంట గిన్నెలన్నీ బైటవేసింది.

పనిమనిషి కేక పెడితేగాని నారాయణి లేవదు. ఇవాళ ఆమె లేచేసరికి కొద్ది పొద్దెక్కింది. కళ్ళు నులుపుకుంటూ వంటగది సమీపించేసరికి ఎదుటి చూపులోనే జరిగిందంతా ఆమె వూహించ గలిగింది. ఆమె గదిలో అడుగుపెట్టగానే "అమ్మా నారాయణీ! నన్నివాళనుంచీ ఈ విషయంలో అడ్డుపెట్టవద్దు. నువ్వు చిన్నదానివి. నీకు తెలీదు. నాబాధ అర్థంచేసుకో తల్లీ" అంది పార్వతమ్మ.

పార్వతమ్మ ఎంతటి దూరపాలోచనతో ఈ మాటలందో నారాయణి గ్రహించినట్లు కనబడదు. అందుకనే ఆమె నిస్సంకోచంగా "అయితే నీ వుద్దేశం ఈ ఇంట్లో ఒక బలమైన స్థానం నువ్వు అపేక్షిస్తున్నావా పిన్నమ్మా?" అంది.

"నన్ను అర్థం చేసుకోమని పదేపదే వేడుకుంటున్నాను నారాయణీ! నేను నిజంగా ఈ బాధ్యతలు నీకు బరువైపోకుండా వుండటానికే నెత్తిన వేసుకోవటంలేదు. కొంత అభిమానమూవుంది. కొంత అవసరమూ వుంది. జీవితంలో దిక్కులేని మనిషినై ఈ ఇంట అడుగుపెట్టాను. నాలుగు మెతుకులు తింటున్నాను. కాని..."

ఈమాట పూర్తవకుండానే అర్థాంతరంగా అందుకుని "చూసేవాళ్ళ దృష్టిలో కేవలం ఒక చుట్టంగానే కాకుండా బాధ్యతగల ఇంటి మనిషిగా కనబడాలని తాపత్రయం కాబోలు" అంటూ పూర్తి చేసింది నారాయణి.

పార్వతమ్మ నిలువెల్లా నీరుకారిపోయింది. ఇవాళ రభస జరుగుతుందని ఆమె ముందుగా వూహించకపోలేదు. అయినా ఈ తీవ్రమైన, అవమానకరమైన ధోరణి ఆమె సహించలేకపోయింది. ఆమె చేతిలోని తాటాకు విసనకర్ర కిందికి జారిపోయింది.

"భగవంతుడు నాకు రెక్కల్లో కావల్సినంత శక్తి నిచ్చాడు. అది వున్నంతకాలం ఈ ఇంటిమీదికి ఎంతమంది వచ్చిపడినా వండిపెట్టగలను. ఇందులో ఇంకొకళ్ళ ప్రమేయం నేను సహించేది లేదు." అంది నారాయణి నిర్మొహమాటంగా.

ఇక ఏవిధమైన ఆసరా లేని నిస్సహాయస్థితిలో పార్వతమ్మ ఆగది విడిచిపెట్టక తప్పలేదు. అంతవరకూ నారాయణి అక్కడ్నించి కదలలేదు. పార్వతమ్మ ముఖమంతా చెరువు చేసుకుని తనగదిలోకి నడిచి మంచంకింద చిరుగులుపడిన చేతిసంచీ తీసుకుని అందులో తన నాలుగు పాతచీరలూ కుక్కుకుంది. అప్పటికింకా పిల్లలు లేవలేదు. నారాయణి భర్త మెలుకువ వచ్చినా బద్ధకంచేత మంచంమీద అటూ ఇటూ దొర్లుతున్నాడు. కిటికీలోంచి పొద్దుటి ఎండ మంచం మీదికి పాకగానే ఆయన మంచం దిగి వళ్ళు విరుచుకున్నాడు. పార్వతమ్మ గొంతు విని ఆయన గుమ్మం వైపుకి తిరిగారు. గుమ్మంముందు చేతిసంచీతో ఆమె వారగా నిలబడివుంది. "నేను వెళ్తున్నాను నాయనా" అంది.

"ఎక్కడికి?" అన్నాడాయన అయోమయంగా.

"అదే ఇంకా నిశ్చయించుకోలేదు. వచ్చి చాలా రోజులయింది. ఇక వెళ్ళొద్దూ.

"నువ్వనేదేవిటో నా కర్థంకావటం లేదు. అసలేం జరిగింది"

"ఏమీ జరగలేదు. ఇందులో జరగడానికేముంది. వచ్చాను. కొన్నాళ్ళు వున్నాను. మళ్ళీ వెళ్ళిపోతున్నాను. అంతే నాయనా!"

"అవును. ఎక్కడికి పోతావు? అది చెప్పు ముందు."

దీనికి ఏమని చెప్పాలో ఆమెకి బోధపడలేదు. "ఇచ్ఛాపురంలో మా దూరపు చుట్టాలున్నారు. వాళ్ళ దగ్గిరకి వెళ్దామనుకుంటున్నాను."

"ఇప్పుడు నీకిక్కడ ఏం లోటు వచ్చిందని"

"రామ! రామ! అలాగని చేశానా, ఏ లోటూ లేదు. నేను కేవలం చుట్టాన్ని నాయనా. నాలుగు రోజులుండి వెళ్ళిపోతున్నాను. దీనికోసం నువ్వింత బాధపడతావు దేనికి?"

"నారాయణితో చెప్పావా?"

"లేదు చెబుతాను" అని పార్వతమ్మ వెనక్కు తిరగ్గానే వంటగది గుమ్మంలో చేతులు తుడుచుకొంటూ నారాయణి నిలబడివుంది. ఇదంతా ఆమె వినే వుండాలి. నారాయణి దగ్గరగా వచ్చి పార్వతమ్మ చేతులు పట్టుకుని పక్కగా తీసుకెళ్ళి "ఈ డబ్బు దగరవుంచుకో పిన్నమ్మా. నువ్వు అభ్యంతరపెడితే నా మీద ఒట్టే" అంది.

పార్వతమ్మ బలవంతం మీద ఆ డబ్బు తీసుకోక తప్పలేదు. ఆమె అక్కణ్ణించి కదుల్తూ పిల్లపెళ్ళి గురించి, పిల్లవాడి చదువు గురించి మరోమారు హెచ్చరించి, పిల్లలు పడుకుని నిద్రపోతున్న గదిలోకి వెళ్ళి లేతఎండలో ముడుచుకుని నిద్రపోతున్న అక్కా, తమ్ముళ్ళని చూసి బయటికి నడిచింది. వెనకాల నారాయణి దంపతులు అనుసరించారు. మరోమారు ఆమె శెలవుతీసుకొంది.

"ఇచ్ఛాపురం చేరగానే వుత్తరం రాయి" అన్నారు వీరభద్రంగారు.

ఉదయపు సంధ్యని చీల్చుకుంటూ మెల్లగా సాగిపోతున్న ఆమె పూర్తిగా అదృశ్యమయేవరకూ నారాయణి దంపతులు గుమ్మంలో నిలబడి తర్వాత నిట్టూర్పులతో లోపలికి వెళ్ళిపోయారు.

"ఏమిటో పిచ్చికాకపోతే ఇప్పుడెక్కడికని పోతుంది?" అన్నారు వీరభద్రంగారు.

వెనకాల వస్తున్న నారాయణి "అవును నిజమే అనుకోండి. అయినా మనంమటుకు ఎన్నాళ్ళని పోషించగలం? ఏదో రెండు నెలలు వుంచుకున్నాం. మనసు రాయి చేసుకొందే ఇలాంటి విషయాల్లో కష్టం. పిల్లాజల్లావున్నవాళ్ళం. ఖర్చులు పెంచుకుంటే ఎలాగు. అదే మనసులో పెట్టుకోకండి. ఎవరిఖర్మ వాళ్లది. ఏం చేస్తాం" అంది నారాయణి.

ఆనాడల్లా అమ్మమ్మ వెళ్ళిపోవటం గురించి గుచ్చిగుచ్చి వేసే ప్రశ్నలకి చివరికి విసుగెత్తి "చుట్టాలు ఎల్లకాలం మనింట్లోనే పాతుకు పోతారేమిటే. వచ్చి రెండునెలలు వుండి వెళ్ళిపోయింది. ఆవిడకోసం దిగులు పడతావేమిటి? వెళ్ళి బిందెతో నీళ్ళుతోడి పట్టుకురా?" అంటూ చిరాకుపడే వరకూ అనూరాధ వూరుకోలేదు. అమ్మమ్మ దగ్గర అంతగా చనువులేని చంద్రుడు అప్రసక్తి తీసుకురాలేదు.

5

అనూరాధ గుమ్మంలో అడుగుపెట్టగానే చుట్టూతా పరుచుకున్న పుస్తకాలమధ్య కూర్చుని తదేకంగా చదువుకుంటున్న మనోరమ చప్పున లేచి అతి ఆప్యాయంగా ఎదురు వచ్చి లోపలికి తీసుకువెళ్ళింది.

"మా స్నేహితురాలింటికి వచ్చి ఓమారు మిమ్మల్ని చూసిపోదామని వచ్చాను. మీ చదువుకి భంగం కలగలేదుగదా" అంది అనూరాధ.

"అబ్బే! లేదు. అలాకూర్చోండి. మీవాళ్లంతా కులాసాగా వున్నారా?"

"ఆఁ! మా అమ్మమ్మ వెళ్ళిపోయింది. మీకు తెలుసునా?"

"తెలియదే! ఎక్కడికి?"

"ఎక్కడో ఇచ్ఛాపురంలో వాళ్ళదూరపు చుట్టాలున్నారుట. అక్కడికి వెళ్ళింది."

"అది నమ్మతగిందేనా అనూరాధా. నాకేమీ నమ్మకంలేదు." అంది మనోరమ భారంగా నిట్టూర్పు విడిచి.

"అంటే మీవుద్దేశ్యం?"—అనూరాధ వ్యాకుల హృదయంతో అడిగింది.

"ఆమె కాపాటి ఆసరావున్నట్టు తోచదు" దగ్గర కొద్దిడబ్బయినా వుందా;"

"అమ్మ పాతికరూపాయలిచ్చింది" అది తప్ప ఆమెదగ్గర మరేమీ లేదు. అంతవరకూ నాకు తెలుసు."

"మీ అమ్మ పాతిక రూపాయలిచ్చిందా?" అంది మనోరమ నమ్మకంలేని స్వరంతో.

అనూరాధ తల వూపింది.

ఈ మనసు అల్లే పాడువూహాలనుంచి తెముల్చుకుంటూ మనోరమ "మాయిల్లు బాగుందా?" అని ప్రశ్నించింది.

"ఏదీ చూపించకుండానే?"

"అయ్యో నా తెలివితెల్లవారిపోను" అంటూ మనోరమ అనూరాధని వెంటబెట్టుకుని ఇల్లంతా

చూపించింది. ఇంతపెద్ద యిల్లు అద్దెకు తీసుకున్న మనోరమ తమ్ముడి ఉద్యోగం తక్కువేమీ కాదని అంచనా వేసింది అనూరాధ.

ఆతర్వాత తను చదువుకునే పుస్తకాలన్నీ పరిచయం చేసింది మనోరమ. ఆమె ఉత్సాహం చూస్తుంటే తన్ని ఆమెతో పోల్చుకొని సిగ్గుపడింది.

"అమ్మమ్మ ఓమారు అంది, ఇలా వృథాగా కాలక్షేపం చెయ్యకపోతే మనోరమదగ్గరకిపోయి చదువుకోరాదా?" అని. మీరంటే ఆమెకి వల్లమాలిన అభిమానం. తరుచు మీ ప్రసక్తి తీసుకువస్తూండేదామె." అంది అనూరాధ అప్పృతి రేకెత్తించిన వ్యథతో.

"ఆమె వెళ్ళేముందు నాకు తెలిసిందికాదు. ఒక్కగంటముందు తెలిసినా ఆమెని తప్పక కలుసుకునే దాన్ని. అనేకవిషయాలు ఆమెతో మాట్లాడా లనుకున్నాను" అంది మనోరమ.

"ఆమె వెళ్ళిపోయే సంగతి మాకుమటుకు తెలుసునా? ఎవరికీ తెలియదు. ఆమె వెళ్లేసమయానికి నేనూ తమ్ముడూ ఇంకా నిద్రలేవలేదు. పాపిష్టిదాన్ని ప్రతిరోజూ తెల్లవారకుండానే లేచేదాన్ని. ఆనాడు పొద్దుపోయి లేచాను. అమ్మమ్మ వెళ్ళిపోయింది. ఆమె హఠాత్తుగా నిశ్చయించుకుని వెళ్ళిపోయింది. మళ్ళీ ఇక ఆమెను చూట్టం పడదనుకుంటాను. ఆమెని మరిచిపోయినా ఆమె చెప్పిన కథలు మరిచిపోలేను. ఆమె వెళ్ళినతర్వాత తిక్కెత్తినట్టు అనిపించింది."—అనూరాధ కంఠం కొద్దిగా వణికింది. కళ్లు చెమ్మగిలి ఒక నీటిచుక్క చెంపలమీదుగా జారిపోయింది.

మనోరమ ఆమెను దగ్గరగా తీసుకుని "బాధపడకు అనూరాధా! ప్రతిరోజూ సాయంత్రంపూట ఇలాగ వచ్చావంటే అంతకంటె మంచికథలు చెబుతాను." అంది.

అనూరాధ సిగ్గుపడుతూ అబ్బే వూరికే అన్నాను. నేనేమన్నా చిన్నపిల్లనా కథలకోసం అంటూ ముఖం వాచిపోవటానికి" అంటూ నవ్వింది.

మనోరమ నవ్వుతూనే "నువ్వు చాలా తెలివైనదానివే. ఏమిటో అనుకున్నాను. అయితేనేం రోజూ వస్తూండు. కులాసాగా కబుర్లు చెప్పుకుందాం."

అలాగే అన్నట్టుగా తల వూపింది అనూరాధ.

"మాయింటికి పత్రికలు కూడా వస్తూంటాయి" చదువుకోవచ్చు."

"పత్రికలు చదవటం నాకు అలవాటులేదండీ" అంది అనూరాధ.

"అలవాటు చేసుకుందువు గాని."

"మీరు రోజూ చదువుతారనుకుంటాను"

"అవును ప్రతిరోజూ చదువుతాను."

"అంత శ్రద్ధగా చదవటానికి అందులో ఏముంటాయి?"

"ఎందుకుండవు? అనేకవిషయాలుంటాయి. ఒకరోజు కాఫీ తాగకపోతే ఎంతతిక్కగా వుంటుందో ఒక్కరోజు పేపరు చదవకపోయినా అలాగేవుంటుంది" అంది మనోరమ.

అనూరాధకి మనోరమధోరణి ఆశ్చర్యంగానే వుంది.

"నేను ఇవాళనుంచీ సంపాదనాపరురాలి నయాను" అంది మనోరమ వున్నట్టుండి.

"ఎక్కడైనా వుద్యోగంలో ప్రవేశించారా?.

"లేదు, అయిదు ప్రయివేట్లు కుదుర్చుకున్నాను. నెలకో పాతిక రూపాయలు వస్తాయి. ఓ పదిరూపాయిలు అమ్మాయికి పంపుతాను. మిగతా పదిహేనూ ఆయనకి పంపేస్తాను. పైఖర్చుకన్నా వస్తుంది.

"ఆయన ఎక్కడ వున్నారు?"

"ఆయన అన్నగారి దగ్గర"

"మరి మీ సంగతి?"

"నాకు తమ్ముడున్నాడుగా, స్కూలువాళ్లు కొంత 'సయిఫెండు' ఇస్తారు. "తెల్లవారగానే ఆ పిల్లలు మనింటికి వస్తారు. ఓ గంట చెబుతాను. అనవసరంగా కాలం ఎందుకు పాడుచెయ్యాలి. నేను చేస్తున్న పని బాగుండలేదూ?"

"ఎందుకు బాగుండలేదు. దివ్యంగా వుంది" మనోరమ గొంతుతగ్గించి "ఇలా పాఠాలు చెబుతున్నానని చెబితే తమ్ముడు కస్సుమని లేచాడు. అతన్ని ఒప్పించి శాంతపరిచేటప్పటికి నా తలప్రాణం తోకకు వచ్చింది. 'నువ్వు పిల్లలకి ప్రయివేట్లు చెప్పి సంపాదించాల్సిన అగత్యం ఏముంది? నే నిన్ను ఇంతగా ఆదరిస్తున్నా నువ్వు నన్ను అర్థం చేసుకోలేదన్నమాట,

చూసేవాళ్లేమనుకుంటారు?' అంటూ నిష్ఠూరాలాడాడు. అన్నిటికి నచ్చచెప్పి "నా సంపాదనకోసం కాదు తమ్ముడూ, నా వాళ్లకోసం; నా సంపాదనలో దమ్మిడీ నేను ముట్టను. నేను పూర్తిగా నీ మీదనే ఆధారపడతాను" అని హామీ ఇచ్చాను. అప్పటికిగాని వాడు మెత్తపడలేదు. తర్వాత ఇందులో తప్పేమీ లేదని వాడూ గ్రహించాడు."అని మనోరమ లేచి గాలికి రెపరెపకొట్టుకుంటున్న పుస్తకాన్ని తీసి అలమారాలో వుంచి తిరిగివచ్చి కూర్చుంది.

"మీతో మాట్లాడుతూవుంటే సరదాగావుంది" అంది అనూరాధ.

"అందుకనే మనం ప్రతిరోజూ కలుసుకుందామని నేనంటున్నాను."

"అమ్మమ్మ వున్నది రెండుమాసాలయినా ఆమె వెళ్ళిపోయింతర్వాత ఏదో పెద్దలోటుగా వుంది. ఆమె తలపుకు వస్తే దిగులు దిగులుగావుంటుంది"

మనోరమ అనూరాధ తల నిమురుతూ "అది మంచిదికాదు. మనస్సు ఎప్పుడూ వుత్సాహంగా వుండాలి. దిగులుపడటం మంచిదికాదు. అలావుంటే ఎవరూ నిన్ను పెళ్ళిచేసుకోరు" అంటూ నవ్వేసిందామె.

ఈ పరిహాసంలో అనూరాధ మనస్సును ఆవరించిన మబ్బులు మంచులా కరిగిపోయాయి. ఆమె సిగ్గుపడి ముఖం ఎఱుపుచేసుకుని "మీదంతా వేళాకోళం" అంటూ దూరంగా జరిగింది.

మనోరమ మరింత బిగ్గరగా నవ్వింది. మనోరమ నవ్వు అనూరాధకి నవ్వు తెప్పించింది.

"ఏమిటి అక్కా అంతలా నవ్వేస్తున్నావు" అంటూ అప్పుడే గదిలో అడుగుపెట్టిన శేఖరం మరో కొత్తమనిషి అక్కడ వుండటంతో నాలిక కొరుక్కుని త్వరత్వరగా బూటుకాళ్లతోనే లోపలికి వెళ్ళిపోయాడు.

అనూరాధ చప్పున నోరు నొక్కుకొని లేచి "వస్తాను" అంటూ త్వర త్వరగా బయటికి రాబోయింది.

మనోరమ నవ్వు నాపుకుంటూ "ఫర్వాలేదు. వాడు వచ్చి మన్నేం చేశాడు? కాసేపు కూచుని వెళ్దువుగాని" అంది.

"లేదు పని వుంది. అప్పుడప్పుడు మీరూ కనిపిస్తూవుండండి" అంది అనూరాధ మెట్లు దిగుతూను.

"నేను అప్పుడప్పుడు వస్తూంటాను, నువ్వు ప్రతిరోజూ రావాలి రేపు ఇదే వేళకి ఎదురు చూస్తూంటాను."

అనూరాధ కనిపించినంతసేపూ చూస్తూ తమ్ముడ్ని గొంతువిని లోపలికి వెళ్లిపోయింది మనోరమ.

"ఈమె మరొక కొత్త శిష్యురాలు కాదు గదా?" అంటూ ఇవతలికి వచ్చాడు శేఖరం.

మనోరమ నవ్వుతూ "ఇంచు మించు అంతే అనుకోవచ్చు" అంది.

"అయితే జీతం ఏపాటి గుంజుతున్నావేమిటి?"

"పోరా నీదంతా పరిహాసం. ఏమీ లేదు" అంది మనోరమ.

6

నారాయణి అన్నగారివద్ద నుంచి వుత్తరం వచ్చింది. బావగారి పేర రాసాడాయన.

బావగార్కి నమస్కరించి వ్రాయునది—

ఇవాళ ఇక్కడ మంచి సంబంధం ఒకటి చూశాను. కుర్రవాడు బి. ఎ. చదివాడు. నెలకు రెండొందలు జీతం తెచ్చుకొంటున్నాడు. పదెకరాలభూమి పిల్లవాడి వాటాకు వస్తుంది. ఒక ఇల్లుకూడా వుంది. మూడు నాలుగువేలు ఇవ్వటానికి మనం సిద్ధపడితే వాళ్ళు ఒప్పుకుంటారని అనుకుంటున్నాను. కాబట్టి నువ్వొకమారు బయల్దేరి ఇక్కడికివస్తే వాళ్ళతో మాట్లాడదాం. నేను ఈ చిరుగుల చొక్కాతో వెళ్ళి పెళ్ళి సంబంధం మాట్లాడితే కలిసేది కూడా కలవదు. లేకపోతే దీనికోసమంటూ ఓ చొక్కా పంచీ కొనుక్కోవాలి. నాకు దాపరికం, సిగ్గూ లేవు సుమా. ఉన్నదున్నట్టుగా రాసేస్తున్నాను. పేదరికం అనుభవిస్తూండగా లేంది చెప్పుకుంటే వచ్చిందా? నువ్వు ఈ విషయంలో కాస్త త్వరపడాలి. ఎదురు చూస్తూంటాను. ఈ సంబంధం కుదురుతే పిల్లదాన్ని గురించి మనకు దిగులు వుండదు."

ఉత్తరం పూర్తవగానే గట్టిగా మూలిగి దాన్ని టేబిల్ మీదికి నెట్టేసారు వీరభద్రంగారు. నారాయణి తీసుకుని చదివి ముందు అభిమానంతో ముఖం ఎరుపుచేసుకుని 'పాడు దరిద్రం మానాభిమానాల్ని కూడా చంపేస్తుంది కాబోలు.' అనుకొని "అదిసరే. పోనీ వెళ్ళిరారాదూ?" అంది ఆమె.

"నాకెక్కడిది తీరిక. ఇవాళనుంచీ క్లబ్బులో ఆటలపోటీలు జరుగుతాయి. అవన్నీ నిర్వహించవలసిన మంటే ఇంకొకళ్ళకి సాధ్యమౌతుందనుకున్నావా? పేకలు తెగుతాయి. నేను లేకపోతే ఒక్క నిముషం గడవదక్కడ" అన్నారాయన చిరాగ్గా.

నారాయణి మనసులోనే నిట్టూర్చింది. పైకి ఏమీ అనకుండా లోపలికి వెళ్ళిపోయింది. ఆమె యొక్క ఆ ప్రేమకీ భర్త తన్ని తీసుకురాలేదు. అమూల్యని చూస్తో చెల్లెలని నాలుగు ముక్కలు రాయించింది అన్నగారికి. ఇక్కడ బావగారు క్షణం తీరికలేని పనుల్లో మునిగిపోయారనీ, కాబట్టి శ్రమ అనుకోకుండా తనే వాళ్ళతో మాట్లాడి వాళ్ళని పిల్లను చూడటానికి తీసుకు రావల్సిందని, శ్రద్ధ తీసుకోవలసిందనీ ప్రాధేయపూర్వకంగా రాయించింది. డబ్బుకూడా పంపించింది. ఇలా రాసానని భర్తతో చెబితే "మంచిపని చేశావు అలా వదుల్చుకోవాలి" అన్నారాయన.

ఈ ఉత్తరం రాసిన ఆరోనాటికల్లా గలగల మంటూ అన్నగారు పెళ్లివారితో సహా వచ్చి దిగాడు. కలిసే ఆలోచింటూ ఆ వచ్చినవారు చెప్పగా ఇక్కడికి రాకుండా వాళ్లి దూరపు చుట్టాలున్నారని వెళ్లారు. అక్కడ భోజనం చేసుకుని తాంబూలాలు వేసుకుంటూ ఇక్కడ వచ్చారు. క్రితంరోజు తాను వస్తున్నట్లుగా ఉత్తరం రాసినా కళ్యాణరాతిగారు ఇంట్లో లేకపోవడం గమనించి ఆశ్చర్యంగా, అనుమానంగా "నా ఉత్తరం అందలేదేమిటి?" అని అడిగాడు నారాయణి అన్నగారు.

పిల్లకి ముస్తాబు చేయాలనే పనిలో మునిగిన నారాయణి "అందింది. లేకపోతే ఈ ఏర్పాట్లన్నీ ఎలా జరిగాయనుకుంటున్నావు" అంది.

"మరయితే బావ ఎక్కడికి వెళ్ళినట్టు?"

"ఆయనకి అర్జెంటు పనివుందని వెళ్ళారు"

"అయితే పిల్లందని ఇంటికి రాలేదేమిటి?"

"పాపిష్టిది. నవ్వొస్తాన్నావుగా. ఆయనకి తీరిక లేదు."

"ఇది మరీ వింతగావుంది చెల్లీ! తీరిక లేకపోవట మంటే అర్థంలేదు. ఒకరికి మాటుకు తీరిక వుండదేమిటి? రోజు బత్తెంమీద పని చేసుకుంటున్న వాళ్ళని రెండు రోజుల జీతం వదులుకుని చేసుకోగానే దాని ఒకపూట తీరిక ఆయనకి లేదన్నమాట. ఏమన్నావంటే నవ్వు తాదు. అసలు రాగ్యత అనేది లేదంటే ఒక్క ముక్కలో పోతుంది. నా దగ్గర దాపరికం, మొహ మాటం లేదుసుమా. వున్నమాట అనేస్తాను," అంటూ దనువుగానే నాలుగూ దులిపాడు ఆయన.

నారాయణి నవ్వుతూ "నీ సంగతి నాకు తెలియదన్నట్టా. పోనివ్వు. ఆయనకి మటుకు రాగ్యతి లేదనా. ఇవాళ పిల్లకి, చీరా, నగల్నీ, ఫలాలూ, తమలపాకులూ, వక్కలూ, ఇంకా ఏమేమిటో తెచ్చారు! అ! అన్నట్టు చూరలూ ఇవన్నీ తెచ్చి పడేయ్యలేదూ. నిజంగా ఆయనకి తీరిక లేదు. చాలంతి చేన మాఁవనిస నవ్వొంనిగా ఆయనకేం రా?" అంది.

"పురుషుడు పుట్టినవాళ్ళకి యజ్ఞం చేశానని మా ఆయన ఇన్నాళ్ళకి ఇంటిపనులు కొత్త చేశానని మహా గొప్పగా చెప్పాస్తున్నాళు. ఎవరి తరపో ఎవరికి తెలియదు. అది వదిలే ముందు త్వరగా తెముల్చు. మళ్ళీ వాళ్ళు చీకటిపడగానే వెళ్ళిపోతారు. కొత్త పోనీయు అది బాగా కనబడేటట్టు ముందంగా పట్టేందు. పెదవులకి 'లిప్ స్టిక్' తెప్పించక పోయావా..."

"ఛో! మాతయ్య! నీదంతా లేకాకోం" అని సిగ్గుపడి సిగ్గులోని ఆనందం అనుభవించి పొక్కు పులకరింపచేసుకుంది అమూల్య.

నారాయణికూతురు ముస్తాబు పూర్తిచేసి, ముందు హాల్లోనుంచి అన్నగారు "చెల్లీ అమ్మాయిని తీసుకు రామ్మా" అనగానే చూపుడు చెక్కపట్టుకుని ముందుకు నడిపించింది. సిగ్గుభారంతో అమూల్య అడుగు ముందుకు పడలేదు. చివరికి నారాయణి తొందరచేయ్యటంతో ఆమె మందంగా అడుగులు వేసుకుంటూవచ్చి మధ్యహాలులో వాళ్ళందరికీ కొద్దిదూరంలో తివాచీ మీద తలవంచుకుని కూర్చుంది. అలా కూర్చునే ఆమె మొదటిసారిగా జీవితంలో అతి అపూర్వమైన కొన్ని అనుభవాలని, సత్యాలని తెలుసుకుని మానసికంగా కొంత పెద్దదయిపోయింది. ఈ పెళ్ళిచూపుల తతంగం ఆమె ఊహించినదానికి కేవలం భిన్నంగా వుండటమేకాదు జీవితంలో ఇంతటి జుగుప్సాకరమైన అనుభవం తనింతవరకూ పొందలేదనికూడా ఆమె అర్థం చేసుకుంది.

ఆ చూడవచ్చినవారిలో ఆడంగులు తమరాగానే తన పక్కకి వచ్చి కూర్చొని తలమీద చెయ్యిపెట్టి కెల్లి పరీక్షచేసి 'ఈ మచ్చ ఏమిటండీ' అన్న దాకొచ్చింది.

నారాయణి కలగజేసుకుని "చిన్నప్పుడు ఆటల్లో కుమ్మరింతగిలి గాయమయింది. అది మచ్చపడింది" అంది.

"అయితే ఎంతవరకూ చదువుకున్నావమ్మా?" అని ప్రశ్నించారు పడకకుర్చీలో కూర్చున్న పెళ్ళికుమారుని తండ్రి.

అనూరాధ తలవంచుకుని ఏ సమాధానం చెప్పకుండా వుండటం గమనించి అవతలవాళ్ళు అపోహ పడతారేమోనని నారాయణి "చెప్పు అనూరాధా! వారు ఏదో అడుగుతున్నారు." అంది.

"చెప్పు! చెప్పు! లేకుంటే మూగపిల్ల అనుకుంటాం" అంటూ ఆయన తన చమత్కారానికి తనే పెద్దగా నవ్వేశారు.

అనూరాధ "మూడోఫారం వరకూ చదివాను" అంది.

"అది 'పాస్' అయావా?"

"లేదు"

"బాగుంది, నాకూ ఈ చదువులంటే పరమ అసహ్యం. అయినా పూరికే అడిగాను. ఆడవాళ్ళకి కాస్త ఉత్తరంముక్క చదవనూ రాయనూ వస్తే చాలు."

"అట్టే అది పెద్దపెద్ద గ్రంథాలే చదువుతుందండీ. ఏదమ్మా భాగవతంలోనుంచి వరూధిని ప్రవరాఖ్యుడు ఘట్టాలలోని పద్యం ఒకటి..."

నారాయణి అన్నగారిమాట పూర్తిగాకుండానే పెళ్ళికుమారుడు తండ్రిగారు: "అబ్బ! పోతన్నగారు మనుచరిత్ర ఎంతగొప్పగా రాశారండీ. నేను ఎన్నిమార్లు చదివానో ఒక లెఖ్ఖా జమా లేదు. అయినా ఈ కాలం వాళ్ళకి మన పూర్వకాలంనాటి కవిత్వం యొక్క గొప్పతనం అర్థంకాదు" అన్నారు.

"అదేమిటండీ మనుచరిత్ర రాసింది తెనాలి రామకృష్ణుడుకదూ మీరు పోతన్నగారి భాగవతానికీ, మనుచరిత్రకీ ముడిపెడతారేమిటి?" అంది ఆయనభార్య తన పాండిత్యం వలుకుతూ గమనించారో లేదో నని చుట్టూతా చూస్తూను.

అనూరాధకి నవ్వు ఆగలేదు. ఆమె ముఖం ఎత్తి చూసేసరికి ఎదురుగా తనవైపే గుచ్చిగుచ్చి చూస్తున్న కోరమీసాల అబ్బాయి బొగ్గులబస్తామీద పిడత బోర్లించినటుగా వున్న తలకాయని ముందుకుచాచి మీసాలు దువ్వుకుంటున్నాడు.

పెళ్ళికుమారుడు తండ్రి "అవునేవ్. మరచి పోయాను. పొరబడ్డాను. మనుచరిత్ర రాసింది తెనాలి రామకృష్ణుడే. నా కంటె నువ్వే తెలివైనదానివి" అంటూ పెళ్ళాంతో చిన్న సరసం ఆడి తన రసజ్ఞతకి తనే మురిసిపోయారు.

"ఏదమ్మా తెనాలి రామకృష్ణుడి, మనుచరిత్రలోని పద్యాలు రెండు చదువు" అన్నారాయన.

"మనుచరిత్ర రాసింది అల్లసాని పెద్దన్న. తెనాలి రామకృష్ణుడు కాదు" అని అనూరాధ సమాధానం ఇవ్వడంతో అక్కడున్నవాళ్ళ ముఖాలన్నీ క్షణం వెలావెలాబోయాయి. వెనక కూర్చున్న నారాయణి మనస్సు సంతృప్తితో కూడిన గర్వంతో నిండిపోయింది.

"ఆఁ! అదే ఒక పద్యం చదువు."

అనూరాధ మాట్లాడదల్చుకో లేదు. నారాయణి వెనకనించి వీపు తట్టి 'చదువమ్మా ఫర్వాలేదు చదువు" అంది.

అనూరాధ కచ్చితంగా 'నేను చదవను' అనేసింది. ఆడవాళ్ళు ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు. నారాయణి కంగారుపడింది. కూతురు స్వభావం గురించి వాళ్ళేమనుకుంటారోనని కలతపడింది. మరోమారు "తప్పు! అలా అనకూడదు చదవాలి" అంది.

"నేను చదవనంటే చదవను" అంది అనూరాధ

"పోనీ ఒక పాట పాడమ్మా. సంగీతం వచ్చా"

ఇక గత్యంతరంలేక వెనకనించి తల్లి పోరుపడలేక అనూరాధ ఒక పాట పాడింది. గాత్రరాపిడి అక్కడక్కడ పట్టినా మొత్తంమీద పాట బాగానే రక్తికట్టింది. పెళ్ళికుమారుడు ఓమారు సర్దుకుని మీసం దువ్వుకొని, వెనకనించి తమ్ముడు 'మీసంమీంచి చెయ్యి తియ్యరా!" అని హెచ్చరించి చేతిమీద ఓ దెబ్బ వేసింతర్వాత సర్దుకుని 'సినిమాపాటలు రావు కాబోలు' అంటూ సణిగి మళ్ళీ అలవాటుగా చెయ్యి మూతిమీదకి పోనిచ్చాడు. మళ్ళీ వెనకనించి తమ్ముడు చేతిమీద చిన్న దెబ్బ వేశాడు.

"ఇంకొకటి పాడమ్మా" అన్నారు పెళ్ళికొడుకు తండ్రిగారు. తన గొంతుకకి తగిన విలువ లేకపోవటంతో పెళ్ళికుమారుడు ముఖం చిన్నబోయింది.

అనూరాధ ఇక పాడనన్నట్టుగా మాట్లాడకుండా కూచుండిపోయింది. వెనకనించి తల్లి మళ్ళీ రొక్కించింది. అయినా అనూరాధ నోరు విప్పలేదు.

"నీ వయసెంతమ్మాయ్?"

"పదహారు" అని సమాధానం చెప్పింది అనూరాధ.

"ఇంగ్లీషు చదవటం కూడా వచ్చునా?"

అనూరాధ సమాధానం చెప్పకుండానే నారాయణి అన్నగారు చప్పున లేచి అలమారులోనుంచి ఓ పుస్తకం తీసి అనూరాధ కందించారు. ఆమె పుస్తకాన్ని పేజీఅయినా తిప్పకుండా అలాగే పట్టుకుని వుండిపోయింది.

నారాయణి అతి నిరుత్సాహపడిపోయింది. ఈ పిల్ల బొత్తిగా పెంకి ఘటం అని వాళ్లు ఎక్కడ అనుకుని పోతారో అని ఆమె బాధపడిపోయింది. ఆమె అనూరాధకి బాగా దగ్గరగా జరిగి పక్కగా కూర్చొని చెవి దగ్గర నోరుపెట్టి "అలా కూచుంటే బాగుండదు. చురుగ్గా అడిగిన వాటికి సమాధానం ఇవ్వాలి. వాళ్ళేమనుకుంటారు. ఆ పుస్తకం తీసి నాలుగు పంక్తులు చదువు. ఊఁ!" అంటూ ఆమె బుజ్జగించసాగింది.

అయినా అనూరాధ వులక లేదు పలక లేదు.

చివరికి విసుగెత్తి నారాయణి కూడా మౌనం వహించింది.

అతర్వాత పెళ్ళికుమారుడు తండ్రి తన పెళ్ళినాటి ముచ్చటల దగ్గర్నుంచీ, ఈ నాటి వరకూ ఆయన జీవితంలో ఆయనకి తోచిన అతి ముఖ్య సంఘటనలన్నీ చిలవలూ, పలవలూ పెంచి నారాయణి అన్నగారితో బాతాఖానీలో పడ్డారు. ఈయన తీరు చూసి నారాయణికి 'పెళ్ళికి పిల్ల నచ్చిందేమో' అనే భ్రాంతిలో పడింది. ఆడవాళ్లిమటుకు ఘరానాగా, బెట్టుగా పలుకైనా లేకుండా ఉండి, ఉండి ముసలాయన ధోరణికి చిరాకును వ్యక్తంచేస్తూ, నిరసనగా నిట్టూర్పులు విడుస్తూ వాళ్లు ఎంత తొందరగా కదులుతే అంత మంచిదనే ఆతృతిలో వున్నారు.

చివరికి ముసలాయన భార్య కలగజేసుకుని ఆయన వాగ్ధోరణి ఆపుతూ "ఇక లేద్దామా" అనేవరకూ ఆయన తనవునికిని తను తెలుసుకోలేని తన్మయావస్థలో పడిపోయారు.

పెళ్ళివారిని సాగనంపుతూ నారాయణి అన్నగారు, "మళ్లీ మీ దర్శనం ఎప్పుడు?" అన్నారు.

"మేం రెండురోజులు ఈ వూళ్లోనే వుంటాం. మా బంధువులు వున్నారు" అన్నారాయన.

"అయితే మా బావగారు రేపు మిమ్మల్ని కలుసుకొంటారు."

"అలాగే"

ఆడవాళ్ళవద్ద శెలవు తీసుకుంది నారాయణి. వాళ్ళు వెళ్ళగానే నారాయణి ముఖం చించుకుని అనూరాధని చివాట్లు పెట్టింది. "తెల్లవారి లేస్తే వాగిన నోరు వాగినట్టుంటుందికదా, అవసరంవస్తే పలుకే బంగారం అయిపోయిందేమే. అంత మొరడితనమా? ఒక చెంప నే చెబుతున్నా నా మాటలు లక్ష్యపెడితేనా? ఎంత సిగ్గయితేమటుకు అంత మొండితనమా? అయ్యో! వాళ్ళేమనుకున్నారో? ఈ పిల్ల బొత్తిగా పెంకిదిలావుందని వాళ్ళు అనుకోరూ?" అంటూ సాధించిపోసింది.

ఆమె అన్నగారు కూడా అనూరాధని కొంత మందలించారు. కాని అనూరాధ మనసు అసలే చిరాగ్గావుంది. ఈ ఇద్దరి ధోరణి ఆమెను మరింత వెర్రెత్తించాయి. ఆమె ముఖం కందగడ్డ చేసుకుని "మీ రసలు నాతో మాట్లాడకండి. నా కివ్వాళ మహా చిరాగ్గా వుంది" అని అనూరాధ కన్నీరు గ్రుక్కుకుంటూ అక్కడ్నించి వెళ్ళిపోయింది.

అన్నా చెల్లెళ్ళు ఒకళ్ళముఖం ఒకరు చూసుకున్నారు. "పిచ్చిపిల్ల. ఈ మాత్రానికే ఇంత బాధపడాలా? ఇందులో పెద్ద అవమానానికేముంది? లోకంలో జరుగుతున్న పద్ధతేగాని కొత్తదికాదుగా. దీని తీరు చూస్తే నాకు బెంగగావుంది. ఇలాంటి పెళ్ళిచూపులు ఎన్ని జరగాలో ఏమో ఖర్మ! దేవుఁడు మన పక్షాన వుండి ఈ సంబంధం స్థిరం చేసేస్తే బాగుండును. ఈ ఒక్కసారికే ఇదిలా రభస చేసిందికదా ఇంకోమారంటే అదసలు వచ్చి కూర్చుంటుందా? అబ్బే! ఇలాంటివాళ్ళతో వేగటం మహా కష్టం" అంటూ నారాయణి చాపమీద చతికిలబడి తల మొత్తుకుంది.

"దాని స్వభావానికి మనం అంతగా దిగులు పడాల్సిన అవసరం లేదు చెల్లీ, దానికోసం బెంగపడకు. చిన్నపిల్ల! నాలుగు రోజులుపోతే నీకంటె అనుభవజ్ఞురాలౌతుంది. కాని మనం భయపడాల్సిందల్లా మీ ఆయన స్వభావం గురించే." అన్నారు నారాయణి అన్నగారు.

ఈ చివరి మాటతో నారాయణికి ఎక్కడలేని కోపం పుట్టుకొచ్చింది. ఆమె తలవిదిలించి చేతులు తీసేసి "నీకు మాట్లాడితే ఆయనొకరు దొరికారా లోకువ. ప్రతిదానికి ఆయన వూసు ఎత్తుతూంటావు. ఆయనేదో దయ్యమో, భూతమో అన్నట్టుగా ఆయన స్వభావాన్ని చూసి భయపడాల్సిన అగత్యం ఏముంది? అంటూ నారాయణి తాచుపాములా కస్సుమంది.

ఆవిడ అన్నగారుకూడా అందుకు తగినట్టుగానే "నీ తెలివి మండినట్టేవుంది. కూతుర్ని చూడటానికి పెళ్ళివారొస్తే వాళ్ళని ఆదరించి మాటా మంతీ ఆడటానికైనా ఇంట్లో లేకుండా వుడాయించిన పెద్దమనిషిని నా దగ్గర నువ్వేదో సమర్థించాలనుకుంటావు.

అనాటి శాన్యతకూడా లేని భర్తని చూసుకుని నువ్వు పొంగిపోతున్నావు. ఛా! ఇలాంటి అపవాళ్ళంటే నాకు పరమ అసహ్యం! నేను వున్నమాట అనేస్తాను. నాదగ్గర దాపరికం లేదు! రానీ ఆయనముందే అనేస్తాను. కాని ఒక మాట మాత్రం చెప్పదల్చుకున్నాను. ఎవరెలాంటివారైనా నాకు పోయేదేమీ లేదు. కాని నేను బాధపడుతున్నదల్లా నిన్ను గురించీ, నీ పిల్లల గురించీను. నేను వుండి ఇవాళ ఈ పెళ్ళివారిని తీసుకు వచ్చాను. నాకు తీరిక లేక నేను రావటం పడకపోతే ఇక అంతేగా. వేళకి భోజనం చెయ్యటం, వూళ్ళో వ్యవహారాలు, చెలిన వేసుకుని తిరగటం, ఇంతేగా మనం చేసే ఘనకార్యాలు. నీ సంసారం తీరు చూసే వాళ్ళకేమీ బాగలేదు చెల్లీ! నేను మళ్ళీ రాత్రి బండికి పోతాను. రేపు వాళ్ళని కలుసుకుని ఏ సంగతీ తెలుసుకోమని బావతో చెప్పు. నేనుండగా వస్తే నేనే చెబుతాను. నేను నీ బాగుకోరేవాణ్నేగాని చెరుపుకోరేవాణ్ని కాను. అందుకని ఇంతగా చెబుతున్నాను. నెత్తురు సంబంధం వుందికాబట్టి బాధపడతాను. ఎల్లకాలం ఇలా సాగదు. మన జాగ్రత్తలో మనం మన బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించుకోకపోతే అధోగతిపాలయిపోతాం. ఎల్లకాలం రోజు లొక్క మాదిరిగా గడవ్వు" అని ఆయన క్షణం ఆగి "ఈ పెళ్ళికి ఏమైనా కాస్త వెనక వేశావా?" అన్నాడు.

"ఏమీ లేదు" అంది నారాయణి తల వంచుకునే.

"నే నలాగే అనుకున్నాలే. అంతగాక మరే ముంది? గతిలేక రోజల్లా వొళ్ళు విరుచుకుంటే తిండి మెతుకులు దొరక్క నాలాంటివాళ్ళ గడ్డికరుస్తుంటే, వచ్చింది ఖర్చు చేసుకోవటం తెలియక మీలాంటివాళ్ళు కష్టాలు కొని తెచ్చుకుంటారు. మీ చేతులారా మీరు మెడకి వురుల్లు పోసుకుంటున్నారు. డబ్బు విలువ తెలియకుండా దుబారా చేసేవాళ్ళని చూస్తుంటే నా కడుపు మండిపోతుంది. అక్లబ్బులో చేరేవాళ్ళంతా అలాంటివాళ్ళే. కేవలం వ్యసనంకోసం జీవితాన్ని, సర్వస్వాన్ని బలిపెట్టే గాలిపటాలన్నీ అక్కడే చేరుతూంటాయి. మీ ఆయన వారిమిత్ర్యయుగాలు నిముషాలుగా, హుషారుగా సర్వం మరిచి తిరుగుతూంటాడు. ను వ్వాయన్ను తలుచుకుని మురిసిపోతూంటావు. ఇదంతా పాతివ్రత్యమని లోలోపల గర్వం పెంచుకుంటావు. ఏదో పెద్ద ఎదురుదెబ్బ తగిలేవరకూ మీలాంటివాళ్ళు ఇలాగే వుంటారు. ముందు నీ వంతు నీ భర్తని అదుపులో పెట్టటానికి ప్రయత్నించు. సాగకపోతే అది వేరు సంగతి. అందుకు నువ్వు చేసిన ప్రయత్నమంటూ వుండాలిగా. ఇరవై ఏళ్ళనించీ నీ సంసారం నువ్విలా చేసుకున్నావు. ఇప్పుడిక అంతా మించిపోయింది" అంటూ ఆయన కాస్త తీవ్రంగా, సూటిగా ఎక్కడయితే తగలాలో సరిచూసి ప్రతిమాటా కూచి కూచి ప్రయోగించారు.

నారాయణి భర్తనిగురించి ఇంతదురుసుగా అన్నగారు మాట్లాడటం సహించలేకపోయింది. "మీరంతా అనుకున్నంత ప్రమాదమేదీ ఆయన స్వభావంలో నాకు కనిపించలేదు. ఆయన నాకు ఎప్పుడెంత మంచివారుగా కనిపిస్తారు" అని ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

ఆయన భుజాలు కుంచించుకుని మూతివిరుచుకుని "ఎవరి ఖర్మ వారిది. తనకి తోచనప్పుడు తోచాలి, ఒకరు చెబుతేనన్నా వినాలి. రెండూ లేనివారికి ఎవరుమటుకు చెప్పగలరు" అనుకున్నారు అర్ధస్వగతంగా.

భోజనందగ్గరకూడా అన్నాచెల్లెళ్ళు మౌనంగానే వుండిపోయారు. చివరికి ఆయన మెల్లగా తలవంచుకునే "నా తల్లిదండ్రు లంతగా లేనివాళ్ళు కావటంవల్ల నాకు విద్యాబుద్ధులు అబ్బే అవకాశంలేక ఇలా శరీరాన్ని అతి చవకగా అమ్ముకుని, ఒకపూట తినీ, ఒకపూట తినకా బ్రతుకుతున్నాను. ఉన్నదానిలో వున్నంతగా నా పిల్లల్ని సుఖపెట్టటానికే ప్రయత్నిస్తాను. కట్టుకున్న తర్వాత, కన్నతర్వాత వాళ్ళని చూసుకోవద్దూ? బాధ్యత అనేది చాలా విలువైనదమ్మా. అది చిన్ననాటినుంచీ అబ్బాలి. లేకుంటే జీవితం దుఃఖభాజనం అయిపోతుంది" అన్నారు.

నారాయణి అన్నగారి దైన్యానికి కంటనీరు పెట్టుకుంది. ఆ దుఃఖతీవ్రతతో ఆమె కిక ముద్ద లోపలికి వెళ్ళలేదు. మావయ్యమాటలు అమాయకమైన మనసునికూడా ద్రవింపచేశాయి. నారాయణి తినీ తినీ అన్నం విడిచి పెట్టి పెరటిలోకి వెళ్ళిపోయింది. ఆయన తలపట్టుకుని అలాగే గోడకి చారబడిపోయారు.

ఆరాత్రి భర్త ఇంటికి రాకుండానే నారాయణి అన్నగారు వెళ్ళిపోయారు. వెళ్ళబోయేముందు పిల్లల భవిష్యత్తు గురించి శ్రద్ధ వహించవలసిందని మరీ మరీ హెచ్చరించారు. నారాయణి పదిహేను రూపాయిలు అన్నగారి చేతిలో వుంచబోయింది.

ఆయన అదివిడి గుప్పిట అలాగే మూసి "నువ్వు పంపిన పాతిక రూపాయిల్లో ఇంకా ఇరవై రూపాయిలు అలాగే వున్నాయి. అవి నాకు చాలు. కాని నెల నెలా ఇలాంటి పదిహేను వెనక వేసి ఒక సంవత్సరం తర్వాత "రెండు వందలు వెనక వేశాను అన్నయ్యా" అని ఒక వుత్తరంముక్క రాయి. నీ అన్న సంతోషిస్తాడు. ఆ పని నువ్వు చెయ్యి" అని ఆయన వెళ్ళిపోయాడు.

నారాయణి నిట్టూర్చి లోపలికి వచ్చేసింది.

రాత్రి శ్రీరంగంగారు ఇంటికి వచ్చేసరికి పన్నెండు దాటింది. ఆయన వస్తూనే ఎవరితో తిరుమూ

అనుకుంటున్నారు. ఆయన ముఖం చాలా తీవ్రంగా వుంది. 'ఏమిటండీ' అని అడగటానికికూడా నారాయణి సాహసించలేకపోయింది. ఆయనే చెప్పసాగారు: "వాళ్ళని పాతిపెట్టేటంత డబ్బువుంది. ఏంలాభం! బుద్ధి ఘనం లేనప్పుడు ధనవంతుల్ని ఎంతవుండీ ఏం ప్రయోజనం! ఇప్పటికి రెండు సంవత్సరాల చందాలు బాకీ వున్నారు క్లబ్బుకి. ఇవాళ లెక్క చేసేసరికి నానా కూతలూ కుయ్యసాగారు. అడుగుతే నామోషీలు. అనుకున్నంతదాకా కడదామనే బుద్ధిలేనివాళ్ళు అడుగుతే పౌరుషాలు దేనికి? కడితే డబ్బుకట్టండి లేకుంటే సభ్యత్వానికి రాజీనామా ఇవ్వండి. మీరు ఇవ్వకపోతే నేనే రద్దుచేస్తాను" అని చెప్పేసాను. దాంతో దెబ్బలు జారిపోయి డబ్బుకట్టేశారు. ఈ వీరభద్రం గారితో వ్యవహారం అంటే ఏమిటో వాళ్ళకి తెలిసి రావటం. మళ్ళీ ఇవతలు సిగ్గులేకుండా నాదగ్గరికి వచ్చి వాళ్ళంతట వాళ్ళే పలకరించారు. మంచిగావుంటే గౌరవిస్తాను. లేదా వళ్లని కొక్కటు కొక్కపారేస్తాను" అంటూ ఆయన భార్య అందించిన పంచ తీసుకుని "నాకు కాస్త మజ్జిగా అన్నం కలిపివుంచు. తిని పడుకుంటాను" అన్నారాయన.

నారాయణి మనసు క్షోభపడింది. ఇవాళ అమ్మాయిని చూడటానికి పెళ్ళివారు వస్తున్నారన్న సంగతి ఆయనకి తెలియకపోదు. 'వాళ్ళు వచ్చారా' అనిగాని 'ఏమన్నారు?' అనిగాని—అసలా విషయమే ఆయన ప్రస్తావించకపోవటం నారాయణికి మనసు కష్టం తోచింది. అయినా ఆమె తన స్వభావానికి విరుద్ధంగా ఆయనతో ఘర్షణపడలేదు.

చివరికి భోజనందగ్గర మటుకు ఆయన అప్పటికీ ఆ ప్రసక్తి తీసుకురాకపోవటం గమనించి "ఇవాళ అమ్మాయిని చూట్టానికి వాళ్ళు వచ్చారు. అన్నయ్య కూడా వచ్చాడు" అంది.

"అలాగా" అన్నారాయన.

"చూసి వెళ్ళారు. రేపు ఈ వూళ్ళోనే వుంటారుట. మీరోమారు వెళ్ళి కలుసుకుంటే ఏమాటా వాళ్ళు చెబుతారు. భగవంతుడిదయవల్ల ఈ సంబంధం స్థిరపడితే బాధలేదు" అంది నారాయణి.

ఆయన అయిష్టంగా ముఖం మార్చుకుని "నాకెక్కడ తీరికవుంది. బోలెడన్ని పను లున్నాయి." అన్నారు.

"అలాగంటే ఎలాగు. మనపను మనం చూడుకోవద్దూ?"—ఇన్నాళ్ళకి నారాయణి ఆమాత్రం ఎదురు మాట అనగలిగింది.

ఆయన తల అడ్డంగా తిప్పుతూ "అబ్బే! చాలా ముఖ్యమైన పనులున్నాయి. అయినా ప్రయత్నిస్తాను" అన్నారు.

నారాయణి ముఖం ఆశతో వెలిగింది.

మర్నాడు, ఆమె ఈ విషయం మరోమారు జ్ఞాపకం చేసింది. ఆయన విసుక్కున్నారు. "పదేపదే చెప్పాలేమిటి?" అంటూను.

"అమ్మా చింతపండు అయిపోయిందే. కాఫీ గిన్నెలు తోమటానికి పనిమనిషి వచ్చింది" అంటూ అనూరాధ వచ్చింది.

నారాయణి అలమారులోనుంచి డబ్బుతీసి లెఖ్ఖపెట్టి చంద్రుడ్ని పిలిచి వాడికిచ్చి వాడ్ని వెళ్ళి పట్టుకురమ్మంది.

వాడు ఆ డబ్బు పుచ్చుకుని గంతులేస్తూ వీధిని పడ్డాడు. పది నిముషాలన్నా కాకుండానే ఏడుస్తూ వెక్కిళ్ళుపెట్టుకుంటూ వాడు ఇంట్లో ప్రవేశించాడు. నారాయణి కంగారుగా 'ఏమయిందిరా?' అంటూ ఇవతలికి వచ్చింది.

వాడు వెక్కుతూ కళ్ళునులుముకోసాగాడు.

"ఏమయిందిరా? చింతపండు తెచ్చావా?"

"మరేం......"

"ఆఁ! ఏమయింది త్వరగా చెప్పు."

"మరేం దారిలో డబ్బులు......"

"ఏమయ్యాయి? పారేశావా? ఎవరన్నా లాక్కున్నారా?"

"జారిపోయి పడిపోయాయి. ఎంత వెతికినా కనబడలేదు." అంటూ వాడు ఏడుపు సాగించాడు.

నారాయణమ్మ ఓర్పు నశించి వాడ్ని నెత్తిమీద వాలుగ మొట్టి "ఎక్కడ పారేసావురా. సరిగ్గా వెతికావా? మళ్ళీపోయి చూసి రా" అంటూ వాడ్ని తోసింది.

"అయినా పెద్దోళ్ళు తెమ్మనేవాళ్ళు తెలిగాని ఆయన్ని పంపడమెందుకమ్మా. ఆయనకేం తెలుసుద్ది" అంది పనిమనిషి చీపురు తీసుకుని ప్రవేశిస్తూను.

"ఇంకేవరున్నారు. నేను వీధిని పడాలి." అంది నారాయణి చేతిలో చంద్రుడ్ని కుంజుకొంటూను.

"ఎంత వెతికినా కనబడలేదే" అంటూ వాడు వెళ్ళటానికి మొరాయించాడు.

నారాయణి నెత్తి మొత్తుకుంటూ "మళ్ళీ వెళ్ళి ఓమారు వెతికిరా అమ్మా! పోరా! దాంతో పోయి వెతికిరా" అంటూ వాడ్ని ఓ తోపు తోసింది.

పనిమనిషి వాడ్ని తీసుకుని వీధిలోకి నడిచింది.

[సశేషము]

కలగూరగంప.

భూమి తిరుగుట లేదా!

శ్రీ వేమూరి నరసింహమూర్తి

శతాబ్దుల కాలము సత్యపరీక్ష చేయబడి ప్రయోగాత్మక నిరూపణలచే నిర్ధారణచేయబడిన నిర్ణయము తిరిగి సనాతనాచారపరులగువారిచే సవాలు చేయబడుటయే యీ వ్యాసమునకు కారణము. పూర్వోక్త మతవిషయము లన్నియు నిత్యసత్యము లని నమ్మి ఆ యభిప్రాయములను మనసునందుంచుకొని వాని నెట్టయిన సమర్థించుటే తమ ఆశయముగా పెట్టుకొనుట వీరి పద్ధతి. నిర్హేతుక మగు మతవిధేయతకంటె సహేతుక పరిశీలన శాస్త్రమునకు దోహదము చేయగల్గును.

'ఆస్తికత్వము' అను గ్రంథమునందు శ్రీ నారశాపి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తిరిగి భూకేంద్ర సిద్ధాంతము నుద్ధరింప ప్రయత్నించిరి. కేరళ దైవజ్ఞ విరచిత 'వివాహబృందావనము'; శ్రీ అవంతుని సీతారామ సిద్ధాంతిగారి 'జ్యోతిస్సిద్ధాంత తత్త్వప్రదీపిక'; రామచంద్ర సుబ్బాజీ బాబుగారు మహారాష్ట్ర భాషలో వ్రాసిన 'సిద్ధాంతశిరోమణి ప్రకాశిక'; దైవజ్ఞ విలాసము మొ॥ గ్రంథములనుండి యుదాహరించుచు భూకేంద్ర సిద్ధాంతమును బలపరచిరి. అనేక శాస్త్రజ్ఞులచె బరిశీలింపబడి నిర్ణయము చేయబడిన సూర్యకేంద్రిక సిద్ధాంతమును నిర్ధారింప బూనుట పునర్విమర్శయే కావచ్చును; కాని శ్రీ శాస్త్రిగారు ఆధునిక విజ్ఞానశాస్త్ర పురోగమనమును పరిశీలింపకయే అజ్ఞాతమయిన సిద్ధాంతమును బయటికి తీసిరి గనుక దానియందలి దోషములను బరిశీలింపవలెను.

సూర్య చంద్రులు రాహుకేతు గ్రస్తులగుటయే సూర్యచంద్ర గ్రహణములకు కారణములనియు, భూమి స్థిరముగ నున్నదనియు స్థిరముగనున్న భూమి చుట్టు సూర్యుడు నక్షత్రములు తిరుగుచున్నవనియు శాస్త్రి వాదము.

జ్యోతిశ్శాస్త్ర జ్ఞానము ప్రబలి సూర్యచంద్రుల గ్రహణములకు కారణములు చంద్రునియొక్క భ్రమణములో భూమి పైనను; భూమియొక్క భ్రమణములో చంద్రుని పైనను సూర్యకాంతివలన గలుగు ఛాయలే యనియు వేరొండు కాదనియు నిర్ణయింపబడిన తర్వాత రాహుకేతు సంబంధమగు వాదము నిరస్తమయినది. అయినను శ్రీ శాస్త్రిగారు రాహుకేతువులు సూర్య చంద్రులను గ్రసించుచున్నవను వాదమును విసర్జింపలేక రాహుకేతువులు అంధకార చారులు గనుక ఛాయాగ్రహులై వారు సూర్యచంద్రులను గ్రసించుచున్నారని సనాతన నూతన సిద్ధాంతములకు సమన్వయము చేయబూనిరి. పాఠకుల యర్థసౌలభ్యముకొరకు వారి వాక్యములనే ఎత్తి వ్రాయుదును.

"చంద్రునియందు భూచ్ఛాయ పడినప్పుడు ఆ ఛాయ అంధకారరూపము గనుక అంధకారచారియగు రాహువు దాని నాధారము చేసికొని చంద్రుని నాచ్ఛాదించును. అంధకార రూపమయిన చంద్రమండల చ్ఛాయ సూర్యునియందు పడినపుడు ఆ ఛాయ నాధారము చేసికొని సూర్య మండలమును రాహువు ఆచ్ఛాదించును.

కనుక ఛాయా నిమిత్తమున గ్రహణమను వాదమునకును రాహు నిమిత్తమున గ్రహణమను వాదమునకును విరోధమేమియు లేదు."

ఈ వాక్యమును బట్టి చూడ చంద్రునియొక్క ఛాయ సూర్యునిపై బడునని వీరు భ్రమపడుచున్నారని స్పష్టము. సూర్యుడు స్వయంప్రకాశము గలవాడనియు చంద్రునియొక్క ఛాయ భూమిపై పడును గాని సూర్యునిపై పడుట కవకాశము లేదనియు వీరు గ్రహించిన వీరి సమన్వయ పద్ధతిలోని లోపము స్పష్టమగును. ఇంతటితో నయినను ఛాందసత్వమును విడి సూర్యచంద్రుల గ్రహణమును గూర్చిన సత్యమును వీరు గ్రహింపవలెను.

శాస్త్రిగారు సూర్యకేంద్రిక సిద్ధాంతమునకు మాపు ఆక్షేపణ లేదనియు కూడా ఇతః పూర్వము వాదోపవాదములు లేక విస్మరింపబడినవి కావు. ఈ సందేహము లన్నియు ప్రాచీనులకుగల్గినవే. కొన్ని శతాబ్దములు సూర్యకేంద్రిక సిద్ధాంతమును స్థాపించుట కొరకు వాదోపవాదములు జరిగినవి. ఈ సిద్ధాంతమును

సమర్థించు శాస్త్రజ్ఞులు సమకాలికులయొక్కయు, మతాచార్యులయొక్కయు నిశిత విమర్శలకు లోనై వారిచే బాధింపబడియు తాము నమ్మిన సూత్రములను విడువక ముందుకు సాగిపోయిరి. మొట్టమొదటిసారిగా సూర్యకైంద్రిక సిద్ధాంతమును ప్రతిపాదించిన వాడు క్రీ. పూ. ఐదవ శతాబ్దము వాడగు పైథాగొరస్. కాని యాతడు తగు పరిశ్రమ చేసి యీ విషయమును స్పష్టముగ నిర్ధారణ చేయుటకు తగు సాక్ష్యమును సేకరింపనందున తరువాతి టాలమీయను యీజిప్టు దేశీయుడు క్రీ. శ. రెండవ శతాబ్దములో యీ సిద్ధాంతమును వెనుకకు త్రోసి భూకేంద్రిక సిద్ధాంతమును ప్రతిపాదించెను. సూర్యకేంద్ర సిద్ధాంతమును ఖండించుటకు ప్రస్తుతము శ్రీ శాస్త్రిగారు ఆయా గ్రంథములనుండి ఎత్తిచూపిన సందేహాస్పద విషయము లన్నిటిని అతడు ఉపయోగించుకొనెను. పదార్థవిజ్ఞానశాస్త్రము తగినంత అభివృద్ధి కాని ఆ కాలములో ప్రత్యక్ష ప్రమాణములను చూపి, వాదన చేయు టాలమీయొక్క తార్కిక బలముచే అప్పటికి సూర్యకైంద్రిక సిద్ధాంతము మరుగునపడి భూకైంద్రిక సిద్ధాంతము నిజమని నమ్మబడినది. టాలమీ సిద్ధాంతములోని అపసవ్యతను తరువాతి పదిహేను శతాబ్దములవరకు నిరూపింప వీలుపడినది కాదు. క్రీ. శ. పదునారవ శతాబ్దములో 'కోపర్నికసు' అను పోలండు దేశీయుడు టాలమీ నిర్మించిన సౌధమును కూల ద్రోసెను. దానితో చక్కగ విశ్వమధ్యమున నుండి సూర్యుని, ఇతర గ్రహములను తనచుట్టు త్రిప్పుకొనెడి మనభూమి తన విశిష్ట స్థానమును గోల్పోయి సామాన్య గ్రహమువలె సూర్యునిచుట్టు ప్రదక్షిణము చేయవలసి వచ్చినది. అట్టి తలపే ఆనాటి ఛాందసులగు క్రైస్తవ మతస్థులకు కష్టముగనుండెడిది. తాము నివసించు భూమి మధ్యనుండి, తమచుట్టును సూర్యచంద్రగ్రహములు తిరుగుచున్నవను ఆధిక్యభావమును, అందు కల ఆనందమును సత్యముకొరకు ఆనాటి మతగురువులు విసర్జింపలేకైరి.

అట్లయినను అనేక కష్టనష్టముల కోర్చి కోపర్నికసు మొదలుగాగల శాస్త్రజ్ఞులు జ్యోతిశ్శాస్త్ర జ్ఞానము నభివృద్ధి పరచిరి.

కోపర్నికసుకంటె ముందుగా క్రీ. శ. ఐదవ శతాబ్దములో హైందవశాస్త్రజ్ఞుడగు ఆర్యభటుడు "అనులోమ గతిః నౌ స్థః పశ్యత్యచలం విలోమగం యద్వత్ | అచలాని భాని తద్వత్ సమ పశ్చిమగాని లంకాయామ్॥" అని దృష్టాంతపూర్వకముగ భూభ్రమణమును నిరూపించి యున్నాడు. ఇందు 'లంకాయామ్' అనుపదము ఒక నిర్దిష్టమగుస్థలము నుదహరించుటకు చెప్పియున్నాడు గాని భూమండలమందెందుండి జూచినను గ్రహనక్షత్రాదులు పశ్చిమాభిముఖమై భ్రమించుచున్నట్లుండునని యాతని భావము. అట్లే,

శ్లో॥ అర్కాద్చంద్ర మండలాశే భ్రమతి|
హితస్మిన్ క్షితి ఛాయా॥

అను ఆర్యభటుని శ్లోకమునుబట్టి యాతనికి సూర్యునిచుట్టు భూమి భ్రమించుచుండునను విషయము తెలిసియుండెనని వ్యాఖ్యాతలు తీర్మానించి యున్నారు.

ఇక శాస్త్రిగారి యాక్షేపములను పరిశీలింతము.

(1) తూర్పునకుగా గలుగు భూభ్రమణ వేగము వలన పశ్చిమదిక్కుగా సతతము పెనుగాలి వీచుచుండవలయును.

(2) ఆ పెనుగాలినిబట్టి పతాకలు ఎప్పుడూ పశ్చిమదిక్కుగానే ఎగురుచుండవలెను.

(3) మేఘసంచారము కూడ ఎప్పుడూ పశ్చిమ దిక్కునకే ఉండవలెను.

(4) ఆకాశముమీదికి వేసిన బాణము ఎప్పుడుపడినను పశ్చిమదిక్కునకే పడవలెను

(5) ప్రాతఃకాలమున తమ గూళ్ళను విడిచి వెళ్ళిన పక్షులు ఆకాశమునుండి తమగూళ్ళకు తిరిగి చేరలేకపోవలెను.

భూమిపైగల ప్రాణుల జీవితమంతయు భూమి నాశ్రయించుకొని జరుగుచున్నది. భూమిపైగల సమస్త ప్రాణికోటియు వస్తుసముదాయమును భూమినాశ్రయించుకొని యుండవలసినదేగాని, భూమిని వదలిపెట్టి పోవుట అసంభవమను విషయము మనకు దృక్సిద్ధమగుచున్నది. దీనినిబట్టియే భూమికి ఆకర్షణశక్తిగలదని నిర్ణయింపబడినది. ఈ భూమ్యాకర్షణశక్తి భూమిని పరివేష్టించి ఆకాశమునందు (space) కొంతదూరము వరకు నుండును. ఈ భూమ్యాకర్షణముయొక్క అవధిని దాటుటకు, ఈశక్తి ప్రభావమునుండి తప్పించుకొనుటయును ఏరికిని శక్యము గాదు. భూమ్యాకర్షణ ప్రభావము ప్రసరించునంతవరకుగల క్షేత్రమునందు జరుగు విషయములన్నియు అట్టియాకర్షణకు లోబడియే జరుగుచుండును. కనుకనే ఆకాశముమీదికి వదలిన బాణముగాని, తమ గూళ్ళను వదలిపోయిన పక్షులుగాని తమతమ స్థానములను పోగొట్టుకొనుటలేదు. ప్రతిక్షణము, ప్రతిలిప్త, ఇట్లేల: మానవుని కల్పితమగు ప్రతి కాలవిభాగమునందును కూడ అనగా నిరతము (without interval) భూమ్యాకర్షణము తన్నాశ్రయించియున్న ప్రాణికోటిని, వస్తుసముదాయమును తనవైపు లాగుకొనుచుండుటచే భూమినుండి పైకెగసిన యేవస్తువుగాని స్థానభ్రష్టత్వమునుపొందక స్వస్థానము చేరుచున్నది. అట్లుగాక పక్షి తన గూటిని వదలిపోయిన తర్వాత భూమి తన యాకర్షణ శక్తి నుపసంహరించుకొనిన యెడల శ్రీ శాస్త్రిగారు

భావించుచుంటిమి పక్షి తనస్థానమును గోల్పోవును. అట్టి పక్షి తన రెక్కలలో బలమున్నంతవరకు విహరించి స్వబలముతో భూభ్రమణవేగము నతిక్రమించి గూటిని చేరుకొనును. లేదా మార్గమధ్యమున శక్తివిహీనయై స్థాణువుగా అంతరాళమున నిలచియుండును. లేక భూమి తన యాకర్షణశక్తి నుపసంహరించుకొనుట వలన యితర గ్రహముల యాకర్షణ యిటు ప్రసరించి తమవైపు లాగుకొనను వచ్చును.— కాని భూమియొక్క నిరంతరాకర్షణశక్తి అట్టి ఊహలకు తావీయదు. ఇక పక్షి తనకు భూమినపేక్షించిగల స్వీయ వేగమునుబట్టియే ఆహారమునకై గూటిని వదలిపోగలుగుచున్నది. భూమ్యాకర్షణ పరిధినధిగమించి పోలేని పక్షికి భూగమనము నిరపేక్షణీయము. ఉదా॥ గంటకు ముప్పదిమైళ్ళ వేగముతో పరుగిడు రైలుబండియందు మనము ఏదిక్కున కైనను నడువగలుగుచున్నాము. రైలుబండియొక్క చలన వేగము బండిలోని ప్రయాణీకుల చలనమును మార్పు చేయుటలేదు. దీనిని బట్టి చలనము సాపేక్షము (Relative) అని తెలియుచున్నది. చలనము సాపేక్షమగుట వలననే భూభ్రమణము మన కతీంద్రియ మగుచున్నది. భూమిపై జరుగు చలనక్రియ యంతయు భూమిననపేక్షించిన చలనమే గాని స్వతంత్రము గాదు. అందుచేతనే పొగ, మేఘములు మొ॥ వాయువులు భూభ్రమణ చలనముతో నిమిత్తము లేకుండ నల్దిక్కుల సంచరింపగలుగుచున్నవి.

న్యూటన్ తన ప్రిన్సిపియాలో "The motion of bodies included in a given space are the same among themselves whether that space is at rest or moves uniformly forwards..." అని వ్రాసినాడు. దీనికి సుమారుగా "స్థిరముగనట్టి గాని, సమగతితో గాని చలించునట్టి దేశములోని మూర్తముల చలనములు సమానములు" అని యర్థము. అనగా ఒకే దేశము నపేక్షించియుండు మూర్తముల చలనములు ఆదేశము (space) యొక్క చలనమున పేక్షింపవు. దీనిని బట్టి భూమి సెకనునకు 17 మైళ్ళ చొప్పున తిరిగినను 17 వేల మైళ్ళ చొప్పున తిరిగినను భూమి నపేక్షించియుండు వస్తు సముదాయముల పరస్పర సంబంధములు మారవని తెలియుచున్నది.

భూమియందు రెండాలు ఎగురుటవంటి దృశ్యములు పూర్తిగా భూమి నాశ్రయించియుండు దృశ్యములని గ్రహింపవలెను. తథ్యమగు పదార్థమందు (Real matter) ఇతరమగు మూర్తము (body) చలించిన పదార్థమునకు గాని మూర్తమునందు గాని సాపేక్ష వేగము (Relative motion) ఇంద్రియ గోచరమగును (ఇంద్రియ గోచర మగుటయనగా శుద్ధముగా ఇంద్రియములకు తోచుటగాని, ఇంద్రియవశమగు ప్రయోగములకు వశమగుటగాని అని యర్థము) భూమి చరించు మహదాకాశమున పదార్థమేదయిన గలదా? లేదా? అను మీమాంస పదార్థ విజ్ఞాన శాస్త్రవేత్తలను కల్లోలపరచినది. భూమి చరించు అంతరాళమున ఈథరు (మిథ్యావాయువు) వంటి పదార్థమేదియునను వ్యాపించియున్నను ఇంద్రియ వశమగు ప్రయోగములేవియు భూమియొక్క చలనగతిని నిర్ణయింపలేవు. దీనినే ఐయిన్‌స్టీన్ "Nature is such that it is impossible to determine absolute motion by any experiment whatever" అని సూత్రీకరించినాడు." ఎటువంటి ప్రయోగము చేతనయినను నిరపేక్ష చలనమును నిర్ణయించుట అసంభవము" అని దీని యర్థము.

ఇక శాస్త్రిగా రుదహరించిన మేఘ నిర్మాణము, వర్షపాతము నిస్సంశయముగా స్థానిక దృశ్యములనియు భూమి నాశ్రయింపక జరుగు ప్రక్రియలు గావనియు తెలియవలెను. దీనినిబట్టి ఒకే దినమున వర్షపాతము భూమినిచుట్టి వ్యాపించియుండుటలేదను విషయము సుగమమగుచున్నది. భూమి తిరుగుచున్నదను కారణముచే వర్షము భూమియందన్ని ప్రదేశములను కన్పించుచున్న, వర్షము ఏదియో ఒక దీర్ఘాంశముపై

పొడవునను ప్రారంభించి తీరవలయును. కాని ఒకే దీర్ఘాంశయందుగల ప్రదేశము లన్నిటియందును ఏక కాలమున వర్షము పడుటలేదు. ఒక గ్రామమునందలి తోటలలో ఒకతోటపై వర్షముండుటయు, మరియొక తోటపై వర్షము పడకపోవుటయు మన మెరిగిన విషయమే. కనుక భూమి తిరుగుటవలన వర్షము భూమి యంతటను వ్యాపించి యుండవలెనను వాదము దోషయుతము. వర్షము స్థానిక వాతావరణము యొక్క కార్యరూపము.

భూమి సూర్యునిచుట్టు తిరుగుచున్నదనుటకుగల నిదర్శనములను చూడుడు:—ఒక దినమున మధ్యాహ్న కాలమున సూర్యుని నిమ్నకోణము (Angle of declination) ను గుర్తించి ఆ రాత్రి అర్ధకాలమునకు సరిగ్గా దక్షిణోత్తర రేఖపై (observer's meridian) సూర్యుని కభిముఖమైయుండు స్థానమునుగాని అచ్చోటగల నక్షత్రమునుగాని గుర్తింపవలెను. అదే స్థానమును వరుసగా కొన్ని దినములు ఒకే కాలమున గుర్తింపగా కొన్ని దినములకు సరిగ్గా ఆ నక్షత్రము పశ్చిమాభిముఖమై ప్రయాణము చేయుచున్నట్లుండును. అనగా అంతరిక్షమున మన పరిశీలన స్థానమున కభిముఖముగా (diametrically opposite) పాతాళమున (Below the horizon) గల సూర్యుడు ప్రాఙ్ముఖముగా నడచు నట్లు కనబడును. అంతరిక్షమున నక్షత్రము పశ్చిమాభిముఖమై ప్రయాణము చేయుచున్నట్లు కనపడినను దాని కితరనక్షత్రములలో గల యంతరము మారదు. కనుక నక్షత్రమండలి యంతయు సూర్యునిచుట్టు ప్రదక్షిణము చేయుచుండవలయును. ఇది సంభవమా?! మరియు ఎన్నియో లక్షల మైళ్ళ దూరమునగల యీ నక్షత్రములు పరిశీలకుని కంటిదృష్టి దినమునకొక డిగ్రీ చొప్పున కోణము చేయుచో అవి ఎన్నియో కోట్ల మైళ్ళ వేగములో పరుగిడుచుండవలెను. ఆధునిక శాస్త్రజ్ఞానమునుబట్టి అది యసంభవము (సెకనుకు 186271 మైళ్ళ కంటె ఎక్కువ వేగమసాధ్యము) అదియునుగాక శతసహస్రములగు నక్షత్రములలో ఒక సామాన్య నక్షత్రమగు — సూర్యుని చుట్టును మిగిలిన నక్షత్రము లన్నియు భ్రమించుచున్న వనుకొనుట సరిగాదు. కనుక యీ సందర్భమున నక్షత్రములు తిరుగుటలేదని యనుకోవచ్చును. కనుక భూమియే తనకన్న ఎన్నో వేలరెట్లు (సుమారు 330000 రెట్లు పెద్దదగు సూర్యగోళముచుట్టు తిరుగుచున్న దనుట సత్యము.

భూమియొక్క జన్మమునుగురించి ఆధునిక జ్యోతిష్కులలో అభిప్రాయభేదము లున్నను ఈనాటి వరకు ప్రబలిన విజ్ఞానశాస్త్ర చరిత్రలో ఏ శాస్త్రకారుడుగాని భూమి సూర్యగోళమునుండి విడివడగా ఏర్పడ్డ గోళమను విషయమును నిరాకరించలేదు. భూమికి సూర్యుడు మూలమనునది నిర్వివాదాంశము. సూర్యునినుండి యుద్భవించి, సూర్యునికన్న ఎన్నో వంతులు చిన్నదయి, సూర్యకాంతిపై ఆధారపడి యున్న భూమి సూర్యునాశ్రయించి సూర్యునిచుట్టును తిరుగక సూర్యుడే భూమిచుట్టూ తిరుగుచున్నాడనుట, భూమిమీదను సనాతనగ్రంథములమీదను వారికి గల మమకారమే కారణ మనిపించుచున్నది.

శతాబ్దములనుండి ఎందరో మహానుభావులు ప్రోవుచేసిన విషయ సంపదను పరిశీలించి హేతువున కాగని విషయములను, ప్రయోగాత్మకముగా నిరాధారమని ఋజువుచేయబడిన విషయములను వదలివేయుట; సందిగ్ధములగు విషయములను పునఃపరిశీలనచేసి విషయ నిర్ధారణచేయుట బుద్ధిమంతుల లక్షణము. ఇట్లని సనాతన భారతశాస్త్రజ్ఞుల ప్రజ్ఞావైభవమును నిరసించుట కాదు. ఎంతటి మహామేధావులయినను తత్కాల పరిస్థితులకు లోబడి పనిచేయువారే గనుక, వారు చెప్పినదే పరమసత్యమని నమ్మనంతమాత్రమున వారిని నిరసించుట గాదు. ఈతరమువారు తిరిగి పరిశ్రమ చేసి కాలహరణము చేయకుండ వారు ప్రోవుచేసిన విషయ సంపదను నేర్చుకొనుచుండుటవలన వా రెప్పటికిని గౌరవనీయులే. కానివారు చెప్పిన విషయము లన్నియు పరమసత్యములని పరిగణింపక, శాస్త్రము సంపాదించిన నూతన విషయములతో, నూతన పరికరములతో పూర్వ శాస్త్రజ్ఞుల యభిప్రాయములను సవరించవలసినచోట సవరించుట యనునది ఆక్షేపణీయము కాదు. కాగా ఎంతికాలమునకు ఒకేశాస్త్రము, ఒకేగ్రంథము ఒకే అభిప్రాయము న్యాయమని నమ్మి చిలుకవలె పునశ్చరణ చేయుటమాత్రము హాస్యాస్పదము.

మేధావి కనుకనే ఆర్యభటుడు క్రీ॥ శ॥ 12-వ శతాబ్దములోనే అనగా కోపర్నికస్ కంటె ముందుగనే భూభ్రమణ సిద్ధాంతమును భూమి సూర్యునిచుట్టు తిరుగు కక్ష్య సమవృత్తముగాక అండాకృతి వృత్తమై యుండుననియు ఊహించగలిగినాడు. అట్లే భాస్కరాచార్యుడు గొప్పగణితశాస్త్రజ్ఞుడుగా పరిగణింపబడెను. భాస్కరాచార్యుడు గణితశాస్త్రజ్ఞుడైనంతమాత్రముచే అతని సూత్రము లన్నియు నిరాక్షేపణీయములు గా నవసరంలేదు. మూడుశతాబ్దముల క్రిందట న్యూటనుచే వ్రాయబడిన చలనసూత్రములు (Laws of motion) ద్రవ్యాకర్షణ సూత్రము ఇంతకాలమును నిత్య సత్యములుగా నమ్మబడినవి. కాని ఈనాడు స్వల్పముగ సవరణలు చేయవలసి వచ్చినది. ఇది సత్యాన్వేషణ, శాస్త్రపద్ధతి.

గ్రంథ విమర్శనము

మహాభారత కర్ణ

పద్యకావ్యం; రచన: శ్రీ వంగా రామిరెడ్డి; ప్రాప్తిస్థానం: శ్రీ ప్రత్తిగోడుపు రాఘవరాజు, ఈమని పోస్టు, (వయా) దుగ్గిరాల, గుంటూరు జిల్లా; వెల రు 1-0-0.

మహాభారతంలో కర్ణునిపాత్ర లోకోత్తరమైన చిత్రణ. కర్ణుడు లేంది భారతం లేదనే అభిప్రాయం పాఠకులలో నిలిచిపోయింది. ఎట్టి ధార్మిక సమస్య లెదురయినా, ఎట్టి క్లిష్టపరిస్థితు లెదురయినా, ధీరోదాత్తుడై నిలచి తన ఆత్మతేజమును జగత్తుకు చాటిన మహాపురుషుడు. మహా త్యాగశీలియైన యీ ప్రాచీనపురుషుడు, స్వాతంత్ర్య సమరోన్ముఖమైన నవ్యభారత రంగంలో అనేకమంది సమరయోధులకు ఉత్సాహకారకు డయినాడు. పలువురు యువరచయితలు కర్ణుని చరిత్రయందలి ఆయా ఘట్టాలను సేకరించి ఖండకృతులుగా రచించారు. శ్రీ రామిరెడ్డిగారు, భారతమునందు గల కర్ణుని ప్రధానఘట్టాల నన్నిటినీ సంపుటీకరించి ఈ కావ్యాన్ని సంఘటించారు.

ఈ కావ్యాన్ని శ్రీ రెడ్డిగారు—కర్ణ ప్రేమ, కర్ణదీక్ష, కర్ణశపథం, కర్ణ శౌర్యం, కర్ణ సైన్యాధిపత్యం, కర్ణ దాతృత్వం, కర్ణ స్వరూపం, కర్ణ శీలం, కర్ణవిషాదం, కర్ణభీభత్సం, కర్ణమరణం, పూజాంజలి, అనే శీర్షికలుగా విభజించారు. ఇట్టి ప్రణాళిక వల్ల ఆయా ఘట్టాలలో రచయిత తాను చెప్పదలచిన విషయాన్ని సూటిగా చెప్పటానికి అనువైంది. అనవసరమయిన వర్ణనలు వగయిరా చొరటానికి అవకాశము లేకుండా, చక్కని శిల్పరూపంలో కావ్యాన్ని రూపొందించటానికి వీలైంది. రచయిత అత్యంత శ్రద్ధాళువు. ఈ శ్రద్ధ ఒక కథానిర్మాణంలోనే గాక పదపద విన్యాసంలోనూ, పద్యపద్య నిర్మాణంలోనూ మనకు కనుపించుతుంది. ఇట్టి శ్రద్ధ ఆధునిక రచయితలలో బహు కొద్దిమందిలో మాత్రమే కనుపించుతుంది. శ్రీ రెడ్డిగారు ఇందుకు అభినందనీయులు.

చీమ చిటుక్కుమన్న తన
　చిత్తము వ్రయ్యలు వ్రయ్యలై యెడో
కామల క్రుంగు; కంట తడి
　పైట చెరంగున నొత్తుచుండుకున్
లో మది నెంచు, కాల్దవి
　బోర్ల బడంగ, పక్కి తెప్పరిల్లి నా
నోము ఫలంబు లీగతి మ
　సమ్మతి మాపె కుమార చేసినన్.

ఇది, అర్ధరాత్రి సమయాన కర్ణుని కలుసుకోవటానికి వెడుతున్న కుంతిమూర్తి; ఈ పద్యంలో కుంతీదేవి బాహ్యమూర్తి మాత్రమే గాక అంతరంగిక మూర్తి సహితం విజయవంతంగా ప్రస్ఫుటం చేయబడివుంది. రచయితకు ప్రాచీన సాహిత్యకారుల శిల్పమార్గాలు కరతలామలకమైవున్నాయి. అందుచేత పద్యం ప్రారంభించగానే, అది యేదో ఒకరకమైన మనోహరగమనాన్ని తనంతట సంతరించుకుంటుంది.

ఉదాహరణకు : కృష్ణుడు-కర్ణునితో :

అగ్గిని బుట్టు మానవతి
    అందమునన్ రతి, సద్గుణంబులన్
కగ్గని సాధ్వుశీల, కల
    కాలము పాండవపాద సేవలో
నిగ్గలు దిద్దు ద్రౌపది అ
    నింద్య చరిత్ర, మదిప్సితంబునన్
సిగ్గ త్యజించి నీ ప్రణయ
    జీవిత కేళుల కంకితంబగున్.

ఏ రచయితకైనా, ముఖ్యంగా సంస్కృతి ప్రభావంలో మునిగి తేలుతూండే మనకు జాతీయమైన నుడికారం పట్టుబడటం చాలా కష్టం. ఈ దిగువపద్యం చూస్తే రచయితకు ఆ రంగంలో గల పోషణ మనకు అవగతమౌతుంది. కృష్ణుడు కర్ణునితో :

రోషము మోసులెత్తి జిగి
    రొమ్ము బిగించి, తెగించి, విల్లునన్
దూసిన బాణపుంజముల
    తో అదలించి గదించు నీపయిన్
మీసము దువ్వి పోరగల
    మేటి యెవండు త్రిలోక నేతలన్

దాసుల జేతు నీవు పర
    దాస్యమునన్ బడి క్రుంగ నేటికిన్.

కర్ణుని పాత్రకు మెరుగులు దిద్దాలనే ఉత్సాహంలో రచయిత భీష్మాది మహాపురుషుల పాత్రలను ద్వేషించి పరుషమైన పదాలను కొన్నిటిని వాడారు. వాటిని రానీయకుండా చూచుకునివుంటే బాగుండేది. అలాంటి పరుష వాక్యాలు అక్కడక్కడ కర్ణుని చేత నే పలికించటం, రచయిత ఉద్యమానికే విఘ్నం కలిగించేదిగా వుంది. తిట్టుకోవటం గొప్పవాళ్లూ తిట్టుకుంటారు బజారుతకం తిట్టుకుంటారు. గొప్పవాళ్ళు తిట్టుకున్నప్పుడు, ఆస్థాయి వేరుగా ఉంటుంది.

"పేటలువార ఈ ముసలిపీనుగు ధర్మము లుగ్గడించి..." ఇత్యాది కర్ణుడు భీష్ముణ్ణి తిట్టడం రసిక హృదయాలను చివుక్కుమనిపించుతుంది.

రాష్ట్రీయ పఞ్చాఙ్గ

[తెలుగు]

ఇది సమస్త భారతదేశానికీ ఒకేరకమయిన పంచాంగం వుండాలనే ఉద్దేశ్యంతో చిరకాలంగా భారత ప్రభుత్వం చేస్తున్న కృషికి ఫలితం. దీన్ని తెలుగులో అనువాదం చేసినవారు శ్రీ పిడపర్తి కృష్ణమూర్తి శాస్త్రిగారని ప్రకాశకుల పీఠికవల్ల తెలుస్తున్నది.

ముఖపత్రంమీద "రాష్ట్రీయ పంచాఙ్గ" అనీ లోపలి ముఖపత్రం మీద "రాష్ట్రీయ పంఞ్చాఙ్" అనీ ముద్రించారు. వీటిని చిత్తగించితే ముందుముందు హిందీ ప్రాబల్యంవల్ల మన భాషకు ఇలాంటి గతి పడుతుందా అని భయపడవలసివస్తోంది. శ్రీ శాస్త్రి గారు ఇలా ఎందుకు అనువదించారో చిత్రంగావుంది. ముఖశీర్షిక లే కాదు. లోపలకూడా అలాగేవుంది. ఉదాహరణకు :

---

1. చైత్ర, శుక్రవార, 22 మార్చి 19 షాబాన్

సూర్యోదయ గం 6-04, అస్త గం 18-10 (ఉగం 6-20 అ. గం 18-26) తిథి: (ఫాల్గున కృష్ణ) సప్తమి గం. 21-52 జ్యేష్ఠనక్షత్ర గం. 17-01 సిద్ధియోగ అప్ర్కత్. గం 8-10 విష్టికరణ గం. 9-26 ధనుస్సు నందు చంద్రప్రవేశ గం. 17.01

ఇండియా నూతన సంవత్సరాది.

ఇది నిటానికి భాషకు సంబంధించిన విషయం. పంచాంగానికి సంబంధించిన విషయం కాదు; అది లేదాం.

ఇక పంచాంగం విషయం—భారతదేశంలో వివిధ ప్రాంతాల ప్రజలనూ ఒకే త్రాటిమీద నడిపించటం మాట ఎలా వున్నా ఒకేమూసలో పోతపోసుకు రావాలనే ఉద్దేశ్యంతో భారత ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో ఈ 'రాష్ట్రీయ పఞ్చాఙ్గ్ నిర్మాణ్' ఒకటి. అయితే యీ ప్రయత్నం యెంతవరకు ప్రజామోదాన్ని పొందగలదనేది, ముందుముందు తేలవలసిన విషయం. హిందీ రాష్ట్రభాష కావటానికి ఎంతకాలం పడుతుందో, ఇది ప్రజామోదం పొందటానికి కూడా అంతకాలమూ పట్టవచ్చు.

ప్రచురణ: డైరెక్టర్ జనరల్ ఆఫ్ అబ్జర్వేటరీస్, లోడి రోడ్, న్యూఢిల్లీ; వెల రు 0.25

చిత్రశతకమ్

సంస్కృత మూలం: శ్రీ జటావల్లభుల పురుషోత్తము; ఆంధ్రానువాదం: శ్రీ ఆత్మానంద యతీంద్రులు. ప్రాప్తి స్థానము: శ్రీ జటావల్లభుల పురుషోత్తము సత్యనారాయణపురం, విజయవాడ-2. వెల రు. 1/-

శ్రీ పురుషోత్తంగారు ఆర్షసంప్రదాయ ప్రచారానికి విశేషంగా కృషి చేస్తున్నారు. ఆ కార్యక్రమంలో వీరు రచించి ప్రచురించుకున్న గ్రంథ పరంపరలో ఇది ఒకటి. ఇది, 'గీర్వాణవాణి' 'భారత విభూతి,' 'ఆర్షవిద్య' 'మన ఋణజాలి' (విద్యార్థులు), 'వైరాగ్యము' 'జీవితకళ', 'కుటుంబం' 'సమాజ సమీక్ష', 'ఈశ్వరారాధనము' 'చిత్రలోకము' అని పది భాగాలుగావుంది. శ్రీ పురుషోత్తం గారి ఉదారాశయం మనకు తెలుసునుగనుక విశేష విమర్శ పనిలేదు. మచ్చుకు ఒక శ్లోకం ఉటంకించి, దానికి శ్రీ స్వామివారు చేసిన అనువాదాన్ని ఉదాహరించి వదిలేస్తాం:

సకేవలం నో ధనికో హిలోకే
యస్యాస్తి విత్తం నికటే మహత్తు
జ్ఞేయశ్చ సోఽపీహ ధనాఢ్య ఏవ
మహేశ్వరాకం స్మృణ ద్ధనస్య"

అనువాదం:

చం॥ ఎవని నికాంతమందున న
హీనముగా సిరి మూల్గుచుండునో
యతని ధనిండొకండె కని
కాదని కాదిక చేమనన్ గన
ద్విరిమిగ పురారి ఘూసనము
దాయముగా గణియించు నెవ్వడా
సవినయుడున్ ముముక్షువగు
సజ్జనుడున్ ధనవంతుడే సుమీ.

తె. మా.

ఆర్యభటీయ వ్యాఖ్య

జ్యోతిశ్శాస్త్ర గ్రంథము. రచయిత: శ్రీ కోటికలపూడి కోదండరామకవి. సంపాదకులు: శ్రీ వేదము లక్ష్మీనారాయణశాస్త్రి; ప్రచురణ: ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము, మద్రాసు. మూల్యం రు: 3-12-0

భారతీయ జ్యోతిశ్శాస్త్ర గ్రంథాలలో పరమ ప్రామాణికమైన ఆర్యభటీయానికి ఇది విపులాంధ్ర వ్యాఖ్య. క్రీస్తుశకము ఐదవ శతాబ్దాంతమున రచింపబడినట్లు ఊహింపబడుతూన్న ఈ జ్యోతిశ్శాస్త్ర కల్పకమునకు, తిరాదివిలబసిన శ్రీ కంఠభాష్యాద్యనేక వ్యాఖ్యానములను సమన్వయము చేసి, శ్రీ కో. కో. కవి ఈ గ్రంథమును రచించారు. ఈయన గత శతాబ్దాంతమువారు.

దశగీతికా పాదము, గణితపాదము, కాలక్రియా పాదము, గోళపాదము అను నాలుగు భాగములుగా రచితమైన ఈ గ్రంథము ఆర్యభటాచార్యుని తత్పూర్వ గ్రంథములన్నిటిని పరిశోధించి, అంగుళోపాలను సవరించి, సర్వకాల గ్రహగతులను సునిశితమతి శోధించి రచించిన ప్రాచీనతమ సమగ్ర గణితశాస్త్ర గ్రంథము.

శ్రీ వేదము లక్ష్మీనారాయణశాస్త్రిగారు విశేష పరిశ్రమచేసి రచించిన ఆంధ్ర ఆంగ్ల పీఠికలు, కో. కో. కవిని స్వయముగ ఎరిగియుండిన కీ. శే. శ్రీ నిడుదవోలు సుందరరామ పంతులుగారి పుత్రులు శ్రీ వేంకటరావుగారు చేసిన కవిపరిచయము గ్రంథ, గ్రంథకర్తృ ప్రాశస్త్యములను చాటుతున్నవి. ఈ గ్రంథముతో పాటుగ మరియేడు జ్యోతిష గ్రంథములు, ఇతర సంస్కృత గ్రంథములు, ప్రబంధములు, శతకములు మొత్తము ౨౭ గ్రంథములు రచించినట్లు శ్రీ ని. వేంకటరావుగారు తెలుపుతున్నారు. కాని, ఇందులో ఎన్ని ఇప్పుడు లభించుచున్నది, ఎన్ని వెలుగుముఖము చూచినది మాత్రం ఏలనో వారు తెలుపలేదు.

ఒకే లిఖితప్రతిపైన ఆధారపడి, ముద్రించిన ఈ గ్రంథములో, ఆ ప్రతిలోని దశగీతిక యందుగల లేఖక దోషములకు అడపదడప పంటిక్రిందబడు ముద్రణాపాపాణ లేశములు తోడవుతున్నవి.

మొత్తముమీద, ఈ గ్రంథము "జ్యోతిశ్శాస్త్రాభిలాషులకు ఆరాధ్య" మనుట అటుంచి, ఆధునిక భగోళశాస్త్రములోను సంఖ్యాబీజరేఖాగణితశాస్త్రాల లోను తెలుగున పాఠ్యగ్రంథాలు తయారుచేస్తూన్న వారంతా అవశ్యం పఠింపదగినది. ఆయా శాస్త్రాల పారిభాషిక పదాలను తెనుగుచేయుటలో వారు పడే పడరాని ప్రసవవేదనను ఈ గ్రంథం చాలావరకు నివారింపగలదు.

అయితే, ముందుగా ఆటినాటి గ్రంథాన్ని భారతీయ జ్యోతిశ్శాస్త్రమును సంప్రదాయ సిద్ధముగ అభ్యసించిన పండితులెవరైనా తేలికపరచడం అవసరం. ఈ పారిభాషిక పదసముదాయం భారతీయమందలి జ్యోతిష పండితులందరికి పరిచితమైనది గనుక, భారతీయ భాషలన్నింటిలోను ఉపయోగింపవచ్చును.

ఇంకొక తెనుగురచనకు మచ్చుతునక:

"సమభూమియందు ఒకకోలను నిలువుగా నాటి మూసిన ఇట్టి త్రాటిచెక్కు రెండుకోణములను ఒక బలపమునకు కట్టి బిగించి గిరగిర చుట్టూ త్రిప్పగా వృత్తమగును. సమానములయిన ఉభయకర్ణములను అగ్రమందు సంపాతమయ్యేట్లుగా తీసినచో త్రిభుజక్షేత్రమగును. తన చేత తీయబడ్డ ఉభయకర్ణములకును మధ్యభాగమందు సంపాతమయ్యేట్లుగా ఉండిన చతుర్భుజక్షేత్రమగును. నీటిమట్టముకట్టి అగ్రబద్ధమయిన గుండ్రద్రవ్యముకల నీటి మట్టపు త్రాడు మధ్యభాగమందు నుండునట్లుగాను కాలిచిన క్షేత్రము సమభూమి అగును. లేదా ఉదకము పల్లమునుండి అయినా సమభూమి సాధించుకోవలసినది." (గణితపాదము పుట: 45)

సిం. కు.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.